
# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019 నవంబర్ 1-30


RNI Regn No. 52879/93


## 'దీపధారి'

## చక్రవర్తుల రాఘవాచారి జ్ఞాపకాల సంచిక

# నివాళి



## మార్క్సిస్టు మేధావి

## విశాలాంధ్ర పూర్వ సంపాదకులు

# చక్రవర్తుల రాఘవాచారి కి

# అరుణాంజలి

## డా॥ చెలికాని రామారావు స్మారక కమిటీ

రామచంద్రపురం. తూర్పుగోదావరి జిల్లా

# సంపాదక చక్రవర్తి రాఘవాచారికి నివాళి
# సి.రా. లో అరుదైన వ్యక్తిత్వం



**- డి.వి.వి.ఎస్. వర్మ**

స
ం
పా
ద
కీ
య
ం

చక్రవర్తుల రాఘవాచారి ఒక అరుదైన నిరాడంబరుడు. అరుదైన ఎందుకంటే నిత్యం మన చుట్టూ కనిపిస్తున్న నిరాడంబరత్వ నటనలో లో కృత్రిమత్వం అధికపాళ్లలో కనిపిస్తుంది. ఇతరుల మెప్పుకోసం వేసే సాధారణ వస్త్రధారణ, తెచ్చిపెట్టుకున్న చిరునవ్వులు, ఒలకబోసే ఆప్యాయతలు అందులో భాగంగా చేసే ఆలింగనాల రూపంలో అది దర్శనం ఇస్తుంది. రాఘవాచారికి ఇలాంటి నటన తెలియదు. కృత్రిమత్వం ఏ కోశానా కనిపించదు. ఆయన సాధారణ ధవళ వస్త్రధారి. హోదాలతో నిమిత్తం లేని స్నేహశీలి. మనసుతో పలకరిస్తాడు. మనల్ని వివశుల్ని చేస్తాడు. ఈ నిరాడంబరత ఆయన జీవన విధానం. అందుకే అది అంత సహజంగా, స్వచ్ఛంగా వుంటుంది

ప్రతి సంవత్సరం దేశంలో, ప్రపంచంలో అత్యంత ధనవంతుల జాబితాను ప్రకటించినట్లే అపార మేధో సంపద గల వారి జాబితానూ ప్రకటిస్తే తెలుగు రాష్ట్రాలలో అగ్రస్థానం రాఘవాచారికే దక్కుతుంది.

మిడి మిడి జ్ఞానం గలవాళ్ల మిడిసిపాటుతనం చాలమందిలో మనం చూస్తున్నాం. జ్ఞాన సంపద శిఖరాలను అధిరోహించిన రాఘవాచారిలో అలాంటి మిడిసిపాటు వీసమంత కూడా కనిపించదు. ఆయన నిగర్వి. స్వోత్కర్ష, ప్రగల్భాలు, వాగాడంబరం, పరుషపదజాల ప్రయోగాలు ఆయనలో కంచు కాగడా పెట్టి వెదికినా కనిపించవు. “తరువు లతి రసఫల భార గురుత గాంచు” అన్న వాక్యం ఆయనకు అక్షరాల అతికినట్టు సరిపోతుంది. అలాంటి వినయశీలతే ఆయన నిరాడంబరత్వం.

ధనార్జనకు ఆయనకు అనేక అవకాశాలున్నాయి. ఆడంబరంగా జీవించడానికి బోలెడు మార్గాలున్నాయి. ఈ “అక్షర రుషి” చుట్టూ అనేక అవకాశాల మేనకలు నృత్య గానాలు చేసినా ఆయన పక్కచూపు చూడలేదు. ఆడంబరాలను ఆకర్షణలను దరి చేరనీయలేదు. సాదాసీదా జీవన మార్గాన్నే ఎంచుకున్నారు. జీవితాంతం సిద్ధాంత నిబద్ధత గల “మార్క్సిస్టు మహర్షి”గానే ఉండిపోయారు. రాఘవాచారి జీవితమే నిరాడంబరతకు నిర్వచనం. దానికి ఉన్నత ప్రమాణాలను, కొత్త కొలబద్దలను ఆవిష్కరించాడు.

రాఘవాచారి ఒక అరుదైన మేధావి . బహుభాషా కోవిదుడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం, పాండిత్యం గలవాడు. పండితుల పరిధి వేరు, మేధావుల పరిధి వేరు. మేధావులు వర్తమానాన్ని విశ్లేషించి భవిష్యత్తుకు ద్వారాలు తెరుస్తారు. గతం మీద తెలివిడిలేని వర్తమాన విశ్లేషణ అసమగ్రమేకాదు లోపభూయిష్టం అవుతుంది. అందుకే కార్ల్ మార్క్స్ తన కాలపు పెట్టుబడిదారీ వ్యవస్థను ఆకళింపు చేసుకోడానికి వివిధ దేశాలలోని వాటి పూర్వసమాజాలను లోతుగా అధ్యయనం చేసాడు. ఈ పూర్వసమాజాల ప్రభావం ఆయా సమాజాల భవిష్యత్ పరిణామాలపై విశేష ప్రభావాన్ని చూపుతాయని భావించాడు.

రాఘవాచారి చాలా సందర్భాలలో ప్రస్తావించినట్లు మన దేశంలో సంస్కృతం తెలిసిన వారికి ఇంగ్లీషు తెలియదు, ఇంగ్లీషు తెలిసిన వారికి సంస్కృతం రాదు. కొందరికి ఈ రెండూ తెలిసినా ఆయా భావజాలాలు సమన్వయం చేయగల మార్క్సిస్టు దృక్కోణం ఉండదు. అందుచేత చాలామంది ఎవరి ప్రపంచంలో వారు తిరుగుతూ ఒక సమ్యక్ దృక్పథాన్ని ఆవిష్కరించ లేకపోతున్నారు. సృజనశీల మేధావికి గతం మీద, వర్తమానం

మీద, మార్క్సిస్టు దృక్కోణం మీదా గట్టి పట్టు వుండాలి. ఈ మూడు స్రవంతుల త్రివేణీ సంగమం రాఘవాచారి. ఆయన చేసిన ప్రసంగాలు ఈ స్రవంతుల మేలు కలయికకు నిదర్శనంగా నిలుస్తాయి

నిబద్ధత గల అరుదైన పాత్రికేయుడు రాఘవాచారి. ఈ నిబద్ధత ఆయన ఈ వృత్తిని ఎంచుకున్న క్రమంలోనే రూపుదిద్దుకుంది. ఎందరికో జీవిత లక్ష్యంగా ఉండే ఇంజనీరింగ్ కోర్సులో చేరి మధ్యలోనే దానిని ముగించారు. తర్వాత బి.ఎస్.సి.లో చేరి పట్టభద్రుడైనా ఆ రంగంలోనే చదువు కొనసాగించకుండా న్యాయశాస్త్ర అధ్యయనాన్ని చేపట్టారు. బి.ఎల్. తర్వాత ఎం.ఎల్. చేసినా న్యాయవాద వృత్తిలో స్థిరపడకుండా పాత్రికేయ వృత్తిని చేపట్టారు. ఆయన పదే పదే ప్రజాస్వామ్యం మీద, పత్రికా స్వేచ్ఛ మీద చేసే ఉటంకింపులు న్యాయశాస్త్ర అధ్యయనంలోనివే అయినా అవే పాత్రికేయ వృత్తికి దారి చూపించాయి. ప్రజలే సార్వభౌములు, పత్రికలు పాలితుల పక్షమే గాని పాలకుల పక్షం కాదని, ఈ నాలుగవ ఎస్టేట్ శాసన కర్తలనీ, ప్రభుత్వాలనీ న్యాయస్థానాలనీ జవాబుదారీతనంలోకి తెచ్చే సాధనమనీ ఆయనకు నేర్పింది న్యాయశాస్త్ర అధ్యయనమే.

యువ కార్ల్‌మార్క్స్ తన 17వ ఏట "వృత్తిని ఎలా ఎంచుకోవాలి" అన్న వ్యాసాన్ని రాశారు. మానవజాతి సంక్షేమానికి, స్వయం పరిణతికీ అవకాశం ఇచ్చే వృత్తిని ఎంచుకుంటే అప్పుడు చేసే త్యాగాలు అందరికోసం చేసే త్యాగాలు అవుతాయని, అందరి ఆనందమే తన ఆనందం అవుతుందని మార్క్స్ చెప్పిన మాటలు రాఘవాచారి వృత్తి ఎంపికలో మనకు కనిపిస్తాయి. పైగా తన నిబద్ధతకు వామపక్ష పాత్రికేయం అనువైంది. జర్నలిస్టుల శిక్షణా తరగతులలోనూ ఈ వృత్తి ధర్మాన్నే ఆయన బోధించారు. జీవితాంతం దానినే అనువదించి నిబద్ధతగల అరుదైన పాత్రికేయుడుగా శిఖరారోహణ చేశారు.

రాఘవాచారి స్వయం కృషీవలుడు. ఆయనమీద కొన్ని ప్రభావాలున్నా తనదారిని తానే వేసుకున్నవాడు. ప్రశ్నతోనే ఆయన జీవితం మలుపులు తిరిగింది. ఆయన జీవితాన్ని పరిణతికి నడిపించిన చుక్కాని ప్రశ్న. ప్రశ్నోపనిషత్తునీ, ఈశ వ్యాసోపనిషత్తుని పలు సందర్భాలలో ప్రస్తావించేవారు. ప్రశ్న నుండే.. ప్రశ్నతోనే పురోగమనం ప్రారంభమైందనీ, కొనసాగిందనీ ప్రగాఢంగా విశ్వసించేవారు. మార్క్స్ చెప్పినట్లు ప్రతిదానినీ సందేహించు అన్నది కూడా ప్రశ్నించడమేనన్నది ఆయన ఉటంకింపులలో కనిపిస్తుంది. ప్రశ్నను చంపేసిన ప్రతి సందర్భంలోనూ సమాజం పురోగమనానికి తిలోదకాలు ఇచ్చి వెనక చూపు పట్టిన ఉదంతాలు ప్రస్తావించేవారు. అయితే ప్రశ్నకు ఎదురు లేదంటారు. ఎంత అణిచివేసినా మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉంటుందంటారు. అదే జరిగి ఉండకపోతే సమాజం ముందుకు సాగేది కాదంటారు. అందుకే ఆయన జీవితంలో ఏనాడూ నిర్వేదానికి తావు ఇవ్వలేదు.

గతకాలపు మూఢాచారాలు, కట్టుబాట్ల మీద తాను సంధించుకున్న ప్రశ్నల నుండి తర్కించగా వచ్చిన సమాధానాలే ఆయన జీవన పథాన్ని ప్రభావితం చేశాయి. ప్రశ్నతోనే పిలక నుండి క్రాపింగ్‌కు మారాడు. ప్రశ్నతోనే 'పవిత్ర యజ్ఞోపవీతాన్నీ' తీసి పక్కన పెట్టారు. ప్రశ్నతోనే కులాంతర వివాహానికి సిద్ధమయ్యారు.

చాల కాలం కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాలలో పని చేస్తున్నప్పటికీ, మార్క్సిస్టు భావజాలాన్ని ఆకళింపు చేసుకున్న తర్వాతే, తన ప్రశ్నల నుండి మార్గాన్వేషణ జరిగిన తర్వాతే పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాడు. ప్రతి అంశాన్ని ప్రశ్నలతోనే సాగు చేసి పరిణతిని పండించుకున్న స్వయం కృషీవలుడు రాఘవాచారి. ఇది అరుదైన ఒక జీవన పరిణామం.

ఇప్పుడు ప్రశ్నను నిర్బంధించే వాళ్లే పాలకులయ్యారు. ప్రశ్నను సంధించినవాళ్లను హతమారుస్తున్నారు. సమాజాన్ని వెనక చూపు పట్టిస్తున్నారు. మెజారిటీ మతోన్మాదమే రాజకీయం కాగా మతపరమైన భావోద్రేకాలు ఓట్లు దండుకునే సాధనాలయ్యాయి.

ఇవి వర్తమాన సమస్యల్ని విస్మరించి గతం వైపు పరుగులు తీయించే వెర్రి వ్యామోహాన్ని కలిగిస్తున్నాయి. ఈ రాజకీయ మత్తు కేవలం ఆర్థిక, రాజకీయ పోరాటలతోనే వదిలిపోదు. జన సాంస్కృతిక పునరుజ్జీవనం మాత్రమే ఎదుర్కొనగలదు. ఇలాంటి తరుణంలో పాత కొత్తల మేలుకలయికగా రూపుదిద్దుకోవాల్సిన సాంస్కృతిక పునరుజ్జీవనానికి దారి చూపగల అరుదైన దీపధారి రాఘవాచారి మనమధ్య లేకపోవడం తీరని లోటు. మరెవ్వరూ తీర్చలేని లోటు. ఈ ధవళ వస్త్రధారికి అరుణవర్ణం ప్రీతికరం. అందుకే ఆయనకు అరుణాంజలి. ❑

జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక

నిడదవోలు వెంకటేశ్వరరావు, ప్రచురణకర్త

2019 నవంబర్ 1-30 సంపుటి : 28 సంచిక : 3,4

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

డా॥ బి. రమేష్‌చంద్రబాబు

కొప్పర్తి వెంకట రమణమూర్తి

డి. సోమసుందర్

మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు


## దీపధారి సి.రా. జ్ఞాపకాల ప్రత్యేక సంచిక గురించి...

చక్రవర్తుల రాఘవాచారి మేధోసంపన్నుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప వక్త. ఆయన కేవలం జర్నలిజానికి, జర్నలిస్టులకు, సంపాదకులకు మాత్రమే దీపధారి కాదు. సాహితీ సాంస్కృతిక రంగాలకు, వివిధ స్రవంతుల కమ్యూనిస్టులకు కూడా దీపధారి.

ఆయనపై వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాల సంకలనాలను ఇప్పటికే విశాలాంధ్ర వారు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ వారు ప్రచురించారు. కొన్ని మినహాయింపులతో ఈ ప్రత్యేక సంచిక అదే కోవకి చెందుతుంది. రాఘవాచారి జీవితం లాగే ఆయన అభిమానులు, పాఠకులు కూడా ఎంతో వైవిధ్యం గలవారై వున్నారు. ఇలాంటి భిన్న తరగతుల పాఠకుల కోసం ఇలాంటి సంచికలు ఎన్ని వచ్చినా అవి పరస్పర పూరకాలుగా వివిధ రకాల పాఠకులను చేరే సాధనాలుగా ఉంటాయి.

రాఘవాచారితో జాతీయ స్ఫూర్తికి ప్రత్యక్ష బాంధవ్యం వుంది. దాదాపు మూడు దశాబ్దాల కిందట జాతీయ స్ఫూర్తి ప్రారంభ సంచిక ఆయన చేతుల మీదుగానే విడుదలైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పత్రికకు దీపధారిగా వున్నారు. జాతీయ స్ఫూర్తి ఒక నిబద్ధత గల పత్రికగా కొనసాగడానికి సి.రా. జ్ఞాపకాల సంచిక నిరంతర స్ఫూర్తిగా వుండాలన్న ఆకాంక్షతో దీనిని వెలువరిస్తున్నాము. కృతజ్ఞతలు.


ఈ సంకలనానికి విశాలాంధ్ర విజ్ఞాన సమితి పూర్తి సహకారాన్ని అందించింది. ఈ సంచికలో వివిధ పత్రికలలో ప్రచురించిన వ్యాసాలున్నాయి. విశాలాంధ్ర, ప్రజాశక్తి, సాహిత్య ప్రస్థానం, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ప్రజాపక్షం, **Scribes News**, ప్రజాతంత్ర పత్రికలకు, వ్యాసాలు, ఫోటోలు సేకరణలో సహకారం అందించిన ఆర్వీ రామారావు, అక్కినేని చంద్రరావు, బుడ్డిగ జమిందార్ గార్లకు, ఇతర మిత్రులకు జాతీయ స్ఫూర్తి సంపాదకవర్గం తన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది.


## ఈ సంచికలో...


ప్రముఖుల నివాళులు

ప్రజాపక్ష పాత్రికేయమే నా తత్వం 8

ఇప్పుడు నిర్వేదానికి తావు లేదు 33

రాఘవాచారి సంపాదకీయాలు 52

మార్క్స్ అంటే మార్పు 61

పరిచయాలు జ్ఞాపకాలు

విజ్ఞాన ఖని, విశిష్ట వక్త — అంపశయ్య నవీన్

నిబద్ధతకు నిలువెత్తు దర్పణం రాఘవాచారి — డా॥ చుక్కా రామయ్య

మేరునగాన్ని తలపించే మేధావి రాఘవాచారి — చెన్నమనేని రాజేశ్వరరావు

అక్షరాల చక్రవర్తి రాఘవాచారి — నందిరాజు రాధాకృష్ణ

సమానతా చక్రవర్తి రాఘవాచారి — మాడభూషి శ్రీధర్

మా ఊరి మార్క్సిస్టు మహర్షి — డా॥ రెంటాల జయదేవ

జర్నలిజం ఆయన ప్రాణం — దాసరి ఆళ్వారుస్వామి

స్వచ్ఛమైన అక్షరం.. స్నేహమయ వ్యక్తిత్వం — వైజయంతి

కామ్రేడ్ రాఘవాచారితో.. నా జ్ఞాపకాలు — సురవరం సుధాకరరెడ్డి

నిబద్ధత గల కమ్యూనిస్టు — ఈడ్పుగంటి నాగేశ్వరరావు

రాఘవాచారితో నా అనుభవాలు — శ్రీమతి జ్యోత్స్న

ఆయన కూతురుగా పుట్టటం నా అదృష్టం — డాక్టర్ సి. అనుపమ

వేదాధ్యాయనం నుండి మార్క్సిస్టు అధ్యయనానికి ఒక మేధావి జీవన యానం — అక్కినేని చంద్రరావు

మా రాఘవాచారి గారు — బుడ్డిగ జమీందార్

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో రాఘవాచారి

సంపాదక శిఖరం, అజాత శత్రువు రాఘవాచారి — కొండుభట్ల రామచంద్రమూర్తి

ప్రత్యామ్నాయ పత్రికా రచనకు ప్రతీక — ఆర్వీ రామారావ్

నిరాడంబర మేధావి, నిబద్ధ సంపాదకుడు — తెలకపల్లి రవి

జర్నలిస్టులలో దీపధారి రాఘవాచారి — ఎన్. వేణుగోపాల్

చేతికి వాచీ లేని మా ఎడిటర్ — మక్కిన సుబ్బారావు

పెద్ద మనసు 'పేట్రియాట్' — మందలపర్తి కిషోర్

అర్ధ శతాబ్ది క్రితం - పత్రికా విలేఖరిగా రాఘవాచారి — పి.ఎ. రామారావు

పాత్రికేయుల శిక్షణలో రాఘవాచారి ఒరవడి — డి. సోమసుందర్

ఆయన ఎడిటర్... సంపాదకుడు కాదు — కొత్తపల్లి రవిబాబు

సమాజాన్ని ప్రభావితం చేసిన రాఘవాచారి — అరసవిల్లి కృష్ణ

సంస్మరణ - సంపాదకీయాలు

అక్షర తపస్వికి అరుణాంజలి

ఆదర్శం, అక్షరం

నిబద్ధతకు నిలువెత్తు చిహ్నం

చిరస్మరణీయుడు, తెలుగు భాషాభిమాని మా రాఘవాచారి

A legend in his lifetime

ప్రముఖ రచయితల అక్షరాంజలి

ఆయన అరుదైన మేధావి — ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

సంపాదక ఉద్యమభేరి — నల్లి ధర్మారావు

అక్షరాంజలి...! — గోలి సీతారామయ్య

మంచి కమ్యూనిస్టు రాఘవాచారి — అదృశ్య దీపక్

మార్క్సిస్టులలో అగ్రగణ్యుడు — తుర్లపాటి కుటుంబరావు

అలవోకగా, అర్థవంతంగా ప్రసంగించే మేధావి — డా. నాగసూరి వేణుగోపాల్

లక్షల మెదళ్లను కదిలించిన 'సిరా' చుక్క — పెనుగొండ లక్ష్మీనారాయణ


విలువలకు నిలువుటద్దం — వేల్పుల నారాయణ

పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన కలంకృషీవలుడు — డా॥ జికె రావ్

జ్ఞానతపస్వి, జన పాత్రికేయుడు — ఆచార్య ఎస్వీ సత్యనారాయణ


కవర్‌పేజీ రాఘవాచారి వర్ణచిత్రం రూపకర్త శ్రీ బాబ్జీ గారు, విజయవాడ

# ప్రముఖుల నివాళులు




సిద్ధాంతాలు, విలువల కోసం పరితపించిన రాఘవాచారి ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచారు

**- ఎం. వెంకయ్య నాయుడు**
**భారత ఉపరాష్ట్రపతి**




జర్నలిజంలో విలువలకు మారు పేరు, భావి తరాలకు స్ఫూర్తి

**- వై ఎస్ జగన్మోహనరెడ్డి**
**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి**



పాత్రికేయ వృత్తికి సిసలైన నిర్వచనం, నిబద్ధతే ఆయన ఆశయం, లక్ష్యం

**- నారా చంద్రబాబు నాయుడు**
**మాజీ ముఖ్యమంత్రి**



మానవతావాదులకు ఆదర్శం, నడిచే విజ్ఞాన గని. ఆయన అరుదైన వ్యక్తులలో ఒకరు

**- పవన్ కళ్యాణ్**
**జనసేన అధినేత**




మార్క్సిజం పునాదిగా సామాజిక, రాజకీయ సాహిత్య, సాంస్కృతిక అంశాలను విశ్లేషించగల దిట్ట

**- కె నారాయణ**
**సిపిఐ జాతీయ కార్యదర్శి**



మానవీయ విలువలు మూర్తీభవించిన ఉన్నత వ్యక్తిత్వం. అజాతశత్రువుగా తెలుగునాట లక్షలాది మందికి ఆయన స్ఫూర్తి ప్రదాత

**- డా జయప్రకాష్ నారాయణ్**
**లోక్ సత్తా వ్యవస్థాపకులు**



ఆయన సేవలు మరువలేనివి. వామపక్ష ఉద్యమానికి, పత్రికా రంగానికి తీరని లోటు

**- కె రామకృష్ణ**
**సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి**



పత్రిక, సాహిత్య రంగానికి నిరుపమాన సేవలు. అభ్యుదయ, వామపక్ష ఉద్యమాలకు తీరని నష్టం

**- పి మధు**
**సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి**



ఉన్నత విలువలతో జీవితాన్ని ఎలా గడపవచ్చో ఆచరణలో రుజువు చేసిన మహా మనీషి

**- ముప్పాళ్ల నాగేశ్వరరావు**
**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి**



తెలుగునాట పాత్రికేయ దిగ్గజం, ఆయన సేవలు చిరస్మరణీయం

**- జె వి వి సత్యనారాయణ మూర్తి**
**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి**

# ప్రముఖుల నివాళులు



సాహిత్య, సామాజిక, రాజకీయ
విశ్లేషణల్లో ఆయనకు ఆయనే సాటి.
పాత్రికేయులకు వెలుగునిచ్చే
దీప స్థంభం

**- మండలి బుద్ధ ప్రసాద్**



మార్క్సిస్టు సిద్ధాంతం మీద
ఆయనకున్న అవగాహన
చాలా లోతైనది

**- ఆచార్య కె ఎస్ చలం**



లౌకిక గొంతులు తగ్గిపోతున్న
ఈ రోజుల్లో రాఘవాచారి వంటి
మేధావి లేని లోటు పూడ్చ లేనిది

**- గోగినేని బాబు**
**ప్రముఖ మానవతావాది**



తెలుగు పత్రికా రంగంలో
ఆయన చివరి పండితుడు

**- ఎమెస్కో విజయకుమార్**




ఏ అంశం ప్రస్తావించినా
దాని దిగంతాలు మన ముందు
పరిచే విజ్ఞాన ఖని

**- జి ఆంజనేయులు**
**ప్రధాన కార్యదర్శి ఎ పి డబ్ల్యు జె ఎఫ్**



ప్రగతి శీల మేధావి,
జర్నలిస్టులకు ఆత్మీయ బాంధవుడు.
ఆయన ఒక విజ్ఞాన సర్వస్వం

**- అంబటి ఆంజనేయులు**
**ఐ జె యు ఉపాధ్యక్షులు**



ఆయన నిరాడంబర,
నిత్య సత్యాన్వేషణా జీవితం
ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి

**- నల్లాన్ చక్రవర్తుల**



నిబద్ధతకు, క్రమశిక్షణకు,
నిజాయితీకి వృత్తి పట్ల
విశ్వాసానికి ప్రతీక

**- కె. శ్రీనివాస రెడ్డి**
**ఐ జె యు అధ్యక్షుడు**



రాఘవాచారి ...
ఒక చెరపలేని అక్షరం,
మరిచిపోలేని వ్యక్తిత్వం


**- డా కత్తి పద్మారావు**



ఆయన ఎడిటోరియల్స్
ఒక్కొక్కటీ ఒక రిఫరెన్స్ బుక్

**- కందిమళ్ల ప్రతాప రెడ్డి**

# ప్రముఖుల నివాళులు



మేధోపరమైన ఆయన అంతస్తు
కొలతలకు అందనిది

**- గూడవల్లి నాగేశ్వరరావు**



ఏ సమయంలో నైనా,
ఏ అంశం గురించి అయినా
ప్రసంగించగల దిట్ట

**- యలమంచిలి శివాజీ**

# ప్రెస్ అకాడమీకి రాఘవాచారి పేరు




ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పేరును సి రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గా మార్చారు. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ రాఘవాచారి గౌరవార్థం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్బులో జరిగిన APUWJ నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన ఈ ప్రకటన చేశారు

# చక్రవర్తుల రాఘవాచారి పేరుతో వెబ్ సైటు ప్రారంభం

**www. chacravarthularaghavachari.in**

విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నవంబరు 13న సిద్దార్థ అకాడమీలోవిశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో సంపాదక చక్రవర్తి విశాలాంధ్ర రాఘవాచారి సంస్మరణ సంచికను సీనియర్ పాత్రికేయులు కె రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. వెబ్ సైటును జాతీయ స్ఫూర్తి సంపాదకులు డి వి వి ఎస్ వర్మ ప్రారంభించారు



















# ప్రజాపక్ష పాత్రికేయమే నా తత్వం !

*లోతైన పరిశీలన... పదునైన పదజాలం.. అన్నిరంగాల్లో సాధికారత, నిబద్ధత గల విజ్ఞానఖని ఆయన.. తెల్లటి ప్యాంటు, చొక్కా ఇస్త్రీ లేకుండా అత్యంత నిరాడంబరంగా.. స్వచ్ఛంగా కనిపించే వ్యక్తి.. పెద్దలైనా, పిన్నలైనా ప్రేమగా పలకరించే స్వభావం.. ఏళ్లు గడిచినా ఒక్కసారి పరిచయమైన వ్యక్తిని చివరి వరకూ జ్ఞాపకం పెట్టుకోగల అరుదైన వ్యక్తిత్వం. అందరినీ కలుపుకుపోతూ, స్నేహంగా మెలిగేతత్వం ఆయన సొంతం. ఇవన్నీ కలగలిస్తేనే ప్రఖ్యాత జర్నలిస్టు చక్రవర్తుల రాఘవాచారి. ఈ పేరునే సంక్షిప్తంగా 'సి రా' అని కొందరు పిలిస్తే.. ఎక్కువమందికి 'విశాలాంధ్ర రాఘవాచారి' గానే సుపరిచితం. ఆయన అధ్యయనం అపారమే కాదు.. వైవిధ్యభరితం.. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ తదితర బహుభాషా కోవిదుడు. మార్క్సిజమే కాకుండా యూరోపియన్ సాహిత్యాన్ని, వివిధ దేశాల రాజ్యాంగాలను ఔపోసన పట్టిన విజ్ఞానవేత్త. ఆయన ప్రసంగాల్లో సందర్భానుసారం వివిధ గ్రంథాలలో అంశాల్ని ఉటంకించడం ఆయన విజ్ఞాన సముపార్జనకు నిలువెత్తు నిదర్శనం. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై 'మహాకవి శ్రీశ్రీ' అంటూ కాలేజీ రోజుల్లోనే విశ్లేషణాత్మక వ్యాసం రాశారు రాఘవచారి. ప్రజాపక్షమే పాత్రికేయం ఉండాలని పదే పదే చెప్తూ తన కలాన్ని ఆ పక్షాన్నే చివరివరకూ నిలిపారు. నేడు మీడియా కార్పొరేట్ల కబంధహస్తాల్లో నలిగిపోతున్న దశలో ప్రత్యామ్నాయ మీడియా ఆవశ్యకత పెరిగింది. ఈ నేపథ్యంలో రాఘవచారి గారు అక్టోబర్ 28న భౌతికంగా దూరం కావడం తీరని నష్టం. ఈ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ.. రాఘవాచారి గారి గురించిన 'జీవన' విశేషాలు ఆయన మాటల్లోనే...*

చుట్టూ ఉన్న వాతావరణం, ఆనాటి పరిస్థితులే ఒక మనిషిని రూపొందించటంలో కీలకపాత్ర వహిస్తాయి. పరమసాంప్రదాయక కుటుంబంలో పుట్టిన నేను వామపక్షవాదిగా, ప్రజాపాత్రికేయుడిగా మారటానికీ, ఎదగటానికీ నా చుట్టూ ఉన్న పరిస్థితులే కారణం. మాది నల్గొండ జిల్లా.. జనగామ తాలూకా శాతాపురం గ్రామం. ప్రస్తుతం జనగామ జిల్లాగా మారింది. మా ఊరు విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి గ్రామానికి సరిహద్దు. ఆయన రైతులను, కూలీలను, లంబాడీలను దోపిడీ చేస్తూ సాయుధ రైతాంగ తెలంగాణ పోరాటంలో పరమ కిరాతకుడిగా ప్రఖ్యాతి మూటగట్టుకున్నాడు. ముఖ్యంగా ఆయన రెండో కుమారుడు బాబు దొర హత్యాకాండకు తెగబడ్డాడు. ఆయన క్రౌర్యానికి బలైన అమరుల బంధువులు 1948 సెప్టెంబర్లో పోలీస్ యాక్షన్ జరగ్గానే జనగామ రైల్వేస్టేషన్లో ఆయన్ని చంపేశారు. అలాగే మా ఊరికి కడివెండి ఆరు మైళ్లు. అది ప్రస్తుతం దేవరుప్పల మండలంలో ఉంది. తెలంగాణ రైతాంగ పోరాటంలో మొట్టమొదటి అమరవీరుడు దొడ్డి కొమరయ్య స్వగ్రామం కడివెండి – అటు భూస్వాముల అరాచకాలు, వాటిని ప్రతిఘటించే రైతుకూలీ ఆంధ్ర మహాసభల నాయకత్వంలో జరిగిన పోరాటాలకు ఘర్షణ కేంద్రం. అది కొంతవరకూ బాల్యంలో, ఆ తర్వాత వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటున్న దశలో ప్రభావితం చేసిన పరిసరాల సంక్షిప్త నేపథ్యం. విద్యార్థి దశలో ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా, విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజం అధ్యయనంతో కమ్యూనిస్టుగా ఎదగడానికి తోడ్పడిన నేపథ్యమూ అదే!

## మాది సనాతన కుటుంబం

మాది సనాతన శ్రీవైష్ణవ కుటుంబం. పరమ ఛాందస ఆచారాలకీ, అనుష్టానాలకూ ప్రసిద్ధి చెందిన వైష్ణవ శాఖ. రామానుజ సిద్ధాంతంలోని సామాజిక సమానత్వస్ఫూర్తి ఏ కోశానా దరికి చేరకుండా జాగ్రత్త పడుతున్న శాఖ అది. ఇతరులతోనే కాదు; చివరకు తోటి వైష్ణవులైన ఇతర శాఖలతోనూ కలిసి భోజనం చేయడం కానీ, బంధుత్వం కానీ ఉండేవి కావు. అలాంటి వాతావరణంలో సహజంగానే విద్యాభ్యాసం ఐదారేళ్ల వరకూ (ఐదేళ్లకు అక్షరాభ్యాసం అన్న తంతు తరువాత) ఇంట్లో మూడు భాషలు తెలుగు, సంస్కృతం, ఉర్దూ ప్రత్యేకంగా ఉపాధ్యాయుల ద్వారా జరిగింది. మా కుటుంబసభ్యులతో పాటు బంధువుల పిల్లలు, కొన్ని సందర్భాల్లో ఇతర గ్రామాల నుంచీ భూస్వాముల పిల్లలు కొందరు వచ్చి, చదువుకుంటుండేవారు. ఇది పరీక్షల్లేని బట్టీయమే ప్రధానంగా ఉన్న విద్యావిధానం. అందువల్ల తెలుగు పద్యాలు, సంస్కృత శ్లోకాలు అలవోకగా ధారణ చేయడం

అలవాటైంది. ఇది అశాస్త్రీయమే కానీ తర్వాత్తర్వాత స్కూలు, కాలేజీ, యూనివర్శిటీలో ఇంగ్లీషు విద్యాభ్యాసంలో కొంతవరకూ తోడ్పడింది. ఈ పరిస్థితి 1948 సెప్టెంబర్ వరకూ జరిగింది.

నేను 1939 సెప్టెంబర్ 10న పుట్టాను. 16 మంది పిల్లల్లో తొమ్మిది మందిమి ఉన్నాం. ఐదుగురు అన్నదమ్ములం, నలుగురు అక్కచెల్లెళ్లు. అన్నదమ్ముల్లో నేను చివరివాణ్ణి. కమ్యూనిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూనే మా అమ్మగారు, అన్నయ్యల ఆకాంక్షలకు భిన్నంగా అనేక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ (వర్ణాంతర వివాహంతో సహా) వారికి నా పట్ల వాత్సల్యం, నాకు వారి పట్ల గౌరవంలో ఏమాత్రం తరుగుదల లేదు.

## గ్రామాల్లో భయం భయం

పోలీస్ యాక్షన్ తర్వాత నిజాం భారత యూనియన్లో విలీనమయ్యాక తదనంతర పరిస్థితుల్లో కమ్యూనిస్టు శ్రేణులపై, వారికి సానుభూతిగా ఉన్న ప్రజలపై దాడులు జరగడం మళ్లీ గ్రామాల్లో భయానక వాతావరణం ఉండేది. ఇదివరకే ప్రస్తావించిన బాబు దొర రజాకార్లను వెంటబెట్టుకుని, సరిహద్దు గ్రామమైన కోలుకొండలో సంఘం కార్యకర్తల (కమ్యూనిస్టు కార్యకర్తల)ను నిర్మూలించే నెపంతో ఊరినే కాల్చేశారు. దీని తర్వాత మేము మా తల్లిగారి ఊరైన బొకినాల (కృష్ణాజిల్లా, మానికొండ పొరుగు గ్రామం) అగ్రహారం వచ్చి చేరాం. అప్పుడూ బొకినాలలో ఏబీసీడీలు నేర్చుకున్నప్పటికీ ప్రధానంగా చదువు సంస్కృతాభ్యాసనానికే పరిమితమైంది. ఇంట్లో నేర్చుకున్నదానికి తోడు మా అన్నయ్యలతో కలిసి గుంటూరు జిల్లా పొన్నూరులో భావనారాయణ స్వామి దేవాలయం నిర్వహించిన సంస్కృత పాఠశాలలో మరో రెండేళ్లు చదువుకున్నా. అప్పుడు శబ్దమంజరి, బాలబోధిని; పంచకావ్యాలైన రఘువంశం, కుమార సంభవంలోని మూడు సర్గలు, దండి దశకుమార చరిత్ర గద్యం, బాలవ్యాకరణం.. ఇలా చదవటంతో గడిచిపోయింది.

## చదువులో ఉత్తమశ్రేణి

ఇంగ్లీషు చదవాలన్న ఇంట్లో వారి కోరిక మేరకు హైదరాబాదులో 1950 డిసెంబర్లో చేరి, అప్పుడు ఫస్ట్ ఫారం (ఆరో తరగతి) సికింద్రాబాదులోని హైదర్‌బస్తీ ప్రైమరీ స్కూల్లో (బైబిల్ హౌస్ ఎదురుగా) ప్రవేశపరీక్ష రాసి, ఫస్ట్ ఫారంలో అక్కడే వైఎంసీ దగ్గర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాను. నేనుంటున్న బంధువు రైల్వే ఉద్యోగి. నివాసం ఆల్వాలు మార్చడంతో టీసీ తీసుకుని, బొల్లారం హైస్కూల్లో పూర్తిచేశాను. తర్వాత ఐదేళ్లు లాలాగూడలోని రైల్వే హైస్కూల్లో చదివి, హెచ్‌ఎస్‌సీ పరీక్షల్లో పాసయ్యాను. 1956 మార్చిలో రాసిన ఆ పరీక్షలో హైదరాబాదు రాష్ట్రంలో ఉత్తీర్ణతా విద్యార్థుల్లో మంచి ర్యాంకు రావడంతో (6వ ర్యాంకు) ప్రతిష్ఠాత్మకమైన నిజాం కళాశాల మొదటి బ్యాచ్ పీయూసీలో ఎంపీసీ విభాగంలో చేరాను. ఆ పరీక్షల్లో యూనివర్శిటీ ఆరో ర్యాంకు రావడంతో ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో పిపిసి కోర్సులో చేరాను. తరువాత అది నచ్చక మానేసి, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ ఐచ్ఛికాంశాలుగా) లో చేరి, డిగ్రీ పూర్తిచేశాను.

## సిద్ధాంత, సాహిత్య అధ్యయనం

ఆ దశలో ప్రపంచాన్ని గూర్చిన ఆలోచనలకు అప్పుడప్పుడే పరిచయమైన వామపక్ష సిద్ధాంతాలకు, సాహిత్యానికి ఎక్కువ సమయం కేటాయించేవాడిని. అప్పుడే విద్యా వాతావరణం, మిత్రులు, సాహిత్య, రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు దోహదపడ్డారు. 1959– 60లో ఆ కళాశాల విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా నెగ్గడం నా విద్యార్థి ఉద్యమ ప్రస్థానానికి తొలిఘట్టం. ఆ సందర్భంలో బీఏ చదువుతున్న వరవరరావు (విరసం నేత), అంపశయ్య నవీన్, ఇంకా చాలామందితో ఏర్పడిన స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. నా మొదటి రచన వెలుగు చూసింది వరంగల్లోనే. పెద్దలు ఎంఎస్ ఆచార్యగారు (ప్రస్తుతం కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ తండ్రిగారు) నిర్వహిస్తున్న 'జనధర్మ' వార పత్రికలో క్రీడాభిరామంలో 'ఓరుగల్లు వర్ణన' అన్న వ్యాసం చాలా ప్రాథమిక స్థాయిలో రాసినది ప్రచురితమైంది. తర్వాత కాలేజీ మ్యాగజైన్లో వరవరరావు సంపాదకత్వంలో శ్రీశ్రీ మీద నేను రాసిన వ్యాసమూ ప్రచురితమైంది. అంతకుముందు నిజాం కళాశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో పాల్గొనడం వల్ల పాఠ్యేతర, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో ఆసక్తి హెచ్చుతూ వచ్చింది.

నిజాం కళాశాలలో అప్పటికి రాష్ట్రంలో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉండేవారు. అలాగే జయసింహ, అబ్బాస్‌అలీ బెయిగ్, అబిదాలీ వంటి టెస్ట్ క్రికెట్ ఆటగాళ్లు ఉండేవారు. ఈనాటి ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు శ్యాంబెనెగల్ అప్పుడు ఎంఏ విద్యార్థి. ప్రసిద్ధ తెలుగు సాహితీవేత్త, కవి జె.బాపురెడ్డి, విమర్శకుడు చేకూరి రామారావు, హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి నాయకుడైన రాజేంద్రప్రసాద్, కె.ప్రతాప్‌రెడ్డి ఆ దశలోనే పరిచయ మయ్యారు. అప్పటికి హెచ్‌ఎస్సీ నాయకులుగా పనిచేసిన

బూర్గుల నరసింగరావు (ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు), సీహెచ్. హనుమంతరావు (ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త) అలాంటి ఉద్దండులు ఉండేవారు. ఈ ప్రభావమూ నా వ్యక్తిత్వంపై ప్రసరించింది. దీనికి శ్రీశ్రీ మొదలుకుని, అప్పటి అభ్యుదయ కవులు, రచయితల రచనలు, ఇంగ్లీషు సాహిత్యంతో పరిచయం ఈ కృషిలో తోడ్పడింది. నిజాం కాలేజీలో పీయూసీలో సహాధ్యాయిగా ఉన్న ఎస్.లక్ష్మణమూర్తి (కాకతీయ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల శాఖాధిపతిగా పనిచేసి, పదవీ విరమణ చేసిన పండితుడు), ప్రసిద్ధ ఇంజనీరు విద్యాసాగర్‌రావు వంటి మిత్రులు లభించడం ఒక విశేషం. వీరిలో లక్ష్మణమూర్తితో కొనసాగుతున్న సాన్నిహిత్యం మరింత చెప్పుకోదగింది.

## చిక్కబడిన చైతన్యంతో ...

వరంగల్లో డిగ్రీ పూర్తయ్యాక ఉస్మానియాలో నాలుగేళ్లు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేయడం విద్యాభ్యాసంలో చివరి ఘట్టం. ఇక్కడ ఆనాడు ప్రబలంగా ఉన్న విద్యార్థి రాజకీయాల్లోనూ కొనసాగుతూ రావడం 1963లో లా కళాశాల విద్యార్థి సంఘాధ్యక్షుడిగా గట్టి పోటీలో నిలవడం ఒక విశేషం. చైనా యుద్ధం తర్వాత పెచ్చరిల్లిన కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదంలో ఏఐఎస్ఎఫ్ అభ్యర్థిగా కాంగ్రెస్ అనుబంధ ఎన్‌యూఎస్ఐ ఇతర సంఘాల నేతల దుష్ప్రచారాన్ని ఎదుర్కొని, ప్రత్యర్థిపై గెలవడం చిక్కబడుతున్న నా రాజకీయ చైతన్యానికి దోహదకారి అయ్యింది. ఈ దశలో తర్వాత కమ్యూనిస్టు పార్టీలో ప్రముఖులైన సురవరం సుధాకరరెడ్డి, పువ్వాడ నాగేశ్వరరావు, ప్రభృతులకు సన్నిహిత మవడం నాకెంతో స్ఫూర్తినిచ్చిన అంశం. అప్పటికే నేను కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకుని, ఐదేళ్లయ్యింది. వరంగల్లో 1960లో పార్టీ క్యాండిడేట్ సభ్యునిగా చేరాను. ఇప్పటివరకూ భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా కొనసాగుతూనే ఉన్నాను.

కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో నేను ఐదారేళ్లు అభ్యసించిన భాషల పరిచయమూ తదనంతరం కాలంలో వృథా కాలేదు. విద్యార్థి ఉద్యమంలోనే కలిసిన కమ్యూనిస్టు ఉద్యమకారులు రావి నారాయణరెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు, ఆరుట్ల దంపతులు (రామచంద్రారెడ్డి, కమలాదేవి) మగ్దూం మొహియుద్దీన్, రాజ బహదూర్ గౌడ్ మా ప్రాంత నాయకులైన భీమిరెడ్డి నరసింహారెడ్డి, కె.రామచంద్రారెడ్డి ప్రభృతుల సాంగత్యం ఎప్పుడూ మరిచిపోలేను. విశాలాంధ్ర జీవితంలో ప్రత్యక్షంగా కలిసి మెలిగిన చంద్ర రాజేశ్వరరావు, నీలం రాజశేఖరరెడ్డి, కంభంపాటి సత్యనారాయణ, ఏటుకూరి బలరామమ్మూర్తి, మద్దుకూరి చంద్రశేఖర్ గారు, మోహిత్ సేన్ ప్రభృతుల ప్రభావమూ గణనీయమే! దాదాపు మూడు దశాబ్దాల పాటు విశాలాంధ్రతోనూ, ప్రజా పాత్రికేయంతోనూ సాగిన జీవితం నాకు ఎప్పుడూ గర్వకారణమే!

## విద్యాభ్యాసమయ్యాక విశాలాంధ్రలో..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాకంటే వయసులో పెద్దయినప్పటికీ వరుసకు మేనల్లుడైన దగ్గరి బంధువు గూటమయ్య గారు అని పిలవబడే దళ నాయకుడు యూనియన్ పోలీసు ఘాతుకానికి బలవ్వడం.. మా పొరుగు గ్రామమైన గబ్బెటలో అమరుడైన గంగసాని తిరుమలరెడ్డి సాహసోపేత విప్లవ జీవితం.. మరోవైపు కడివెండికి చెందిన నల్లా నరసింహులు, యాదగిరిరావు ప్రభృతులను ప్రత్యక్షంగా చూసి ఏర్పరుచుకున్న అభిప్రాయాలు.. నిజాం నవాబు, భూస్వామ్య శక్తుల పరమ పైశాచిక ప్రవర్తనంపై పెరిగిన ఏహ్యత.. ప్రజా ఉద్యమాల్లో ప్రముఖుల వీరగాథలు వినడం... ఇదికాక కళాశాల విద్యతో పాటు వెలుపలి సమాజంలోని విస్తృత పరిణామాల అధ్యయనం.. నాపై చెరగని ముద్ర వేశాయి. 1965లో ఎల్ఎల్ఎం పూర్తిచేసి, పార్టీ ఆదేశం మేరకు విశాలాంధ్ర పత్రికకు విలేకరిగా పనిచేయడానికి రావడంతో విద్యార్థి దశ ముగిసింది.

## ఆదర్శవంతమైన కుటుంబం

రాఘవాచారి తెలంగాణాలో పుట్టినా జీవితంలో ఎక్కువ భాగం విజయవాడలోనే గడిపారు. గుంటూరు జిల్లా కమ్యూనిస్టు నాయకుడు కనపర్తి నాగయ్య కుమార్తె జ్యోత్స్నను వర్ణాంతర వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె స్కూలుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో మరణించడం వారికి తీరని వ్యథ కలిగించింది. పెద్దకుమార్తె డాలీ (అనుపమ) వైద్యురాలు. సీనియర్ జర్నలిస్టు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడు సంజయ్‌ను అనుపమ వివాహం చేసుకున్నారు. వారిద్దరూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన భార్య జ్యోత్స్న 'అభ్యాస' అనే వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేసే విద్యాసంస్థను నెలకొల్పారు. చివరిదశలో రాఘవాచారి గారు డాక్టర్ అనుపమ దగ్గర ఉంటూనే చికిత్స కోసం హైదరాబాద్‌లోని కొంపల్లిలో సురక్షా హాస్పటల్లో నెలరోజుల క్రితం చేరి, అక్కడే తుదిశ్వాస విడిచారు. ❑

– ప్రజాశక్తి జీవన డెస్క్

# విజ్ఞాన ఖని, విశిష్ట వక్త

పరిచయాలు జ్ఞాపకాలు

**అంపశయ్య నవీన్**

వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బి.ఏ. ఫస్టియర్ చదువుతున్నప్పుడు (1959) కొత్తగా ఒకతను బి.ఎస్సీ. రెండో సంవత్సరంలో చేరాడని, అప్పటికే అతడు 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా'లో సభ్యుడని, చదువులోనే కాకుండా అనేక ఇతర విషయాల్లో కూడా చాలా తెలివైనవాడని, ఇలా అతన్ని గూర్చి తోటి విద్యార్థులు కథలు కథలుగా చెప్పుకునేవారు. దాంతో అతన్నొకసారి చూడాలన్న కోరిక కలిగింది. ఒక మిత్రుడతన్ని పరిచయం చేశాడు. కొంచెం పొడవుగా, బక్కపలుచగా చురుకైన కళ్ళతో, శాంత స్వభావుడిగా కనిపించాడు. కాస్సేపు మాట్లాడగానే నాకాయన మీద చాలా గౌరవం కలిగింది.

కొద్ది రోజుల్లోనే స్టూడెంట్ యూనియన్‌కు ఎలక్షన్స్ వచ్చాయి. రాఘవాచారి జనరల్ సెక్రెటరీగా పోటీ చేస్తున్నాడన్న ప్రచారం ప్రారంభమైంది. కాలేజీలో చేరిన కొద్దిరోజుల్లోనే పోటీ చేయడం చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్స్‌లో వరవర రావు ఒక ప్యానెల్‌ను నిలబెట్టి వాళ్ళ తరపున ప్రచారం చేసేవాడు. అప్పటికి వరవరరావుకు ఒక స్పష్టమైన రాజకీయ ఐడియాలజీ అంటూ ఏదీ ఏర్పడలేదు. అందువల్ల రాఘవాచారికి వ్యతిరేకంగా ఒకరిని నిలబెట్టాడు. కాలేజీలో మరో గ్రూప్ ఆర్.ఎస్.ఎస్.కు చెందింది. వాళ్ళూ ఒకర్ని నిలబెట్టారు. ఎలక్షన్స్ రేపు జరుగుతాయనగా– పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎన్నికైతే ఏం చెయ్యబోతున్నారో చెప్పడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసేవారు. ఆ సమావేశంలో చాలా బాగా ఉపన్యసించిన వాళ్ళకే ఓట్లు పడేవి.

> ***బి.ఎస్సీ. చదువుతున్న రోజుల్లోనే రాఘవాచారికున్న ప్రపంచ రాజకీయాలను గూర్చిన అవగాహన మమ్మల్ని అబ్బురపరచేది. ఒక్క రాజకీయాలను గూర్చిన అవగాహనే కాకుండా సాహిత్యాన్ని గూర్చి, సంగీతాన్ని గూర్చి, చిత్రకళను గూర్చి ఆయనకున్న అపారమైన జ్ఞానం మమ్మల్ని ముగ్ధుల్ని చేసేది.***

రాఘవాచారి ఇంగ్లీషులో చాలా అద్భుతంగా మాట్లాడాడు. ఆ కారణంగానే తర్వాత రోజు జరిగిన ఎన్నికల్లో ఆయన చాలా మంచి మెజారిటీతో గెలిచాడు. మేమందరం రాఘవాచారికే ఓటేశాం. వరవరరావు అభ్యర్థి ఓడిపోయాడు. అప్పటికి వరవరరావు, రాఘవాచారిని గుర్తించలేదు. కానీ త్వరలోనే వరవరరావు, రాఘవాచారి ఒకర్నొకరు తెలుసుకున్నారు. నాకు కూడా త్వరలోనే రాఘవాచారితో స్నేహం ఏర్పడింది. నన్నూ, వరవరరావును వామపక్ష భావాల వైపు మళ్ళించింది రాఘవాచారే.

బి.ఎస్సీ. చదువుతున్న రోజుల్లోనే రాఘవాచారికి ప్రపంచ రాజకీయాలపై ఉన్న అవగాహన మమ్మల్ని అబ్బురపరిచేది. రాజకీయాలే కాకుండా సాహిత్యాన్ని గూర్చి, సంగీతాన్ని గూర్చి, చిత్రకళను గూర్చి ఆయనకున్న అపారమైన జ్ఞానం మమ్మల్ని ముగ్ధుల్ని చేసేది. నేను సెకండియర్లో ఉండగా ఒకసారి మా కాలేజికి ఎన్.జి.రంగా వచ్చారు. ఆ రోజుల్లోనే సి.రాజగోపాలాచారి నాయకత్వంలో స్వతంత్ర పార్టీ ఏర్పడింది. మా కాలేజీలో నెహ్రూ విధానాల్ని విమర్శిస్తూ రంగా గంటన్నరసేపు ఏకధాటిగా మాట్లాడాడు. ఆయన వాగ్ధాటి మా విద్యార్థుల్లో చాలా మందిని ఆకర్షించింది. ఆయన వెళ్ళిపోయాక రాఘవాచారితో 'ఎన్.జి.రంగా ఉపన్యాసం చాలా గొప్పగా ఉంది కదా?' అన్నాను. 'ఆయన ఉపన్యాసం మీకంతగా నచ్చిందా?' అని ఓ చిరునవ్వు నవ్వి ఓ గంటసేపు ఎన్.జి. రంగా ఉపన్యాసం మన దేశానికి ఎంత ప్రమాద కరమైందో వివరించాడు. అప్పుడే నాకు గొప్ప జ్ఞానోదయమైనట్టు తోచింది. అప్పుడే నాకు రైటిస్టులంటే ఎవరో, లెఫ్టిస్టులంటే ఎవరో తెలిసింది. నెహ్రూ అనుసరిస్తున్న సోషలిస్టు విధానాలు అంటే లెఫ్టిస్టు విధానాలే– ఈ దేశానికి, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు మేలు చేస్తాయన్న నమ్మకం కలిగింది. అప్పట్నించి రాఘవాచారి మీద నాకు గొప్ప గౌరవం. ఎప్పుడు కలుసుకున్నా ఆ రోజుల్లో నెహ్రూ విధానాలైన సెక్యులరిజం, అలీన విధానం, మిశ్రమ ఆర్థిక విధానం, పంచవర్ష ప్రణాళికలు, పబ్లిక్ సెక్టారే ఆర్థిక వ్యవస్థలో ప్రధానభాగం (కమాండింగ్ హైట్స్) కావడం ఈ విధానాలను గూర్చి రాఘవాచారి మాకొక టీచర్లా బోధించేవాడు. సీ.పీ.ఐ. కూడా నెహ్రూవిధానాలను ఆమోదించిందని చెబుతుండేవాడు.

ఆ రోజుల్లో జరిగిన మరో సంఘటన నాకు రాఘవాచారి మీదున్న గౌరవాన్ని ఇనుమడింపజేసింది. ఒకసారి మా కాలేజీలో షేక్స్‌పియర్ రచించిన నాటకాల మీద సెమినార్ జరిగింది. మా కాలేజీ ఇంగ్లీషు లెక్చరర్ టి.జి. వైద్యనాథన్ షేక్స్‌పియర్ నాటకాల గొప్పదనాన్ని గూర్చి చాలా గొప్ప ఉపన్యాసం చేశాడు. రాఘవాచారి లేచి 'షేక్స్‌పియర్ నాటకాలకంటె బెర్నార్డ్‌షా రాసిన

**పరిచయాలు జ్ఞాపకాలు**

నాటకాలే సమాజానికి ప్రయోజన కరవైున'వని వాదిస్తూ చాలాసేపు మాట్లాడాడు. దానికి వైద్యనాథన్ సమాధానమిస్తూ అరగంటసేపు మాట్లాడాడు. అయినా రాఘవాచారి ఊర్కోలేదు. బెర్నార్డ్ షా నాటకాలే గొప్పవని, ఆ నాటకాల్లో సమకాలీన సమాజంలోని వైరుధ్యాల చిత్రణ గొప్పగా జరిగిందని, షేక్స్‌పియర్ నాటకాల్లో రాజులు, రాణులు, వాళ్ళ ప్రేమకథలు, రాజులకు–రాజులకు మధ్య జరిగే కుట్రలు, కుతంత్రాలే ఉన్నాయని, ఒకప్పుడవి గొప్పవైతే కావచ్చు గానీ, ఇప్పుడు వాటి అవసరం లేదన్న ధోరణిలో రాఘవాచారి ఇంగ్లీషులో వైద్యనాథన్‌కు ధీటుగా సమాధానం చెప్పాడు. ఇద్దరూ ఇంగ్లీషులో ఏకధాటిగా, అద్భుతమైన 'ఎలోక్వెన్స్'తో వాదించుకుంటుంటే మంత్రముగ్ధులమై విన్నాం.

ఇద్దరూ కరెక్టేననిపించారు. మేం వైద్యనాథన్ బాగా మాట్లాడుతున్నాడని అనుకున్నా, రాఘవాచారి వైపే మొగ్గాం. రాఘవాచారికున్న ఆ అపారమైన ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానం నన్నెంతగా ప్రభావితం చేసిందో మాటల్లో చెప్పలేను. ఒక సీనియర్ ఇంగ్లీషు ప్రొఫెసర్‌తో సరిసమానంగా ఒక బి.ఎస్సీ. చదువుతున్న విద్యార్థి వాదించటం అనితరసాధ్యం అనిపించింది. ఇది జరిగిన మర్నాటి నుండి రాఘవాచారి పట్ల నాకున్న గౌరవం వెయ్యింతలు పెరిగింది. ఆ చర్చ తరువాతే నేను బెర్నార్డ్‌షా నాటకాలన్నీ చదివి ఒక నాటకంలో గానీ, నవలలో గానీ సంభాషణలు ఎలా రాయాలో నేర్చుకున్నాను.

బి.ఎస్సీ. పూర్తి చేశాక రాఘవాచారి హైదరాబాద్ వెళ్ళి ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజిలో జాయిన్ అయ్యాడు. నేను కూడా ఎం.ఏ. చదవటానికి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజిలో చేరాను. అంతకు ముందే వరవరరావు ఉస్మానియాలోనే ఎం.ఏ. (తెలుగు) పూర్తిచేసి యు.జి.సి. స్కాలర్‌షిప్‌తో రీసెర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్నాడు. మేము ముగ్గురమూ మంచి మిత్రులమైపోయి తరచుగా కలుసుకొని అనేక విషయాలను చర్చించుకునేవాళ్ళం.

రాఘవాచారి ఆరోజుల్లో మమ్మల్ని ఏఐఎస్ఎఫ్ మీటింగులకు తీసికెళ్తుండేవాడు. అలా జరిగిన ఒక మీటింగ్‌కు (1964) మహాకవి శ్రీశ్రీ వచ్చారు. అప్పటికే మేం 'మహాప్రస్థానం' చదివి ఉండటం వల్ల శ్రీశ్రీని చూడటం, వినటం గొప్ప అవకాశంగా భావించాం. శ్రీశ్రీ పాల్గొన్న ఆ సమావేశానికి సి. నారాయణరెడ్డి కూడా ఒక వక్తగా వచ్చారు. నాకు ఎం.ఏ.లో అర్థశాస్త్రం బోధించిన గురువు –ప్రొఫెసర్ కె.ఎస్. ఉపాధ్యాయ ఆ మీటింగుకు అధ్యక్షత వహించి 'మిలిటెంట్ జనరేషన్' అనే టాపిక్ మీద గొప్ప ఉపన్యాసం చేశాడు.

రాఘవాచారి లా కాలేజిలో ఎల్.ఎల్.బి. చదువుతున్న రోజుల్లో ఆయన ఆ కాలేజి స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా పోటీ చేశాడు. ఆయనకు పోటీగా ఆర్.ఎస్.ఎస్. భావజాలానికి చెందిన వ్యక్తినే నిల్చోబెట్టారు. పోటీ చాలా తీవ్రంగా– నువ్వా నేనా అన్నట్టే జరిగింది. ఆ రోజుల్లో మా మరో సన్నిహితుడు సత్యనారాయణరెడ్డి (సత్తెన్న) కూడా లా కాలేజిలో ఎల్.ఎల్.బి. చదువుతుండేవాడు. నేనూ, వరవరరావు, సత్తెన్న లా కాలేజిలో రాఘవాచారి తరపున ప్రచారం చేశాం. స్వల్ప మెజారిటీతో రాఘవాచారి గెల్చాడు. లా కాలేజిలో అధ్యక్షుడుగా రాఘవాచారి నిర్వహించిన ఒక సమావేశం నాకెప్పుడూ గుర్తొస్తుంది. వి.కె. కృష్ణమీనన్‌ను ఆహ్వానించి ఆయన ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశాడు రాఘవాచారి. 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో భారత సైన్యాలు ఓడిపోవడం వల్ల కృష్ణమీనన్ రక్షణమంత్రిగా రాజీనామా చేశాడు.

నెహ్రూకు అత్యంత సన్నిహితుడైన కృష్ణమీనన్ రాజీనామా చేసినందుకు నెహ్రూయే రాజీనామా చేశాడన్నట్టుగా 'రైటిస్టులు' ఉత్సవాలు జరుపుకొన్నారు. అలాంటి కృష్ణమీనన్ లా కాలేజీ కొస్తున్నాడంటే ఆర్.ఎస్.ఎస్.కు అనుబంధ పార్టీ అయిన జన సంఘ్‌కు చెందిన కొందరు విద్యార్థి నాయకులు కృష్ణమీనన్‌ను లా కాలేజిలో అడుగుపెట్టనీయబోమని ప్రతిజ్ఞ చేశారు. కానీ, కృష్ణమీనన్ లా కాలేజీకొచ్చి చట్టాలను గురించి అద్భుతమైన ప్రసంగం చేశాడు. కృష్ణమీనన్ ఎంత గొప్ప వక్తో ఆ రోజుల్లో చాలా మందికి తెలుసు. ఆయన ఉపన్యాసాన్ని అడ్డుకోవాలని కొందరు రైటిస్టు విద్యార్థులు విఫలప్రయత్నం చేశారు. కానీ, మీనన్ వాగ్ధాటి ముందు వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. ఎలాంటి రాజకీయాలు మాట్లాడకుండా కృష్ణమీనన్ తనకిచ్చిన టాపిక్ – 'సమాజం మీద చట్టాల ప్రభావం' అనే అంశం మీదనే గంటన్నర సేపు ప్రసంగం చేశాడు. కృష్ణమీనన్‌ను చూడటం, ఆయన ప్రసంగాన్ని వినడం జీవితంలో ఎప్పుడూ మరచిపోలేని అనుభవం.

1964లో నెహ్రూ చనిపోయినప్పుడు రాఘవాచారి చాలా చలించిపోయాడు. నెహ్రూ పట్ల ఆయనకు విపరీతమైన అభిమానం ఉండేది. నేను 'ఏ' హాస్టల్లో ఉంటున్న రోజుల్లో నాకాయన చాలా పుస్తకాలు తెచ్చిచ్చేవాడు. నెహ్రూ చనిపోయాక కమ్యూనిస్టు నాయకుడు హిరేన్ ముఖర్జీ రచించిన 'జెంటిల్ కొలోసస్' నాకు రాఘవాచారే తెచ్చిచ్చాడు. ఆ పుస్తకం చదివి

☞ మిగతా 26వ పేజీలో

# నిబద్ధతకు నిలువెత్తు దర్పణం రాఘవాచారి

పరిచయాలు
జ్ఞాపకాలు

డా॥ చుక్కా రామయ్య

తెలంగాణ ప్రాంతంలో జనగామ జిల్లాకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. చారిత్రకంగా, సాంస్కృతికంగా అక్కడి ఒక్కొక్క గ్రామానికి ఒక్కో విశిష్టత ఉంది. ఫ్యూడల్ వ్యవస్థ అక్కడ ఎంత పటిష్టంగా ఉండేదంటే.. తమ దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడకుండా ఉండాలని, ఆంధ్రా ప్రాంతం నుంచి కొన్ని పండిత కుటుంబాలను రప్పించి ఇక్కడ ధార్మిక ప్రచారం చేయించేవారు. అలా ఒక్కొక్క గ్రామానికి అక్కడి నుంచి వచ్చిన పండిత కుటుంబాలకు దొరలు మాన్యాలిచ్చేవారు. అలా అక్కడి వారికి ఇక్కడి వారికి సంబంధాలు ఏర్పడ్డాయి. అలాంటి కుటుంబంలో చక్రవర్తుల రాఘవాచారి ముత్తాతల కుటుంబం పాలకుర్తి మండలంలోని శాతాపురానికి వచ్చి స్థిరపడింది. కాగా, ఇక్కడి సామాజిక పరిస్థితులేమో భిన్నంగా ఉండేవి. దొరలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు, గ్రామాల్లోని పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు చైతన్యవంతులవుతున్న తరుణంలో పుట్టిన రాఘవాచారి పైనా కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం గాఢంగా పడింది. పండిత కుటుంబాలు కూడా క్రమంగా ఇక్కడి ప్రజలతో మమేకమయ్యారు.

రాత్రిపూట తమ ఇళ్లకు తల దాచుకోవడానికి వచ్చే నల్ల నరసింహులు లాంటి యోధుల మాటలు, ఆనాటి ప్రజాశక్తి సంపాదకీయాలు, విప్లవ యోధుల చర్యలు రాఘవాచారిని ఎంతో ప్రభావితం చేశాయి. దీంతో రాఘవాచారిలో చిన్నప్పటి నుంచే కమ్యూనిస్టుల పట్ల, కమ్యూనిస్టు భావాల పట్ల ఆసక్తి, అభిమానం పెరిగాయి. సాయుధ పోరాట కాలంలో కొన్ని కుటుంబాలు విజయవాడకు వెళ్లినప్పుడు అక్కడ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం.. ఇవన్నీ ఆయనపై గాఢ ముద్రను వేశాయి. అందుకే సాయుధ పోరాటాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని కడ శ్వాస వరకూ కౌగిలించుకున్నారాయన.

సంప్రదాయబద్ధంగా సంస్కృతం, తెలుగు, తల్లి నుంచి నేర్చుకున్న తమిళం, నిజాం కాలంలో వ్యవహార భాషగా ఉన్న ఉర్దూ, హిందీ, కళాశాల స్థాయిలోనే ఇలా ఐదారు భాషలు క్షుణ్ణంగా నేర్చుకొని విజ్ఞానఖనిగా అవతరించారు. అందువల్లే రాఘవాచారికి సంప్రదాయమూ తెలుసు.. ఆధునికతా తెలుసు. ఉస్మానియా 'లా' కళాశాలలో విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా భూస్వామ్య వర్గానికి చెందిన ప్రతినిధిని ఓడించారు. వరవరరావు, అంపశయ్య నవీన్.. మొదలైనవారు ఆయన సహాధ్యాయులుగా ఉండేవారు. ఆ రోజుల్లో ఎల్.ఎల్.ఎం చదివిన వారు అందులో ఉత్తీర్ణులు కావడమే అరుదు. కానీ సునిశిత ప్రతిభ కలిగిన రాఘవాచారి అందులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయినా 'న్యాయవాది'గా విధులు నిర్వహించలేదు. దీనికి్కారణం అప్పటికే ఆయనకు పత్రికా రంగంతో మమేకమై ఢిల్లీలో 'పేట్రియాట్' వంటి పత్రికల్లో పని చేయడం. కమ్యూనిస్టుగా రాణించడంతో ఆయన అధ్యయనం పత్రికా రంగానికి ముఖ్యంగా విశాలాంధ్ర పత్రికకు తద్వారా సమాజానికి ఎంతో ఉపయోగపడింది. బాబ్రీ మసీదు కూల్చివేతపై గానీ, బమ్మెర పోతన పంచశత జయంతి ఉత్సవాల సందర్భంలో నైతేనేమి..సందర్భమేదైనా ఆయన రాసే సంపాదకీయాలు విజ్ఞానాత్మకంగా, వివేచనాత్మకంగా ఉండేవి. పాఠకుల పరిజ్ఞానాన్ని పెంచేవి. మేధావి గనక రచనలో ఆయన వ్యక్తపరిచే సునిశిత హాస్యం, వ్యంగ్యం ఆకట్టుకునేవి. ఆయన మంచి వక్త. ఎన్నో అంశాలపై ఆయనకున్న పట్టు, ఆయన ప్రసంగాల ద్వారా వ్యక్తమయ్యేది. 'సింపుల్ లివింగ్–హై థింకింగ్' అన్నదానికి ఆయనొక నిలువెత్తు నిదర్శనంగా నిలిచేవారు.

రాఘవాచారి మరణం నన్ను తీవ్ర వేదనకు గురిచేసింది. ఆయనా, నేనూ ఒకే ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లం. మా ఇద్దరివీ పక్కపక్క గ్రామాలే. పెట్టుబడిదారీ వర్గానికి చెందిన పత్రికలు ఆయన్ను సంపాదకుడిగా రావాలని ఆహ్వానించినప్పటికీ సున్నితంగా తిరస్కరించారు. ఆయనకున్న నిబద్ధత తిరుగులేనిది. అందుకే ఆయన జీవితాంతం కమ్యూనిస్టుగానే బతికాడు. కమిటెడ్‌గా ఉన్నాడు. ఇలాంటి తరం శిఖరం ఒక్కొక్కటి పడిపోతుంటే మాలాంటి వాళ్లకు ఆవేదన కలుగుతోంది. ఆయన నిబద్ధత, నిమగ్నత తిరుగులేనివి. ఆయన తన జీవితంలో, వృత్తిలో పాటించిన విలువలు చిరస్మరణీయం. యువతరానికి ఆయన జీవితం ఎంతో స్ఫూర్తి. రాఘవాచారి ఆశయాలను, ఆలోచనలు, విలువలను ముందుకు కొనసాగించడమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం. ఆయన దివ్య స్మృతికి నా నివాళి. ❑

వ్యాసకర్త విద్యావేత్త
మరియు మాజీ శాసనమండలి సభ్యులు

# మేరునగాన్ని తలపించే మేధావి రాఘవాచారి

చెన్నమనేని రాజేశ్వర రావు

తెలుగు పత్రికా రచయితల్లో నిరుపమానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి. ఎక్కువ మంది ఆయనను ప్రసిద్ధ సంపాదకుడని భావిస్తారు. కానీ ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అసాధారణ మేధావి. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో పండితుడు. ఆయన కమ్యూనిస్టు సిద్ధాంతానికి నిబద్ధుడు. క్రికెట్ అంటే అమితాభిమాని. అన్నింటికీ మించి మంచి మనిషి. మూర్తీభవించిన నిజాయతీపరుడు. ఆ నిజాయితీ వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

సాంప్రదాయిక అష్టగోత్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచే ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు, రామాయణ మహాభారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. సంస్కృతం నేర్చుకోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. ఈ అధ్యయనానుభవమే అనంత జ్ఞాపకశక్తి సాగరంలో ఆయనను గజఈతగాడిగా తయారు చేసింది. చిన్నప్పటి నుంచే ఆయన మనుషులను, వివిధ అంశాలను నిశితంగా పరిశీలించే వారు. వాళ్ల అమ్మ ఇంటికొచ్చిన కమ్యూనిస్టులకు భోజనం పెట్టేవారు. కానీ కుటుంబ సభ్యులతో కాకుండా వారికి విడిగానే భోజనం పెట్టేవారు. రాఘవాచారి జన్మించిన వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో నల్లా నర్సింహులు, కొమాండూరి వెంకటాచార్యులు వంటి అనేకమంది కమ్యూనిస్టులకు శరణు ఇచ్చేది. వెంకటాచార్యులు భారీ కాయుడు. రజాకార్లు ఆయనను పట్టపగలు కిరాతకంగా హతమార్చారు. ఈ సంఘటన రాఘవాచారిని కలచివేసింది.

ఆయన బళ్లో చేరింది 11వ ఏటే. అయిదో తరగతిలో సికింద్రాబాద్ సమీపంలోని లాలా గుడా రైల్వే పాఠశాలలో చేరారు. ఆయన సోదరుల్లో ఒకరు కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రిక విశాలాంధ్ర పట్టుకొచ్చేవారు. 1953 నుంచి రాఘవాచారి విశాలాంధ్ర చదవడం ప్రారంభించారు. అప్పటి నుంచే పేదలంటే ఆయనకు సహానుభూతి అలవడింది. అయినా అప్పుడూ రాఘవాచారి జీవన విధానం మాత్రం శ్రోత్రీయమైందే. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరిన తరవాతే పిలక తీసేశారు. పి.యు.సి.లో ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతటిలో ఆరవ ర్యాంకు సాధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు ఆ చదువు మీద ఆసక్తి తగ్గింది. వరంగల్ వెళ్లి బి.ఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు.

వరవరరావు అప్పుడు వరంగల్ కళాశాలలో రాఘవాచారికి సమకాలికుడు. వరవరరావు ప్రధానమంత్రి నెహ్రూకు వీరాభిమాని. అదే సమయంలో రాఘవాచారికి కమ్యూనిస్టు రాజకీయాల మీద అభిమానం ఏర్పడింది. పట్టభద్రుడైన తరవాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం అభ్యసించారు. అప్పుడు ఆయన కమ్యూనిస్టు పార్టీలో విద్యార్థి విభాగంలో పని చేసేవారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీషు చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు.

జైపాల్‌రెడ్డి అప్పుడు ఎన్.ఎస్.యు.ఐ. నాయకుడిగా ఉండేవారు. న్యాయ శాస్త్రంలో పట్టభద్రుడైన తరవాత ఎల్.ఎల్.ఎం. చేశారు. కమ్యూనిస్టు పార్టీ అభీష్టం మేరకు 1965లో ఆయన విశాలాంధ్రలో చేరారు. ఆ వృత్తిలో అసమానుడనిపించుకున్నారు. చదివిందల్లా గుర్తుంచుకోవడం ఆయన ప్రత్యేకత.

1969–71 మధ్య ఆయన దిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల పేట్రియట్ ఇంగ్లీషు పత్రిక విలేకరిగా పని చేసేవారు. పత్రికా రచన ఆయనకు సునాయాసంగా ఒంటబట్టిన విద్య. విలేకరుల సమావేశానికో, మరో సభకో వెళితే అక్కడ చెప్పే విషయాలను నోట్ చేసుకునేవారు కాదు. ఆయన ఏకసంథాగ్రాహి. చక చకా వార్త టైప్ చేసేసేవారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకులయ్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఒత్తిడి చేసినా ఉద్యోగ విరమణ చేశారు. యాజమాన్యాలు తొలగించే దాకా ఉద్యోగాన్ని పట్టుకుని వేలాడే వాళ్లు అనేకమంది ఉన్న ఈ రోజుల్లో రాఘవా చారి సంపాదక బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు.

ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. ఎం.ఎస్. సుబ్బలక్ష్మికి భారతరత్న బిరుదు ప్రదానం చేసినప్పుడు రాఘవాచారి రాసిన సంపాదకీయం చూస్తే కర్నాటక సంగీతం ఆయనకు ఎంత కరతలామలకమో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. కర్నాటక సంగీతానికి సుబ్బలక్ష్మి చేసిన సేవలను సాధికారికంగా వివరించారు. పాలకుర్తి మండలం వాడే అయిన పోతన మీద ఆయన రాసిన సంపాదకీయం తెలుగు భాషలో రాఘవాచారి పాండిత్యానికి నిదర్శనం. మునుపటి జన సంఘ్ జనతా పార్టీ నుంచి విడిపోయి భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసినప్పుడు సంపాదకీయం రాస్తూ "గాంధీకి సోషలిజంలో విశ్వాసం లేదు, జన సంఘ్‌కు గాంధీ మీద ఎన్నడూ నమ్మకం లేదు" అని రాశారు.

"తెలుగు పత్రికల పరిణామం-ప్రయోగాలు-ప్రయోజనం" అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాష ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. సందర్భానికి తగిన, సందర్భోచితం కాని మాటలను అనుచితంగా వాడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా రచయితలను స్వార్థపర శక్తులు కొనేయగలరు అన్న అభిప్రాయం కలుగుతోందని వ్యాఖ్యానించారు. తెలుగు పత్రికలలో రాజకీయ వార్తలకే ప్రాధాన్యత ఉంటోందన్న అసంతృప్తి కూడా వ్యక్తం చేశారు.

ఆయనకున్న అపారమైన జ్ఞాపకశక్తి, మేధో సంపత్తి విశాలాంధ్ర సంపాదకుడిగా పని చేయడం సులువైంది. "పత్రికా రచన తీవ్రమైన అసూయాపరురాలైన ప్రియురాలి లాంటిది. ఏ రూపంలోనూ, ఏ రకంగానూ ప్రత్యర్థులను సహించలేదు. దివారాత్రాలూ ఆమెకే కేటాయించాలి. ఆమె తిరిగిచ్చేది భౌతిక సంపత్తి కాదు. విధి సక్రమంగా నిర్వహించామన్న సంతృప్తి మాత్రమే ఉంటుంది" అని టైమ్స్ ఆఫ్ ఇండియా సంపాదకుడు ఒకరు స్వాతంత్ర్యానికి ముందే వ్యాఖ్యానించారు.

రాఘవాచారి ఈ ఆదర్శానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన పండితుడు, జ్ఞాన సంపన్నుడు, మేధావి, అపారమైన మేధాశక్తి ఉన్న వాడు కనక విజయవాడలోనూ, ఇతర ప్రాంతాలలోనూ ఉపన్యాసకుడిగా ఆహ్వానించే వారు. ఆయన చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా మనసుకు హత్తుకునేట్టు చెప్పగలరు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిసలాడుతుంది. జ్ఞాన సంపద తొలకరిస్తుంది. ఉద్రిక్త వాతావరణం ఉన్నప్పుడు కూడా చిటికెలో ఆయన నవ్వులు విరిసేలా చేయగల దిట్ట. ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్రేకాలు రెచ్చగొట్టే, అశ్లీల పత్రికలను నిషేధించే ప్రతిపాదనను సంపాదకులతో చర్చించారు. సంపాదకులందరూ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అన్నారు. ఎన్.టి.ఆర్.కు నోట మాట పెగలక నిశ్చేష్టులయ్యారు. ఆ సందర్భంలో రాఘవాచారి వాతావరణాన్ని తేలికపరిచారు. ఎన్.టి. రామారావు పార్టీ వారు ధరించే చొక్కాలూ పసుపే, ఆయన నిషేధించాలనుకునే పత్రికలూ పసుపే (యెల్లో జర్నలిజం) అన్నారు. దాంతో ఎన్.టి.ఆర్.తో పాటు అందరూ పకపకా నవ్వేశారు.

**పరిచయాలు జ్ఞాపకాలు**

చిత్తశుద్ధి గల కమ్యూనిస్టుగా ఆయన ఎప్పుడూ తన పార్టీకి నిబద్ధుడయ్యే ఉన్నారు. ఆయన మామగారు కనపర్తి నాగయ్య, రాఘవాచారి మార్గదర్శకుడు కమ్యూనిస్టు నాయకుడు మోహిత్ సేన్ పార్టీని వీడి మరో పార్టీ పెట్టుకున్నప్పుడూ రాఘవాచారి సి.పి.ఐ. లోనే కొనసాగారు. మోహిత్‌సేన్ అంటే ఆయనకు గౌరవం ఉండేదే తప్ప ఆరాధనాభావం లేదు.

ఆయనకు ఉన్న ప్రజ్ఞకు, అపార పాండిత్యానికి గొప్ప ఆలోచనాపరుడో, అద్వితీయ రచయితో, విద్యా ప్రవీణుడో కాగలిగే వారే. కానీ పార్టీ కోరిక మేరకు ఆయన పత్రికా రచననే ఎన్నుకున్నారు. కచ్చితంగా రాసే ఆయన ధోరణి పాఠకులను ఆకట్టుకునేది. ఆయన మంచి వక్తే కాదు. ఉత్తమ శ్రోత. నిశిత పరిశీలకుడు. పిల్లలతో ఆయన ఎంత సరదాగా గడపగలరో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. వాళ్లతో సునాయాసంగా కలిసిపోతారు. వారికి చాక్లెట్లు, బిస్కెట్లు కొని పెడతారు.

ఆయనలో అహంకారం బొత్తిగా కనిపించదు. గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయరు. ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడగలరు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండిన రాఘవాచారిలో కలివిడి తనం తగ్గలేదు. ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చటపడతారు. ఆయన సాదా సీదాగా, బక్క పలచగా ఉండే మనిషి. ఆయనకు ఉన్న మేధా శక్తి మనకు కనిపించే ఆయన శరీరాకృతికన్నా చాలా మహత్తరమైంది.

పత్రికా రచనలో సుదీర్ఘ అనుభవం ఉన్న రాఘవాచారి తెలుగు పత్రికా రంగం తెలుగు రాజకీయ వ్యవస్థను నిజాయితీగా చిత్రించడం మానేసి రాజకీయ నాయకుల, పార్టీల ప్రయోజనాలను కాపాడేందుకే పరిమితమై పోతోందంటారు. తెలుగు పత్రికా రంగంలో నైతికత కరవవుతోందంటారు. పెట్టుబడికి ముద్దు బిడ్డగా మారిందంటారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారు. ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి అయిన సంపాదకుడే. ❑

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

పరిచయాలు జ్ఞాపకాలు

# అక్షరాల చక్రవర్తి రాఘవాచారి

నందిరాజు రాధాకృష్ణ

సాహితీ సభల్లో, పాత్రికేయ సమావేశాల్లో ఆ రూపం కనిపించదు. ఆధునిక రుషి, పాత్రికేయులకు నిలువెత్తు స్ఫూర్తి చక్రవర్తుల రాఘవాచారి మనకికలేరు. ఆ కలం ఆగిపోయింది. ఆ గళం మూగబోయింది. పాత్రికేయ పర్వత శిఖరం కూలి పోయింది. నడిచే విజ్ఞాన సర్వసం అచేతనంగా నిలబడిపోయింది. ఆజానుబాహు దేహం అంతర్ధానమైంది. అరవిరిసిన ఆ కనుదోయి మూసుకుపోయింది. మిసిమి పసిమి ఛాయ పంచభూతాల్లో కలిసిపోయింది. స్ఫురద్రూపం, ఆకట్టుకొనే చూపు, నెమ్మది స్వభావం, సరళ స్నేహ హృదయం, తెల్లని గిరజాల జుట్టూ, అంతకంటే మల్లెపూవు తెల్లదనం పాంటూ– చొక్కా, మనకిక కనపడదు. మహా నిశిత పరిశీలనం, పరిశోధనం, అనర్గళ వాగ్వైభవం కనుమరుగయ్యాయి. నాలుగు దశాబ్దాల పాత్రికేయ జీవితంలో ఎన్నో సభల్లో, కార్యక్రమాల్లో కలిసే సదవకాశం కలిగింది. అదొక అదృష్టం.

విశాలాంధ్ర రాఘవాచారిగా తెలుగు పాఠకలోకానికి చిరపరిచితులైన చక్రవర్తుల రాఘవాచారి కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై, తొలి కార్తీక సోమవారం ఉషోదయ సమయాన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆ పలకరింపులిక లేవు. ఆ మృదుహస్త స్పర్శ మాయమైంది. ఒక వారం కిందట మియాపూర్లోని ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్యంతో ఉన్న విషయం తెలిసి ఆయనను కలుసుకునే ప్రయత్నం చేసినప్పుడు.. ఆ స్థితిలో ఆయనను కదిలించి బాధపెట్టడం కూడదని మిత్రులు చెప్పడం వల్ల ఆయనతో మాట్లాడే అవకాశం చిక్కలేదు. ఉదయమే ఆయన పార్థివ దేహం సందర్శించి నివాళు అర్పించవలసిన దురదృష్టం.

ఆయన అధ్యయనం విస్తారం, వైవిధ్యభరితం. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూలోనూ ఆయనకు ప్రవేశమే కాదు, పాండిత్యమూ ఉంది. భారత రామాయణాలు మొదలుకొని ప్రాచీన సాహిత్యాన్ని, మార్క్సిస్టు గ్రంథాలను, యూరోపియన్ సాహిత్యాన్ని, వివిధ దేశాల రాజ్యాంగాలను ఆయన ఆపోశన పట్టారు. అలవోకగా ఆయా సందర్భాల్లో ఆయా అంశాలను వివిధ గ్రంథాల నుంచి ఉటంకించడం ఆయన విశిష్టత. చివరి క్షణం వరకూ ఆయన జీవితకాలపు జర్నలిస్టు విద్యార్థి. అక్షరాన్ని నమ్ముకో అమ్ముకోవద్దు అని బోధించిన గురువాయన. పాత్రికేయం ఉద్యోగమనుకుంటే ఎక్కువరోజులు ఈ రంగంలో సాగలేవు, గుర్తుంచుకో .. అని వేలాదిమంది జర్నలిజం విద్యార్థులకు సలహా ఇచ్చారు

రాఘవాచారి విశాలాంధ్రకు 1972 లో సంపాదకత్వం స్వీకరించి మూడు దశాబ్దాలుపైగా నిర్విఘ్నంగా కొనసాగించి కీర్తి గడించారు. సంపాదకుడిగా ఆయన బాధ్యతల నుంచి తప్పుకొని దశాబ్దమున్నర గడచినా.. ఇప్పటికీ ఆయన విశాలాంధ్ర రాఘవాచారిగా జనం మదిలో, హృదిలో నిలిచిపోయారంటే ఆ పత్రికతో ఆయనకున్న అనుబంధం అంటుంది. 1953 నుండి 'విశాలాంధ్ర' పత్రికను చదవటం ప్రారంభించారు. అరవై అయిదు సంవత్సరాల విశాలాంధ్ర పాఠకుడాయన. ఏ తెలుగు దినపత్రికల సంపాదకులకు లభించని అరుదైన గౌరవం అది. విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో ఆయన లేని సభ దాదాపు ఉండదంటే అతిశయోక్తి కాదు. రేడియోలో ఆయన ప్రసంగించని అంశం లేదు. చరిత్ర లోతుల్ని శోధించి మాట్లాడేవారు.

వరంగల్లు జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో వరదాచార్యులు – కనకవల్లి దంపతులకు 1939 సెప్టెంబరు 10వ తేదీన జన్మించిన రాఘవాచారి శ్రీవత్స గోత్రీకులు. పూర్తి వైష్ణవ సాంప్రదాయంలో పెరిగిన ఈయన తొమ్మిది మంది సంతానంలో, అయిదుగురు అన్నదమ్ములలో చివరి వాడు. చిన్నప్పుడు అందరూ 'రాఘవన్' అని పిలిచేవారు. ఆనాటి పద్ధతిలో ఇంట్లోనే విద్య నేర్చారు. అమ్మ తమిళం నేర్పింది. ఆంధ్రనామ సంగ్రహం, రుక్మిణీ కల్యాణం బాల్యంలోనే చదివేశారు అన్నయ్యలతో పాటు గుంటూరు జిల్లా పొన్నూరులో ఉండి అక్కడి భావనారాయణ సంస్కృత కళాశాలలో సంపత్కుమారాచార్య, చల్లా సత్యనారాయణ శాస్త్రి వద్ద పంచకావ్యాలు నేర్చారు. 15వ యేటికల్లా ఉర్దూ, సంస్కృతంలో రాటుదేలారు.

హైదరాబాద్ లాలా గుడా రైల్వే స్కూల్ లో హైస్కూల్ విద్య అభ్యసించారు.. నిజాం కాలేజి లో పియుసి మొదటి బాచ్‌లో చేరి ఉస్మానియా పరిధిలో 6వ రాంక్ సాధించారు. ప్రీ ఇంజనీరింగ్ పాసైనా ఇంజనీరింగ్ లో చేరకుండా బి.ఎస్.సి. చదివి ఉత్తీర్ణులయ్యారు. ఉస్మానియాలో 'లా కోర్సు'లో ప్రవేశించి ఎల్.ఎల్.ఎం. పూర్తి చేశారు. ఇక్కడే రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటి ఆర్ట్స్ కాలేజి విద్యార్థి ప్రెసిడెంట్ మాజీ కేంద్రమంత్రి ఎస్. జయపాల్ రెడ్డికి అత్యంత సన్నిహితులు. విద్యార్థి దశలో మక్దూం మొహియుద్దిన్, శ్రీశ్రీ ప్రభావం పడింది. ఆ దశలోనే కమ్యూనిస్టు భావజాలం అలవడింది. మహాకవి శ్రీశ్రీ పై ఆ రోజుల్లోనే విశ్లేషణాత్మక వ్యాసం రాశారు. భారత రాజ్యాంగం, వివిధ దేశాల రాజ్యాంగవిషయాలను కరతలామలకం చేసుకొన్నారు. ధర్మ శాస్త్రాధ్యయనం "జూరిస్ ప్రుడెన్స్" అంటే

**పరిచయాలు జ్ఞాపకాలు**

ఆయనకు విపరీతమైన అభిమానం. కష్టమైన పాఠ్యాంశమైనా పట్టుదలగా దానినే ఎంచుకొని ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

ఎం ఎస్ ఆచార్య నిర్వహణలో వరంగల్ నుంచీ వెలువడే 'జనధర్మ' చదివేవారు. రాఘవాచారి తొలి రచన జనధర్మ పత్రికలో ప్రచురితమయింది. కాలేజీ రోజుల్లోనే –క్రీడాభిరామం– లో "ఓరుగల్లు వర్ణన" వ్యాసం రాసి ప్రశంసలందుకున్నారు. అప్పటి నుంచీ వారి దృష్టి పాత్రికేయం వైపు మళ్ళింది. విద్యార్థిగా న్యాయశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ చేసిన ఆయన రాజకీయాలు, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలు ఆయనకు కరతలామలకం. ఉస్మానియా లా కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షునిగా వ్యవహరించారు.

క్రికెటర్ జయసింహ, దర్శకుడు శ్యాం బెనెగల్, చేకూరి రామారావు, జే బాపురెడ్డి, ఆచార్య జి వి సుబ్రహ్మణ్యం, అంపశయ్య నవీన్, ముదిగొండ వీరభద్రయ్య వీరి సహవిద్యార్థులు. ఆయన కేవలం చదవడమే కాదు, చదివిన ప్రతి అంశాన్ని మదిలో నిక్షిప్తం చేసుకునేవారు. ఆయన జ్ఞానపకశక్తి అమోఘం. ఐక్యూ టెస్టు చేసి ఉంటే ఐన్‌స్టీన్‌కు సరిసమానంగా ఉండి ఉంటారేమో అనడంలో అతిశయోక్తి కాదని అభిమానులు అంటారు. అందుకే ఆయనను తోటి జర్నలిస్టులు, రచయితలు, వివిధ వర్గాల మేధావులు 'నడుస్తున్న విజ్ఞానసర్వస్వం' అని గర్వంగా పిలుచుకుంటారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్యూనిస్ట్ నాయకుడు కనపర్తి నాగయ్య కుమార్తె జ్యోత్స్నను వివాహమాడారు. విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారు.

ఆయనను కమ్యూనిస్టు జర్నలిస్టు రాఘవాచారిగా అభివర్ణించేవారు. ఆయనే "నేను మొదట కమ్యూనిస్టును, ఆ తర్వాత జర్నలిస్టును.." అనే వారు. కాబట్టే ఆయన ఆలోచనలో, రాతలో, మాటలో ఇతరుల కన్నా భిన్నత్వం, సామాజిక దృక్పథం ప్రతిబింబించేవి. ఆయన సంపాదకీయాల్లోనూ అవే సాక్షాత్కారమయ్యేవి. వామపక్ష భావాలున్నప్పటికీ ఇతర సిద్ధాంతాలు, విశ్వాసాలను నమ్మే వ్యక్తులతో స్నేహంగా ఉండడం ఆయన ప్రత్యేకత. నొప్పించక, తానొవ్వక అన్నట్లు వ్యవహరించి నప్పటికీ తన అభిప్రాయాలు, విశ్వాసాలలో చివరివరకూ ఏనాడూ రాజీపడలేదు. ప్రముఖ ఆంగ్ల పాత్రికేయుడు హెన్రీ వాటర్సన్ "ఒక పత్రిక సంపాదకుడికి విస్తృత అధ్యయనం, గొప్ప తెలివితేటలు, దేనికీ జంకని ధీరత్వం ఉండాల్సిన ముఖ్యలక్షణాలు" అన్నారు. ఆ సలక్షణాలన్నీ పుణికిపుచ్చుకున్న వ్యక్తి రాఘవాచారి.

పాత్రికేయుడు సమాజాన్ని అధ్యయనం చేయాలి, దానిలోని లోటుపాటులు ఎత్తిచూపుతూ సరిదిద్దేందుకు ఒక సాధనంగా మారాలని సలహా ఇచ్చేవారు. సమాజంపై పడి బతికే పాత్రికేయం వృత్తి విలువలను దిగజార్చుతుందని ఆవేదన వెలిబుచ్చేవారు. పాత్రికేయులూ సమాజంలో భాగమే తప్ప భిన్నం కాదు, ప్రత్యేకం కాదు అని రాఘవాచారి జర్నలిస్టుల సభలు, సమావేశాల్లో హెచ్చరించేవారు. వినయం, విచక్షణ, వివేచనతో పాత్రికేయులు మెలిగినప్పుడే రాణించగలుగుతారని హితవు పలికారు. పాత్రికేయులు కూడా సాధారణ పౌరులే. వారికి కొమ్ములు లేవు. అందరిలాగే వారు కూడా సమాజాన్ని పీడించే రుగ్మతలకు లోనవుతుంటారని అనేక సందర్భాలలో వెన్నుతట్టి మరీ గుర్తు చేసేవారు.

లోతైన విశ్లేషణ, పదునైన వ్యాఖ్యానం, ఏ రంగంలో ఏ అంశంపైనైనా సాధికారిత, నిబద్ధత, అతి సాధారణ జీవితం, కలుపుగోలుతనం, చక్కని స్నేహభావం తదితర ప్రత్యేకతలన్నీ కలగలిస్తే రాఘవాచారి. ఆయన్నే సి రా" అని పిలుస్తుంటారు. అయిదున్నర దశాబ్దాలకు పైగా పాత్రికేయ అనుభవంతో పదునెక్కిన కలం ఆయనది. ఆయన సంపాదకీయాల్లో అతిశయోక్తులు, సంచలనాలు, రెచ్చగొట్టే ధోరణులు, భయానక వాతావరణాన్ని సృష్టించే మాటలు, వ్యాఖ్యలు భూతద్దం పెట్టి వెదికినా కనిపించేవి కాదు. డొంకతిరుగుళ్లు లేవు.. మనిషిలో ఆలోచన, వివేచన కల్పించడమే ఆ సంపాదకీయాల ధ్యేయం. తెలుగు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య పరిమాణాలను గురించి చర్చించాల్సి వచ్చినా, విశ్లేషించాల్సి వచ్చినా రాఘవాచారి సంపాదకీయాలను ప్రస్తావించాల్సిందే.

పత్రికాస్వేచ్ఛ, విలువలు, ప్రవర్తనా నియమావళి, సంస్కరణలు, పాలకులు ఆర్డినెన్సులు, అవాంఛనీయ ధోరణులు, గుత్తాధిపత్యం ధోరణులపై ఆయన రాసిన సంపాదకీయాలు వెలకట్టలేనివి. శ్రమజీవుల పక్షాన నిలబడి అక్షరాగ్నులు సంధించడంలోనూ, కమ్యూనిస్టు సిద్ధాంత చర్చలోనూ, సంగీతనిధి ఎం ఎస్ సుబ్బులక్ష్మిని స్మరించడంలోనూ, భక్తపోతన సాహిత్యాన్ని విశ్లేషించడంలోనూ..అరవిందుని సావిత్రి గురించి ఎంత ఆసువుగా మాట్లాడేవారో ఆంగ్లికన్ జ్యూరిస్ ప్రుడెన్స్ గురించి అంతే అనర్గళంగా విశదీకరించేవారు. ఆయన సంపాదకీయాలను 'జర్నీ ఇన్టు వరల్డ్' గా పేర్కొనవచ్చు. అరవై అయిదేళ్ల విశాలాంధ్ర ప్రస్థానంలో దాదాపు సగం కాలం ఆయన సంపాదకీయ మార్గదర్శనంలో పత్రిక రూపురేఖలు తీర్చిదిద్దుకొంది. రాఘవాచారి సంపాదకుడే కాదు, అంతకుమించి వక్త. పత్రికా స్వాతంత్ర్యం పేరిట యజమానులు చేస్తున్న అక్రమాలను ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో రాఘవాచారి జర్నలిజం విజిటింగ్

☞ మిగతా 25వ పేజీలో

పరిచయాలు జ్ఞాపకాలు

# సమానతా చక్రవర్తి రాఘవాచారి

**మాడభూషి శ్రీధర్**

పాత్రికేయుడంటే భుజాన సంచీ, ఓ చేతిలో నోట్ బుక్ అందులో రాసుకోవడానికి సిద్ధంగా పెన్ను మరో చేతిలో ఉండాల్సిందే. కాని సి రాఘవాచారికి అవేవీ అవసరం లేదు. పెన్ను, నోట్ బుక్ ఎన్నడూ పట్టుకోని పాత్రికేయుడు. గంటల కొద్దీ సాగే అసెంబ్లీ పార్లమెంటు సమావేశాలను కూడా నోట్స్ రాసుకోకుండానే కవర్ చేసిన రిపోర్టర్. అంతేకాదు నిరంతరం నోట్ బుక్కులన్నీ నింపే పాత్రికేయులకు కూడా రాసుకోలేక పోయిన పాయింట్లు చెప్పి, అందులో రాసుకోదగ్గవి వదిలి వేయవలసినవీ, ప్రధానమైనవి ఏమిటో కూడా చెప్పే నిపుణుడు మేధావి రాఘవాచారి. ప్రధానమైన సమావేశం లేదా సంఘటన జరగగానే ఆయన చుట్టూ జర్నలిస్టులు గుమికూడే వారు. అందరికీ నవ్వుతూ సమాధానం చెప్పేవారు.

అపారమైన మేధా శక్తి, అపూర్వమైన జ్ఞాపకశక్తి. శతాబ్దాల నాటి ప్రముఖసైద్ధాంతికుల నిర్వచనాలను నాలుక కొసలమీద విరాజిల్లే సమయోచిత ప్రజ్ఞామూర్తి – రాఘవాచారి. ఒంటి మీద తెల్లని బట్టలు, మనసంతా తెల్లని చల్లని వెన్నెల వంటి అభిమానం, కల్మషం లేని హృదయం. అంతా సమానమే అనే అసలైన వైష్ణవ విధానాన్ని, నిజమైన కమ్యూనిజపు సిద్ధాంతాన్ని, అంతా గత జన్మకర్మ కాదు ఈ జన్మలో మనం చేజేతులా చేసుకున్న కార్యక్రమాలే అని మనసా వాచా నమ్మిన వాడు, ఆచరించిన వాడు పదిమంది కోసమే పట్టుమని పది కాలాల పాటు తెలిసిన విజ్ఞానపు అక్షరాలు రచించిన వాడు. అటువంటి వ్యక్తి మళ్లీ రాడు, అంతటి వ్యక్తిత్వం మరి రాబోదు.

> **అక్షరకురుక్షేత్రంలో భీష్మాచార్యుడు పెన్నుతో పనిలేని పాత్రికేయుడు**
>
> ***ఆయన నిరాడంబర, నిత్య జ్ఞానాన్వేషణా, నిరంతర ప్రజా సంపర్క జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి... కమ్యూనిస్టు పాత్రికేయ సంప్రదాయంలో అగ్రగణ్యుడు, మూడు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక విశాలాంధ్ర సంపాదకుడు, నడుస్తున్న గ్రంథాలయం, విజ్ఞాన సర్వస్వం వంటి మేధావి, నిరాడంబరుడు, పరిచయమైన వారందరికీ ఆత్మీయుడు, అజాతశత్రువు, ఆహార్యంలోనూ హృదయంలోనూ మానవ సంబంధాలలోనూ స్వచ్ఛమైన తెల్లని మల్లెపూవు చక్రవర్తుల రాఘవాచారి."***

మంచితనం మూర్తీభవించిన మహోన్నత మానవతావాది రచనా ప్రజారామరాజ్య రాఘవ చక్రవర్తి. 81 సంవత్సరాల వయసులో ఆ అక్షర చక్రవర్తి సంపూర్ణ విశ్రాంతి కోసం మరో ప్రపంచానికి మహా ప్రస్థానం ప్రారంభించారు. విజయవాడ జనరల్ హాస్పటల్‌కు ఆయన శరీరాన్ని సమర్పించుకోవడమే ఆయన అంతిమ వాంఛ, అక్కడికి భౌతిక కాయాన్ని తరలించడమే అంతిమ యాత్ర. రిపోర్టర్ అయినా, ఎడిటర్ అయినా, సభలో వక్త అయినా, ప్రెస్ అకాడమీ శిక్షణా తరగతుల్లో అధ్యాపకుడిగానైనా రాఘవాచారి అనర్గళంగా మాట్లాడేవారు. పవర్ పాయింట్లతో పనిలేని పవర్ ఫుల్ పాయింట్లున్న పవర్ ఫుల్ వ్యక్తి. ఆయన క్లాస్‌లు వినడంతో పాటు ఆయనతో పాటు ప్రయాణించి తెలుసుకునే అంశాలే బోలెడు.

తన తొలి జర్నలిజం అక్షరం జనధర్మలో అచ్చయిందని ఒక ఇంటర్వ్యూలో చెపితే నేను ఆశ్చర్యపోయాను. వరంగల్లులో జనధర్మ పత్రికను మా నాన్నగారు ఎం ఎస్ ఆచార్య నడిపేవారు. జనధర్మ ప్రతి వారం విజయవాడ విశాలాంధ్ర రాఘవాచారి గారి కార్యాలయానికి వెళ్లేది. ఆచార్య గారి సంపాదకీయాలు తప్పనిసరిగా చదవడమే గాక నచ్చిన సంపాదకీయాలు విశాలంధ్రలో పునర్ముద్రించేవారు.

వరంగల్లు జిల్లా పాలకుర్తిమండలం (జనగామ తాలూకా) సాతాపురం గ్రామంలో సెప్టెంబర్ 10, 1939లో సంప్రదాయ పరమైన శ్రీ వైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచారిగారు సంస్కృతం, తెలుగు, ఉర్దూ ఆంగ్ల భాషల్లో నిష్ణాతుడు. తమిళ పరిచయం కూడా ఉంది. వైష్ణవంలో భాగమైన నమ్మాళ్వార్, గోదాదేవి పాశురాలు గడగడా చదివే వారు. మరోవైపు కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలు, ఎల్ ఎల్ ఎం న్యాయసిద్ధాంత విజ్ఞాన శాస్త్రం (జూరిస్ప్రుడెన్స్)లో నిర్వచనాలు నిన్న మొన్నటిదాకా కంఠతా చెప్పేవారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆయన ఎల్ ఎల్ బి, ఎల్.ఎల్.ఎం చదివినపుడు, క్లాస్‌లో పాఠాలు, హాస్టల్‌లో సహాధ్యాయి మనోహరరావు పాఠాలు చదువుతూ ఉంటే వినడమే ఆయన పని. అదే ఆయన ప్రిపరేషన్. ఆ శ్రుతపాండిత్యంతోనే పరీక్షలు రాయడం ఫస్టులో బెస్టుగా పాస్ కావడమే పని.

వరవరరావు కుటుంబ సభ్యుడు వరంగల్లు వాస్తవ్యుడు ఎన్ వేణుగోపాల్ చక్రవర్తుల రాఘవాచారి గురించి రాసిన మాటలు ఆయన మాటల్లోనే "అనేక రకాలుగా ఆయన నాకు ఆత్మీయుడు. ఆయన గురించి ఎన్నో వైపుల నుంచి విన్నాను. ఎంతో దగ్గరగా చూశాను. మొట్టమొదట మా కుటుంబ గురువు, మా బాపుకు అత్యంత గౌరవనీయుడు, మేం అయ్యార్ల గారు అని పిలిచే

శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల తిరుమలాచారి గారి సతీమణి, మేం అమ్మార్ల గారు అని పిలిచే ఆండాళమ్మ గారికి ఆయన తమ్ముడు. సొంత తమ్ముడు కాకపోయినా సొంత తమ్ముడిలాగనే పెరిగిన వాడు. తిరుమలాచారి గారు ఒక వంక వైష్ణవ గురువుగా ఉంటూనే తెలంగాణ సాయుధపోరాటాన్ని సమర్థించినవారు, గెరిల్లాలకు ఆశ్రయం ఇచ్చినవారు. అత్యాధునిక భావాలు వినడానికీ, చర్చించడానికీ, ఆమోదించడానికీ కూడ ఎటువంటి భేషజం పాటించనివారు. ఆయన ఊరు గూడూరు. రాఘవాచారి గారి ఊరు శాతాపురం. రెండూ తెలంగాణ సాయుధ పోరాటం ఉధృతంగా నడిచిన పాలకుర్తి – విస్నూరు – కడివెండి – దేవరుప్పుల సమీప గ్రామాలు. తిరుమలాచారి గారు శిష్య సంచారం తిరుగుతూ ప్రతి ఏటా కొన్ని వారాలో రోజులో బాపు దగ్గర రాజారంలో ఉండేవారు.

అలా రాఘవాచారి గారు చిన్నతనంలో అక్కతో పాటు రాజారం వచ్చారని విన్నాను. అలా నేను పుట్టక ముందు నుంచే మా ఇంటికీ ఆయనకూ సంబంధం ఉంది. ఆ తర్వాత 1957–60లలో వరంగల్ ఆర్ట్స్ కాలేజిలో ఆయన వరవరరావు గారికి సహవిద్యార్థి. అప్పటికే హైదరాబాద్‌లో కొంతకాలం చదువుకుని వచ్చి కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావంలోకి, కమ్యూనిస్టు విద్యార్థి రాజకీయాల ప్రభావంలోకి వచ్చిన రాఘవాచారి గారు ఒక రకంగా వరవరరావు గారి మీద తొలి కమ్యూనిస్టు ప్రభావాలు వేసిన వారిలో ఒకరు. వారిద్దరి స్నేహం గత అరవై సంవత్సరాలకు పైగా నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నది. వరవరరావు గారు తన కాలేజి జీవితపు రోజుల గురించి చెప్పినప్పుడల్లా రాఘవాచారి గారి ప్రభావశీల వ్యక్తిత్వం గురించి సగౌరవంగా తలచుకున్నారు. ఉపన్యాసాలు విజ్ఞాన ఖనులుగా ఉండేవి. సంస్కృతం, ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ సాహిత్యంలో అపారమైన పరిచయం, స్పష్టమైన మార్క్సిస్టు దృక్పథం, అత్యంత సరళమైన వివరణా, విశ్లేషణా శక్తి అలవోకగా ఉటంకించే, ప్రస్తావించే దేశదేశాల సాహిత్య, సామాజిక, రాజకీయ సమాచారం ఆయన ఉపన్యాసాలకు వేలాది అభిమానులను తయారు చేశాయి.

ఆయన నిరాడంబర, నిత్య జ్ఞానాన్వేషణా, నిరంతర ప్రజా సంపర్క జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి... కమ్యూనిస్టు పాత్రికేయ సంప్రదాయంలో అగ్రగణ్యుడు, మూడు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక విశాలాంధ్ర సంపాదకుడు, నడుస్తున్న గ్రంథాలయం, విజ్ఞాన సర్వస్వం వంటి మేధావి, నిరాడంబరుడు, పరిచయమైన వారందరికీ ఆత్మీయుడు, అజాతశత్రువు, ఆహార్యంలోనూ హృదయంలోనూ మానవ సంబంధాలలోనూ స్వచ్ఛమైన తెల్లని మల్లెపూవు చక్రవర్తుల రాఘవాచారి.”

పరిచయాలు జ్ఞాపకాలు

వేణుగోపాల్ ప్రతి అక్షరంతో నేను ఏకీభవిస్తాను. రెండేళ్ల కిందట నేను మా నాన్నగారి స్మారక ప్రసంగం ఇవ్వాలని రాఘవాచారి గారిని అభ్యర్థించాను. ఆయన ఆరోగ్యరీత్యా వాయిదా పడినా మొత్తానికి ఆయన రాగలిగారు. హైదరాబాద్ నుంచి వరంగల్లులోని కాకతీయ యూనివర్సిటీకి నేను ఆయనతో కలిసి కారులో చేసిన ప్రయాణం మరువలేనిది. ఆలేరు దాటి జనగామ, పెంబ్యాల, ఘనపురం దాటుతూ ఉంటే ఆ ఊళ్లలో దశాబ్దాల కిందట ఉన్న ప్రముఖుల పేర్లు వారితో ఉన్న అనుబంధాలు, వారి గొప్పతనం వివరిస్తూ వచ్చారు, చిన్ననాటి ముచ్చట్లు చదువుకున్నపుడు సహాధ్యాయులతో జ్ఞాపకాలు, నాన్న పత్రిక జనధర్మతో అనుబంధాలు వివరిస్తూ ప్రయాణం సాగింది. వరంగల్లులో ఉపన్యాసం అద్భుతంగా సాగింది.

కాకతీయ విశ్వవిద్యాలయంలో నాన్నగారు, రాఘవాచారి అభిమానులకు వీనుల విందు. తరువాత ఇంటికి వచ్చి మా అమ్మగారితో ఆప్యాయంగా మాట్లాడిన మాటలు మమ్మల్ని ఆనాటి గురుతులు మోసుకొచ్చాయి. ఈ మధ్య నేను విజయవాడలో ఆర్టికల్ 370 మీద మాట్లాడడానికి వెళ్లినపుడు రాఘవాచారిని కలిసి ఇంకెన్నో ముచ్చట్లు మాట్లాడుకునే అవకాశం కలిగింది. కాని అదే మా ఆఖరిసమావేశం అవుతుందని నేను ఊహించలేదు.

ప్రముఖ సంపాదకులు ఆర్వీ రామారావుగారు ఇటీవల రాఘవాచారి గురించి “పుట్టుకే కాదు బతుకులోనూ నిష్టాపరుడు” అని రాసిన వ్యాసంలో తనకు సంపాదకీయ రచనలో ఏ సందేహం వచ్చినా రాఘవాచారితో మాట్లాడే వాడినని చెప్పారు. ఆచార్య రంగా మరణించినపుడు ఆయన గురించి రాఘవాచారి బోలెడు ముచ్చట్లు చెప్పారని, దాని ఆధారంగా తాను సంపాదకీయం రాస్తే, ఫోన్ చేసి “నా సంపాదకీయం కన్నా నీదే బాగుందయ్యా” అన్నారని తెలిపారు. అంతటి సహృదయ చక్రవర్తి ఆయన.

అక్షరాలు ఆయనబాణాలు, సంపాదకీయాలు ఆయన ధనుస్సు, విశాలాంధ్ర పాత్రికేయ క్షేత్రం ఆయన కురుక్షేత్రం. అనారోగ్యపు అంపశయ్యపై ఉండి కూడా సమాజం గురించి ఆలోచిస్తూ, మిత్రులతో శిష్యులతో తన అక్షరయాత్రా విశేషాలు వివరిస్తూ అసౌకర్యాలను భరిస్తూ నవ్వుతూ వెలిగిపోయిన భీష్మాచార్యుడు. విశాలాంధ్ర పత్రికకు సువిశాల కాలం పాటు అంటే దాదాపు మూడు దశాబ్దాల పాటు సంపాదకుడిగా ఆయన కలంతో రచనా వ్యవసాయం చేశారు. ఆయనకు భార్య జ్యోత్స్న, కూతురు డాక్టర్ సి అనుపమ ఉన్నారు. వారికి నా సానుభూతి. ఆ మహాయోధుడికి నా జోహార్లు. ❑

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

పరిచయాలు జ్ఞాపకాలు

# మా ఊరి మార్క్సిస్టు మహర్షి

డా॥ రెంటాల జయదేవ

విజయవాడ... ఆ పేరు చెప్పగానే గుర్తొచ్చే అనివార్యమైన మరో పేరు ఇప్పుడు చరిత్రలోకి వెళ్ళిపోయింది. ఒకప్పటి బెజవాడ... నేటి విజయవాడగా మారడంలో అక్షరాలా అవిభాజ్య భాగం పంచుకొన్న మరో నిబద్ధమైన కలం ఆగిపోయింది. కంఠం మూగపోయింది. వరిష్ఠ పత్రికా రచయిత, విశాలాంధ్ర మాజీ సంపాదకుడు సి. రాఘవాచారి వెళ్ళిపోవడం ఒక తీరని విషాదం. తీర్చలేని లోటు. ప్రచురణ రంగం, పత్రికా ప్రపంచం అంతా విజయవాడలోనే కేంద్రీకృతమైన రోజుల్లో... ఆ నగర విజయ ధ్వజాల్లో చక్రవర్తుల వెంకట రాఘవాచారి ఒకరు.

విజయవాడలో మొఘల్ రాజపురం దాటితే... బొమ్మారెడ్డి, పరకాల పట్టాభి రామారావు, ఐ.వి, రాఘవాచారి లాంటి శ్రమజీవుల వనాలు. మరికాస్త ముందుకు వెళితే బాలాంత్రపు, ఉషశ్రీ, భట్టు లాంటి సంగీత, సంప్రదాయ, సాహిత్య స్వరాలు. ఎవరి సిద్ధాంతాలు, నమ్మకాలు వాళ్ళవైనా, ఎక్కడా స్నేహం చెడని అరుదైన జుగల్ బందీ తరం అది. వారి రాతలు చదువుతూ, మాటలు వింటూ, మంత్రముగ్ధమై ఆయా రంగాలలో ఆదర్శాల వైపు అడుగులు వేసిన నా లాంటి వాళ్ళు ఎందరో! అందుకే, ఆ రోడ్ల వెంట నడుస్తుంటే ఎవరికైనా ఛాతీ రెండంగుళాలు ఉప్పొంగేది. అనుకోకుండా ఆ సాయంకాలం ఏ రాఘవాచారో, మరొకరో కాలినడకనో, వీధి రిక్షాలోనో ఎదురైతే... అక్కడ ఒక మాటల పూదోట వెల్లివిరుస్తుంది. విజ్ఞాన పరిమళం గుబాళిస్తుంది. వెరసి... ఆ సాయంత్రం ఒక సదసద్గోష్ఠి.

విజయవాడ జనజీవితంలో, పరిణామంలో అంత ప్రభావశీలంగా మమేకమైన రాఘవాచారి పదహారణాల తెలంగాణ బిడ్డ అని అక్కడి చాలామందికి తెలీదు. తెలిసినా సరే ఆశ్చర్యమే తప్ప, అన్యభావం అనిపించదు. ఒకే ఒక్కసారి పరిచయమైనా సరే... అవతలివాళ్ళను అత్యంత ఆత్మీయులుగా మార్చేసుకొనే సహజాత సుగుణమేదో రాఘవాచారిలో ఉండేది. ప్రతి చిన్న విషయం గుర్తుపెట్టుకొని, పిన్నల్లో పిన్నగా, పెద్దల్లో పెద్దగా మనసారా మాట్లాడడం, హాయిగా కాలక్షేపం చేయడం తరాల అంతరాలు, తరతమ భేదాలూ లేకుండా అందరికీ ఆయనను సన్నిహితుణ్ణి చేసింది. నిత్యం తెల్లటి ప్యాంటు, చొక్కా, చేతులు లేని స్వెట్టర్, చలికాలం వస్తే మెడ చుట్టూ మఫ్లర్, నమ్మిన సిద్ధాంతాన్ని ప్రతిఫలిస్తోందా అన్నట్టు... రక్తం పొంగిన ఎర్రటి ముఖం, గాలికి రేగి, ఊగే వెండితీగల జుట్టు, ముఖంపై చెరగని చిరునవ్వు... రాఘవాచారి అచ్చం జీవన ప్రబోధం చేస్తున్న గీతాచార్యుడే. చిన్నప్పటి సంప్రదాయ కుటుంబ చిహ్నాలన్నిటినీ ఒక్కొక్కటిగా వదులుకొంటూ సమభావం, సహజీవనమే మానవతా మంత్రాలుగా ఎదిగిన ఈ పత్రికా వైతాళికుడు కాళిదాసు 'రఘువంశం' నుంచి కార్ల్ మార్క్స్ 'దాస్ క్యాపిటల్' దాకా... భాసుడు, భవభూతి, పోతన, శ్రీనాథుల మొదలు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు, సమకాలీన రాజకీయ విన్యాసాల దాకా అన్నింటినీ ఆపోశన పట్టిన సనాతన అధునాతనుడు. సమయం, సందర్భాలను బట్టి ఆ రచనల్లోని అంశాలను అలవోకగా తన ప్రసంగంలో ప్రస్తావించే ధార, ధారణ ఆయనవి. అందుకే, రాఘవాచారి రాత ఒక సైద్ధాంతిక భూమికలో వేనవి కాలపు ఉషోదయ విహారమైతే, ఆయన మాట సదా... శరత్కాలపు వెన్నెలలో వేట. ఆసక్తి గల వారికి ఆయనొక వాకింగ్ ఎన్‌సైక్లోపేడియా.

> ***మనుషుల్లోని మంచితనాన్ని పెంచుకోవడానికీ, పంచుకోవడానికీ రాఘవాచారికి కులమూ, మతమూ, ఏ సిద్ధాంత రాద్ధాంతమూ అడ్డు కాలేదు. మార్క్సును మెచ్చుకున్నట్టే... మహా భారత వ్యాసుడినీ, వాల్మీకినీ అక్కున చేర్చుకొనేవారు. ఆదిశంకరులనూ, రామానుజులనూ ఉటంకించేవారు. ఈ జ్ఞానం, ఆదర్శం, ఆచరణ ఆయనను సిద్ధాంతాలకు అతీతంగా అందరితోనూ సాన్నిహిత్యం పెంచుకున్న స్నేహశీలిని చేశాయి.***

విద్యార్థి నాయకుడిగా, 'విశాలాంధ్ర' సంపాదకుడిగా, చంద్ర రాజేశ్వరరావు వృద్ధాశ్రమ వ్యవహర్తగా, టీవీ నైన్టీనైన్ మీడియా స్కూలుకు పెద్దగా, ప్రెస్ అకాడెమీ పక్షాన ఉమ్మడి తెలుగు రాష్ట్రమంతటా ప్రతి జిల్లాకూ తిరిగి కొత్త తరానికి జర్నలిజం పాఠాలు చెప్పిన ఆచార్యుడిగా, రాష్ట్ర రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అనుభవాన్ని పంచిన అతిథి ఉపన్యాసకుడిగా ఆయనదొక సుదీర్ఘ ప్రస్థానం. హైదరాబాద్లోని 'ఆల్వాలు' ప్రాంతం (ఆళ్వారులు, వైష్ణవాలయం ఉన్న ప్రదేశం కాబట్టి) మూలాల మొదలు తెలంగాణలోని ప్రతి జిల్లా కథా ఆయన చారిత్రకంగా వివరిస్తుంటే ప్రయాణాల్లో వినడం సహప్రయాణికులు కొందరికి దక్కిన అరుదైన అవకాశం. శ్రీవైష్ణవ కుటుంబంలో సంస్కృత పంచ కావ్యాల సంప్రదాయ విద్యతో పాటు ఉర్దూ కూడా చదువుకొన్న నేపథ్యం ఆయనది. తెలంగాణ రైతాంగ పోరాటంలో తొలి

అమరవీరుడైన దొడ్డి కొమరయ్య స్వగ్రామానికి దగ్గరి ఊళ్ళో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పుట్టి, నిజాం నిరంకుశత్వం, ప్రజా పోరాటాలు చూస్తూ పెరిగారు. విద్యార్థి దశలోనే ఏ.ఐ.ఎస్.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై, కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్న ఆయన చివరి వరకు ఆ సిద్ధాంతాలకు తగ్గట్టే బతికారు. పెద్దల అభిమతాన్ని కాదని వామపక్ష ఉద్యమంలో దగ్గరైన వ్యక్తిని వర్ణాంతర వివాహం చేసుకోవడం, పిల్లలను ఆ సామాజిక సంస్కరణల రీతిలోనే పెంచడం రాఘవాచారి ఆచరణవాదం. అది ఓ చెదరని శరత్ 'జ్యోత్స్న'. గుంటూరు జిల్లా కమ్యూనిస్టు నేత కనపర్తి నాగయ్య కుమార్తె, న్యాయవాది అయిన సతీమణి జ్యోత్స్న అనుక్షణం రాఘవాచారిని ప్రోత్సహించి, వెన్నంటే నడిచారు. ఇక, విద్యార్థులపై ఒత్తిడి లేని చదువుల కోసం 'అభ్యాస' అంటూ ఓ విభిన్న తరహా స్కూలును ఆమె నడిపితే, భర్తగా ఆయన వద్దనకుండా ప్రోత్సహించారు. అలా వాళ్ళది అయిదు దశాబ్దాల ఆదర్శ దాంపత్యం.

రాఘవాచారి తన సిద్ధాంతాలను ఎవరి మీదా రుద్దాలని చూడలేదు. మనుషుల్లోని మంచితనాన్ని పెంచుకోవడానికీ, పంచుకోవడానికీ ఆయనకు కులమూ, మతమూ, ఏ సిద్ధాంత రాద్ధాంతమూ అడ్డుకాలేదు. మార్పును మెచ్చుకున్నట్టే... మహాభారత వ్యాసుడినీ, వాల్మీకినీ అక్కున చేర్చుకొనేవారు. ఆదిశంకరులనూ, రామానుజులనూ ఉటంకించేవారు. ఆ జ్ఞానం, ఆదర్శం, ఆచరణ ఆయనను సిద్ధాంతాలకు అతీతంగా అందరితోనూ సాన్నిహిత్యం పెంచుకున్న స్నేహశీలిని చేశాయి. 'మా ఊరి మార్క్సిస్టు మహర్షి'గా పిలుచుకొనేలా చేశాయి. ఆయుర్వేదం నుంచి అణుబాంబుల దాకా, శాస్త్రీయ సంగీతం నుంచి సాహిత్యం, రాజకీయాల దాకా సభ... అంశం ఏదైనా సాధికారికంగా విశ్లేషిస్తూ, చమత్కారం, వ్యంగ్యం కలగలిపి ఆసక్తి గొలిపేలా మాట్లాడడం ఆయన ప్రత్యేక శైలి.

విజయవాడలో ఆయన లేని సభను ఊహించలేం. ఏటా జనవరి పుస్తక మహోత్సవం అంటే, ప్రతిరోజూ పుస్తకాల గాలి పీల్చుకుంటూ రాఘవాచారి దంపతుల హాజరు తప్పనిసరి. వదలని ఉబ్బసంతో చలిలో పోరాడుతూనే రాఘవాచారి ప్రసంగిస్తేనో, ఆత్మీయంగా పలకరిస్తేనో... అప్పుడే ఆ సాహితీసభలకు నిండుదనం. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జాతీయస్థాయి ఉత్తరాది నాయకులొస్తే వారిని ఆంగ్లంలో సభకు పరిచయం చేయాలన్నా, పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారాలు దిగ్గంతులకు అందించినప్పుడు సభాసమాప్తిలో సమ్యక్ భాషణం చేయాలన్నా రాఘవాచారే శరణ్యం. కొన్నేళ్ళ క్రితం లతామంగేష్కర్, ఎస్పీబీలకు పిన్నమనేని పురస్కార ప్రదానసభలో ఆయన అలవోకగా హిందీ, ఉర్దూలు మేళవిస్తూ, ఆశువుగా చేసిన కవితాత్మక వందన సమర్పణ విని, లతాజీ మంత్రముగ్ధమైపోయిన దృశ్యం ఇప్పటికీ సభికులకు ఆకుపచ్చని జ్ఞాపకమే.

**పరిచయాలు జ్ఞాపకాలు**

ఏ రంగంలోనైనా సీనియర్ల నుంచి సమకాలికులు, కొత్త తరం దాకా అందరి గౌరవం, అభిమానం పొందడం ఒక అరుదైన విన్యాసం. పత్రికారంగంలో అది మరీ సకృత్తు. ఆ ఫీట్‌ను అనాయాసంగా చేసిన నిరాడంబర, పండిత పాత్రికేయుడు రాఘవాచారి. తెలుగుతో పాటు ఇంగ్లీషులోనూ సమాన సామర్థ్యం ఆయన సొంతం. కొన్నాళ్ళు 'పేట్రియాట్' దినపత్రిక, 'లింక్' వారపత్రికలకు పనిచేసిన అనుభవం ఉన్న రాఘవాచారి, ఆ తరువాత పార్టీ ఆదేశంతో 'విశాలాంధ్ర' విలేఖరిగా మొదలుపెట్టి, అదే పత్రికకు సంపాదకుడి స్థాయికి ఎదగడం తెలిసిన చరిత్ర. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఆయన ఆ పత్రికతో కలిసి నడిచారు, నడిపారు. వేల సంఖ్యలో సంపాదకీయాలు రాశారు. అయితే, అడపాదడపా సంకలనాలకూ, సంచికలకూ రాసిన వ్యాసాలు తప్ప ఆయన మరే రచనలూ చేయకపోవడం, చేసిన కొన్నీ పుస్తక రూపం ధరించకపోవడం ఓ విషాదం. '

విశాలాంధ్ర'కు రాఘవాచారి వరమైతే, ఆయన విస్తృత గ్రంథపఠనానికీ, అనుభవానికీ, రచనలకూ మరింత విశాలమైన వేదిక, విస్తృతి లేకపోవడం సాహితీ లోకానికి శాపం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, 'జమీన్ రైతు' లాంటి పేరున్న వేదికలు ఉత్తమ జర్నలిస్టుగా పురస్కారాలు అందించినా, ప్రధాన పత్రికారచనా లోకంలో రాఘవాచారికి రావాల్సినంత గుర్తింపు వచ్చిందా అన్న అనుమానమూ కలుగుతుంది. పదవీ విరమణ సమయంలో పేరున్న పత్రికా రచయితలు సభ పెట్టి సన్మానిస్తామంటే వద్దంటే వద్దనడం, అతి కష్టం మీద ఒప్పుకొన్నా.. వేదికపై ఇచ్చిన భారీ మొత్తం పర్సును నిరాకరించడం రాఘవాచారిలో మాత్రమే కనిపించే అరుదైన వ్యక్తిత్వం. ఈ కాలంలో ఇలాంటివాళ్ళున్నారా అని ఆశ్చర్యపరిచే అంశం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకొన్నప్పటి విద్యార్థి దశ నుంచి ఆయనకు పోరాటాలు అలవాటే. జీవితంలోనూ ఎన్నో పోరాటాలు చేశారు. ఎదిగిన కూతురు చదువుకొంటున్న వయసులో ఊహించని దుర్ఘటనలో దుర్మరణం పాలవడం కొన్నేళ్ళ క్రితమే ఆయనను కుంగదీసింది. ఆ మానసిక వైకల్యంపై పోరాడుతూ వచ్చారు. దాని నుంచి పూర్తిగా కోలుకోకుండానే, క్యాన్సర్ ఆయనను శారీరకంగా తినేయడం మొదలుపెట్టింది. అయినా, వైద్యురాలైన పెద్ద కూతురు (అనుపమ అలియాస్ డాలీ) అండతో ఆయన చాలాకాలంగా అనారోగ్యంపై పోరాటం చేస్తూనే ఉన్నారు.

☞ మిగతా 29వ పేజీలో

# జర్నలిజం ఆయన ప్రాణం !

దాసరి ఆళ్వారుస్వామి

పాత్రికేయ వృత్తికే జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు కొందరుంటారు. ఆ వృత్తికి అవసరమైన భాషకు ప్రాధాన్యత నివ్వటం సర్వసాధారణం. సి.రాఘవాచారిగా పత్రికా ప్రపంచానికి పరిచితులైన వారి పూర్తి పేరు చక్రవర్తుల రాఘవాచారి. ఆయన తల్లిదండ్రులు – కనకలక్ష్మి, వరదాచారిలు. రాఘవాచారి 1939 సెప్టెంబర్ 10న జన్మించారు. వీరు జన్మించింది తెలంగాణ పరిధిలోని వరంగల్ జిల్లా అయినా, వీరి బాల్యం చాలా వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో గడిచింది. ఊహ తెలిసే నాటికి ఆ ప్రాంతం నైజాం పాలకుల ఆగడాలకు, అకృత్యాలకు అడ్డు లేకుండా ఉండేది. అలాంటి నీచ, నికృష్ట వాతావరణంలో తన కొడుకును పెంచటానికి ఇష్టపడని రాఘవాచారి తల్లి కనకలక్ష్మి తన పుట్టింటికి పంపింది. కనకలక్ష్మి పుట్టినిల్లు కృష్ణాజిల్లాలోని గన్నవరం తాలూకా బొకినాల. నిన్న మొన్నటి వరకు సైకిల్‌పై ఆ గ్రామానికి వెళ్ళటానికి అనువైన రహదారి ఉండేది కాదు. అలాంటి కుగ్రామంలో మాతామహుల ఇంట రాఘవాచారి నివసిస్తూ, అక్కడికి మూడు మైళ్ళ దూరంలో ఉన్న మానికొండకు వచ్చి చదువు కొనసాగించి, ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఐదుగురు సోదరుల్లో రాఘవాచారి చివరివాడు. అనంతరం సోదరులతో కలిసి గుంటూరుజిల్లా, పొన్నూరులో భావనారాయణస్వామి ఆలయ అనుబంధ సంస్కృత పాఠశాలలో చేరి, సంస్కృత భాషకు మెరుగులు దిద్దుకున్నారు. రెండేళ్ళ పాటు ఆ పాఠశాలలో ఉన్నప్పుడే శబ్ద మంజరి, బాలబోధిని, రఘువంశం, కుమార సంభవం, దండి కుమారచరిత్ర, బాల వ్యాకరణం లాంటి వాటిని ఔపోసన పట్టారు.

1948లో నైజాం నవాబుల పతనం, రజాకార్ల దోపిడీలు తగ్గిపోయి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. తర్వాత సికింద్రాబాద్‌లో పాఠశాల విద్య, నిజాం కళాశాల మొదటి బ్యాచ్‌లో పియుసి చదివి 6వ ర్యాంకు సాధించారు. వరంగల్‌లోని ఆర్ట్స్ కళాశాలలో చేరి, బి.ఎస్.సి. డిగ్రీ అందుకొన్నారు. 1959లో కళాశాల విద్యార్థి సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అక్కడ చేరిన మిత్రులతో కలిసి సాహిత్యం, రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. వరంగల్‌లో చదువుకున్నప్పుడే రాఘవాచారి గారి తొలి రచన క్రీడాభిరామంలో ఓరుగల్లు ఎం.ఎస్.ఆచార్య గారు నిర్వహిస్తున్న జనధర్మ వారపత్రికలో ప్రచురించబడింది. కళాశాల ప్రచురించే మ్యాగ్‌జైన్‌లో కూడా వీరి రచనలు ముద్రించబడుటయే కాక, కళాశాల వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో కూడా పాల్గొని బహుమతులందుకోవటం ఆనవాయితీగా మారింది. స్వగృహంలో నేర్చుకొన్న ఆంగ్లం రాఘవాచారిని త్రిభాషా పండితునిగా తీర్చిదిద్దాయి. అటు తర్వాత ఉర్దూ భాష కూడా వారికి కరతలామలకమైంది. వారిది సనాతనాచారాలు కలిగిన కుటుంబంలో జన్మించినా, కుటుంబ కట్టుబాట్లను ఒకింత పక్కకు నెట్టి, జ్యోత్స్నను కులాంతర వివాహం చేసుకొన్నారు. జర్నలిస్టుగా – 1965 జూలైలో విశాలాంధ్ర దినపత్రిక రిపోర్టరుగా హైదరాబాద్‌లో ఉద్యోగ జీవితం ప్రారంభించారు.

1968లో సెప్టెంబర్‌లో 'పేట్రియట్' ఆంగ్ల దినపత్రిక 'లింక్' ఆంగ్ల వారపత్రికలలో చేరి హైదరాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. 1971 ఆగస్టు 31 వరకూ వాటిలో కొనసాగి, ఆ తర్వాత 1971 సెప్టెంబర్ 1న తిరిగి విశాలాంధ్రలో చేరారు. 1971 జూన్ 6వ తేదీన విశాలాంధ్ర దినపత్రిక సంపాదకునిగా బాధ్యతలు చేపట్టారు. 30 ఏళ్ళ పాటు ఆ పత్రిక సంపాదకునిగా కొనసాగి, పత్రిక ప్రజాదరణ పొందటానికి అహర్నిశలూ కృషి సల్పారు. పలు సంస్థలకు జర్నలిజం సలహాదారుగా ఆయన పనిచేశారు. 1990లో సర్ సి.వై. చింతామణి అవార్డును, 1990లోనే తెలుగు విశ్వవిద్యాలయం తాపీ ధర్మారావు పేరిట నెలకొల్పిన ఉత్తమ సంపాదక పురస్కారం అందుకున్నారు. 1993లో విజయవాడ సిద్ధార్థ కళాపీఠం విశిష్ట పురస్కారం, 1997లో మద్రాసు తెలుగు అకాడమీ పురస్కారంతో పాటు వారి జీవితంలో మరెన్నో గౌరవ సత్కారాలు అందుకున్నారు. ❑

వ్యాసకర్త పాత్రికేయుడు

# స్వచ్ఛమైన అక్షరం.. స్నేహమయ వ్యక్తిత్వం

పరిచయాలు జ్ఞాపకాలు

**వైజయంతి**

ఆదర్శాలు మాట్లాడటం వేరు. ఆదర్శంగా జీవించడం వేరు. ఆదర్శంగా జీవిస్తూ ఆ విషయాన్ని ప్రచారం చేసుకోకుండా అదేం పెద్ద గొప్ప కాదు అన్నట్టుగా మరింత గొప్పగా జీవించడం వేరు. రాఘవాచారి ఆ గొప్పతనం ఉన్న గొప్పమనిషి.

చక్రవర్తుల రాఘవాచారి అంటే ఎవరూ గుర్తుపట్టరు. సి.రాఘవాచారి అనగానే ఆ తెల్లటి స్వచ్ఛమైన రూపం గుర్తుకు వస్తుంది. పాత్రికేయుడిగా బహు సుపరిచితుడు. కాని వ్యక్తిగా రాఘవాచారిని పరిచయం చేయడమే చాలా కష్టం. ఒక అమృత హృదయుడి గురించి పరిచయం చేయడానికి మనకు అర్హత ఉందా లేదా అని అంతరాత్మ తప్పనిసరిగా మథన పడుతుంది. తుదిశ్వాస వరకు రాఘవాచారి కమ్యూనిస్టుగానే నిరాడంబరంగా జీవించి, ఆదర్శంగా నిలిచారు. స్థితప్రజ్ఞత, పూర్వభాషణం, మృదుభాషణం ఆయన లక్షణాలు. రాఘవాచారి గారిది ఆదర్శ వివాహం. బాల్యంలో శ్రీవైష్ణవానికి అనుగుణంగా త్రికాల సంధ్యా వదనం చేశారు. వైష్ణవ నామాలు, వెనకాల పిలక, పంచెకట్టు, చేతులకు శంఖుచక్రాలు వేయించుకున్నారు. అంతటి నిష్ఠాగరిష్టులైన రాఘవాచారి డిగ్రీ చదువుతుండగా కమ్యూనిజానికి ప్రభావితులయ్యారు. తన ఆలోచనలను మార్చుకున్నారు. పేరు మార్చుకోవలసిన అవసరం ఏముంది? ఆచారి అని ఉంచుకుంటే మాత్రమేం ఆలోచన, ఆచరణలో ఆ పేరు తనకు ఆటంకం కాబోదు కదా అనుకున్నారు. రాఘవాచారి అజాత శత్రువు, ఎవ్వరినీ విమర్శించరు. ఆయనతో మాట్లాడుతుంటే ఒక గ్రంథాలయమంతా కలియతిరిగిన భావన కలుగుతుంది.

రాఘవాచారికి ఇద్దరు ఆడ పిల్లలు. 1990 ఆగస్టులో రెండో అమ్మాయి ప్రమాదవశాత్తు మరణించింది. ఆ సమయంలో రాఘవాచారి నిబ్బరంగా కూర్చోవడం చూసి ఆయనతో 'అమ్మాయి పోయింది కదా!' అని అడిగితే, 'బతికుంటే బాగా చదువుకుని వృద్ధిలోకి వచ్చేది' అన్నారే కాని 'విధి నా మీద పగబూనింది' లాంటి చిన్న మాటలు ఆయన నోటి నుంచి రాలేదు. ఇది ఇలా ఉంటే, రాఘవాచారికి అత్యంత ఆత్మీయుడైన రేడియో దిగ్గజం ఉషశ్రీ సెప్టెంబరు 7, 1990లో కన్ను మూశారు. అప్పటికి రాఘవాచారి అమ్మాయి పోయి పూర్తిగా నెల కూడా కాలేదు. ఉషశ్రీ హైదరాబాదు ఆసుపత్రిలో గతించే సమయానికి విజయవాడలోని ఉషశ్రీ ఇంట్లో ఆయన తల్లి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీవీలో వార్తలలో అకస్మాత్తుగా తండ్రి గతించిన వార్త చూస్తే పిల్లలు ఏమైపోతారో ఏమోనని రాఘవాచారి సతీమణి జ్యోత్స్న గబగబ ఉషశ్రీ ఇంటికి చేరి విషయం చెప్పారు. ఒక పక్కన తండ్రి పోయినందుకు బాధపడాలో, కూతురు పోయిన బాధలో కూడా ఉషశ్రీ కూతుళ్ల గురించి ఆలోచించిన ఆయన విజ్ఞతకు చేతులెత్తి నమస్కరించాలో తెలియదు.

ఉషశ్రీ, రాఘవాచారిది విచిత్రమైన అనుబంధం. ఉషశ్రీ రిటైరయ్యాక, మధ్యాహ్నం భోజనం చేశాక, నిద్ర మధ్యలో లేపద్దని చెప్పి నిద్రపోయేవారు. సరిగ్గా అదే సమయానికి రాఘవాచారి విశాలాంధ్ర ఆఫీసులో ఎడిటోరియల్ పూర్తి చేసి ఐదో నెంబరు బస్సు దిగి, ఉషశ్రీ ఇంటి మీదుగా ఇల్లు చేరుకునేవారు. తప్పనిసరిగా ఉషశ్రీ ఇంటి దగ్గర ఆగి మంచి నీళ్లు తాగి ఉషశ్రీతో కొద్దిసేపు చర్చించి వెళ్లేవారు. ఆయన వస్తే, మాత్రం తప్పకుండా నిద్ర లేపమనేవారు. ఇద్దరూ శ్వేతవస్త్రాలే ధరించడం, ఇద్దరివీ కమ్యూనిస్టు భావాలే కావడం, ఇద్దరికీ సాహిత్య చర్చలంటే ఇష్టం కావడంతో, వీరిద్దరి మధ్య అనుబంధం సన్నని లతలా పెనవేసుకున్నట్లు కూడా తెలియనంత గాఢంగా పెనవేసుకుంది. వారిద్దరూ మార్నింగ్ వాక్ చేస్తుంటే చూసిన వారంతా వేదవ్యాస్, కార్ల్ మార్క్స్ అనుకునేవారు. ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవించు కునేవారు. ఉషశ్రీ గతించి మూడు దశాబ్దాలు అవుతున్నా రాఘవాచారి తుదిశ్వాస వరకూ ఆ కుటుంబంతో అనుబంధాన్ని పెనవేసుకునే ఉన్నారు.

తామరాకు మీద నీటిబొట్టు అనే మాట రాఘవాచారికి అన్వయించినట్లుగా మరొకరికి పొసగదు. రాఘవాచారి ఎంత సామాన్యంగా జీవిస్తారో ఒకరు చెప్పవలసిన పని లేదు. ఒక పత్రికకు అతి చిన్న వయసులో ఎడిటర్ అయ్యి, అదే పత్రికకు మూడు దశాబ్దాల పాటు అతి తక్కువ జీతానికి ఎడిటరుగా పనిచేసిన ఒకే ఒక్క జర్నలిస్టు బహుశా రాఘవాచారి మాత్రమేనేమో. విజయవాడలో 16 సంవత్సరాలు అద్దె ఇంట్లో ఉండి, ఆ తరవాత సొంత ఇల్లు కట్టుకుని, అక్కడ 16 సంవత్సరాలు ఉన్నాక, కొన్ని కారణాల వల్ల ఇల్లు అమ్మేశారు. 'మీకు బాధగా లేదా' అని ఎవరో ప్రశ్నిస్తే, స్వచ్ఛమైన చిరునవ్వులు నిండిన పెదవులతో, 'ఏముంది షోడశ సంవత్సరాలు అద్దె ఇంట్లో ఉన్నాను. మరో షోడశ కాలం సొంత ఇంట్లో ఉన్నాను. మళ్లీ అద్దె ఇంట్లో ఎంతకాలమంటే అంత కాలం' అని నిజాయితీగా అనేవారు. అసంతృప్తికి అర్థం తెలియదు రాఘవాచారికి. ఆయనకు అనారోగ్యమని తెలిసి ఎవరైనా పలకరించడానికి వెళితే ఆయన తన అనారోగ్య విషయం తప్ప మిగిలిన ఎన్నో విజ్ఞానదాయక విషయాలు మాట్లాడేవారు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, మార్క్సిజం, న్యాయశాస్త్రం, స్టాటిస్టిక్స్... అన్ని అంశాల మీద తడబాటు లేకుండా మాట్లాడగలిగిన శక్తి రాఘవాచారికి ఎక్కడ నుంచి వచ్చిందో మరి. ఆయనకు పెద్ద చిన్న తారతమ్యం తెలియదు. మానవులంతా ఒకటే అనే ఆత్మ కలిగిన రాఘవాచారి రాజకీయ నాయకుడిని, రిక్షా తొక్కుకునే వ్యక్తిని, టీ అమ్ముకునే కుర్రవాడిని అందరినీ సమదృష్టితో పలకరించేవారు. ❑

**వ్యాసకర్త సాక్షి ఫీచర్స్ రిపోర్టర్**

పరిచయాలు జ్ఞాపకాలు

# కామ్రేడ్ రాఘవాచారితో... నా జ్ఞాపకాలు

సురవరం సుధాకరరెడ్డి

కామ్రేడ్ రాఘవాచారిని వారం రోజుల క్రితమే కొంపల్లిలోని సురక్షా ఆసుపత్రిలో పరామర్శించి వచ్చాను. అప్పటికే మాట్లాడే ఓపిక లేదు. కాని గుర్తు పట్టారు. ఆఖరు దాకా పోరాడి చనిపోయారు.

కామ్రేడ్ రాఘవాచారి ప్రముఖ పాత్రికేయుడే కాదు. గొప్ప మేధావి. తెలంగాణ సాయుధ పోరాటంతో సన్నిహిత సంబంధమున్న, భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. వారి సోదరులు అప్పలాచారిగారు జనగామ తాలూకాలో అన్ని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తర్వాత వారి భూమంతా పోయింది. కామ్రేడ్ రాఘవాచారి ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతూ, మధ్యలో దానిని వదిలేసి బిఎస్‌సి చేశారు. హైదరాబాదులో ఎల్ఎల్‌బి, ఆ తర్వాత కానిస్టిట్యూషన్ లా ప్రధాన అంశంగా ఎల్ఎల్ఎం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజి ప్రెసిడెంట్‌గా వున్నప్పుడు, అప్పట్లో ఎఐఎస్ఎఫ్‌కు అనుబంధంగా ఉన్న హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లో పార్టీ ఆదేశంతో విశాలాంధ్ర విలేకరిగా తన పాత్రికేయ జీవితం ప్రారంభించారు. ఢిల్లీ నుండి శ్రీమతి అరుణా అసఫాలి ప్రారంభించిన పేట్రియట్ పత్రికకు విలేకరి బాధ్యతలు తీసుకున్నారు. కొంతకాలం ఢిల్లీలో కూడా పనిచేశారు. పేట్రియట్ పత్రిక సంపాదక వర్గంలో చేరమనే వారి కోరికను నిరాకరించి, పార్టీ ఆదేశంపై విశాలాంధ్ర ఎడిటర్ బాధ్యతలు స్వీకరించారు. బహుశా చిన్న వయసులో ఎడిటర్ బాధ్యతలు తెలుగు పత్రికల్లో నిర్వహించిన వారు రాఘవాచారే.

కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి, వేముల పల్లి శ్రీకృష్ణ లాంటి నిష్ణాతుల తర్వాత విశాలాంధ్ర ఎడిటర్ బాధ్యతలు తీసుకున్న కామ్రేడ్ రాఘవాచారి సునిశితమైన వ్యాఖ్యలు, వ్యాసాలు, సంపాదకీయాలతో 25 సం॥ల పాటు అవిచ్ఛిన్నంగా సంపాదకుడిగా పనిచేశారు. హైదరాబాదులో వున్నప్పుడే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్‌లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

రాఘవాచారి సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు అనర్గళంగా మాట్లాడగలిగే వారు. ఆయనొక నిరంతర పాఠకుడు. గొప్ప వక్త. రెచ్చగొట్టే ఉపన్యాసాలు కాకుండా, లోతైన విషయ పరిజ్ఞానంతో శ్రోతలను ముగ్ధులను చేసేవారు. రాజకీయ, సామాజిక, సాహిత్య సభలు కాని, వివాహాలు గాని, ఆయన తన ఉపన్యాసాలతో రక్తి కట్టించేవారు. మనసును నొప్పించని సునిశితమైన వ్యంగ్యం ఆయన ఉపన్యాసాలలో ఉండేది.

రాఘవాచారి గొప్ప స్నేహశీలి. వరంగల్ వెళ్లినా, ఢిల్లీ, హైదరాబాదు వెళ్లినా పాత స్నేహితులను వెతికి వెళ్లి కలిసేవారు. ఆప్యాయంగా మాట్లాడేవారు. వైస్ ఛాన్సలర్లు, మేధావులు, పాత్రికేయులు అనేక మందితో ఆయనకు సన్నిహిత పరిచయాలు వుండేవి. కామ్రేడ్ మోహిత్‌సేన్‌తో ఆయన సన్నిహితంగా వుంటుండేవారు. మాకు విద్యార్థి దశలో మోహిత్‌సేన్ పార్టీ బాధ్యులుగా వుండేవారు.

కామ్రేడ్ రాఘవాచారితో నాకు ఐదున్నర దశాబ్దాల సుదీర్ఘ స్నేహం వుంది. మేము పార్టీ సహచరులుగా, మిత్రులుగా గడిపాము. నేను కర్నూలులో గ్రాడ్యుయేషన్ తర్వాత, విశాలాంధ్ర పత్రికలో చేరేందుకు ఉత్సుకత చూపాను. విశాలాంధ్రలో ట్రైనింగ్ నిమిత్తం విజయవాడ రావలసిందిగా ఉత్తరం వచ్చింది. విజయవాడ వచ్చి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి గారిని కలిసాను. ఆయన ఏటుకూరి బలరామమూర్తి గారికి పరిచయం చేసారు. 24 గంటలు గడవక ముందే హైదరాబాదు నుండి రాఘవాచారి గారు ఉస్మానియా యూనివర్శిటీ లా కాలేజీలో చేరేందుకు, విద్యార్థి రంగంలో పనిచేయటానికి నన్ను పంపమని రాష్ట్ర కార్యదర్శికి టెలిగ్రాం ఇచ్చారు. లా కాలేజీలో చేరేందుకు మరుసటి రోజే ఆఖరి రోజు గనుక నన్ను ఆ రాత్రే హైదరాబాదు పంపారు.

నేను వచ్చేసరికి రాఘవాచారి గారే నన్ను తీసుకెళ్లి లా కాలేజీలో చేర్పించారు. నేను కాలేజీకి అప్లికేషన్ తీసుకెళ్లేప్పటికే లా కాలేజి విద్యార్థి యూనియన్ ప్రధాన కార్యదర్శికి కూడా నామినేషన్ వేయించారు. అంతకుముందు సంవత్సరం ఆయన అధ్యక్షులుగా పనిచేసారు. యూనివర్శిటీలో కొంతమేరకు గూండా రాజకీయాలుండేవి. నన్ను ఉపసంహరించుకొమ్మని నా ప్రత్యర్థులు బెదిరించారు. నేను కర్నూలు విద్యార్థిని కాబట్టి, ఆంధ్రా వాళ్లు పోటీ చేయటానికి వీల్లేదని బెదిరించారు. కాలేజీలో కొందరు రాయలసీమ విద్యార్థులు వున్నా మెజారిటీ తెలంగాణ విద్యార్థులే. రాఘవాచారిపై అందరికి గౌరవముండేది. అప్పటికే విద్యార్థుల్లో ఆయనొక మేధావిగా, మంచి నాయకుడిగా గుర్తింపు వుండేది. యూనివర్శిటీ ఆర్ట్సుకాలేజీలో విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో తీవ్రమైన పోటీ ఏర్పడి ఒక గూండా గ్యాంగు కులకర్ణి అనే అభ్యర్థిపై దాడి చేసి ప్రచారం చేయకుండా నిరోధించారు. కొందరు లెక్చరర్స్ రాఘవాచారిని పిలిచి ఆ అభ్యర్థికి సహాయం చేయమని కోరారు. ఆయన వెళ్లి అభ్యర్థితోపాటు కరపత్రాలు పంచినా ప్రత్యర్థులు దాడికి సాహసించలేదు. ఆఖరికి కులకర్ణి గెలిచారు. యూనివర్శిటీ లా కాలేజీలో నేను గెలిచాను. ఆయనతో పాటు నేను హైదరాబాద్

స్టూడెంట్స్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నన్ను అనేక కాలేజీలకు తీసుకెళ్లి పరిచయం చేసారు. ఆ సంవత్సరం సిటీలో ఏడు కాలేజీలలో విద్యార్థి ఫెడరేషన్ అభ్యర్థులు గెలిచారు. యస్.జైపాల్‌రెడ్డి గారు యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు. ఆయన శక్తివంతమైన నాయకుడు, మేధావి. వరవరరావు అప్పుడు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి. రాఘవాచారికి మిత్రులు. ఆర్ట్స్ కాలేజి క్యాంటిన్ ముందు జైపాల్‌రెడ్డికి మాకు అనేక అంశాలమీద తీవ్రమైన చర్చలు జరిగేవి. రాఘవాచారి గొప్ప వాదనా పటిమతో చర్చలో పాల్గొనటం మాకు నేర్పించారు. ఈ చర్చలు వినేందుకు అనేకమంది విద్యార్థులు గుమిగూడేవారు. ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు, మేము, న్యూ ఏజ్, లింక్, పేట్రియట్, ఫ్రీ ప్రెస్ జర్నల్ తదితర పత్రికలు, ఆర్గనైజర్ లాంటి ఆర్‌ఎస్‌ఎస్ పత్రికలు చదివేవాళ్లం. రోజూ హాస్టలు నుండి సిటీకి సాయంకాలం వెళ్లి పత్రికలు తెచ్చుకునే వాళ్లం. మా రాజకీయ పరిణతి పెరిగేందుకు ఆ వాతావరణం ఉపయోగపడింది. కామ్రేడ్స్ రహమాన్, అజీజ్‌పాషా, సదానంద్, కల్పన తదితరులం కలిసి పనిచేసేవాళ్లం. యూనివర్శిటీలో అప్పుడు కె.కేశవరావు (ప్రస్తుత టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి), డి.శ్రీనివాస్(రాజ్యసభ సభ్యులు) ఇతర విద్యార్థి సంఘాల నాయకులు. రాయపాటి సాంబశివరావు గారు న్యూసైన్స్ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్‌గా వుండేవారు.

ఎఐఎస్ఎఫ్ నిలువుగా చీలిపోయింది. కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా వుండేవారు. తీవ్రమైన సైద్ధాంతిక చర్చలు జరిగేవి. రాఘవాచారి నేతృత్వంలో నగరంలో వాటిని ఎదుర్కొన్నాం. విద్యార్థి ఫెడరేషన్ రీ ఆర్గనైజేషన్ తర్వాత గుంటూరులో మహాసభ జరిగింది. ఉత్సాహపూరిత వాతావరణంలో మహాసభకు వస్తున్న శ్రీశ్రీని విజయవాడలో ఆపేసారు. ఆ మహాసభలో రాఘవాచారి అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా

**పరిచయాలు జ్ఞాపకాలు**

ఎన్నికయ్యాము. చీలిపోయిన విద్యార్థి ఫెడరేషన్‌ను విస్తృతం చేసేందుకు ఇద్దరం కలిసి కృషి చేశాము. కార్యకర్తల రాజకీయ శిబిరాలు, శిక్షణా తరగతుల ద్వారా కార్యకర్తలను సమీకరించ గలిగాం. తర్వాత ఆయన పత్రికా రంగంలోకి వెళ్లారు. ఐనా మా స్నేహం కొనసాగింది. ఆయన హైదరాబాద్‌లో వున్నప్పుడే అక్కడ విద్యార్థిగా ఉన్న జ్యోత్స్నను ప్రేమ వివాహం చేసుకున్నారు.

కామ్రేడ్ రాఘవాచారి ఆ తర్వాత కొన్ని వందల సంస్కరణ వివాహాలు చేయించి వుంటారు. జీవితమంతా నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా పనిచేసారు. అతి నిరాడంబరంగా జీవించారు. ఆయన రిటైరైన సందర్భంలో వచ్చిన డబ్బులో మూడో భాగం మళ్లీ పార్టీకే ఇచ్చారు.

మార్క్సిజం పట్ల, పార్టీ రాజకీయాలపట్ల సంపూర్ణమైన అవగాహనతో, విశ్వాసంతో పనిచేసారు.రెండు నెలల క్రితం నేను కేర్ ఆసుపత్రిలో ఆంజియోగ్రామ్ చేయించు కొని, రెండు స్టెంట్లు వేసుకున్నప్పుడు, అనారోగ్యంగా వున్నా ఆయన జ్యోత్స్నతో పాటు వచ్చి పరామర్శించారు. మా ఇద్దరి మధ్య అదే ఆఖరు సమావేశం అవుతుందని భావించలేదు. పాత్రికేయ రంగంలో తనదైన ముద్రవేసిన రాఘవాచారి శాశ్వతమైన సెలవు తీసుకున్నారు. కామ్రేడ్ రాఘవాచారికి ఇవే నా జోహార్లు. ❑

**వ్యాసకర్త సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి**

---

## అక్షరాల చక్రవర్తి రాఘవాచారి

**(17వ పేజీ తరువాయి)**

ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పేట్రియాట్ ఆంగ్ల పత్రికలో పనిచేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం నియమించిన డాక్టర్ నరేంద్ర లూథర్ కమిటీలో సభ్యులుగా వ్యవహరించారు. అనేక అవార్డులు, రివార్డులు పొందారు. ఏ విషయం మీద, ఏ సందర్భంలో మాట్లాడినా అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా, చమత్కారంగా ప్రసంగించడం ఆయన ప్రత్యేకత. ఆధ్యాత్మిక సభలకు వెళ్లినా తన విశ్వాసాలు, సిద్ధాంతాల నుంచి పక్కకు తొలగలేదు. అదే సమయంలో ఆ భావాలు ఉన్న వారిని నొప్పించకుండా చెప్పదలచిన విషయాన్ని మృదువుగానే చురుక్కుమనేలా చెప్పేవారు.

విశ్వాసాల, నిబద్ధతా ప్రస్థానమే ప్రాతికేయవృత్తిగా రాఘవాచారి ఆచరించి చూపారు. కొద్దికాలంగా అనారోగ్యం ఆయనను వెంటాడింది. ఇటీవల వయోధిక పాత్రికేయ సంఘం హైదరాబాద్ లో నిర్వహించిన "గోరాశాస్త్రి" శతజయంతి సభకు కూడా ఉత్సాహంగా హాజరై అందరినీ ఆత్మీయంగా పలకరించారు. నేను 1979లో విజయవాడలో పాత్రికేయ అక్షరాభ్యాసం చేసిన నాటి నుంచి వారితో పరిచయం. నేను విశాలాంధ్రలో పనిచేయకున్నా కొత్త లేకుండా, మొదటి అయిదు సంవత్సరాల్లోనే వెన్నుతట్టి ప్రోత్సహించిన గురుతుల్యులు రాఘవాచారి. ఎక్కడ కనిపించినా ఆప్యాయంగా పలకరించి బాగోగులు కనుక్కునేవారు. ఇంటికెళ్ళిన పాత్రికేయులతో అలుపుసొలుపు లేకుండా గంతలతరబడి కబుర్లాడేవారు. వారికి అశ్రు నయనాలతో అక్షర నివాళి. ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు**

పరిచయాలు
జ్ఞాపకాలు

# నిబద్ధత గల కమ్యూనిస్టు

**ఈడ్పుగంటి నాగేశ్వరరావు**

ప్రతిభావంతుడయిన పాత్రికేయుడు, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు, భావాల ప్రచారంలో ప్రజ్ఞాశాలి రాఘవాచారి గారు 50 సంవత్సరాల ప్రజా జీవితంలో ప్రగతిశీలురపై పెద్ద ప్రభావాన్ని కలిగించారు. నాటి తెలంగాణా రైతాంగ పోరాటంతో ప్రభావితుడయిన – ఆయన సోదరుడు సాంగత్యం, విశాలాంధ్ర పఠనంతో కమ్యూనిస్టు రాజకీయాలకు చిన్నతనంలోనే రాఘవాచారి ఆకర్షితులయ్యారు.

విద్యార్థి దశలో విద్యార్థి ఫెడరేషన్ ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రాచీన, ఆధునిక సాహిత్య అధ్యయనం, మార్క్సిస్టు ప్రపంచ దృక్పథం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. మూడు దశాబ్దాల పాటు రాష్ట్ర రాజకీయాలు, పరిణామాలకు నిఘంటువుగా వెలుగొందారు.

విశాలాంధ్ర సంపాదకులుగా, పేట్రియాట్, లింక్ పత్రికలకు విలేకరిగా విలువైన సేవలు అందించారు. పత్రికా రంగంలో తనదైన ముద్ర వేశారు. జర్నలిస్టు సంఘానికి నేతృత్వం వహించారు. ఇక మేధావిగా గణుతికెక్కారు. వివిధ యూనివర్శిటీలలో జర్నలిస్టులకు ప్రత్యేక ప్రసంగాలు ఇచ్చారు. కొంత కాలం సి.ఆర్.ఫౌండేషన్, ఎన్.ఆర్.ఆర్. పరిశోధనా కేంద్రానికి డైరెక్టరుగా పనిచేశారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి వివిధ హోదాలలో నిబద్ధతతో పనిచేస్తూ, తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి రాఘవాచారి. ❑

**వ్యాసకర్త సిపిఐ సీనియర్ నాయకులు**
**విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు ఛైర్మన్**

## విజ్ఞాన ఖని, విశిష్ట వక్త

**(12వ పేజీ తరువాయి)**

నెహ్రూ వ్యక్తిత్వంలోని ఔన్నత్యాన్ని, నెహ్రూ విధానాల ప్రాసంగికతను ఎంత బాగా అర్థం చేసుకున్నానో! రాఘవాచారి ఎల్.ఎల్.బి. అయ్యాక ఎల్.ఎల్.ఎం. కూడా చేశాడే గానీ వకీలుగా ఎప్పుడూ పని చెయ్యలేదు. ఆయనకు జర్నలిజం మీద సహజమైన అభినివేశం ఉండేది. కొంతకాలం సి.పి.ఐ.వారి 'న్యూఏజ్' పత్రికలోనూ, కొంతకాలం 'పేట్రియట్'లోనూ, కొంతకాలం 'లింక్'లోనూ పనిచేశాక ఆయన 'విశాలాంధ్ర' పత్రిక ఎడిటర్‌గా స్థిరపడ్డాడు.

విశాలాంధ్రలో ఆయన రాసిన సంపాదకీయాలు ఎంత గొప్పగా ఉండేవో ఆ పత్రిక ఒక పార్టీ అధికార పత్రిక కావడం వల్ల సామాన్య పాఠకులెవరూ గుర్తించలేకపోయారు. ఆయన ఏ 'ది హిందూ' లాంటి జాతీయ పత్రికలోనో పనిచేస్తే భారతదేశం లోని జర్నలిస్టులలో అగ్రగణ్యుడుగా గుర్తింపు పొందేవాడు. విజయవాడకెళ్ళినప్పుడల్లా నేను రాఘవాచారిని కలిసేవాడిని. ఆయన విశాలాంధ్రలో నా నవలనొకదాన్ని సీరియల్‌గా పబ్లిష్ చేశాడు. నాలుగైదేళ్ల క్రితం ఆయనకు ప్రొస్టేట్ క్యాన్సర్ సోకిందని, ఒక మేజర్ ఆపరేషన్ చేసి ప్రొస్టేట్ గ్లాండ్‌ను తొలగించారని తెలియగానే నేను విజయవాడ వెళ్ళి రెండు మూడు గంటలసేపు ఆయనతో గడిపాను. ఈ మధ్య హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉంటుండడంతో హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా ఆయన్ను కలిశాను. తన వియ్యంకుడు సీ.హెచ్. రాజేశ్వరరావు (సీనియర్ జర్నలిస్టు) ఇంట్లో రాఘవాచారి ఉండేవాడు. హైదరాబాద్‌లో జరిగిన సాహిత్య సమావేశాలకు– ముఖ్యంగా వెలిచాల కొండలరావు ఏర్పాటు చేసిన సమావేశాలకు తప్పకుండా వచ్చేవాడు.

2001లోనూ, 2011లోనూ వరంగల్లో జరిగిన నా షష్ఠి పూర్తి, సప్తతి ఉత్సవాలకు ఆయన వచ్చి ఉపన్యసించాడు. పాలకుర్తిలో శంకరమంచి శ్యామ్‌ప్రసాద్ రచించిన 'పాలకుర్తి ప్రముఖులు' అనే పుస్తకావిష్కరణకు నేను, రాఘవాచారి, చుక్కా రామయ్య కలిసే వెళ్ళాం. పాలకుర్తి ప్రముఖులెవరంటే పాల్కురికి సోమన, బమ్మెర పోతన్న, చుక్కా రామయ్య, రాఘవాచారి, అంపశయ్య నవీన్. – మేం ముగ్గురం పాలకుర్తి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వాళ్ళమే కావడం విశేషం. మొన్న ఆయన హైదరాబాద్ కొంపెల్లిలోని సురక్షా హాస్పిటల్లో ఉన్నాడని తెలిసి నేను శివకుమార్, రాజేశ్వరరావు (రాఘవాచారి వియ్యంకుడు)తో కలిసి వెళ్ళి రాఘవాచారిని కలిశాను. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. అతికష్టంగా నాతో రెండు మాటలు మాత్రమే మాట్లాడగల్గాడు. ఇవే ఆయనకు చివరిరోజులని నాకర్థమైంది.

ఆయన భార్య జ్యోత్స్న, ఆయన కూతురు డాక్టర్ అనుపమ (పీడియాట్రీషన్)ను కలిసి, ఆయనకు 'గుడ్‌బై డియర్ ఫ్రెండ్' అని చెప్పి కన్నీళ్ళతో హాస్పిటల్ నుండి బయటకొచ్చాను. ❑

# రాఘవాచారితో నా అనుభవాలు

పరిచయాలు జ్ఞాపకాలు

రాఘవాచారి గారిని మొట్టమొదటిసారిగా 1964లో మా విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో చూశాను. ఆ సభలో రాఘవాచారి గారిని రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అదే సభలో నన్ను కోశాధికారిగా (కోశం లేని) చేశారు. ఆ సంవత్సరం వేసవి రాజకీయ పాఠశాలలో మరోసారి కలిశాము. పచ్చని శరీర ఛాయ, తెల్లని పాంట్-షర్ట్‌తో మార్క్సిస్టు మేధావి మోహిత్‌సేన్‌తో కలసి మంగళాపురంనకు నడుస్తున్న దృశ్యం ఎప్పటికీ గుర్తుగా మిగిలిపోయింది. తరువాత లా చదవటానికి హైద్రాబాద్ వచ్చాక మరికొంత పరిచయం. రాఘవాచారి గారంటే బహుశా నేనే కాదు అందరూ ఎంతగానో గౌరవించేవారు. మొట్టమొదటిగా తనతో వివాహ ప్రస్తావన వచ్చినప్పుడు, రాఘవాచారి గారిని పెళ్ళి చేసుకోవటానికి ఏ ఆడపిల్ల సంశయించాల్సిన అవసరం లేదని అన్నాను. రాఘవాచారి గారిని పెళ్ళి చేసుకుని నేనూ సమాజంలో కొంచెం గౌరవం పొందాను అది నా అదృష్టం.

> *రాఘవాచారిని గొప్ప వ్యక్తి అన్నా, అద్భుత మేధావి అన్నా, మంచి స్నేహితుడూ... సహచరుడు అన్నా, విజ్ఞాన ఖని అన్నా... ఇంకా ఏమన్నా అది చాలా చిన్నది అనిపిస్తుంది. మాటలకందని వ్యక్తిత్వం ఆయనది. ఆయన మంచి వక్తే కాదు. మంచి భర్త కూడ. భార్య వ్యక్తిత్వానికి, స్వతంత్రానికి ఎంతో విలువనిచ్చే మంచిమనిషి మా 50 ఏళ్ళ సాహచర్యంలో నేను తప్పులే చేశానో ఒప్పులే చేశానో, ఎన్నడూ నేను చేసిన తప్పులను తిరిగి ఆయన ప్రస్తావించలేదు. అంటే మా మధ్య చిన్న చిన్న అభిప్రాయ బేధాలు లేవని కాదు... కానీ, వాటిని మేమెప్పుడు పొడిగించలేదు.*
>
> **- శ్రీమతి జ్యోత్స్న**

రాఘవాచారి గారిని ఎప్పుడూ కేవలం నా మనిషి అనే దృష్టితో చూడలేదు. ఆయనను సమాజానికి సంబంధించిన వ్యక్తిగానే ప్రేమించాను, ఇష్టపడ్డాను.

మా భావసారూప్యత మా బంధాన్ని మరింత పటిష్టం చేసింది. నిజమైన కమ్యూనిస్టుగా జీవితం గడిపారు. నేనూ ఆ విషయంలో తన అడుగుజాడల్లోనే నడిచాను.

**మరికొన్ని జ్ఞాపకాలు :**

మా చిన్న పాప తన మూడో ఏటనే పక్కనున్న కొట్లో కొనుక్కుంటుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పొన్నూరులో సంస్కృతం చదువుకునే రోజుల్లో వారి మేనమామ ఒక రోజు హోటల్లో ఇడ్లీ పెట్టించారట. రాఘవాచారి గారు అక్కడ ఆకలి అయిన వాళ్ళకి అలా పెడతారనుకున్నారట. మరునాడు అక్కడ ఇడ్లీ తిన్నారట. అప్పుడు అందరూ డబ్బులు ఇవ్వటం చూశారు. తన దగ్గర డబ్బులు లేవు. చాలా భయం వేసి అప్పటికెలాగో తప్పించుకుని తరవాత చాలాకాలం ఆ దారిని వెళ్ళటానికి భయపడేవారట.

తెలంగాణలో రజాకార్ల గొడవల్లో మానికొండ పక్కన బొకినాలలో వున్నప్పుడు అక్కడ కొంతకాలం చదువుకున్నారట. అక్కడ వాళ్ళ టీచరు గారి పేరు దూర్వాసుడు అట. కానీ వారు చాలా శాంతంగా వుండేవారట. అలాగే వారి మంచినీళ్ళు, ఆహారం వాళ్లే తీసుకెళ్లేవారట. బయట ఎక్కడా తినకూడదు వారి ఆచారం ప్రకారం.

తనకు చిన్నప్పటి నుంచీ కులమతాల పట్టింపు ఉండేది కాదు. హైద్రాబాద్ రైల్వే హైస్కూల్లో చదివేటప్పుడు వాళ్ళ క్లాసులో తక్కువ కులం అబ్బాయి వాళ్ళ యింటికెళ్లి మాథ్స్ చెప్పేవాళ్లట. అందరితో స్నేహంగా వుండేవాళ్లట. వాళ్ళ యింట్లో తెలిస్తే స్నానం చేయకుండా లోనికి రానివ్వరు.

ఉపనయనము తరువాత పదహారో సంవత్సరం వరకు సంధ్యా వందనం చేసేవారట. చాలా నిష్ఠగా వుండేవారట. ఆ తరువాత ఎప్పుడైతే ఆచారాలను ప్రశ్నించటం మొదలుపెట్టారో అప్పుడు వేషధారణ కూడా మారింది. తర్వాత కాలంలో కమ్యూనిస్టుగా కూడా అంతకంటే ఎక్కువ నిష్ఠగా వున్నారు. ఇది అందరికీ తెలిసిన నగ్న సత్యం.

అంపశయ్య నవీన్ గారు రాసిన చెదిరిన స్వప్నాలులో ఆనాటి రాఘవాచారి గారి వ్యక్తిత్వం, జ్ఞాన సంపద, అందరినీ ఆకట్టుకునే శక్తి కనిపిస్తుంది. అందులో నరసింహాచారి పాత్ర రాఘవాచారి గారిది.

రాఘవాచారి గారికి లక్ష్మణమూర్తి గారు (వరంగల్) మంచి స్నేహితులు. ఆయనే రాఘవాచారి గార్కి నిజాం కాలేజ్‌లో పీయూసీలో అడ్మిషన్ ఫామ్ నింపటానికి పెన్ కోసం చూస్తుంటే లక్ష్మణమూర్తి గారు ఇచ్చారట (రాఘవాచారి గారి దగ్గర ఎప్పుడూ పెన్ ఉండదు) ఆనాటి నుంచి వారి స్నేహము నిర్విఘ్నంగా సాగింది. హాస్పిటల్‌లో అప్పటి వరకు ఓపిక లేక, గొంతు సరిగా రాక బాధపడుతున్న రాఘవాచారి గారు లక్ష్మణమూర్తి గారిని చూడగానే ఎంతో ఉత్సాహంగా లేచి కూర్చుని చాలా సేపు కబుర్లు చెప్పారు.

## పరిచయాలు జ్ఞాపకాలు

రాఘవాచారి గారు సాధారణంగా ఏ సభలో పాల్గొన్నా ఇంటికి వచ్చి ఆయా సభా విశేషాలు, సభలో తాను మాట్లాడింది పూర్తిగా వివరించేవారు. అంతేకాదు ఒక్కోసారి తనకు నచ్చిన విషయాలు చాలాసేపు చెప్పేవారు. అప్పుడు మేము మంచి శ్రోతలుగా ఉండేవాళ్ళము. అవన్నీ రికార్డ్ చేయగలిగితే బాగుండేది. నాకు అంత సాంకేతిక పరిజ్ఞానం లేదు. రాఘవాచారి గారు విజయవాడలో సాధ్యమైనంత వరకు అన్ని సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యేవారు. చాలా కార్యక్రమాలకు వక్తగా కాక శ్రోతగా వెళ్లేవారు. ఎక్కడ నాటకాలు జరిగినా, హరికథలున్నా విధిగా వెళ్లేవారు. పౌరాణిక నాటకాలకు వెళ్లి తెల్లవారాక వచ్చేవారు. తను ఏ సభకు వెళ్లినా సభా ప్రారంభానికి ముందే వెళ్ళేవారు. సభ పూర్తయిన తరువాత అందరినీ కలిసి వచ్చేవారు.

ఇంకో విషయం... రాఘవాచారి గారు తాను వక్తగా వున్నప్పుడు ఏ విషయం అయినా ఎంత సమయంలో (అది రాజకీయ ఉపన్యాసం కావచ్చు. పెళ్లి కావచ్చు. సాంస్కృతిక సభ కావచ్చు) పూర్తి చెయ్యమంటే అంతే సమయంలో పూర్తి చేసేవారు. ఒక నిమిషం అటూ ఇటూ ఉండదు. రాఘవాచారి గారు ఆధ్యాత్మిక సభలకు వెళ్లినా తన సిద్ధాంతాలకు, ఆశయాలకు ఎటువంటి భంగం కలుగకుండా మాట్లాడేవారు.

రాఘవాచారి గారికి సంగీత సాహిత్యాలంటే చాలా యిష్టం. మా యింట్లో ఎప్పుడూ రేడియోలో వార్తలు నుండి అనేక కార్యక్రమాలు విని చివరిగా సంగీత కార్యక్రమాలు విని పదకొండు గంటలకు రేడియో ఆఫ్ చేసి పడుకునేవారు. చివరలో హాస్పిటల్‌లో తనకిష్టమైన కర్ణాటక సంగీతం, బాల మురళీకృష్ణ, సుబ్బులక్ష్మి పాటలు, పాత సినిమా పాటలు పెడితే వింటూ లయబద్ధంగా చెయ్యి కదుపుతూ పడుకునేవారు.

రాఘవాచారి గారికి పిల్లలతోనూ అనుబంధం ఎక్కువే. పిల్లలకి చాక్లెట్స్, బిస్కట్స్ ఇవ్వటంలో ఆనందం పొందేవారు. వాకింగ్‌కి వెళ్ళినప్పుడు పేపర్లతో బాటు చాక్‌లెట్స్, బిస్కెట్స్ తప్పకుండా తెచ్చేవారు. మా పిల్లలు చిన్నప్పుడు వాళ్ళతో బాగా గడిపేవారు. మనుమలు హవిష్ అన్నా, ప్రభాత్ అన్నా, దీపు అన్నా చాలా ప్రేమ. ప్రభాత్, దీపు చైనా వెళ్ళాక వీడియో కాల్‌లో వాళ్ళను చూసి చాలా ఆనందించేవారు. అసలు పిల్లలంటేనే ఇష్టం. పిల్లలు కూడా ఆయనంటే ఇష్టపడేవారు.

అలాగే ఇంటికి వచ్చిన వారికి టీ లేక కాఫీ తప్పకుండా ఇవ్వాలనేవారు. నేను మాటల్లో పడి మర్చిపోతే గుర్తు చేసేవారు. నాకు ఇంట్లో కూడా చేతనైన సహాయం చేసేవారు. రాఘవాచారి గారు ఇంట్లో ఉన్నప్పుడు ఎక్కువగా చదువుతూ గడిపేవారు. రోజూ 10-12 పేపర్లు చదివేవారు. చాలా వేగంగా చదివేవారు. ఒకసారి చదివినా, విన్నా, చూసినా ఎప్పటికీ మరిచిపోరు. అది చదువైనా, మనుషులనయినా, కారు నంబరులైనా, ఫోన్ నెంబర్లు అయినా అలా గుర్తు ఉండేవి. తనకు పూర్తి వ్యతిరేకం నేను. నా మతిమరుపునకు ఒక్కోసారి రాఘవాచారి గారికి విసుగొచ్చేది.

రాఘవాచారి గారు కరస్పాండెంట్‌గా వున్నప్పుడు కూడా ఏ సభకు వెళ్ళినా పెన్ను పేపర్ తీసికెళ్లేవారు కాదు. ఎక్కడా ఏమీ నోట్ చేసుకోకుండానే తన తలలో రికార్డు అయ్యేది. ఆ రోజుల్లో సీనియర్ జర్నలిస్టులు కూడా ఆయన సహాయం తీసుకునే వారని అనేవాళ్ళు.

రాఘవాచారి గారికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ రాజేశ్వరరావు గారన్నా, రాజశేఖరరెడ్డి గారన్నా, సుందరయ్య గారన్నా ఇంకా చాలా మంది పేరు పేరునా చెప్పాలంటే పెద్ద లిస్ట్ అవుతుంది చాలా అభిమానం.

అలాగే కొంత మంది కాంగ్రెస్ నాయకులన్నా ముఖ్యంగా నెహ్రూ కుటుంబం అన్నా చాలా అభిమానం. వరంగల్ బి.యస్సీ. చదివేటప్పుడు తన సహాధ్యాయులు వరవరరావు గారన్నా, నవీన్ గారన్నా ఇష్టం. క్రికెట్ అభిమాని. నిజాం కాలేజ్‌లో జయసింహ ప్లేయర్ గురించి చెప్పేవారు.

రాఘవాచారి గారి లాంటి జ్ఞాని విశాలాంధ్ర లాంటి చిన్న పత్రికలో కాకుండా, ఏ ఇంగ్లీషు పత్రికలోనో పని చేస్తే గొప్ప పేరు వచ్చేదనకుంటారు. మరికొంతమంది లాయరుగా ఉంటే ఏ జస్టిసో అయి ఉండేవారేమో అని అనుకుంటున్నారు. అవన్నీ నిజమే అయి ఉండచ్చు. కానీ, విశాలాంధ్ర లాంటి కమిట్‌మెంట్ వున్న పత్రికలో ఏ ప్రలోభాలకు లొంగకుండా, పేరు కోసం ప్రాకులాడకుండా నిజాయితీ గల కమ్యూనిస్టుగా అతి సాధారణ జీవితం గడిపారు. కాబట్టే ఆయన ఇంతటి గౌరవం, ప్రేమ పొందగలిగారు. అశేష జనావళి హృదయాల్లో స్థానం సంపాదించారు.

రాఘవాచారి గారికి సమాజంలోని ఎటువంటి రుగ్మతలు అంటలేదు. మూఢ ఆచారాలను హేతుబద్ధత లేని ఆలోచనలను నిర్ద్వంద్వంగా ఖండించేవారు. ఒక్కోసారి చదువుకున్నవారు కూడా హేతుబద్ధంగా ఉండటం లేదని బాధపడేవారు.

రాఘవాచారి గారు కులమతాల పంకిలం అంటకుండా, స్వచ్ఛమైన అభ్యుదయ వాదిగా జీవిత పర్యంతం జీవించారు. వారికి ఆ బురదను అంటనీయకండి.

మా చిన్న పాప దీప ఆకస్మిక మరణం మాకెంతో మనస్తాపం కలిగించింది. తన పేరుతో దీప మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు నెలకొల్పి, ట్రస్ట్ నిర్వహిస్తున్న అభ్యాస విద్యాలయం ద్వారా చాలా మంది పేదపిల్లలకు ఉచితంగాను, కొంత మందికి అతి తక్కువ ఫీజుతోను ఉన్నతమైన విద్యనందిస్తున్నాము. అనేక మంది దాతలు మా ప్రయత్నంలో సహాయ సహకారాలందిస్తున్నారు. వారికి మా ధన్యవాదాలు. రాఘవాచారి గారిని ఎంతో ప్రేమించిన అందరికీ నా నమస్సులు. ❑

**వ్యాసకర్త రాఘవాచారి జీవన సహచరి**

# ఆయన కూతురుగా పుట్టటం నా అదృష్టం

పరిచయాలు జ్ఞాపకాలు

**డాక్టర్ సి. అనుపమ**

నాకు మా నాన్న గారి గురించి రాయటానికి తగిన భాష, అర్హత ఉన్నాయో, లేదో తెలియదు. కాని ఆయనను చూసి నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలలో ముఖ్యమైనది, ఆయన తను నమ్మిన సిద్ధాంతాల కోసం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా, పార్టీపరంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిరాశ చెందక మొక్కవోని దీక్షతో ముందుకు సాగడం. తన జీవనశైలిలో తను చూపిన నిరాడంబరత, మంచితనం, నిజాయితీలు తనకు ఇంత మంది అభిమానులను తెచ్చి పెట్టిందని నేను అనుకుంటున్నాను.

మాలో ఎవరికీ ఈ మార్గంలో నడవమని, ఇలాగే వుండాలని నిర్దేశించలేదు. ఆయన జీవన విధానం నుండే ఫలితం గురించి ఆలోచించకుండా కష్టపడి మా కలలను సాకారం చేసుకోవడం నేర్చుకున్నాము. అలాగే అన్ని వర్గాల ప్రజలతో కలిసి మెలిసి ఉండి అజాతశత్రువు అన్న పదానికి నిజమైన అర్థంగా నిలిచారు.

ఈ రోజు ఆయన మనకి భౌతికంగా దూరమైనా తన మంచితనం, ఆశయాలు, జ్ఞాన సంపద, నిబద్ధతతోకూడిన జీవన శైలి ద్వారా మా గుండెల్లోనే కాక అశేష జనావళి హృదయాలలో ఎప్పటికీ చిరంజీవిగా ఉంటారు. అంతటి గొప్ప వ్యక్తి కూతురుగా పుట్టటం నా అదృష్టం. ఆయన ఆశయాలలో, మంచితనంలో పదో వంతు నేను అంది పుచ్చుకున్నా నా జీవితం ధన్యమవుతుందని భావిస్తున్నాను. ❑

**వ్యాసకర్త రాఘవాచారి కుమార్తె**

# ఆదర్శ పురోహితులు రాఘవాచారి

**నిడదవోలు వెంకటేశ్వరరావు**

శ్రీ రాఘవాచారి గారు పత్రికా రంగంలోనే కాకుండా ఆదర్శ వివాహాలు జరిపించడంలో కూడా ఎంతో ప్రముఖులు. ఎంతో మంది ఆదర్శ వివాహాలకు రాఘవాచారి గారు పౌరోహిత్యం వహించారు.

వివాహాలు జరిపించే సందర్భంలో రాఘవాచారి గారు వివాహ వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాల గురించి ఎంతో చక్కగా వివరించేవారు. అలాగే నూతన దంపతులకు వారి సామాజిక బాధ్యతలను గురించి వివరించి వారికి స్ఫూర్తి కలిగించేవారు. సాంప్రదాయ వివాహ పద్ధతులను ఎక్కడా విమర్శించేవారు కాదు. ఆదర్శ వివాహాల గురించి ఆయన చేసే ప్రసంగాలు సాంప్రదాయ వాదులను కూడా ఆలోచింపచేసేలాగా ఉండేవి.

సాధారణంగా పెళ్ళిళ్ళు ముహూర్తాలు చూసుకుని అవి ఎప్పుడు కుదిరితే అప్పుడు జరుపుకుంటుంటారు. 1980–95ల మధ్య కాలంలో ఆదర్శ వివాహాలు జరుపుకోవడానికి రాఘవాచారి గారికి సమయం ఎప్పుడు కుదురుతుందా అని ఎదురుచూస్తూ ఆయనకి సమయం కుదిరినప్పుడు, వారి సమక్షంలోనే వివాహం చేసుకునేవారు.

ఇటువంటి మహోన్నత వ్యక్తి మృతి అన్ని వర్గాలకు తీరని లోటు.

**పబ్లిషర్, జాతీయ స్ఫూర్తి**

## మా ఊరి మార్క్సిస్టు మహర్షి

(21వ పేజీ తరువాయి)

సత్తువ తగ్గిన శరీరం సహకరించడానికి నిరాకరిస్తున్నా, చివరి రోజుల వరకు మానసికంగా, మేధాపరంగా అలసట ఎరగని చైతన్యంతో తిరుగుతూనే ఉన్నారు. సంభాషిస్తూనే వచ్చారు. ఇటీవల గోరాశాస్త్రి శతజయంతి సభలో ఉపరాష్ట్రపతితో నవ్వుతూ మాట్లాడుతూ, కళ్ళ ముందే తిరిగిన రాఘవాచారి ఇక కనిపించరంటే ఆత్మీయులకు తీరని బాధ. విషాదం అనివార్యమని తెలిసినా, అది వాస్తవ రూపం ధరించడం భరించలేని సత్యం. నిజాయితీ, నిబద్ధత, నమ్మిన సిద్ధాంతాల పట్లే కాదు… నమ్మని సిద్ధాంత ప్రవర్తకుల పట్ల సైతం సహిష్ణుత, సహనం, సమభావం ఉన్న ఓ అరుదైన మనిషి వెళ్ళిపోయాడు. బెజవాడ చిన్నబోయింది. రిక్షాలోనో, ప్రభుత్వ అధికారులు రిజర్వేషన్ చేయించడం మర్చిపోయినా కోపగించకుండా ఏ రైల్వే జనరల్ బోగీలోనో… సామాన్యుడిలా సాగిపోయే అలాంటి నిరాడంబర బహుముఖ ప్రజ్ఞాశాలిని మరొకరిని చూడగలమా! ప్రతి ఒక్కరినీ, ప్రతి చిన్న విషయాన్నీ గుర్తుపెట్టుకొని, కళ్ళు ఎగరేస్తూ పలకరించే ఆ నిష్కల్మష హృదయాన్ని మరిచిపోగలమా!! అచ్చమైన జీవన పత్రికాచార్యుడికి ఆత్మీయ నివాళి. ❑

**వ్యాసకర్త పాత్రికేయుడు**

పరిచయాలు జ్ఞాపకాలు

# వేదాధ్యయనం నుండి మార్క్సిస్టు అధ్యయనానికి ఒక మేధావి జీవనయానం

అక్కినేని చంద్రరావు

సుమారు క్రీ.పూ. 1300 సంవత్సరాల నాడు భారత దేశంలో ఋగ్వేద దశ ప్రారంభమయినట్లు ప్రపంచ చరిత్రకారులు చాలా మంది పేర్కొన్నారు. ఇండో–ఇరానియన్ దశగా పేరొందిన ఈ సందర్భంలో పర్షియన్‌లు, భారతీయులు ఒకే ప్రజా సమూహంగా జీవించారు. ఈ క్రమంలో భారతీయ సంతతి వారు పర్షియన్ల నుండి వేరు పడి, నాటి హిందుస్థాన్ ఉత్తర పశ్చిమ ప్రాంతమయిన సింధు ప్రాంతంలో ప్రవేశించటంతో భారతదేశంలో వేద సంస్కృతి ప్రారంభమయింది. ఇదే ఋగ్వేద దశ. ఋగ్వేదం రెండు దశల్లో పరిణామం చెందింది. మొదటి దశలో బోధించిన దశ. దీనికీ పండితులున్నారు. వీరంతా బోధించే పండితులు (Teaching priests) గా పిలవబడ్డారు. తరువాత వ్రాతపూర్వకమయిన దశ ఒకటి ప్రారంభమయింది. బోధనలను లిఖించిన వారు లిఖిత పండితులు (Writing priests) గా పిలవబడ్డారు. బోధనా దశ నుండి లిఖిత రూప దశకు పయనించిన ఋగ్వేదం ఒక క్రమ రూపంలో నడవటంలో నాటి ప్రకృతికి మానవుడికి మధ్య ఉన్న సంబంధమే ప్రధాన పాత్ర పోషించిన యదార్థాలు చరిత్రలో నమోదు కాబడ్డాయి. నాటి దైవ రూపాల పేర్లు అన్నీ అగ్ని (నిప్పు), వరుణుడు (నీరు), మారుత (వాయువు) ఇంకా సముద్ర జీవులు, వృక్షాలు, జంతువుల పేర్లతోనే దేవుళ్లు పిలవబడ్డారు. ఇండో–ఇరానియన్ దశలో 34 మంది దేవుళ్ళుగా ఉన్న సంఖ్య భారతదేశంలో వందలాది సంవత్సరాలుగా క్రమేపీ లక్షల సంఖ్యలో దేవుళ్ళు ఉద్భవించారు. ప్రకృతిలో ఉన్న అనేక జీవ, నిర్జీవ సముదాయాలు దేవుళ్ళ రూపాలు సంతరించుకున్నాయి. ప్రకృతిలో లేనిది (భౌతికంగా కనిపించని దాన్ని) "స్వర్గం" అని పిలుస్తూ అక్కడ కొందరు దేవుళ్ళు ప్రతిష్టింపబడ్డారు.

ప్రకృతికి – మానవుడికి మధ్య ఋగ్వేద దశలో ప్రారంభమైన ఈ క్రమం ఒక ప్రత్యేక పద్ధతిని సంతరించుకుంది.

బోధనా దశ నుండి లిఖించే దశకు మారుతున్నప్పుడు ఋగ్వేదం కొన్ని పరిణామ రూపాలను ధరించింది. అవి 1. సంధి (అక్షరాలను కలపటం) 2. పద (word) రూపం ధరించటం 3. సంహిత (పదాలు వ్యాఖ్య రూపం ధరించటం) 4. అనుక్రమం (Index) వ్యాఖ్యాలు ఒక క్రమరూపంలోకి రావటం, శ్లోకాలుగా పరిణామం చెందటం.

ఇక్కడ అత్యంతగా మనల్ని ఆకర్షించే విషయం ఏమిటంటే సంధి నుండి అనుక్రమం వరకు నడిచిన వేద భాషలో స్వర శబ్దాలు, ఉచ్చారణలు, ప్రకృతిలోని వాయువు, నీరు, గాలి, అన్నింటికీ మించి జంతు జాలం నుండి, స్వీకారం పొందినట్లుగా మండూకాస్ (మండకోపనిషత్)లో శ్లోకాలు చెబుతున్నాయి.

భారతీయ తాత్విక చరిత్రలో "ఋగ్వేదం" మానవ సమాజానికి ఒక ప్రామాణిక పద్ధతిని అందించింది. ఆ పద్ధతే "అభ్యాసన" (Lesson) గా పిలవబడింది.

రాఘవాచారిగారు ఈ "అభ్యాసన" మార్గాన్నే తన జీవితంలో నిరంతర క్రమంగా ఆచరించారు. ఋగ్వేదం నుండి జాలువారిన యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం, తరువాత ఉపనిషత్తులు భగవద్గీత ఈ అధ్యాత్మిక గొలుసు పరమార్థాన్ని తన మేధస్సులో పదిలపర్చారు. ఆయన అనేక సభలలో భారతీయ తత్వశాస్త్రంలోని ఆధ్యాత్మికతను సున్నితంగా తిరస్కరిస్తూ, దానిలో వస్తుగత వాస్తవికతను(Objective reality) తన సహజశైలిలో వివరించిన తీరులో ఆయనలోని మేధస్సును మనం గమనించవచ్చు.

ప్రకృతికి–దైవానికి మధ్య పండితులు సృష్టించిన వారధిని, మిధ్యా (illusion) భావంగా ప్రకటిస్తూ, ఆయన ఎల్లప్పుడూ ప్రకృతి గమనానికే ప్రాధాన్యతనిచ్చారు.

మార్క్సిస్టు తత్వశాస్త్రంతో పరిచయం ఏర్పడిన నాటి నుండి ఆయన మేధస్సు మరింత పదునెక్కిందని చెప్పటానికి ఆయన ఉపన్యాసాలు, వ్యాసాలు, సంపాదకీయాలు, మన ముందున్న ఋజువులు. ఏ దేశమయినా అంతిమంగా మార్క్సిస్టు తాత్విక చింతననే స్వీకరిస్తుందని, సమాజంలోని అన్ని రుగ్మతలకు అదే ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుందని చెప్పటంలో రాఘవాచారి ఏ సందర్భంలోనూ వెనుకాడలేదు.

"అధ్యయనం" "వ్రాయటం" "చెప్పటం" – ఈ నిరంతర ప్రక్రియ రాఘవాచారి గారి జీవితంలో నడుస్తూ వచ్చింది. ప్రజా సమూహాలతో ఆ జీవితం పెనవేసుకుపోయింది. అభ్యాసన ఆయన సహచర్య సహచరి కూడా. ఋగ్వేదం నుండి జాలువారిన "అభ్యాసన"కు ఆయన అత్యంత గౌరవ స్థానం ఇచ్చాడు. అందుకేనేమో తన కుమార్తె దీపా మెమోరియల్ ట్రస్ట్ పేరుతో నడుస్తున్న పాఠశాలకు "అభ్యాస విద్యాలయం"గా నామకరణం చేయటం ద్వారా చరిత్ర ఇచ్చిన ఒక ప్రాధాన్యతా క్రమాన్ని వర్తమానానికి గుర్తు చేశారు.

"అభ్యాసన' సమాజానికి అవసరం. ఏది వాస్తవమో? ఏది అవాస్తవమో? తేల్చుకునే మార్గం. దాన్ని అనుసరించటం మన విధి. ఈ మార్గంలో నడుస్తూ రాఘవాచారికి నివాళులర్పిద్దాం. ❑

***His Nature is Pacific but His ideas are Atlantic***

వ్యాసకర్త సిపిఐ నాయకులు

# మా రాఘవాచారి గారు

బుడ్డిగ జమిందార్

పరిచయాలు జ్ఞాపకాలు

రాఘవాచారి గారు లేని విజయవాడ పుస్తక మహోత్సవం 2020 జనవరిలో జరుపుకోనుంది. నేడు భౌతికంగా పుస్తక మహోత్సవ ప్రాంగణంలో నడవలేరేమో గాని ఆ ప్రాంతానికి వచ్చే పుస్తక ప్రియులందరూ మహోన్నత వ్యక్తి రాఘవాచారి గారిని మరువలేరంటే అతిశయోక్తి ఏమీ కాదు. గడచిన పదేళ్ళలో ప్రతి నూతన సంవత్సరం నేను రాఘవాచారి గారిని పుస్తక పండుగకు తీసుకెళ్లేవాడిని. వారితో అన్ని స్టాల్స్ సందర్శించేవాడిని. ప్రతి పబ్లిషర్‌కు రాఘవాచారి గారంటే ఎనలేని గౌరవం. ఆయన కనబడితే నిల్చొని హృదయ పూర్వక నమస్కారాలు తెలిపేవారు. కొంత మంది యువతీ యువకులు కూడా వారి పాదాలకు నమస్కారాలు చేసేవారంటే చక్రవర్తుల వారిపై ఉన్న అమోఘమైన గౌరవమే. కొంచెం వెనుకగా నడిచే నేను వారికి లభించే ఆదరణ చూసి గర్వపడేవాడిని. ఖురాన్, బైబిల్, భగవద్గీత, స్వామి వివేకానంద స్టాల్స్, విశ్వనాథ సత్యనారాయణ, మంగళంపల్లి పుస్తకాలు, సంగీత, సాంస్కృతిక, జానపద పుస్తకాలు ఒకటేమిటి అన్నీ వారికి ఎరుకే. విప్లవ సాహిత్యం, విరసం, శ్రీశ్రీ సాహిత్యనిధి, అరసం, విశాలాంధ్ర, ప్రజాశక్తి, అన్ని ప్రదర్శనలలోనూ తప్పనిసరిగా పాల్గొనేవారు.

పుస్తకావిష్కరణ సభల్లో తప్పనిసరిగా అధ్యక్షులుగానో, పుస్తకావిష్కర్తగానో, పుస్తక పరిచయం చేసే వ్యక్తిగానో ఉండేవారు. అన్నింటికీ మించి శ్రోతగా సభికులలో ముందు వరుసలో కూర్చొని, సభా ప్రాంగణానికి వన్నె తెచ్చేవారు. వేదికపైనున్న వ్యక్తులు, అతిథులు మాత్రం శ్రీ రాఘవాచారి గారికి నమస్కారాలు చెప్పేవారు. అదీ ఒక వ్యక్తి సంపాదించుకోగల గౌరవం. ఈనాడు వేదికపైకి ఎగబాకి కృత్రిమంగా పేరు సంపాదించుకోవాలను కొనేవాళ్లు రాఘవాచారి గారి నుండి నేర్చుకోవాలి. ఒక సంపూర్ణ వ్యక్తి 'నేర్చుకోవాలి, నేర్పాలి లేదా చెప్పాలి, వినాలి' అనే అంశాలు రాఘవాచారి గారి నుంచి నేర్చుకోవాలి.

ఆరోగ్యం సహకరించనప్పటికీ నాకు ఫోన్ చేసి విశాలాంధ్ర కు తీసుకెళ్ళు, దాసరి భవన్ (సిపిఐ ఆఫీసు)కు తీసుకెళ్లు అనేవారు. ఒకసారి (6 నెలల క్రితం అనుకుంటాను) దాసరిభవన్‌కు తీసుకెళ్లమంటే సాయంత్రం వెళ్లాం. ఓర్పుగా మూడు అంతస్తుల భవనంలోని పెద్ద మెట్లను రాఘవాచారి గారు ఎక్కి కౌన్సిల్ ఇన్‌ఛార్జి కామ్రేడ్ చెంచయ్య గారిని కలిశారు. ఇంతకూ వచ్చిన పనేమిటంటే తాను ప్రతీ సంవత్సరం పార్టీకి చెల్లించాల్సిన ఐదు వందల రూపాయలు చెల్లించటానికట. దీనికి తోటు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులకు తన వంతు సహాయంగా వెయ్యి రూపాయల విరాళం ఇచ్చారు. పార్టీ యెడల వారికి ఉన్న క్రమశిక్షణకు ఇదొక ఉదాహరణ.

ప్రతినిత్యం ఉదయం ఇంటినుంచి నడుచుకుంటూ సిద్ధార్థ అకాడమీ గ్రౌండ్స్‌లో వాక్ అయిన తర్వాత గుడ్‌మార్నింగ్‌లో టీ తాగి అక్కడే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపరు కొనుక్కొని మరలా నడుచుకుంటూ ఇంటికి వెళ్లడం రాఘవాచారి గారికి అలవాటు. వరంగల్లులో విద్యార్థి దశ నుండి ఆసుపత్రిలో చివరిసారిగా చేరే వరకూ క్రమం తప్పకుండా విశాలాంధ్ర పేపరును చదివిన అరుదైన విశాలాంధ్ర పాఠకుడు చక్రవర్తుల వారు. ప్రతీ బుధవారం విశాలాంధ్రలో నేను రాసే అంతర్జాతీయ పరిణామాల వ్యాసం తప్పనిసరిగా చదివేవారు. వారే స్వయంగా నాకు ఫోన్ చేసి అందులోని అంశాల చారిత్రాత్మక నేపథ్యం గురించి కనీసం ఐదు నిమిషాలపాటయినా మాట్లాడేవారు. అంతటి మహానుభావుడు నా ఆర్టికల్స్ చదవటమే గాక అందు గల అంశాల గురించి నాతో మాట్లాడటమంటే అంతకుమించి నాకేమి కావాలి. వారిచ్చిన స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నాను.

రాఘవాచారి గారితో పరిచయమున్న ఎవరైనా సరే తనని నా మనిషేనని అనుకోవటం విశేషం. మా కుటుంబ ఆప్తులైన రాఘవాచారి గారు నా శ్రీమతి రొమిలా, పిల్లల గురించి నేను వారికి ఎక్కడ ఎదురైనా అడిగేవారు. చివరిసారిగా ఆగస్టు నెలలో విజయవాడ వచ్చిన రాఘవాచారి గారి దంపతులు మా ఇంట్లో కొన్ని రోజులున్నారు. అప్పుడే నగరంలోని అనేక మంది ప్రముఖులు వారిని చూడటానికి రావటంతో కాలనీ వాసులు ఒక నిశబ్ద వాతావరణంలో రాఘవాచారి గారి గురించి తెలుసుకున్నారు.

ఇంట్లో స్వంత తండ్రివలే తనకు కావల్సిన తేలికపాటి అల్పాహారాన్ని రొమిలాతో చేయించుకునేవారు. వాటిల్లో ఆయనకు ఇష్టమైన బియ్యపురవ్వతో చేసిన ఉప్మా ఒకటి. తిరిగి హైదరాబాదు వెళ్ళేటప్పుడు నేను నవంబరు నెలలో మరలా తిరిగి మీ దగ్గరికి వస్తాను అని చెప్పిన రాఘవాచారి గారు ఈ ఒక్కమాటను తప్పి మమ్మల్నందరినీ దుఃఖసాగరంలోకి తీసుకెళ్ళారు.

ఎక్కడకు వెళ్ళినా అవకాశమున్నప్పుడల్లా తనతో తీసుకెళ్లే రాఘవాచారి గారు తన దేహాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ విద్యార్థులకు అప్పగించటానికి తనతో పాటు అంబులెన్సులో నన్ను మాత్రం వదలకుండా తీసుకెళ్లారు. వందల మంది అభిమానుల సమక్షంలో తుదివీడ్కోలు పలికాము. నిశ్శబ్ద బాధాతప్త వాతావరణంలో ఆ సమయాన వేదాలు, ఉపనిషత్తులు, మార్క్సిస్టు సిద్ధాంతాలు రాఘవాచారి గారిని తమలో చేర్చుకోగా మనందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. ❑

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం




భారత కమ్యూనిస్టు పార్టీ
వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని
సభ
26-12-03



విశాలాంధ్ర 44వ వార్షికోత్సవం
22-6-96.
WELCOME






విజయవాడ
పుస్తక మహోత్సవమ
2016 జనవరి 1 నుండి 11 వరకు
"జయంతి" పెరుమార్కు
సంస్మరణ సభ


చాసో స్ఫూర్తి
సాహితీ పురస్కార ప్రదానోత్సవము
విజయనగరం
చాసోస్ఫూర్తి 17వ సాహితీ పురస్కార ప్రదానోత్సవం
17 జనవరి 2011


శ్రీ కలిదిండి భీమరాజు
జయంతి
సమాలోచన సభ
2018 మార్చి 11 - ఆదివారం సా|| 4:00 గం|| లకు
సురాజ్య భవనం - తణుకు

# ఇప్పుడు నిర్వేదానికి తావు లేదు

**- రాఘవాచారితో తెలకపల్లి రవి ముఖాముఖి**

***సాహిత్యం గురించి మాట్లాడుకోవడమంటే ముందు పత్రికలు తర్వాత పుస్తకాలు చర్చకు వస్తాయి. మీ ఉద్దేశంలో ఈ రంగాల మధ్య అంతస్సంబంధం ఎలా వుంటుంది?***

సాహిత్యం, భాష, సంస్కృతి ఆరిస్టోక్రసీ నుంచి ఒక విధమైన డెమొక్రసీకి మారడంలో పత్రికలు పెద్ద పాత్ర నిర్వహించాయి. కందుకూరి వీరేశలింగం నుంచి ఇప్పటి వరకు ఈ పాత్ర కొనసాగుతూనే వుంది. ఆంధ్రప్రత్రిక, భారతి వంటివి ఒకప్పుడు సాహిత్యానికి ఆటపట్టుగా వుండేవి. ఇటీవల కాలంలో కొన్ని పత్రికలలో సాహిత్యం కొంత ప్రాధాన్యత కోల్పోయిన పరిస్థితి వున్నా మొత్తం మీద ఈ పాత్ర పురోగమన శీలమైందే. పత్రికలలో ఒక విధమైన చర్నింగ్ జరుగుతోంది. పత్రికలకు సంబంధించిన సాంస్కృతిక పార్శ్వాన్ని విశ్లేషించే ఒక ప్రయత్నం పెద్ద ఎత్తున జరగాల్సి వుంది. ముఖ్యంగా వామపక్ష పత్రికలు సంఘాలు ఈ విషయంలో పెద్ద పాత్ర నిర్వహించాయి. పరిణామాలకు స్పందించే లక్షణం సాహిత్యంలో ఎక్కువగా వుంటుంది పత్రికలకూ అదే ప్రాణం. మాది వరంగల్ జిల్లాలో సనాతన సంపన్న కుటుంబం. మా ఇంటికి ఆ రోజుల్లో శ్రీ వైష్ణవ పత్రిక వచ్చేది. అలాగే గోలకొండ. అది 1946. ఇప్పటి ప్రమాణాలతో చూస్తే ఆ పత్రికలు ఎలా వుంటాయో కాని అప్పట్లో నిద్రాణమై వున్న జనాన్ని జాగృతపరచడానికి ఎంతగానో దోహదపడ్డాయి. మూగ జీవుల హృదయ స్పందనను ప్రతిబింబించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి సంచి భుజాన వేసుకుని మీజాన్‌కు విలేకరిగా వూరూరు తిరిగేవారు. సురవరం ప్రతాపరెడ్డి రాజకీయంగా మితవాది. సాంస్కృతికంగా అతివాది. భాషా సంస్కృతుల విషయంలో ఆయన సేవ చాలా వుంది. ఎవరో వ్యాఖ్యానం చేస్తే ఆగ్రహించి తురుష్క ఆంధ్రలో తెలుగు కవులు అంటూ గోలకొండ కవుల సంచిక ప్రకటించారు. ఆ విధమైన ఉద్యమ స్ఫూర్తి, అభినివేశం వుండేవి. తెలంగాణా విషయంలో భాష విషయమున న్యూనత పనికి రాదని, సర్కారు ఆంధ్రము కంటే అదేమి తక్కువ కాదని ఆయన రాశారు. భాష విషయంలో ఇలాటి పోటీతత్వం పాజిటివ్‌గా పని చేసింది. ప్రాంతీయపరమైన అస్తిత్వవాదనలు ఇప్పుడు ఆ రోల్ ప్లే చేయడం లేదు. గాయాలను పుళ్లను మాన్పించేదిగా వుండాలి గాని కెలికేదిగా గాదు. యాసలు, మాండలికాల వల్ల తెలుగు భాష సుసంపన్నమైంది. అది అసెట్ కాని లయబిలిటీ కాదు. యూనిఫామిటీ ఆకాంక్ష తప్ప సంపూర్ణంగా సాధ్యమయ్యేదికాదు.

***మీలాటి వారి ఉపన్యాసాలలో పాత వాక్యాలలోని శ్లోకాలు అలవోకగా కోట్ చేస్తుంటారు. అలాటి అవగాహన రానురాను తగ్గిపోతున్నది. అయితే పాతను అదే పనిగా పట్టుకోవడం - ప్రత్యేకించి నేటి నేపథ్యంలో అంత వాంఛనీయం కాదనే అభిప్రాయం వుంది...***

ప్రాచీన అర్వాచీన అనే విషయంలో కాళిదాసే ప్రమాణం. పురాణమిత్యేవ నసాధుసర్వాం అని ఆయనే అన్నాడు. గతాన్ని పరీక్ష చేసి కాలానుగుణమైన దాన్ని స్వీకరించాలి. అలాటిదే నిలబడుతుంది. తెలుగు సాహిత్యంలో ఉద్యమ స్ఫూర్తిగల కవిత్వం ప్రజలలో నిలబడింది. శివకవిత్వమైనా, ప్రగతిశీల కవిత్వమైనా, కులవ్యవస్థను ప్రశ్నించిన నాటి భక్తికవితా సంప్రదాయం చూడండి. త్యాగరాజు, పోతన వాళ్ళ పరిధిలో ఉన్నత భావాలనే ప్రదర్శించారు. సూఫీ కవిత్వమైనా అంతే. భక్తిని ఆదర్శంగా చేసుకుని మంచి భావాలు చెప్పారు. ప్రాచీనమైన వాటిని యధాతథంగా స్వీకరించడం కాదు. నేటికి అన్వయించుకోవాలి. కొటేషన్స్ ఏవైనా అంతే. ఆ సందర్భాన్ని పాటించకపోతే రాసిన సందర్భం నేటి సందర్భంలో చూడకపోతే కువ్యాఖ్యానాలు తప్పవు.

భాష సార్వత్రీకరణకు మీడియా కీలకపాత్ర వహించింది. శ్రేష్టులైన వారికే పరిమితమైన భాష మీడియా వల్ల సార్వజనీనమైంది. మరీ ముఖ్యంగా గత యాభై ఏళ్ళుగా ప్రత్యామ్నాయ మీడియా విస్తరించింది. జాతీయోద్యమం, వామపక్ష ఉద్యమం, సంస్కరణోద్యమం, మూడు స్రవంతులుగా ఇందుకు దోహదపడ్డాయి. అందుకే గిడుగు, గురజాడ, కందుకూరి ఆధునిక మునిత్రయం అయ్యారు. 1930-40ల నుంచి సాగిన సాహిత్యంలో ఆ ప్రభావం కనిపిస్తుంది. కన్యాశుల్కం ఈ ధోరణులకు ప్రతీక అనవచ్చు.

***కాని గురజాడపైనా, అభ్యుదయ సాహిత్యంపైనా వచ్చే విమర్శలు..***

జీవితం విశాలవంతమైనపుడు ఆ ప్రభావం సాహిత్యంపైనా కనిపించుతుంది. అదింకా విశాలం కావాలని కోరుకోవచ్చు. కాని కొంత మంది దానిలోపాలనే ప్రధానంగా చూపడం సరైందికాదు. వాళ్లు వైతాళికులు. ట్రయిల్ బ్లేజర్స్. వాళ్ల స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుపోవచ్చు. ఆ పని కమ్యూనిస్టు ఉద్యమం చేసింది. జన జీవితం కేంద్ర బిందువుగా సాహిత్యం సృష్టించింది. అందులో సామాజిక సమస్యలనూ తీసుకున్నారు. కమ్యూనిస్టులు కాని వారు కూడా తెలంగాణా పోరాట స్ఫూర్తిని పలికించారు.

కాళోజి, దాశరథి వంటి వారు సుద్దాల హనుమంతు, యాదగిరి, ఇప్పుడు గద్దర్ వీరంతా ప్రజలలోంచి వచ్చిన వారే. అటు జన జీవన అనుభవం నుంచి ఇటు అవగాహన నుంచి తీసుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమం మనిషిలో ఆత్మాభిమానాన్ని రగిలించింది. ప్రజల మనిషిలో కంఠీరవం ఆ వర్గాల్లోంచి వచ్చినవాడే. మహీధర రామ్మోహనరావు రథచక్రాలు తదితర రచనలలో ఎస్‌సి, ఎస్‌టి సమస్యలను ప్రస్తావించారు. జాన్ పాత్ర ఈ విషయాలు మాట్లాడుతుంది. పరిస్థితి క్లిష్టంగా మారుతున్న కొద్ది ఆ వేదన లోంచి ఘర్షణలోంచి రకరకాల వాదనలు వస్తాయి. పురోగమనం ఎవరి గుత్త సొమ్ముకాదు. గతం నుంచి కూడా తీసుకోవాలి. చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా అంటే కేవలం గతాన్ని కీర్తించడానికేనా? భవిష్యత్తు కూడా దాంట్లో వుంది.

విశ్వనాథ సంగతి వేరు. ఆయన గతాన్ని పునరుద్ధరించాలను కుంటాడు. కాని వేయిపడగలులో నీవు మిగిలితిని నేను మిగిలితిని అని చెప్పినట్టు చివరకు ఆయనే మిగిలాడు. ముందుకు పోవాలంటే జనాన్ని మనతో తీసుకుపోవాలి. మగ్దుం అంటాడు. చలేతో సారే జమానేకో సాత్ లేకోచలో అని అలా వుండాలి కాని కవి రాబిన్‌సన్ క్రూసో కాకూడదు. పోరాడాలంటే అన్ని వర్గాల వారిని వెంటబెట్టుకుని పోవాలి. ఇప్పుడు సామ్రాజ్యవాద ప్రమాదం ప్రపంచీకరణ అలాటి సమైక్య పోరాటానికి అనువైన వాతావరణం కలిగిస్తున్నది. ఈ పోరాటానికి ఎన్నో పార్శ్వాలున్నాయి. పర్యావరణ పరిరక్షణ బృందాల నుంచి విప్లవ గ్రూపుల వరకు దీంట్లో కలసి రావచ్చు. గ్రీన్స్ పార్టీల వంటివి కూడా పాల్గొంటున్నాయి. ప్రతికూలమైన సాంప్రదాయక విలువలకు మతతత్వానికి వ్యతిరేకంగా భాషలు ప్రాంతీయ అస్తిత్వాలను నొక్కి చెప్పే విధంగా జరిగే పోరాటాలూ వున్నాయి. అయితే ఇవి ఉమ్మడి పోరాటంలో భాగం పంచుకోవాలి. ఆఫ్రికా వంటి చోట్ల సమాంతర సమీకరణలు జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకుకు వ్యతిరేకంగా సాగే ఇలాటి పోరాటాలు రానున్న కాలానికి సంకేతాలని భావించవచ్చు. శ్రీశ్రీ చీనాలో రిక్షావాలా చెక్‌దేశపు గని పనిమనిషి కలసి నడుస్తారంటే కవిత్వంలా అనిపించింది. 50, 60 ఏళ్ల తర్వాత ఇప్పుడు అది అక్షరాలా నిజమవుతున్నది. మన దేశంలో కూడా వసుధైక కుటుంబం అనే భావన వుంది...

ప్రపంచం ఇప్పుడు మారిపోయింది. ఇది వరకటి అధ్యయనం, అనుభవం మార్పులకు గురి అయ్యాయి. డబ్ల్యు.టి.వో. అంటే ఒకప్పుడు మేధావులు, నిపుణులు మాత్రమే చర్చించేవారు. ఇవాళ అందరూ మాట్లాడుతున్నారు. పత్తిరైతు ఆత్మహత్యలకు దానికీ సంబంధం చూస్తున్నారు. ఈ విషయంలో కూడా మీడియా చాలా పాత్ర నిర్వహిస్తున్నది దాని వేగరీస్, పర్వర్షన్స్, డిస్టార్షన్స్ ఎన్ని ఉన్నా మొత్తం మీద జనాన్ని కదిలించడానికి కారణమవుతున్నాయి. మీడియాకు యాజమాన్యం ఉన్నప్పుడు తటస్థంగా ఉంటారని భావించలేము. అవి ప్రజానుకూల పాత్ర నిర్వహించే అవకాశమే లేదు. ప్రత్యామ్నాయం రావాలి. అన్ని రంగాలలో రావాలి. అవతలి పక్షమా ఇవతలి పక్షమా అనే మీమాంసకు గురి అయి అస్త్ర సన్యాసం చేయడానికి అవకాశం లేదు. రిస్కు తీసుకుని అయినా ఒక పక్షాన్న నిలబడాలి. బతుకును బాగు చేసేదే ఫిలాసఫీ. సిద్ధాంత రాహిత్యం సినిసిజం, నిహిలిజం, నిస్సహాయత, కొంటిగొట్టుతత్వం పనికిరావు. కొత్త రచయితలు ఈ విషయాలను అర్థం చేసుకోవాలి. ఇప్పుడు నిర్వేదానికి తావులేదు. మేధాపాట్కర్ వంటి వారే రంగంలోకి దిగి పోరాడుతున్నారు. ఆమె చెప్పేదంతా సరైంది అవునా కాదా అనే చర్చ కాదు. ప్రజలలో ఉన్న కొన్ని ప్రగాఢ ఆకాంక్షలను ఆమె అందుకున్నది. అలాగే వివిధ తరగతులకు సంబంధించిన వారి అంశాలపై ప్రజాశీలత కావాలి. కదలకుండా ఉండే తత్వం పోవాలి. ఈ క్లిష్ట దశలో సామూహిక కష్టనష్టాల నుండి అనుభూతి పొంది అక్షరాయుధాలు అందించాలి. జయించేందుకు ప్రపంచం ఉంది అనే స్ఫూర్తి కలిగించడం సాహిత్య ధర్మం. ప్రపంచంలో ఏ గొప్ప ఉద్యమం కూడా సాహిత్య ఉద్యమంతో సంబంధం లేకుండా రాలేదు. ఫ్రెంచి విప్లవం మన జాతీయోద్యమం ఏదైనా సరే మేధావుల కాల్పనిక భావనలు నిర్దిష్ట రూపం తీసుకొనేది ఉద్యమాల సందర్భంలోనే.

***వసుధైక కుటుంబం అనే పాతకాలపు భావనను నేడు అన్వయించుతున్నారు. అది, అంతర్జాతీయత ఒకటే అన్నట్లు భావించవచ్చా?***

రెండూ ఒకటి కాదు. ఆ భావనను మార్చుకోవాలి. ఆనాటి వారి భావనలో ప్రపంచం చాలా పరిమితమైంది. ఒక పిర్కాను ప్రపంచం అని ఉండవచ్చు. విశ్వశ్రేయం కావ్యం అన్నారు భౌతిక సామాజిక కట్టుబాట్లు అన్నీ కూడా అల్ప సంఖ్యాకులను ఆధిక్యతలో అట్టిపెట్టడానికి దారి తీశాయి. కులవ్యవస్థ చాలా హాని చేసింది. గుణకర్మ విభాగశ: అంటూనే విద్యను అధిక సంఖ్యాకులకు అందుబాటులో లేకుండా చేయటం కులవ్యవస్థలో అతి పెద్ద అన్యాయం. నాస్తికులు వేదాలు చదవరాదంటూ ఇతరుల కంటే ఎక్కువగా వారే వేదాలకు హాని చేశారు. వస్తు ఉత్పత్తి చేసే వారికి, వినియోగించుకునే వారికి మధ్య అంతరం విపరీతంగా పెరిగిపోయింది. కులాలు సంకుచిత భావాలకు దారి తీశాయి. కులం ప్రధానమై పోయింది. ప్రజాస్వామ్యంలో కులం ఒక్కటే ఆధారంగా గెలవడం సాధ్యంకాదు. అయినా దాన్ని పట్టుకొని ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. ఆ విధమైన తీవ్ర తప్పిదాలు గతంలో ఉన్నప్పటికీ దాన్ని అర్థం చేసుకోవాలి.

గతం అర్థం చేసుకోవడం వేరు, దాంట్లోనే బ్రతకడం వేరు. చాలా కాలం కిందటే పెండ్యాల సుబ్రహ్మణ్యశర్మ లాంటి వారు మహాభారతాన్ని ఆధునిక దృక్పథంతో విశ్లేషించారు. ఎంగెల్స్ ప్రాచీన క్రైస్తవం పట్ల తీసుకున్న వైఖరి కూడా అదే. క్రైస్తవ మతాన్ని సంస్కరించే, పోరాటం చేసిన మార్టిన్ లూథర్ నిజానికి రైతుల సమస్యలకు మతపరమైన ఆచ్ఛాదన ఇచ్చారు. ఆధునిక కాలంలో మార్టిన్ లూథర్ కింగ్ కూడా అలాంటి పనే చేశారు. నేనొక కలగంటున్నాను అని కింగ్ అన్న మాటలు సుప్రసిద్ధాలు. ప్రజలెప్పుడూ కలలు కంటూనే ఉన్నారు. వాటిని నిజం చేసేమార్గం ఏదో చూడడం ఆలోచనా పరుల కర్తవ్యం. లోకాయుతులు చార్వాకుల నుంచి ఈనాటి వరకూ మూఢనమ్మకాలపై విమర్శలు సాగుతూనే వున్నాయి. కాని ప్రజల స్థాయిని చూడాలి. ఈ రోజుకులతత్వం చాలా వికృతరూపం తీసుకుంటున్నది.

***మీకు ఉర్దూ సాహిత్యంతో మంచి పరిచయం ఉంది కదా?***

చిన్నప్పుడు నేను ఉర్దూ నేర్చుకున్నాను. చాలా మంది అనుకునేట్లు కొంత మంది ప్రచారం చేసేట్లు ఉర్దూ ఒక మతానికి సంబంధించిన భాష కాదు. పర్షియన్, అరబిక్ భాషల మేళవింపుతో సివిల్ సర్వీస్ అవసరాల కోసం పుట్టింది. సంస్కృతం బ్రాహ్మణ భాష అనుకోవటం, ఇంగ్లీష్ క్రైస్తవ భాష అనుకోవటం ఎంత పొరపాటో ఉర్దూ ముస్లిం భాష అనుకోవటం కూడా అంతే పొరపాటు. పాలనా భాషగా పెరిగింది. గొప్ప ఉర్దూ కవులలో హిందువులే ఎక్కువ. కాయస్తులు వారిలో చాలా ఎక్కువ. హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ పాలనా భాష. మేము ఉర్దూ నేర్చుకున్నాము. ఉర్దూకు ప్రజాస్వామ్య సంస్కృతి చాలా ఎక్కువ. దక్కన్ ఉర్దూ, బెంగాలీ, లక్నో, ముంబాయ్ వగైరా ఉర్దూలు వేర్వేరుగా ఉంటాయి. స్థానిక భాషల సంపర్కం అందుకు కారణం. బెంగాలీ ఉర్దూ హైదరాబాద్‌లో అర్థం కాదు. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఉర్దూను శుద్ధి చేయాలని విఫలయత్నం చేశారు. ఉర్దూ అత్యంత అధునాతన భాష. శక్తివంతమైన భాష. గజల్స్ రుబాయెట్‌లు అందరికీ తెలుసు కదా! శ్రామిక ప్రజల భావాలను ఉర్దూ సాహిత్యం గొప్పగా వ్యక్తీకరిస్తుంది.న హింద్ బనేగా, బనేగా న ముసల్మాన్‌కీ అవులాద్ హై అని సాహిర్ లుధియాన్వీ అంటారు.

వైదిక మత సాహిత్యంలోనూ లౌకిక వ్యవహారాలు ఉంటాయి. జనజీవనాంశాలు తెలుస్తాయి. అవి చాలా పరిమితం గానే ఉండొచ్చు. వాటిని తెలుసుకోవడానికి అయినా అవి అధ్యయనం చేయాలి. అంతేకాని రత్నాలు రాశులు పోసి అమ్మారని భ్రమలు పెంచుకోవడం కాదు.

సంస్కృతం చాలా గొప్ప భాష. ఎకానమీ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ – పొదుపుగా వ్యక్తీకరించడం దాన్లో చాలా సులభం. జ్ఞాపకం ఉంచుకోవడానికి వీలైన పద్ధతులు సంస్కృతంలో ఉన్నాయి. అందుకే శ్లోకాలు ఇంత కాలంగా గుర్తుంటున్నాయి. మోడ్రన్ మేధావులు కూడా నాలుగు శ్లోకాలు చెప్పడం ఒక అర్హతగా భావిస్తున్నారు. సందర్భానికి సరిపోతాయా లేదో చూడాలి కాని ఆ భాషనే ద్వేషించకూడదు. పతంజలి శాస్త్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. గొప్ప తీర్పులు ఇచ్చాడు. సంస్కృత పండితుడు కె.ఆర్. మున్షీ సంస్కృతాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని పెట్టుకొని ఆయనను ఉపన్యాసానికి ఆహ్వానించారు. సంస్కృతం ప్రజల నుంచి దూరమైందని ఆయన చెప్పారు. కనుక మనం ఏ దృష్టితో చూస్తున్నామనేది ముఖ్యం. కాళిదాసు శాకుంతలలో కణ్వుడి ద్వారా చెప్పించిన మాటలు సర్వకాలాలకు వర్తించేవే. షెల్లి, కీట్స్, వర్డ్స్‌వర్త్ ఇలాంటి మహాకవులలో సార్వజనీనత ఉంటుంది. ప్రపంచమంతటా నుంచీ వారు ఉత్తమ భావాలను స్వీకరిస్తారు. తమ భావాలను ప్రసరిస్తారు. 19, 20 శతాబ్దాలలో ప్రపంచ సాహిత్యంలో అత్యుత్తమ రచయితలెందరో ఉద్భవించారు. సర్వాంటెస్, బైరాన్, చార్లెస్ డికెన్స్, టాల్‌స్టాయ్, బాల్జాక్ ఇలాంటి వారి గ్రంథాలు చదివి తీరాలి. అవి ఆధునిక యుగపు ప్రవేశద్వారాలు లాంటివి. మార్క్స్, షేక్స్పియర్‌ను ఎంతగానో మెచ్చుకుంటాడు. వారు ఒక భాషకు దేశానికి పరిమితమయిన వారు కాదు. ఆ అత్యుత్తమ సాహిత్యం ఎంత ఎక్కువగా చదివితే అంత మేలు జరుగుతుంది. టాల్‌స్టాయ్ వార్ అండ్ పీస్ ఒక ఎపిక్. నిన్న జరిగిన ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం సందర్భానికి కూడా అది వర్తిస్తుంది. నిన్నటి సాహిత్యాన్ని ఎలా అనువదించుకోవాలన్నదే కీలకం.

**మరి ఇటీవలి ఇంగ్లీష్ పుస్తకాల గురించి మీ అభిప్రాయం?**

సాల్మన్ రష్దీ, అరుంధతీరాయ్, విక్రమ్‌సేథ్ వంటి వారి పుస్తకాలు చదివాను. నిజానికి ఇప్పటికీ నేను ప్రముఖుల గ్రంథాలను చదువుతూనే ఉంటాను. వీరందరూ చక్కగానే రాస్తున్నప్పటికీ పైన చెప్పిన జాబితాలోకి రారు. రష్దీ పై ఇరాన్ నేత ఖొమేనీ మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకించవచ్చు. కాని ఆ ఒక్క కారణంతో అది గొప్ప గ్రంథమైపోదు. శాటానిక్ వర్సెస్ నవలకు వచ్చిన ప్రచారంతో పోలిస్తే అంత ప్రతిభ దాంట్లో లేదు. దానికి సంచలన శీలత ఉన్నంతగా లక్ష్యశుద్ధి లేదు. మార్కెట్ అనేది ఈ రోజుల్లో పుస్తక ప్రచురణను కూడా శాసిస్తున్నది. ఇంగ్లీషులో ఇది మరింత ఎక్కువ. మా చిన్నతనంలో కొవ్వలి నవలలు ఎగబడి చదివేవారు. అంతమాత్రాన అవి గొప్పవైపోవు. అరుంధతీరాయ్ రచనలో రీడబులిటీ చాలా ఎక్కువ. ఆమె తన మొదటి పుస్తకంలో ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ గురించి తప్పుగా రాసినప్పటికీ తర్వాత ఆమె నిర్వహిస్తున్న పాత్ర బాగానే ఉంది.

***మీరు బహు భాషలలో ప్రావీణ్యం పొందడానికి దారి తీసిన పరిస్థితులేంటి?***

అదృష్టమో దురదృష్టమో గాని నేను తొమ్మిది పదేళ్ల వయస్సు లోనే సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీష్ మూడూ నేర్చుకోగలిగాను. ఒక కాజీ, ఒక శాస్త్రి, ఒక భట్రాజు నాకు ఇవి నేర్పించారు. తెలుగుతో పాటు మా అమ్మగారి ద్వారా తమిళం కూడా తెలుసుకున్నాను. ఆంధ్రనామ సంగ్రహం, రుక్మిణీ కళ్యాణం ఇలాంటివి సంస్కృతంలో బాల్యంలోనే చదివాను. నా చదువు ఇంట్లోనే జరిగేది. అది నాన్ ఫార్మల్ విద్య అనవచ్చు. ఆ రోజుల్లో వర్షం రాకపోతే విరాటపర్వం చదివించేవారు. అలా ప్రాచీన కావ్యాల గురించి తెలుసుకున్నాను. 1948లో తెలంగాణాలో రజాకారుల దేశముఖ్‌ల దాడి జరిగినపుడు మా కుటుంబం ఈ కమ్యూనిస్టులకు ఆశ్రయం ఇచ్చింది. మా తాతగారు పెద్ద ఆయుర్వేద వైద్యులు. అప్పట్లోనే పాకలు వేసి సర్జరీ చేసేవారు. పేరు మోసిన విస్సూరు రామచంద్రారెడ్డికి ఆయన వైద్యులు. మూడు నెలలపాటు ఆయన ఆ పాకల్లోనే చికిత్స పొందుతూ ఉన్నారు. మా తాతయ్యకు నజరానాలు పంపారు. రెండు గ్రామాలు మా ఆధ్వర్యంలో ఉండేవి. అయితే మా ఇంట్లో వాళ్లు ఉదారవాదులు. మాకు తెలిసీ తెలియని వయస్సు అప్పట్లో కమ్యూనిస్టు నాయకులు నల్లా నర్సింహులు, యాదగిరి రావువంటి వారు వస్తే మా అమ్మ వండిపెడుతుండేది. వాళ్లు ఎవరూ చుట్టాలయితే మాకు ఎందుకు చెప్పవని పోట్లాడేవాన్ని. గుంటమయ్య అని ఒక పూజారి ఉండేవాడు. ఆయన కూడా పోరాటంలో పాల్గొని నిర్బంధానికి గురయ్యాడు. చోడవరపు విశ్వనాథం అని ఆయన్ను కాల్చి చంపేశారు. అలాంటి వాతావరణంలో కూడా మా కుటుంబం సంఘానికి అండగా నిలబడేది. నేను తర్వాత కృష్ణా జిల్లా మానుకొండలో చేరాను. మా మేనమామ కాంగ్రెస్‌లో పని చేసేవారు. తర్వాత 1949లో సికింద్రాబాద్ వచ్చాం. మగ్దుం, శ్రీశ్రీ రచనలు, ఎర్రజెండాలు వంటి పుస్తకాలు అప్పుడే చదివాను. విశాలాంధ్ర చదువుతుండే వాడిని. ప్రత్యేకించి మోటూరి హనుమంతరావుగారి రచనలు నాకు ఎంతో నచ్చేవి. అందుకే ప్రజాశక్తి ప్రారంభ సభలో పాల్గొన్నప్పుడు ఆ విషయం ప్రత్యేకంగా చెప్పాను. అన్నయ్య ఆర్‌టిసిలో పని చేసేవాడు. విద్యార్థి ఉద్యమంలో పని చేస్తూ క్రమంగా కమ్యూనిస్టునయ్యాను. ఉస్మానియా యూనివర్శిటీలో పియుసిలో మెరిట్ లిస్టులో ఆరో వాడిగా వచ్చాను. బిఎస్‌సి, ఎల్‌ఎల్‌బి చేశాను. జీవన విధానంలో మాత్రం సంప్రదాయ ఛాయలు ఉండేవి. ఉదాహరణకు చాలా కాలం పిలక ఉండేది. అందుకే పార్టీ సభ్యత్వం తీసుకోలేదు. 1959-60లలో చివరిసారి తద్దినం పెట్టి ఇక మీదట పెట్టనని ప్రకటించి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడినయ్యాను. వివిధ పత్రికలలోనూ, తర్వాత పేట్రియాట్ విలేకరిగానూ పని చేశాక విశాలాంధ్ర సంపాదకత్వం స్వీకరించాను.

***మీ అధ్యయనం రచనా పద్ధతి గురించి చెప్పండి?***

రాజకీయాలు, సాహిత్యం చదవడానికి చాలా ప్రాధాన్యత నిస్తాను. ఇప్పటికీ రోజుకు రెండు గంటలయినా చదవాల్సిందే. ప్రాచీన సాహిత్యం చదివిన ఉటంకించినా దాన్ని ప్రస్తుతానికి ఎలా అన్వయించాలని తప్ప గతంపై వ్యామోహంతో కాదు. నాకు రాయడం పైన, రాజకీయాలపైన ఉన్న ఆసక్తితోనే లాలో మంచి స్టూడెంట్‌ని అయినప్పటికీ ప్రాక్టీసు చేపట్టలేదు. అందులోనూ హిందూ ధర్మ శాస్త్రాన్ని ఆప్షనల్ సబ్జెక్టుని చాలా లోతుగా చదివాను. అయినా పార్టీలో పని చేసేప్పుడు ఇవన్నీ ఎందుకనే భావం...

***చాలా మందితో పోలిస్తే మీరు రాసిన పరిమాణం తక్కువ, ఉపన్యాసాలకు కేటాయించే సమయం ఎక్కువ అనిపించదా?***

నిజమే! మనం రాయకపోతే నష్టమేమిటి? అనే ధోరణి దీనికి చాలా వరకూ కారణం. అది పొరపాటే అయి ఉండవచ్చు. పైగా రోజువారీ రొటీన్ పనులు వీటి మధ్య రాయాల్సినంతగా రాయలేదేమో! రాసినవి కూడా భద్రపర్చుకోలేదు. ఇక ఉపన్యాసాలు అంటే ప్రజాజీవితంలో భాగంగా అవి తప్పని సరి కదా! ❑

*- సాహిత్య ప్రస్థానం మాస పత్రిక సౌజన్యంతో..*


**జాతీయ స్ఫూర్తి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 | 1 సం॥నికి | రూ. 300-00 |
| 2 సం॥లకు | రూ. 500-00 | విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

***NEFT లేదా RTGS** పంపడానికి*
**JAATEEYA SPURTHI**
**A/c No.3620 101 0000 380**
**Syndicate Bank, Eluru Main Branch**
**IFSC Code : SYNB0003620**

*పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**
క్రాంతి నర్సింగ్ హోమ్
నన్నయ్య విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్
**తణుకు - 534 211**
**✆ 08819 222265, 93971 14495**

# సంపాదకశిఖరం, అజాతశత్రువు రాఘవాచారి

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

కొండుభట్ల రామచంద్రమూర్తి

నిరాడంబరంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించడం చాలా తక్కువ మందికి సాధ్యం. ఏదో ఒక బలహీన క్షణంలో పదవీ వ్యామోహానికో, ధన ప్రభావానికో, బంధుప్రీతికో, ఆశ్రితపక్ష పాతానికో లోనవుతారు. కొన్ని దశాబ్దాలపాటు నిబద్ధతతో జీవించినవారు సైతం వృత్తి జీవితం చరమాంకంతో కట్టు తప్పి వ్యవహరించిన సందర్భాలు అనేకం. అటువంటి ప్రపంచంలో నమ్మిన విలువలకు కట్టుబడి, అత్యంత నిరాడంబరంగా, ఏ రకమైన భేషజాలు లేకుండా, అజాతశత్రువుగా, ఆదర్శమూర్తిగా జీవితాంతం నడుచుకున్నవారిని ఒక చేతి వేళ్ళపైన లెక్కపెట్టవచ్చు. అటువంటి మహానుభావులలో 2019 అక్టోబర్ 28న ఉదయం శాశ్వతంగా కన్నుమూసిన సంపాదకశిఖరం చక్రవర్తుల రాఘవాచారి ఒకరు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఆయన తెల్లటి ప్యాంటు, తెల్లటి షర్టు వేసుకొని చిరునవ్వుతో కనిపించేవారు. ఆయన హృదయం అంతే నిర్మలం. ఆయన మనస్సు సాగర సదృశం. విజ్ఞాన ఖని.

ఎనభై ఏళ్ళ కిందట 1939 సెప్టెంబర్ 10న వరంగల్లు జిల్లా జనగాం తాలూకా, పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో పండిత, సంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచారి అత్యంత ప్రతిభావంతుడు. చిన్నతనం నుంచీ చదువులో ప్రథమశ్రేణిలో ఉండేవారు. తొమ్మిదో ఏటనే మేనమామ ఇంట్లో ఉంటూ పొన్నూరులో సంస్కృతం అభ్యసించారు. పదకొండో ఏటి నుంచి హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేశారు. నిజాం కాలేజిలో, ఉస్మానియా విశ్వవిద్యాయలంలో ఉన్నత చదువులు చదువుకున్నారు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలపై అధికారం సంపాదించారు. అరుదైన ప్రతిభ కలిగిన గొప్ప వక్త. అద్భుతమైన రచయిత. నడుస్తున్న విజ్ఞానసర్వస్వంగా (మూవింగ్ ఎన్ సైక్లోపీడియా)గా ఆయనను ఆంధ్ర విశ్వ విద్యాలయం మాజీ కులపతి రామకృష్ణారావు విజయవాడలో జరిగిన సభలలో అభివర్ణించేవారు.

రాఘవాచారిగారూ, మా అన్నగారు డాక్టర్ రామసత్యం, విప్లవ రచయిత వరవరరావుగారూ ఒకే సంవత్సరం వరంగల్లులో పీపీసీ కోర్సు చేశారు. నేను బెంగుళూరు నుంచి విజయవాడకు 'ఆంధ్రప్రభ' ఉపసంపాదకుడిగా బదిలీపైన 1979లో వెళ్ళినప్పటి నుంచీ రాఘవాచారిగారిని తరచు కలుసుకునేవాడిని. ఆయన అడుగుజాడలలో నడిచిన పాత్రికేయులలో నేనూ ఒకడిని. ఆయనలాగే నిరాడంబరంగా జీవించాలనీ, పుస్తకాలు అదేపనిగా చదవాలనీ, సామాజికస్పృహతో జీవించాలనీ, ప్రజలపక్షాన, ముఖ్యంగా పేదలపక్షాన, నిలబడి ప్రపంచాన్ని అవలోకించి, వ్యాఖ్యానించాలనీ ప్రయత్నిస్తూ వచ్చినవాడిని. విజయవాడలో పని చేసిన పదేళ్ళలో నాలుగేళ్ళు ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పని చేసిన నాకు ఆయన అండదండలు దండిగా ఉండేవి. ప్రతి సందర్భంలోనూ ఆయన సూచనలూ, సలహాలూ స్వీకరించేవాడిని. 1979–80లో వాజపేయి, చరణ్ సింగ్, జార్జి ఫెర్నాండెజ్, హేమవతీ నందన్ బహుగుణ, జగ్జీవన్ రాం వంటి హేమాహేమీలు విజయవాడ ప్రెస్ క్లబ్‌కు వచ్చారు. వారిలో చాలా మందిని సభికులకు పరిచేయగల పరిజ్ఞానం రాఘవాచారి గారికే ఉండేది. నా అభ్యర్థన మేరకు ఆయన అద్భుతంగా అతిథుల గురించి మాట్లాడేవారు. నేను పత్రికారంగంలో అడుగుపెట్టడానికి ముందే రాఘవాచారిగారు జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంతకు క్రితం విద్యార్థి సంఘం నాయకుడిగా దీక్షాదక్షతలు ప్రదర్శించారు. మొహిత్ సేన్, ప్రతాపరెడ్డి ప్రోత్సాహంతో హైదరాబాద్‌లో విశాలాంధ్ర విలేఖరిగా చేరి, పేట్రియట్‌కు కూడా వార్తలు పంపిస్తూ కొంతకాలం పని చేశారు. పేట్రియట్, లింక్ కోసం పని చేసేందుకు ఢిల్లీలో కొంత కాలం ఉన్నారు. అక్కడే, ఇంగ్లీషు జర్నలిజంలోనే కొనసాగి ఉంటే, కమ్యూనిస్టు పత్రికల పట్ల నిబద్ధత కొంత సడలించి ప్రధాన స్రవంతిలో ప్రవేశించి ఉంటే జాతీయస్థాయిలో ఇంగ్లీషు పత్రికలకు సంపాదకుడై బ్రహ్మాండంగా రాణించేవారు. కోటంరాజు పున్నయ్య, కోటంరాజు రామారావు, కుందూరి ఈశ్వరదత్తు, ఖాసా సుబ్బారావు, ఎం చలపతిరావు వంటి హేమాహేమీల సరసన చేరేవారు. కానీ నరనరానా జీర్ణించుకున్న కమ్యూనిస్టు భావజాలం, స్వతహాగా ఉండిన నిబద్ధత ఆయనను 1972లో 'విశాలాంధ్ర' సంపాదకుడిగా నిలిపాయి. ఆ పదవిలో 29 సంవత్సరాలు కొనసాగారు. చిన్న పత్రికకు పెద్ద సంపాదకుడిగా అనేక వందల సభలలో ప్రసంగించారు. రాఘవాచారిగారు ఎవరిపైన అయినా ఆగ్రహం ప్రదర్శించడం కానీ, కేకలు వేయడం కానీ, నిష్ఠురంగా మాట్లాడటం కానీ, ద్వేషపూరితమైన వ్యాఖ్యాలు చేయడం కానీ నా నాలుగు దశాబ్దాల సాన్నిహిత్యంలో ఎన్నడూ చూడలేదు. మామూలుగా కబుర్లు చెప్పే సందర్భంలో కానీ, ప్రసంగాలలో కానీ సున్నితమైన, సునిశితమైన హాస్యం, వ్యంగ్యం, చమత్కారం తళుక్కున మెరిసేవి. ఆయన ఎవరిని ఉద్దేశించి చణుకులు విసిరారో వారు సైతం హాయిగా నవ్వుకునేవారు కానీ బాధ పడేవారు కాదు. విలువల విషయంలో, నైతికత విషయంలో మాత్రం రాజీ ప్రసక్తి లేదు. పైకి మెత్తగా, నవ్వుతూ ఉండేవారు కానీ నిర్ణయాలు మార్చుకునేవారు కాదు. తెలంగాణలో పుట్టినా జీవితంలో ఎక్కువ భాగం విజయవాడలోనే నివశించారు.

**పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి**

గుంటూరు జిల్లా కమ్యూనిస్టు నాయకుడు కనపర్తి నాగయ్య గారి కుమార్తె జ్యోత్స్నను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె స్కూలుకు వెడుతూ స్కూటర్ పైనుంచి పడిపోయి రోడ్డు ప్రమాదంలో మరణించడం ఆ దంపతులకు తీరని వ్యథను మిగిల్చింది. పెద్ద కుమార్తె డాలీ (అనుపమ) వైద్యురాలు. సీనియర్ జర్నలిస్టు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడు సంజయ్‌ను అనుపమ పెళ్ళి చేసుకున్నారు. వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. డాక్టర్ అనుమప దగ్గర ఉంటూనే చికిత్స కోసం హైదరాబాద్‌లోని కొంపల్లిలో సురక్షా హాస్పిటల్‌లో నెలరోజుల క్రితం చేరిన రాఘవాచారి అక్కడే తుదిశ్వాస విడిచారు.

రాఘవాచారిగారు పత్రికా రంగంలోకి రాకపోయి ఉంటే లాయర్‌గా ప్రాక్టీసు మొదలు పెట్టేవారు. ఎల్ ఎల్ ఎం లో గోల్డ్ మెడలిస్టుగా, న్యాయశాస్త్రం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మేధావిగా, రాజ్యాంగం పట్ల అచంచలమైన విశ్వాసం కలిగిన న్యాయకోవిదుడుగా రాఘవాచారిగారు న్యాయవ్యవస్థలో ఎన్ని మెట్లు ఎక్కి ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేవారో ఊహించుకోవలసిందే. సాధారణంగా న్యాయవాదులకు ఉండే చొరవ, దూసుకొనిపోయే స్వభావం రాఘవాచారిగారు ప్రదర్శించి ఉంటే సర్వోన్నత న్యాయస్థానం వరకూ వెళ్ళగలిగిన మేధాసంపత్తి, పరిజ్ఞానం, పరిశ్రమించే మనస్తత్వం ఆయనకు ఉన్నాయి. జర్నలిస్టు సంఘాలూ, ప్రెస్ అకాడెమీలూ నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన ప్రెస్ లాస్ చెప్పేవారు. జర్నలిస్టులకూ, పత్రికలకూ వర్తించే ప్రెస్ లాస్ చెప్పడంలో ఆయనా, మరో ప్రఖ్యాత జర్నలిస్టు వరదాచారీ నిష్ణాతులు. సంస్కృతంలోనూ, తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ఆయన అనేక గ్రంథాలు చదివారు. ఉర్దూ అలవోకగా, ధారాళంగా మాట్లాడేవారు. కొంతకాలం క్రితమే కడపలో జర్నలిస్టుల సభ జరిగినప్పుడు అక్కడికి వెళ్ళిన రాఘవాచారిగారు కడపదర్గాను సందర్శించి అక్కడ ఉన్నవారితో ఉర్దూలో హాయిగా మాట్లాడి అనేక విషయాలు తెలుసుకున్నారని హైదరాబాద్‌లో జరిగిన సంతాపసభలో జర్నలిస్టు అజిత తెలియజేశారు. రాఘవాచారి గారితో సంభాషించినా, ఆయన ప్రసంగం ఆలకించినా ఆయన చదవని పుస్తకం లేదు, ఆయనకు తెలియని విషయం లేదు అనిపించేది. సంపాదకుడిగా పదవీ విరమణ చేసిన తర్వాత ఆయన విజయవాడలో జరిగే పుస్తక మహోత్సవాలలో (బుక్ ఫెస్టివల్స్) ప్రతి రోజూ కనిపించేవారు. సతీసమేతంగా ఆయన అన్ని స్టాళ్ళనూ సందర్శించి పుస్తక విక్రేతలనూ, పాఠకులకూ ప్రోత్సహించేవారు. పుస్తక ప్రదర్శనలలో జరిగే సభలకు విధిగా హాజరయ్యేవారు. కొన్ని సభలలో ప్రధాన వక్తగానూ, మరికొన్ని సభలలో ప్రముఖ సభికుడిగానూ ఉండేవారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టి, కుటుంబం కట్టుబాట్లను తెంచుకొని కమ్యూనిస్టు భావజాలంవైపు ప్రయాణించి, పత్రికారంగంలో నా బోటి పాత్రికేయులెందరికో మార్గదర్శిగా ఉంటూ, కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరులూదుతూ, నిరాడంబరంగా, నిగర్విగా జీవించడం రాఘవాచారి గారికే సాధ్యమైంది. కేరళలో సీపీఎం నాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ జీవనయానంతో రాఘవాచారి జీవితాన్ని కొన్ని కోణాలలో పోల్చవచ్చు. పుట్టుకతో వచ్చిన భావజాలాన్నీ, సంప్రదాయాలనూ, చాదస్తాలనూ వదిలించుకొని ప్రగతిపథంలో పయనిస్తూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించడం, లక్షలాది మంది పైన ప్రభావం వేయడం అసాధారణం. కమ్యూనిస్టు ఉద్యమం ఎన్ని పాయలుగా చీలినా అన్ని పాయలకు చెందిన నాయకులూ, కార్యకర్తలూ రాఘవాచారి గారిని గౌరవించడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన అంశం. సీపీఎం నాయకులతో సీపీఐ నాయకులకు విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత సంబంధాలు స్నేహపూరితంగా ఉండాలని ఆయన భావించేవారు. మోటూరి హనుమంతరావు, బొమ్మారెడ్డి వంటి సీపీఎం నాయకులూ, ప్రజాశక్తి నిర్వాహకులూ రాఘవాచారి గారిని సోదరతుల్యుడుగా ఆదరించేవారు. 'నవతెలంగాణ' పత్రిక వార్షికోత్సవంలో రాఘవాచారి గారిని సన్మానించడం ఆయన పట్ల సుహృద్భావానికి నిదర్శనం. దళితుల పైన దాడి జరిగిన సందర్భాలలో ఇతర సంపాదకులతో కలసి కారంచేడు, చుండూరు వచ్చి బాధితకుటుంబాలను పరామర్శించారు. భూస్వాముల దౌర్జన్యాన్ని ఖండిస్తూ సంపాదకీయాలు రాశారు. మానవత్వంపైన దాడి జరిగిన ప్రతిసారీ ధర్మాగ్రహం ప్రదర్శించారు. దేశ చరిత్ర కీలకమైన మలుపు తిరిగిన సందర్భాలలో వివేకవంతమైన, విలువైన సంపాదకీయాలు రచించారు. విద్వత్తుతో నిండిన ఉపన్యాసాలు చెప్పేవారు. బాధితులతో, పీడితులతో సంఘీభావం ప్రకటించే వారు. ఆయనది వైవిధ్యభరితమైన జీవితం. పాత్రికేయులకూ, సామాజిక కార్యకర్తలకూ ఆయన ప్రాత:స్మరణీయుడు.

రాఘవాచారిగారు ఎందరో కమ్యూనిస్టు అగ్రనేతలతో కలసి పని చేశారు. ఎందరో మేధావులతో స్నేహం చేశారు. ఎన్నో గ్రంథాలు చదివారు. భవభూతి నుంచి విశ్వనాథసత్యనారాయణ, శ్రీశ్రీల వరకూ, షేక్స్‌పియర్ నుంచి కమ్మింగ్స్ వరకూ ఎందరో కవులనూ, రచయితలనూ అధ్యయనం చేశారు. ఎన్నో సభలలో ప్రసంగించారు. వివేకాన్ని ప్రబోధించే వాచస్పతి ఆయన. వేల సంపాదకీయాలు రాశారు. ప్రతి పరిణామాన్నీ మార్క్సిస్టు దృక్పథంలో పరిశీలించి టిప్పణి చెప్పగల మేధస్సు ఆయన

☞ మిగతా 40వ పేజీలో

# ప్రత్యామ్నాయ పత్రికా రచనకు ప్రతీక

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

**ఆర్వీ రామారావ్**

నాలుగున్నర దశాబ్దాల నుంచి ఎరిగిన మనిషి, అందునా వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ, సైద్ధాంతికంగానూ ఒకే దారిలో నడుస్తున్న వ్యక్తి దూరం అయినప్పుడు ఎంత నిగ్రహించుకున్నా అక్షరాలు తడబడక మానదు. చక్రవర్తుల రాఘవాచారి మరణించారని తెలియగానే వ్యక్తిగతంగా నా జీవితంలో ఉండబోయే వెలితి తలుచుకుంటేనే భయమేస్తోంది. పత్రికా రచనలోనూ, సాహిత్య రంగంలోనూ, ప్రధానంగా సంస్కృత–ప్రాచీన తెలుగు సాహిత్యం గురించి ఏ అనుమానం వచ్చినా రాఘవాచారిని సంప్రదించడానికి అలవాటు పడ్డ ప్రాణం నాది. ఎప్పుడు ఏది అడిగినా సాధికారంగానే కాదు ఏ విషయం ఎక్కడ దొరుకుతుందో అది ఏ పుస్తకంలో, ఏ పత్రికలో ఎన్నో పేజీలో ఉందో కూడా కచ్చితంగా చెప్పగల ధారణా శక్తి రాఘవాచారి సొంతం. అంతకు ముందు రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణ సముపార్జించుకున్న జ్ఞానాన్ని అప్పనంగా కొల్లగొట్టడానికి అలవాటు పడ్డ వాడిని. అలాంటి జిజ్ఞాసాపరుల్లో బహుశః రాఘవాచారి ఆఖరి వారు కావచ్చు. ఇక మీదట అనుమానం వస్తే ఎవరిని అడగాలో తెలియదు. రాజకీయ పరిణామాలను ఎలా అర్థం చేసుకోవాలో, విశ్లేషించాలో ఆయన దగ్గర్నుంచే కొంతైనా నేర్చుకోవడానికి అవకాశం వచ్చింది.

వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో 1939 సెప్టెంబర్ 10న శుద్ధ శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన రాఘవాచారి ఆ చాదస్తాన్నైతే వదిలించుకోగలిగారు కాని అంత చాదస్తంగా ఉండడానికి అవసరమైన నిష్ఠ కడదాకా అనుసరించారు. మార్క్సిస్టు భావజాలాన్ని జీర్ణించుకుని, ఆచరణలో ఆదర్శప్రాయంగా మెలగాలంటే నిష్ఠ అవసరం ఎంత ఉందో ఆయన జీవిత విధానాన్ని చూస్తే అర్థం అవుతుంది. వృత్తి రీత్యా రాఘవాచారి పత్రికా రచయితే కావచ్చు. నిజానికి ఆయన వృత్తి విప్లవకారుడు. నిజాయితీగా విప్లవకారుడిగా కొనసాగడం కష్టమే. నిష్ఠ లేకపోతే వృథా ప్రయాస కూడా. రాఘవాచారి జీవిత విధానాన్ని దగ్గర నుంచి చూసిన వారికి విప్లవ భావం జాలం ఉన్న వ్యక్తి అంత మృదుభాషిగా ఎలా ఉండగలరా అనిపించేది. ఆయన నోట ఎప్పుడూ తీవ్రమైన అభిప్రాయాలు, విస్పష్టమైన వాదనలు వినిపించిన సందర్భాలు ఉండేవి. కాని పరుషంగా మాట్లాడిన, గొంతు పెంచిన, అనవసర ఆవేశమో, ఆగ్రహమో ప్రదర్శించిన ఉదంతాలు మాత్రం ఎన్నడూ లేవు. తన అభిప్రాయాన్ని ఎంత ఖండితంగా చెప్పినా అది మిత్ర సమ్మితంగానే ఉండేది. గుండెల్లో విప్లవాగ్ని దాచుకుని అంత ప్రశాంతంగా మాట్లాడగలగడం ఆయనకే చెల్లింది. అందుకే ఆయన భావాలతో విభేదించిన వాళ్లు ఉండొచ్చు కాని వ్యక్తిగతంగా ఆయనను అభిమానించని, గౌరవించని వారు లేరు.

రాఘవాచారి చదివింది న్యాయశాస్త్రం. అందులో ఆయన స్నాతకోత్తర పట్టా (ఎల్.ఎల్.ఎం.) ఉన్నవారు. ఆ రంగంలోనే ఆయన కొనసాగి ఉంటే న్యాయవ్యవస్థలో నిస్సందేహంగా నిర్ణాయకమైన స్థితిలో ఉండేవారు. కారణాలు ఏమైతేనేమి ఆయన పత్రికా రంగంలో ప్రవేశించారు. ఇంగ్లీషు దినపత్రిక పేట్రియట్ కు, వారపత్రిక లింక్‌కు విలేకరిగా పని చేశారు. ఇంగ్లీషు పత్రికా రంగంలోనే కొనసాగి ఉంటే సి.వై. చింతామణి, కోటం రాజు రామారావు, మానికొండ చలపతిరావు వంటి ఉద్దండులు జాతీయ స్థాయిలో ఇంగ్లీషు పత్రికా రంగం వెలుగు దివ్వెలుగా నిలిచిన తెలుగువాళ్ల సరసన రాఘవాచారి పేరు కూడా చేరేది. కానీ కమ్యూనిస్టు పార్టీ ఆదేశం మేరకు ఆయన విశాలాంధ్ర విలేకరిగా పని చేశారు. ఆ తరవాత ఆ పత్రికకు సంపాదకుడిగా దాదాపు మూడు దశాబ్దాలు పని చేశారు. ఒకే పత్రికకు అంత సుదీర్ఘకాలం సంపాదకుడిగా కొనసాగినవారు మరెవరూ కనిపించరు. కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడం, డబ్బు సంపాదించడం లాంటి లక్ష్యాలు ఆయనకు ఉండి ఉంటే ఇంతకన్నా ఎక్కువే కీర్తో, డబ్బో సంపాదించగలిగేవారు. కానీ ఆయన కమ్యూనిస్టు పార్టీలో అత్యంత క్రమశిక్షణ గల వ్యక్తి గనక విశాలాంధ్రలోనే కొనసాగారు. అంతకన్నా మించి నమ్మిన సిద్ధాంతాన్ని ఎన్నడూ విడనాడలేదు. మార్క్సిజంలో ఆయన అభినివేశం, నిబద్ధత, అపారమైన విశ్వాసం ఆయన నిటారుగా నిలబడడానికి ఉపకరించింది.

విశాలాంధ్రలో కొనసాగినంత కాలం ఆయన తన సంపాదకీయాల ద్వారా, అడపా దడపా రాసిన వ్యాసాల ద్వారా ప్రజా పక్షపాత పత్రికా రచన అంటే ఏమిటో, ప్రత్యామ్నాయ పత్రికా రచన అంటే ఏమిటో నిరూపించారు. ప్రధాన పత్రికలన్నీ పాలక పక్షాలకు బాకాగా మారిపోవడం ఇటీవలి పరిణామం ఏమీ కాదు. పత్రికా రంగం పెట్టుబడి ప్రధానమైన వ్యవహారంగా మారినప్పటి నుంచీ ఇదే వరస. రాఘవాచారి పత్రికా రంగంలో చేరినప్పుడూ ఈ పరిస్థితి ఉంది. ఆ తరవాతా ఉంది. చుట్టూ చీకటి ఆవరించి ఉన్నప్పుడూ నిరుత్సాహపడకుండా, తన చేతిలో ఉన్న పత్రిక చిన్నదా పెద్దదా అని ఆలోచించకుండా పత్రికను ప్రజల గొంతుకగా ఎలా ఉండాలో నిర్దేశించే ప్రత్యామ్నాయ పత్రికా రచన మార్గాన్ని తుదకంటా కొనసాగించడమే ఆయన విశిష్టత. పత్రికలు పెట్టుబడికి ప్రతిరూపాలుగా మారాయని నిందించడం వల్ల ఇప్పుడు ప్రయోజనం లేదు. పత్రికారంగం పరిశ్రమగా మారిపోయిన తరవాత భారీ పెట్టుబడులు, లాభార్జన ప్రధానం

**పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి**

కావడంలో ఆశ్చర్యం లేదు. పత్రికాధిపతులకు ఈ రంగం వ్యాపారం కావచ్చు. కానీ పత్రికా రచయితలకు తాము చేసే పని వ్యాపారం కాదు. కాకూడదు. ఈ చైతన్యంతో పని చేసే పత్రికా రచయితలు పరిశ్రమలుగా మారిపోయిన పత్రికల్లో పని చేసినా ప్రత్యామ్నాయ పత్రికా రచన ఆవశ్యకతను గుర్తించి, ఉన్న పరిమితుల మేరకు ఆ మార్గంలో నడవడం అసాధ్యమైతే కాదు. రాఘవాచారి పని చేసిన పత్రికల స్వభావమే ప్రత్యామ్నాయ పత్రికా రచన. ఆ దారిలోనే ఆయన నడిచారు. కానీ ఆ పని ఆదర్శ ప్రాయంగానే కాదు, భావి తరాలకు బాట చూపే రీతిలో వ్యవహరించడం రాఘవాచారి లాంటి కొద్ది మందికే సాధ్యం.

ఆయన పాండిత్యం, జ్ఞాన సంపద ప్రత్యక్షంగా మనకిక అందుబాటులో ఉండవు. అయితే ఆయన తాత్విక ధోరణి ఎప్పుడూ స్ఫూర్తిదాయకంగానే ఉంటుంది. రాఘవాచారి జ్ఞానాన్ని, జ్ఞాపక శక్తిని, పాండిత్యాన్ని తలుచుకుని మురిసిపోవడం కాదు. ఆ మార్గంలో నడవడానికి ఏ మేరకు కృషి చేయగలిగినా ఆయన మీద నిజంగానే అభిమానం ఉన్నట్టు లెక్క.

విశాలాంధ్ర సంపాదకుడిగా ఉన్నంత కాలం ఆయన సంపాదకీయాలే ఎక్కువగా రాశారు. సమకాలీన అంశాలపై రాసిన వ్యాసాలు చాలా తక్కువ. ఒక వేళ ఆ పని చేసి ఉంటే ఆయన ప్రతిభ సంపాదకీయాలకు పరిమితం కాకుండా భవిష్యత్ తరాల వారికి బాగా ఉపకరించేది. చాలా సార్లు ఆయనతో ఈ మాట అన్నాను కూడా. చిద్విలాసంగా నవ్వి "ఐ యూజ్ మై టాలెంట్స్ ఎల్స్ వేర్" అనే వారు. తన ప్రతిభను వ్యక్తీకరించడానికి ఆయన ఎన్నుకున్న మార్గం ప్రసంగాలు. వాటితో ఆయన తీరిక లేకుండా ఉండేవారు. బెజవాడలో ఆయన లేని సమావేశాలు అరుదు. అవి జ్ఞానదాయకంగా ఉన్న మాట వాస్తవమే. కానీ వాటిలో ఆయన చెప్పిన అంశాలు రికార్డులకు ఎక్కకుండా పోయాయే అనే బాధ మిగిలే ఉంటుంది. ఆయన అభిప్రాయాలను రికార్డు చేయడానికి ఎంతమంది ఎన్ని సార్లు ప్రయత్నం చేసినా ఆయన అంగీకరించలేదు. ప్రెస్ అకాడమీ రికార్డు చేసిన ఆయన అనుభవాలు మాత్రం ఉన్నాయి.

ఆలోచనలో అపారమైన స్పష్టత, దానికి తగ్గ వాగ్ధార, పాండిత్యం రాఘవాచారి బలం. ఆయన జ్ఞాపకశక్తి నిరుపమానమైంది. ఏం చెప్పాలన్నా అలవోకగా చెప్పేసే వారు. ఆయన గొప్ప పత్రికా రచయిత అని పొగిడే వారికి కొదవ లేదు. ఆ రంగంలో ఆయన ప్రస్తుత తరానికే కాదు తన తరంలోని వారికీ గురుతుల్యుడే. ఉన్నత స్థానాల్లో పని చేసిన పత్రికా రచయితలు ఆయన డిక్టేట్ చేస్తే రాసుకుని తమ ఉద్యోగాలు కొనసాగించిన వారే. హైదరాబాద్‌లో ఆయన పని చేసినంత కాలం ఆయన డిక్టేషన్‌తో పత్రికా రచయితలుగా వెలిగిపోయిన వారు చాలా మందే ఉన్నారు. ఇది ఆయా పత్రికా రచయితల అర్భకత్వమని భావించనక్కర లేదు. అది అసామర్థ్యం కన్నా రాఘవచారికి ఉన్న అనితర సాధ్యమైన సామర్థ్యానికి మాత్రమే నిదర్శనం. ఆయన హైదరాబాద్‌లో పని చేస్తున్నప్పుడు జాతీయ స్థాయిలోని ఇంగ్లీషు దినపత్రికల విలేకర్లుగా ఉన్న కొందరికి ఆయన ఏ పత్రికకు కావలసిన రీతిలో ఆ పద్ధతిలోనే వార్త డిక్టేట్ చేసే వారు. వారిలో ఒకరిద్దరు సజీవంగా ఉన్నారు.

సాహిత్య రంగంలో రాఘవాచారి కృషి లిఖిత రూపంలో వ్యక్తం అయింది తక్కువే కాని ఒక సందర్భంలో అభ్యుదయ రచయితల సంఘం మహాసభలను ప్రారంభిస్తూ ఆయన చేసిన ప్రసంగం రచయితలకు నిరంతరం మార్గదర్శకంగానే ఉంటుంది. ఆయనకు తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషలు తెలుసు. తెలుగు పత్రికా రంగంలో మేలి సంపాదకుడిగా ఆయనకు ప్రాశస్త్యం ఉంది. తెలుగు చాలా సూటిగా సరళంగా రాసేవారు. అయితే ఇంగ్లీషులోనే ఎక్కువ సునాయాసంగా రాయగలిగేవారు. ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు**

---

## సంపాదక శిఖరం, అజాతశత్రువు రాఘవాచారి

**(38వ పేజీ తరువాయి)**

సొంతం. ఆయనది అమృతవాక్కు. ఇంతటి విస్తారమైన అనుభవం, అపారమైన పరిజ్ఞానం కలిగిన రాఘవాచారిగారు సంపాదకీయాలకే పరిమితం కావడం విశేషం. కొంతమంది సంపాదకుల మాదిరి సంపాదకీయాలను గుదిగుచ్చి సంకలనంగా ప్రచురించడం ఆయనకు నచ్చదు. 'ఆ రోజు సంభవించిన పరిణామాలపైన అప్పటికప్పుడు చేసిన వ్యాఖ్య సంపాదకీయం. కొన్ని రోజుల తర్వాత దానికి విలువ ఉండదు,' అని చెప్పేవారు. ఆత్మకథ రాయాలనీ, భవిష్యత్తు తరాల జర్నలిస్టులకు మార్గదర్శనం చేయాలనీ నాతో సహా ఎంతో మంది ఎన్నిసార్లు చెప్పినా ఆయన అందుకు అంగీకరించలేదు. ఉపనిషత్తుల కంటే, రామాయణ, భారతాల కంటే గొప్పగా తన జీవితచరిత్ర ఉండబోదంటూ కొట్టి పారేసేవారు. టీవీలకు ఇంటర్వ్యూలు ఇవ్వడానికి సైతం ఇష్టపడే వారు కాదు. బహుకొద్ది ఇంటర్వ్యూలు ఇచ్చారు. కలుసుకున్నప్పుడు మాత్రం ఎంతసేపైనా మాట్లాడుతూ ఉండేవారు. దోసిళ్ళ కొద్దీ జ్ఞనామృతాన్ని దానం చేశారు. రాఘవాచారి గారి మృతి మీడియా ప్రపంచానికి తీరని లోటు. అటువంటి మానవతా మూర్తులూ, ప్రతిభాసంపన్నులూ, సరస్వతీ పుత్రులూ శతాబ్దాలకు ఒకరు జన్మిస్తారు. ఆయనకు ఇదే నా శ్రద్ధాంజలి. ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు,**
**ఆం.ప్ర. ప్రజావిధానాల సలహాదారు**

# నిరాడంబర మేధావి, నిబద్ధ సంపాదకుడు

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

**తెలకపల్లి రవి**

రాఘవాచారి గారు కన్ను మూశారన్న వార్త ఈ రోజు తెల్లవారుతుండగానే తెలిసింది. 'ఎంతటి జ్ఞానజ్యోతి ఆరిపోయింది' అన్న ఆంగ్ల వాక్యం అప్రయత్నంగా గుర్తుకు వచ్చింది. సామవేదాన్ని, సామ్యవాదాన్ని కూడా సాధికారికంగా చర్చించగల సవ్యసాచి ఆయన. ఆంగ్లమూ తెలుగూ సంస్కృతమూ అనర్గళంగా మాట్లాడ్డమే కాదు, ఉర్దూ కూడా తెలిసిన భాషావేత్త. మా విశాలాంధ్ర సంస్థలో కోహినూర్ వజ్రం అని దాసరి నాగభూషణరావు ఒకసారి ఆయనను అభివర్ణించారు. 'శ్రీ రాఘవం రఘుకులాన్వయ రత్నదీపం...' అన్నట్లే 'సీ రాఘవం అక్షరాశయ అరుణదీపం' అనొచ్చు. నేను ప్రజాశక్తిలో ప్రవేశించాక ఈ నలభయ్యేళ్ల పైగా గడిచిన ఈ కాలంలో ఎందరెందరో పాతతరం పెద్దలను, పిన్నలను కూడా కలిశాను. కలుస్తున్నాను. కాని సి.రాఘవాచారి వంటి జ్ఞాన సంపన్నుణ్ణి, నిరాడంబర మూర్తిని దాదాపుగా చూడలేదని చెప్పగలను. ఇన్ని వున్నా ఇనబింబం లాటి ఎర్రజండా నీడలోనే కడదాకా సాగడం ఆయన నిబద్ధతకు నిలువుటద్దం.

రాఘవాచారి గారు హైదరాబాద్ వచ్చే ముందు ఫోన్ చేయడం లేదా వచ్చాక మాట్లాడ్డం చాలా సార్లు జరిగేది. గతంలో వెంటబడి వేధించి ఇంటర్వ్యూ తీసుకున్న నేను ఈ సారి కెమెరాతో సహా తన అనుభవాలు నిక్షిప్తం చేయాలని నిరంతరం అడుగుతుండేవాణ్ని. ఇదిగో అదిగో అంటూ గడిచిపోయింది. కొద్ది రోజుల కిందట ఆస్పత్రిలో చేరారని కూడా తెలిసింది. ఇతర కారణాలతో పాటు మనం వెళితే ఎంతో కొంత శ్రమ పెట్టడమే కదా. ఒకింత మెరుగుపడతారేమోనన్న ఆశ ఆపేసింది. ఇంతలో ఈ విషాద వార్త.

1970వ దశకం చివరలో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం పునరుద్ధరణ సభలో మొదటిసారి ఆయనను చూశాను. కవితా శరధి దాశరథి కృష్ణమాచార్యులు అధ్యక్షత వహించగా జమున ప్రారంభించారు. దాశరథి మధ్యలో వెళ్లిపోవలసి రావడంతో నండూరి రామమోహనరావు అధ్యక్షత కొనసాగించారు. అప్పుడు మాట్లాడిన రాఘవాచారి గ్రంథాలయోద్యమం వీర తెలంగాణ పోరాటంలో దాని పాత్ర చైతన్య కేంద్రంగా ఈ గ్రంథాలయంలో జరిగిన కృషి వంటి విశేషాలు చెప్పారు. అంతే. ఆయన అభిమానిగా మారిపోయాను. మేమిద్దరం వెళ్లి బృందావన్ హోటల్‌లో కాఫీ తాగి కబుర్లు చెప్పుకున్నాం. నా రాతలు చూస్తున్నానని ప్రేమగా మాట్లాడారు. అప్పటి నుంచి ఆఖరి వరకూ ఆయన అంత అభిమానంగానూ ఉన్నారు. మాది కమ్యూనిస్టు కుటుంబమని తెలిశాక ఆయన అభిమానం ఇంకా పెరిగింది. నాన్న నరసింహయ్య ఆత్మకథ తనే తీసుకుని చదివి ఫోన్ చేశారు. ఎప్పుడూ అడిగేవారు. ఇక విశాలాంధ్ర ప్రజాశక్తి రెంటికీ సంపాదకులుగా సేవలందించిన మోటూరు హనుమంతరావు గారంటే ఆయనకు ఎనలేని గౌరవం. బొమ్మారెడ్డి గారిని పితామహులుగా ప్రస్తావించేవారు. సుందరయ్య, రాజేశ్వరరావు వంటి వారు గాని గురజాడ, శ్రీశ్రీ వంటి వారు గాని ప్రాతః స్మరణీయులన్నది ఆయనకు వూతపదం. ఎవరి గురించైనా, దేని గురించైనా నిర్దుష్టంగా నిర్వచించగల విజ్ఞాన సర్వస్వం ఆయన.

బోద్ధలగువారు మత్సర పూర్ణమతులు అంటూ భర్త్రహరి పండితులకు మత్సరం వుంటుందని అంటారు గాని రాఘవాచారిలో మచ్చుకైనా అలాటిది చూడలేదు. ఎవరి గురించి ఎప్పుడూ వివాదంగా వ్యాఖ్యలు చేయడం కూడా ఎరుగను. విమర్శనాత్మకంగా వుండరా అంటే తను నమ్మిన విధానాల విషయంలో రాజీ పడి ఎరుగరు. సమగ్ర అవగాహనతో సమతుల్యత పాటించడంలో ఆయన ఒక మార్గదర్శి. 1991–92లో మత శక్తుల పెరుగుదల తర్వాత మేము మరింత దగ్గరయ్యాము. కోదాడలో మిత్రులు సభ ఏర్పాటు చేసి విజయవాడ నుంచి సంపాదకులను ఆహ్వానించారు. ఆయన, నండూరి, పొత్తూరి నేను బయలుదేరి వెళ్లాము. వయసులోనూ అనుభవంలోనూ వారికీ నాకూ పోలిక లేదు. అయినా ఎంతగా ఆదరించారో చెప్పలేను. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా నేనున్న కాలంలో ఏ సమస్య వచ్చినా తప్పక పిలిచిన వ్యక్తి సిరా. పాత్రికేయ ఉద్యమానికి కూడా అలాగే గురుతుల్యులుగా వుండేవారు. నేను లా చదువుకుని కూడా సమాజ శ్రేయస్సు కోసం ప్రాక్టీసు చేయలేదని తన మీద తను ఎప్పుడూ జోక్ చేసుకునేవారు. ఒకసారి న్యాయవ్యవస్థపైనా బార్ కౌన్సిల్ వారు సదస్సు పెట్టారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రామమూర్తి వచ్చారు. ఆ తరుణంలో జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్ అన్నది అందరూ చెప్పారు. రాఘవాచారి మాత్రం జస్టిస్ హరీడ్ ఈజ్ జస్టిట్ బరీడ్ అంటూ మరో కోణం వివరించారు. ఇప్పుడు అదే అయోధ్య వ్యాజ్యం ఆఘమేఘాల మీద విచారిస్తుంటే రోజూ ఆ మాటలే అనుకుంటూ వచ్చాను. కరసేవ, కరసేవకులు అన్న

☞ మిగతా 48వ పేజీలో

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

# జర్నలిస్టులలో దీపధారి రాఘవాచారి

**ఎన్ వేణుగోపాల్**

**నివాళి**

ఎనభై సంవత్సరాలు నిండిన జీవితంలో అరవై సంవత్సరాల ప్రజా జీవితం, అందులో నలభై సంవత్సరాల పాత్రికేయ జీవితం గడిపి, విలువలతో, విద్వత్తుతో, విస్పష్టమైన దృక్పథంతో, ప్రపంచం పట్ల అపారమైన ప్రేమతో అజాత శత్రువుగా జీవించి సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మరణించిన చక్రవర్తుల రాఘవాచారి (సెప్టెంబర్ 10, 1939– అక్టోబర్ 28, 2019) జీవితమూ, కృషీ, ప్రవర్తన ఉదాహరణ ప్రాయమైనవి, ఆదర్శప్రాయమైనవి. పాత వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో సంపన్న భూస్వామ్య శ్రీవైష్ణవ కుటుంబంలో చక్రవర్తుల వెంకట వరదాచార్యులు, కనకవల్లి దంపతుల సంతానంలో చివరివాడుగా జన్మించిన రాఘవాచారి కుటుంబ ఆచారాన్ని అనుసరించి ఇంట్లోనే సంస్కృతం, ఉర్దూ, తెలుగు, తమిళం చదువుకున్నారు. మతాచార పరులైనప్పటికీ కుటుంబానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పట్ల సానుభూతి ఉండడం, గెరిల్లాలకు ఇంట్లో ఆశ్రయం ఇవ్వడం, సమీప బంధువు ఒకరు గెరిల్లాగా పనిచేస్తూ పోలీసు కాల్పుల్లో చనిపోవడం ఆయన తొమ్మిది, పదేళ్ల వయసు నాటికే కలిగిన అనుభవాలు. పాఠశాల విద్య హనుమకొండలో, పీయూసీ హైదరాబాదులో చదివి, బీఎస్సీ కోసం 1957లో వరంగల్ ఆర్ట్స్ కాలేజి చేరే నాటికే ఆయనలో వామపక్ష భావాలు బలపడ్డాయి.

అక్కడే కళాశాల విద్యార్థి సంఘం కార్యదర్శిగా కూడా ఉండి, ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం చదవడానికి వచ్చే సరికి ఆయన అప్పటి కమ్యూనిస్టు పార్టీ అనుబంధ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులయ్యారు. కులాచారపరంగా వేదాధ్యయనమూ ఉపనయనమూ జరిగి, తొమ్మిదో ఏటి నుంచి పద్దెనిమిదో ఏటి దాకా పూజా పునస్కారాలు చేసిన వ్యక్తే, జంధ్యం ధరించిన వ్యక్తే, ఒకటొకటిగా వాటన్నిటినీ వదిలేశారు. ఆ వదిలేయడం కూడా ఏదో ఉద్వేగం కొద్దీ కాదు, క్రమక్రమంగా అధ్యయనంతో దృక్పథం బలోపేతమవుతుండగా కమ్యూనిస్టుగా మారి 1960 నాటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అలా బ్రాహ్మణ భూస్వామ్య విలువల్లో పుట్టి పెరిగి, తనలో తాను సంఘర్షణతో, ప్రశ్నలతో, చర్చలతో, అధ్యయనంతో ప్రజానుకూల ప్రగతిశీల వామపక్ష అభిప్రాయాలు పెంపొందించుకుని కొత్త విలువల కమ్యూనిస్టు కార్యకర్తగా మారారు. ఆ విలువలతోనే అరవై ఏళ్లకు పైగా జీవించారు. ఉద్వేగంతో కొన్ని విలువలు ఏర్పడతాయి, కానీ అధ్యయనంతో వాటిని స్థిరపరచుకోవాలి అని ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పినట్టు ఈ ప్రయాణం సులభంగా సాగిందేమీ కాదు.

చదువుకున్న న్యాయశాస్త్ర విద్యతో న్యాయవాదిగా మారి ఉంటే ఏమై ఉండేవారో తెలియదు గానీ, డిగ్రీ రోజుల నుంచే సామాజిక విషయాల మీద రచన అలవాటు ఉండడంతో పత్రికా రచనలోకి వచ్చారు. పార్టీ చీలిక సందర్భంగా మోహిత్ సేన్, తానూ కలిసి రాఘవాచారిని న్యాయవాద వృత్తి ఆలోచన నుంచి తప్పించి విశాలాంధ్రలోకి తీసుకువచ్చామని సంస్మరణ సభలో కందిమళ్ళ ప్రతాపరెడ్డి అన్నారు. అలా ఆయన 1965లో విశాలాంధ్ర దినపత్రికలో విలేకరిగా చేరడం న్యాయవ్యవస్థకు జరిగిన నష్టమేమో గాని, తెలుగులో వామపక్ష పత్రికా రచనకు అందిన అద్భుతమైన కానుక. అప్పటికే ఆయనకు ఇంగ్లీష్ రచనలో కూడా ప్రావీణ్యం ఉండడంతో పేట్రియట్, లింక్ పత్రికలకు హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ కూడా కరెస్పాండెంట్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా జర్నలిస్టు ఉద్యమ నిర్మాణంలో పనిచేశారు. విశాలాంధ్ర దినపత్రికకు సంపాదకుడిగా 1972 నుంచి 2000 వరకు ఇరవై ఎనిమిది సంవత్సరాలు పని చేసి, అతి ఎక్కువ కాలం సంపాదకుడిగా ఉన్న ఏకైక వ్యక్తి అయ్యారు. ఈ ఇరవై ఎనిమిది సంవత్సరాలలో ఆయన రాసిన వేలాది సంపాదకీయాలతో పాటు, తీర్చిదిద్దిన పాత్రికేయులు వందల మంది ఉన్నారు.

విశాలాంధ్ర ఒక కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక గనుక పత్రికా రచన చరిత్రలో దానికి, సంపాదకుడిగా రాఘవాచారి గారికి దక్కవలసిన స్థానం దక్కకపోయినా, ఆయన వ్యక్తిత్వంలోని ఇతర ప్రభావశీల అంశాలు ఆయనను అపురూపమైన తెలుగు మేధావిగా నిర్ధారించాయి. ఆయన ఒక గొప్ప ఉపన్యాసకుడు. విషయం ఏదైనా, సభా నిర్వాహకులెవరైనా, కొన్నిసార్లు ఆయన భావాలను వ్యతిరేకించేవారైనా ఆయన ఉపన్యాసకుడిగా ఉండాలని కోరుకునేవారు. ఆయన ఉపన్యాసమంటే ఒక ప్రవాహంలా సాగేదేమీ కాదు, నింపాదిగా సాగుతున్నట్టే ఉండేది. కానీ హాస్యం, చమత్కారం, విద్వత్తు నిండిన ఆయన ఉపన్యాసం ఎంతసేపు

☞ మిగతా 45వ పేజీలో

# చేతికి వాచీ లేని మా ఎడిటర్

**మక్కెన సుబ్బారావు**

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

చేతికి వాచీలేని, సొంత వాహనం కనీసం స్కూటరైనా లేని జర్నలిస్టును ఊహించగలమా? విశాలాంధ్ర దినపత్రికకు 28 ఏళ్లపాటు సంపాదకునిగా పనిచేసిన కామ్రేడ్ సి.రాఘవాచారి నిరాడంబర జీవితానికి ఇవి మచ్చుతునకలు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే (బిషప్ హజరయ్య హైస్కూల్) చదివించిన నిబద్ధతా మూర్తి ఆయన. ఒక సబ్ ఎడిటర్‌ను క్రమశిక్షణా రాహిత్యానికిగాను సస్పెండ్ చేయవలసివచ్చినపుడు యాజమాన్యం తరపున సస్పెన్షన్ ఉత్తర్వు రాసిన చేత్తోనే, ఆ సహచరుని పక్షాన సంజాయిషీ కూడా రాసిచ్చిన సౌజన్యమూర్తి ఆయన. ఎడిటర్‌గా సంపాదక విభాగ పెద్దగా వ్యవహరించారే గాని ఏనాడూ దర్పానికి పోలేదు, అధికారం చెలాయించలేదు. ఉదయం 10 గంటలకు ఆఫీసుకు వచ్చి 11.30 కల్లా సంపాదకీయ రచన పూర్తిచేసి ఆఫీసుకు ఎదురుగా ఉన్న టీస్టాల్ కెళ్లి రోడ్డుమీదే నిలబడి టీ తాగి వచ్చే అసామాన్యుడాయన.

రాఘవాచారితో నా తొలి పరిచయం 1969లో. అప్పుడాయన ఢిల్లీ నుంచి వెలువడే పేట్రియట్ ఆంగ్ల దినపత్రికకు హైదరాబాద్ విలేకరి. నేను విశాలాంధ్ర అసెంబ్లీ సమావేశాల రిపోర్టింగ్ నిమిత్తం వెళ్లాను. ఆ తదుపరి 1971లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వం రాఘవాచారిని విశాలాంధ్ర సంపాదకునిగా నిర్ణయించి విజయవాడ పంపింది. అప్పుడు హైదరాబాద్‌లో విశాలాంధ్ర విలేకరిగా ఉన్న ఎ. ప్రభాకరరావును పేట్రియట్‌కు ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో విశాలాంధ్ర ముఖ్య విలేకరిగా నన్ను పంపింది. 1976లో న్యూస్ఎడిటర్‌గా నేను విజయవాడ కేంద్ర కార్యాలయానికి తిరిగి వచ్చిన దగ్గర్నుంచి 2000, జూన్ 22న ఆయన రిటైర్మెంట్ తీసుకునే వరకు సహచరుణ్ణి.

ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఎడిటర్ బాధ్యతల్లోకి రాగా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఆనాటి నుంచి 2014 ఆగస్టు దాకా రాఘవాచారి సంపాదక రచనా కలం నా చేతిని నడిపించింది. ఆయన స్ఫూర్తితోనే 'మన తెలంగాణ' పత్రికలో, ప్రస్తుతం విశాలాంధ్ర విజ్ఞాన సమితి సోదర సంస్థ నవ చేతన విజ్ఞాన సమితి నిర్వహిస్తున్న 'ప్రజాపక్షం'లో నా కలం యథాశక్తి పనిచేస్తున్నది. నా తదుపరి రాఘవాచారితో సుదీర్ఘ సహచర్యం గల జర్నలిస్టు కె. శ్రీనివాసరెడ్డి. రాజధాని హైదరాబాద్‌లో విశాలాంధ్ర ముఖ్య విలేకరిగా, ఎడిటర్‌గా, దేశవ్యాప్త గుర్తింపు పొందిన జర్నలిస్టు నాయకునిగా ఆయన ఎదగటంలో రాఘవాచారి ప్రోత్సాహం, మార్గదర్శకం ఎప్పుడూ ఉన్నాయి.

రాఘవాచారి జ్ఞాపకశక్తి అద్భుతం. విలేకరిగా ఆయనెప్పుడూ ఏవో కొన్ని పాయింట్లు నోట్ చేసుకోవటం తప్ప సుదీర్ఘంగా నోట్స్ రాసుకునేవారు కాదు. సంపాదకునిగా రెఫరెన్స్ బుక్స్ తిరగవేసేవారు కాదు. ఒకటి మాత్రం చెబుతుండేవారు. 'వాస్తవాలు పవిత్రమైనవి వ్యాఖ్య నీ యిష్టం'. ఇది జర్నలిస్టులకు శిరోధార్యం.

పుట్టింది, పెరిగింది, విద్యాబుద్ధులు నేర్చింది తెలంగాణ అయినా కోస్తాంధ్రలో ఆయన పేరు సుపరిచితం. ముఖ్యంగా ఓ రెండు దశాబ్దాల పాటు విజయవాడలో ఆయన వక్తగానో, ప్రేక్షకునిగానో హాజరు కాని సభ ఉండేది కాదు. రాజకీయ సభ అయినా, సారస్వత సభ అయినా, సంగీత కచేరీ అయినా, చివరకు చినజీయర్ స్వామి వంటివారి ఆధ్యాత్మిక సభ అయినా సరే. మన సిద్ధాంతం, విశ్వాసాల పట్ల మనకు చిత్తశుద్ధి ఉన్నప్పుడు, ఎవరిని కలిసినా ఫరవాలేదు. ఎదుటి వారిని మనం గౌరవిస్తే వారూ మనల్ని గౌరవిస్తారని అనేవారాయన.

బహుభాషా పరిజ్ఞానం, అపారమైన మేధస్సు ఉన్న మీరు విశాలాంధ్ర పత్రికకు ఎడిటర్ ఎందుకయ్యారు, ఢిల్లీ వెళ్లి ఉంటే గొప్ప ఇంగ్లీషు జర్నలిస్టుగా రాణించేవారు కదా అని రాఘవాచారిని ప్రశ్నించిన సహ పత్రికా సంపాదకులు లేకపోలేదు. ఆయన సమాధానం ఒక్కటే నేను ముందుగా కమ్యూనిస్టును. కాబట్టే విశాలాంధ్ర సంపాదకుణ్ణి అయినాను. పార్టీ అప్పగించిన బాధ్యత నెరవేర్చటాన్ని మించిన సంతృప్తి ఏదీ ఇవ్వదు.

ట్రేడ్ యూనియన్ నాయకులు కనపర్తి నాగయ్యగారి కుమార్తె జ్యోత్స్నను కులాంతర వివాహం చేసుకున్న రాఘవాచారి రాష్ట్రంలో మరెన్నో వందల వర్ణాంతర, ఆదర్శ వివాహాలు నిర్వహించారు. కుమార్తె డాక్టర్ డాలీకి ఆమె ఇష్టప్రకారమే వివాహం చేశారు. సిద్ధాంతాలను నమ్మటం వేరు ఆచరించటం వేరు. కాని నమ్మిన దాన్ని ఆచరణలో పెట్టిన ఆదర్శమూర్తి కామ్రేడ్ రాఘవాచారి. వారి కుటుంబ సభ్యులకిదే నా సంతాపం, సానుభూతి. ❑

**వ్యాసకర్త 'ప్రజాపక్షం' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**

# పెద్దమనసు "పేట్రియాట్"

మందలపర్తి కిషోర్

దాదాపు రెండు తరాల అభ్యుదయవాదుల కళ్ళు తెరిపించిన సి.రాఘవాచారి అక్టోబర్ 28 తెల్లవారు ఝామున కన్నుమూశారు. ఆయన అనారోగ్యంతో మూడు నాలుగేళ్లుగా అవస్థ పడుతున్నారు; రెండు మూడు వారాలుగా ఆస్పత్రిపాలైన రాఘవాచారి సోమవారం పొద్దుట కన్నుమూశారు.

"ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుం"దని కవిగారు అన్నారు. అది అందరి విషయంలో నిజం కాకపోయినా, "సి.రా." అనే కలంపేరుతో రాసిన సి.రాఘవాచారి గారి విషయంలో ప్రత్యక్షర సత్యం!

గొప్ప జర్నలిస్టుగా రాఘవాచారి ప్రతిభా పాటవాలకు – ఆయన మిత్రులు మాత్రమే కాదు, తద్భిన్నమయిన వారు సైతం– జోహారులర్పించడం కద్దు. "పేట్రియాట్", "లింక్" తదితర ఇంగ్లీష్ పత్రికలతో మొదలైన రాఘవాచారి పత్రికా రచన "విశాలాంధ్ర"తో సమగ్రతను సంతరించుకుంది.

ఇక సంపాదకుడిగా ఆయన సాధించిన ఘన విజయం ఒకటుంది. "విశాలాంధ్ర" పత్రికలో రాఘవాచారి ఎన్నెన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారు. సొదుం రామ్మోహన్, ఆర్వీయార్ మేస్టారు, డీవీవీఎస్ వర్మ, మానం ఆంజనేయులు (సంజీవి పేరుతో డాల్ఫిన్స్ నోట్ అనే కాలమ్ రాసేవారు!) తదితర కాలమిస్టుల్ని విశాలాంధ్రలో పరిచయం చేసిన విశిష్టత ఆయనదే. మల్లిక్ "టుమ్రీలు" మొదలైంది కూడా ఆయన సంపాదకత్వంలోనే అని గుర్తు. ఈ టుమ్రీలకు కొన్నాళ్ళు టీవీగారూ, కొన్నాళ్ళు మోహన్ కార్టూన్ బొమ్మలు వేశారు. సంస్కరణల పుణ్యమాని మా లాంటి కుర్రకారు పాఠకులు విశాలాంధ్ర ఫాలో అవడం మొదలైంది. డెబ్భై శతకం నాటికి ప్రధానంగా కార్మికులూ, కర్షకుల వాణిగా ఉండిన ఆ పత్రికకు "మధ్యతరగతి బుద్ధిజీవుల"లో ఆమోద యోగ్యతను సంపాదించి పెట్టిన సంపాదకుడు రాఘవాచారి గారు. మధ్యతరగతి బుద్ధిజీవులను కార్మిక కర్షకులకు మిత్ర వర్గంగా భావించే వాళ్ళు రాఘవాచారి సాఫల్యాన్ని ప్రశంసించడం సహజం. అందుకు భిన్నంగా ఆలోచించే వాళ్ళు కూడా, ఆ వర్గం కష్టజీవులకు దూరమై, వ్యతిరేకంగా పరిణమించకుండా చూడడంలో రాఘవాచారి పాత్రను ప్రశంసించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన విషయం.

"పాపం, ప్రతిభావంతుడైన రాఘవాచారి విశాలాంధ్ర పంజరంలో చిక్కి పత్రికారంగానికి పూర్తిగా ఉపయోగపడకుండా పోయాడు!" అంటూ సానుభూతి ప్రకటించే మిత్రశత్రువులను రాఘవాచారి ఎన్నడూ మన్నించలేదు. తాను వామపక్ష ఉద్యమంతో మమేకమై పనిచేసిన కారణంగానే, తన మూర్తిమత్వం అంతటి విశిష్టతనూ, ప్రజ్ఞనూ సంతరించుకోగలిగిందని రాఘవాచారిగారు తరచూ అనేవారు.

మంచి వక్తగానూ, సంభాషణా చతురుడుగానూ, పత్రికా ప్రపంచం పాలిట నడిచే విజ్ఞాన సర్వస్వంగానూ రాఘవాచారి సుప్రసిద్ధులు. ప్రత్యేకించి భారత రాజ్యాంగ చట్టం గురించీ, మన చట్టాల సారం గురించీ, న్యాయకోవిదులనిపించుకున్న వారి దృష్టికోణం గురించీ సోదాహరణంగా మాట్లాడగలిగే సామర్థ్యం రాఘవాచారి సొంతం. అన్నిటికీ మించి, తొలితరం కాకపోయినా మలితరం నాయకుడిగా పత్రికా రచయితల ఉద్యమాన్ని నిర్మించిన చరిత్ర రాఘవాచారి గారిది.

పుట్టింది వరంగల్ జిల్లా పాలకుర్తి దగ్గిరే అయినా, మేనమామల ద్వారా పశ్చిమగోదావరి జిల్లాపై మమకారం కలిగి వున్నా, విజయవాడతో రాఘవాచారి అనుబంధం విశిష్టమైంది. అది జర్నలిజానికి పరిమితమైంది కాదు. ముఖ్యంగా సీపీఐ అధికార పత్రిక "విశాలాంధ్ర"కే ఎంతమాత్రం పరిమితం కాలేదు. సభలూ సమావేశాల్లో – అరుదుగానే అయినా– అర్థవంతమైన చర్చ జరిగేలా చూసేందుకు రాఘవాచారి శక్తివంచన లేకుండా కృషి చేసేవారు. సభలనూ, సమావేశాలనూ నిర్వహించే పద్ధతిలో సమూలమైన మార్పు తీసుకొచ్చారాయన. వేదిక ఎక్కగానే జాతీయ అంతర్జాతీయ ప్రాంతీయ ఉపప్రాంతీయ సమస్యలన్నిటినీ కెలుక్కుని, ఏళ్ల తరబడి మాట్లాడే మైకాసురులకు కాలజ్ఞానం బోధించడానికి రాఘవాచారి జంకేవారు కాదు. పుస్తకావిష్కరణ సభల్లో తమ విజ్ఞాన సర్వస్వాన్నీ ఆవిష్కరించాలని తాపత్రయపడే అత్యుత్సాహులకు ఆయన కళ్లెం బిగించేవారు. దూర ప్రాంతాల్లో నివసించే నాగరికులపరంగా ఆలోచించి మాట్లాడమని – సరసంగానే అయినప్పటికీ– హెచ్చరించేవారు. ఫలితంగా ఒకప్పుడు పీడకల పాటిగా వుండే విజయవాడ సభలు యత్కించిత్ మానవత్వం సంతరించుకున్నాయి. ఇందుకు రాఘవాచారి గారికి విజయవాడ పౌరులు కలకాలం రుణపడి వుండాలి!

### పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

ముఖ్యంగా, డెబ్భై దశకంలో తెలుగు పత్రికలు చదవడం ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం ప్రారంభించిన మా తరానికి రాఘవాచారి గారు గొప్ప ఆదర్శంగా నిలిచారు. తెలుగు పత్రికల ప్రతిధ్వనులకే పరిమితం కాకుండా, మౌలికమైన ఆలోచనల కోసం ఏయే వనరులను సంప్రదించాలో సూచించే వారాయన. ఏయే నగరాల్లో ఏయే లైబ్రరీల్లో విదేశీ పత్రికలు దొరుకుతాయో ఓపిగ్గా వివరించేవారు. పాతకాలపు సాహిత్యాన్ని, ఎందుకు, ఎలా చదవాలో శ్రద్ధగా బోధించేవారు. అలాంటి రాఘవాచారి ఇక లేరనుకుంటే, బెంగగా అనిపించడం సహజం. "అబ్బే! మనం ఇలాంటివాటికి అతీతంగా ఉండాలోయ్!" అని రాఘవాచారి ఎప్పుడూ అనలేదు– అదే ఆయన విశిష్టత!

విశాలాంధ్ర సంపాదక బాధ్యత తీసుకున్న కొత్తలోనే రాఘవాచారి గారిని కలిశాను నేను. అప్పట్లో "జై ఆంధ్ర" ఆందోళన ముమ్మరంగా సాగుతోంది. రాఘవాచారి గారి లాంటి వాళ్ళు సదరు జై ఆంధ్రులని ఎప్పుడూ దుమ్మెత్తిపోసేవారు కారు. నిన్నటిదాకా మనతో ఉండి, హఠాత్తుగా జ్ఞానోదయమై ఇవాళే జైఆంధ్ర అంటూ గొంతు చించుకునే వాళ్ళను చూసి వాళ్ళు నవ్వుకునేవారు. నేను రాఘవాచారి గార్ని కలిసిన రోజున కూడా సంభాషణ అదే ధోరణిలో సాగుతోంది. అది చూస్తే నాకు మాత్రం ఉడుకుమోత్తనంగా అనిపించింది– అప్పుడు! కాస్త బుర్రమీద పెంకు గట్టిపడ్డ తర్వాత గానీ అందులోని ఔచిత్యం బోధపడలేదు. పనికిమాలిన వాళ్ళను పట్టించుకోవడంవల్ల మన శక్తియుక్తులూ, కొండొకచో ఆరోగ్యభాగ్యమున్నూ నష్టపోతాయి తప్ప అంతకు మించిన ప్రయోజనం శూన్యం. రాఘవాచారి గారి లాంగ్ లైఫ్ ఆదినుంచి తుదివరకూ లైవ్లీగా ఉండడానికి ఆయన సెన్స్ అఫ్ హ్యూమర్ ముఖ్య కారణం అనిపిస్తుంది! జర్నలిజం లాంటి వృత్తిలో దీర్ఘకాలం కొనసాగే వాళ్లకి ఒకింత సినిసిజం అలవడే ప్రమాదం ఉంది. రాఘవాచారి గారి నగుమోమును గుర్తు చేసుకుని ముందుకు పోవాలి!! ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు**

---

## జర్నలిస్టులలో దీపధారి - రాఘవాచారి

**(42వ పేజీ తరువాయి)**

సాగినా వినాలనిపించేట్టు ఉండేది. అది ఐదు పది నిమిషాల చిన్న ఉపన్యాసమైనా, గంటకు పైగా వివరంగా సాగే ఉపన్యాసమైనా అందులో ఇంగ్లీష్, ఉర్దూ, సంస్కృతం, తెలుగు సాహిత్యాల నుంచీ, సమాజం నుంచీ ఎన్నో ఉటంకింపులు ఉండేవి. ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నట్టు ఆయన జ్ఞాపకశక్తి విస్తారమైనది. ఉటంకింపులు షేక్ స్పియర్‌వి అయినా, కాళిదాసువైనా, మార్క్స్, లెనిన్లవి అయినా, గాంధీవైనా ఉపన్యాసం మధ్యలో, తెచ్చిపెట్టుకున్నట్టుగా కూడా కాకుండా, చాలా సహజంగా, అనివార్యంగా వచ్చినట్టుగా ఇమిడిపోయేవి. శ్రోతలకు తెలియని సమాచారం, తెలిసిన సమాచారంలోనే కొత్త కోణాలు, అతి సులభమైన, వివరమైన పద్ధతిలో ఉండేవి. అందువల్ల విజయవాడలో ఆయన ఉపన్యాసం లేకుండా జరిగిన సభలు అరుదు. ఆయన శ్రోతగా వచ్చి కూచున్నా మాట్లాడమని పిలిచిన సందర్భాలెన్నో.

అన్నిటికీ మించి ఆయన ఒక అద్భుతమైన మానవీయమైన మనిషి. అంత జ్ఞానసంపన్నుడై కూడా అత్యంత నిరాడంబరంగా, అందరితోనూ ఆప్యాయంగా ఉండేవారు. నడుస్తున్న గ్రంథాలయం గా, విజ్ఞాన సర్వస్వంగా పేరు తెచ్చుకుని కూడా కొత్త విషయాలు తెలుసుకోవాలని ఆసక్తి చూపేవారు. తనకన్న ముప్పై నలభై సంవత్సరాల చిన్న వారితో కూడా గౌరవంగా ప్రవర్తించేవారు. పూర్తిగా వ్యతిరేకమైన భావజాలం ఉన్న వారి నుంచి కూడా గౌరవాదరాలు పొందిన అజాతశత్రువు. నలభై సంవత్సరాలుగా నాకు తెలిసి ఆయన ఆహార్యం తెల్లని మల్లెపూవు లాంటి దుస్తులే. ఆహార్యంలో మాత్రమే కాదు ఆయన హృదయంలోనూ, మానవ సంబంధాలలోనూ అటువంటి స్వచ్ఛమైన మల్లెపూల సుగంధాన్నే నింపుకున్నారు. వందల సంపుటాల ఉద్గ్రంథం లాంటి జ్ఞాన సంపదను మల్లెపూల పరిమళంలా వ్యక్తిగత సంభాషణల్లోనూ, సభల్లోనూ వెదజల్లారు. ❑

**వ్యాసకర్త వీక్షణం పత్రిక సంపాదకులు**

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

# అర్ధ శతాబ్ది క్రితం – పత్రికా విలేఖరిగా రాఘవాచారి

పి.ఎ. రామారావు

మేధావి, అపారమైన జ్ఞాపకశక్తి గలవారు, బహుముఖ ప్రజ్ఞాశాలి, విశాల హృదయుడు, అయినా నిరాడంబరుడు, నిగర్వి, పరోపకారి, తన విద్వత్తును తొలివారితో పంచుకోవడంలో ఆనందించే వ్యక్తి – ఇవీ కీ॥శే॥ చక్రవర్తుల రాఘవాచారి గురించి, వారితో నాకు గల అయిదు దశాబ్దాల అనుభవంతో, చెప్పగల విషయాలు. రాఘవాచారి గారితో నా పరిచయం 1969 ప్రారంభం నుండి నేను దక్కన్ క్రానికల్ పత్రికలకు శాసనసభ, మండలిరిపోర్టింగు మొదలు పెట్టినప్పటి నుండి ప్రారంభ మయింది. అంతకు ముందే, కీ॥శే॥ బి. నాగేశ్వరరావు, టి.వి. కృష్ణ గారితో, అప్పుడప్పుడు రాఘవాచారి గారిని జర్నలిస్టుల యూనియన్లో కలుసుకోవడం తటస్థించినా, అది పరిచయంతో లెక్క కాదు.

> ***రాఘవాచారిగారు, సభలో జరిగింది జరిగినట్లు, ఏ విషయం వదిలి పెట్టకుండా, రిపోర్టు డిక్టేట్ చేసేవారు. ధారాళంగా, సునాయాసంగా, ఆయన రిపోర్టు చెపుతూ వుంటే, శాసనసభ కార్యాలయంలోనే, టైపురైటర్‌పై, నాలుగు కార్బన్ కాపీలు పెట్టి టైపు చేసుకుని, అందరూ తలొక కాపీ తీసుకుని, ఎవరికి కావలసిన రీతిలో వారు రిపోర్టు తయారు చేసుకునేవారు.***

రాఘవాచారి గారు అప్పట్లో (1969) విశాలంధ్ర, పేట్రియాట్ విలేఖరిగా శాసనసభ, మండలి సమావేశాలు రిపోర్టు చేస్తుండేవారు. ఆ రోజుల్లో కొన్ని వార్తా పత్రికలకు, వార్తా సంస్థలకు తెలుగు రాని కొందరు విలేఖరులుండేవారు. వారికే నా లాంటి కొత్తగా శాసనసభ రిపోర్టింగు మొదలు పెట్టిన వారికీ, రాఘవాచారి గారు ఒక గురువులాగా ఎంతో అండగా ఉండేవారు. ఏదైనా ముఖ్యమైన అంశాలపై సభలో సుదీర్ఘ చర్చ జరిగి, దానికి ముఖ్యమంత్రో, వేరే మంత్రో సమాధానం ఇవ్వడం జరిగితే, తెలుగు రాని విలేఖరులకు రిపోర్టు ఇవ్వడం సమస్యగా మారేది. వాళ్ళు రాఘవాచారి గారి సహాయం కోరేవారు. రాఘవాచారిగారు, సభలో జరిగింది జరిగినట్లు, ఏ విషయం వదిలిపెట్టకుండా, రిపోర్టు డిక్టేట్ చేసేవారు. ధారాళంగా, సునాయాసంగా, ఆయన రిపోర్టు చెపుతూవుంటే, శాసనసభ కార్యాలయంలోనే, టైపురైటర్‌పై, నాలుగు కార్బన్ కాపీలు పెట్టి టైపు చేసుకుని, అందరూ తలొక కాపీ తీసుకుని, ఎవరికి కావలసిన రీతిలో వారు రిపోర్టు తయారు చేసుకునేవారు. ఏ రిపోర్టరైనా, చాలా నెమ్మదిగా టైపు చేస్తుంటే, "రామారావ్, నువ్వు టైపు చెయ్యి" అని రాఘవాచారిగారు అనడం, నేను టైపు చేయడం అనేక సందర్భాలలో జరిగింది. ఇది వారి విశాల హృదయానికి, అవసరమైన వారికి సహాయం చెయ్యడం అనే వాటికి నిదర్శనం.

నా మటుకు నేను, ముఖ్యమైన అంశాలపై రిపోర్టు ఇవ్వవలసినప్పుడు, రాఘవాచారి గారిని, ఏ పాయింటులతో ప్రారంభించాలి (లీడ్) అనే విషయంపై సలహా తీసుకుంటూ ఉండే వాడిని. కొన్ని సార్లు నేను వెలిబుచ్చిన అభిప్రాయంతో ఏకీభవించి, రాఘవాచారి గారు బాగా ప్రోత్సహించేవారు. మరికొన్ని సందర్భాలలో, ఆ విషయం కాదు. ఈ విషయం హైలైట్ చేయాలనీ, దానికి గల కారణాలను విడమర్చి చెప్పేవారు. రాఘవాచారి గార్కి, తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు ఉర్దూ కూడా బాగా వచ్చు. ఉర్దూ పత్రికల విలేఖరులు కూడా రాఘవాచారి గారితో చర్చించి, ఆయన సలహాలను తీసుకున్న సందర్భాలు చాలా చూశాను నేను.

రాఘవాచారి గారు విజయవాడ వెళ్ళాక గూడా, నేను ఎప్పుడెక్కడికి వెళ్ళినా, ఆయనను కలుసుకుంటూ ఉండేవాడిని. యూనియన్ విషయాల్లో, కీ॥శే॥ కె. పూర్ణచంద్రరావు, నేను అనేక సార్లు రాఘవాచారి గారిని కలవడం జరిగింది. పూర్ణచంద్రరావు, రాఘవాచారితో మాట్లాడడమే ఒక ఎడ్యుకేషన్ అనేవారు. అది నిజమేనని నాకు అనుభవపూర్వకంగా తెలిసింది.

ఆయన చాలా సౌమ్యుడు. ఆయనకు కోపం రావడం కాని, ఎవరినైనా పరుషంగా మాట్లాడడం కాని, నేను చూడలేదు. ఇది ఆయన ఔన్నత్యాన్ని, సౌశీల్యాన్ని చాటుతుందనడంలో సందేహం లేదు. రాఘవాచారి గారు, బి. నాగేశ్వరరావు, టి.వి.కృష్ణ, డి.నరసింహారావు (సింహం) వంటి వారితో రాజకీయ, సాంఘిక విషయాలు చర్చించుకునేటప్పుడు వినడం ఒక విధమైన ఆసక్తి కరంగా ఉండేది. ఎన్నో కొత్త విషయాలు, కొత్త కారణాలు తెలిసేవి. ఆయన రాసిన సంపాదకీయాలు నేను చదవలేదనేది యదార్థం. అయినా ఆయన తెలుగు భాషాభివృద్ధికి దోహదం చేసిన సంపాదకులులో ఒకరని అందరికీ తెలిసిందే. రాఘవచారి గారి మరణం పత్రికా రంగానికి తీరని లోటనేది నిర్వివాదాంశం. ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు**

# పాత్రికేయుల శిక్షణలో రాఘవాచారి ఒరవడి

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

**డి. సోమసుందర్**

జర్నలిస్టులకు నిరంతర శిక్షణ అవసరమని గట్టిగా భావించిన సంపాదకులలో రాఘవాచారి ఒకరు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టు తనను తాను తీర్చిదిద్దుకోవలసిన అవసరాన్ని ఆయన అన్ని సందర్భాలలో నొక్కి చెప్పేవారు. విశాలాంధ్ర దినపత్రికలో అటువంటి ఒరవడిని పట్టుదలగా కొనసాగించారు. ఏడాదిలో రెండు సార్లు రాష్ట్రస్థాయి విలేకరుల సమావేశాలు నిర్వహించేవారు. మూడు, నాలుగు రోజుల పాటు నిర్వహించే అటువంటి సమావేశాలలో వృత్తిపరమైన మెళకువలను నేర్పేవారు. అటు భాషలో ఇటు వ్యక్తీకరణలో స్పష్టత కోసం రాఘవాచారి ప్రయత్నించేవారు. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండే విలేకరులను ఆయన ప్రోత్సహించేవారు. వారి అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని చిరునవ్వుతో భరించేవారు. సర్వజ్ఞులమని విర్రవీగే వారిని మాత్రం రాఘవాచారి క్షమించేవారు కాదు. సునిశితమైన వ్యంగ్యంతో, చమత్కారంతో చురకలు వేసేవారు. వార్తలు పంపడంలో వైఫల్యాలను సమర్థించుకోవడానికి చాలా మంది విలేకరులు తమకు గల పార్టీ బాధ్యతలను ఏకరువు పెట్టేవారు. మరికొందరు వాణిజ్య ప్రకటనలు, సర్క్యులేషన్ల లక్ష్యాలను సాధించినట్లు గొప్పగా చెప్పేవారు. 'అంతటి బహుముఖ ప్రజ్ఞ వున్నవారు, ఇతర రంగాల్లో రాణించడమే మేలని' రాఘవాచారి చమత్కరించేవారు. 'మీ అంతటి బహుపాత్రాభినయం మాకు కుదరదు' అని స్పష్టం చేసేవారు. పార్టీ నాయకులే విలేకరులుగా వుంటూ అటు పార్టీ పని, ఇటు విశాలాంధ్రపనీ ఎగ్గొట్టే వారి పట్ల రాఘవాచారి తీవ్ర అసహనం వ్యక్తం చేసేవారు. 'పార్టీలో మీరు చాలా పెద్ద నాయకులు. మీకు ఆదేశాలు ఇచ్చేంత పెద్దవాళ్ళెవరూ లేరిక్కడ' అనేవారు. అటువంటి వారిని ఉద్దేశించి తరచూ 'ఉభయభ్రష్టత్వం' అనే మాట వాడేవారు. విశాలాంధ్రలో 'రంగస్థలి' శీర్షికలో సంగీతం, నృత్యం వంటి కార్యక్రమాల సమీక్షలు వస్తూ వుండేవి. విలేకరిగా ఉంటూ పార్టీ నాయకత్వంలో వున్న ఒకాయన ఆ కాలమ్ అనవసరమని వాదించేవారు. లయవిన్యాసం, తన్యావర్తనం వంటి పదాలను ప్రస్తావిస్తూ 'మద్దెల ఎలా వాయించారో అంత వివరంగా పేరాలు, పేరాలు విశ్లేషించడం అవసరమా, మనకు స్పేస్ దండగ' అంటూ సదరు పెద్ద మనిషి ఒకసారి దబాయించారు. 'రోజువారీ పేజీలు, పేజీలు వచ్చే మన మద్దెల వాయింపుతో పోలిస్తే అదెంతలెండి' అంటూ రాఘవాచారి అనేసరికి ఆయన నోరు మూతపడింది. పార్టీ నేతల ప్రసంగాలు విశాలాంధ్రలో సుదీర్ఘంగా ప్రచురించడం పట్ల రాఘవాచారి తన అసంతృప్తిని చమత్కారంగా వ్యక్తం చేసేవారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామీణ విలేకరులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన రాఘవాచారి గారిదే. యూనియన్ నిర్వహించే శిక్షణా కార్యక్రమాలన్నిటికీ ఆయన తప్పనిసరిగా హాజరయ్యేవారు. యూనియన్ పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీని ఏర్పాటు చేసింది. అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ పాత్రికేయులకు, డెస్క్ సిబ్బందికి విస్తృతంగా శిక్షణా కార్యక్రమాలు జరుగుతూ వుండేవి. భారత రాజ్యాంగం, పత్రికా చట్టాలు, 'నైతిక విలువలు – ప్రవర్తనా నియమావళి' వంటి అంశాలను రాఘవాచారి బోధించేవారు. శిక్షణా తరగతుల్లో కొన్ని సందర్భాల్లో హాజరు పల్చగా వుండేది. కాని రాఘవాచారి క్లాసు మాత్రం నిండుగా వుండేది. ఆయన్ని వినడానికి పాత్రికేయులు ఇష్టపడేవారు. దానికి తోడు ఆయన వస్తున్నారని తెలిసి స్థానికులు కొందరు వచ్చి వినేవారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్ళినా రాఘవాచారికి అభిమాన శ్రోతలు వుండేవారు. శిక్షణా తరగతుల్లో ఆయన 'విశ్వరూప దర్శనం' జరిగేది. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని రాఘవాచారి సుబోధకంగా వివరించేవారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ ఆవిర్భవించిన పరిణామ క్రమాన్ని, అనంతర కాలంలో అది రియల్ ఎస్టేట్‌గా రూపాంతరం చెందిన క్రమాన్ని తనదైన శైలిలో వ్యంగ్యంగా, చమత్కారంగా విశ్లేషించేవారు. భావప్రకటనా స్వేచ్ఛలో పత్రికా స్వేచ్ఛ అంతర్లీనంగా ఇమిడి ఉందన్న అంశాన్ని సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించి చెప్పేవారు. దేశ, విదేశీ మేధావుల, రాజనీతిజ్ఞుల, తాత్వికుల, శాస్త్రవేత్తల వ్యాఖ్యలను సందర్భోచితంగా అలవోకగా ఉదహరించేవారు. ఆయన పాఠం ఒక సంవాదం మాదిరిగా కొనసాగేది. పౌరుల కంటే అదనంగా పాత్రికేయులకు హక్కులేమీ లేవని ఆయన స్పష్టం చేసేవారు. పాత్రికేయులకు బాధ్యతలే ఎక్కువని గుర్తు చేసేవారు. భావ ప్రకటనా స్వేచ్ఛతో పాటు రాజ్యాంగం ప్రస్తావించిన పరిమితుల గురించి పాత్రికేయులను హెచ్చరించేవారు. 'లోక కళ్యాణం పేరుతో తంపులు పెట్టే నారద యత్నం పురాణాల్లో చెల్లుతుంది కానీ, ప్రజాస్వామ్యంలో చెల్లదని' రాఘవాచారి చమత్కరించేవారు. జూట్‌ప్రెస్, ఎల్లో ప్రెస్ సత్యాలను సప్రెస్ చేస్తున్నాయని ఆయన విమర్శించేవారు. 'నిష్పాక్షిక పాత్రికేయం అనేది పాక్షిక సత్యం' మాత్రమేనని, దానికి పెట్టుబడి పక్షపాతం వుందనేది సంపూర్ణ సత్యమని రాఘవాచారి వివరించేవారు.

**పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి**

రాజ్యాంగ వ్యవస్థలలో ప్రవేశించిన పెడధోరణులను, పతన లక్షణాలను రాఘవాచారి ప్రస్తావించేవారు. రాజ్యాంగ బాధ్యతలలో వున్న పెద్దలను, న్యాయమూర్తులను, రాజకీయ నాయకులను నిశితంగా విమర్శించేవారు. వ్యవస్థలపై ఆయన తన ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నట్లే వుండేది కానీ, వ్యక్తులపై ద్వేషం వీసమంతైనా ఉండేది కాదు. మీడియాలో పోకడలను, యాజమాన్యాల పెడధోరణులను కూడా రాఘవాచారి విస్తారంగా ప్రస్తావించేవారు. 'విలువలు లేని రంగుల వలువలు' అంటూ ఎత్తి పొడిచేవారు. పెట్టుబడికి, కట్టుకథలకు పటిష్టమైన బంధం గురించి, నియంత్రణా రేఖలు చెరిగిపోవడం గురించి, లక్ష్మణ రేఖల పేరుతో ఆంక్షలు విధించే ప్రభుత్వాల గురించి రాఘవాచారి నిరంతరం సాలోచనగా మాట్లాడేవారు.

శిక్షణా తరగతుల సందర్భాలలో ఒక విశేషం ఉండేది. రాఘవాచారి క్లాసు వున్న రోజునే పాఠం చెప్పడానికి వచ్చే ఇతర రిసోర్సు పర్సన్లు ఆయన క్లాసును శ్రద్ధగా వినేవారు. తాము చెప్పేటప్పుడు రాఘవాచారి గారు క్లాసులో శ్రోతగా లేకుండా ఉంటే బావుండునని చాలా మంది అనుకునేవారు. తోటి సంపాదకులు సైతం ఆయన పట్ల అటువంటి గౌరవాన్ని, వినయాన్ని కలిగి ఉండేవారు. రాఘవాచారి నడయాడే విజ్ఞాన సర్వస్వం అనే మాట శిక్షణా తరగతుల్లో ఆయన్ని విన్న ప్రతి ఒక్కరూ గ్రహించేవారు. ఆయన్ని విన్న ప్రతీసారీ తమ స్థాయి ఎంతో కొంత పెరిగిందని ఎంతో మంది సీనియర్ పాత్రికేయులు అంటూ వుండేవారు.

గ్రామీణ పాత్రికేయులకు వేతన వ్యవస్థ లేకపోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేసేవారు. పైస్థాయి పాత్రికేయులకు మంచి వేతనాలు లభిస్తున్నప్పటికీ గ్రామీణ విలేకరులకు ఏ వేతనాలు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ మఫసిల్ జర్నలిస్టులను పత్రికా వ్యవస్థలోని ఎస్సీలుగా చూస్తున్నారంటూ ఎమ్.చలపతి రావు చేసిన వ్యాఖ్యను తరచూ ఉటంకించేవారు.

నేను విశాలాంధ్ర విలేకరిగా 28 సంవత్సరాలు పనిచేశాను. అందులో దాదాపు 24 ఏళ్ళ పాటు రాఘవాచారి గారే సంపాదకులుగా ఉన్నారు. రిపోర్టింగ్‌లో ఆయన నన్ను బాగా ప్రోత్సహించేవారు. ఇతర ప్రాంతాలకు కవరేజికి పంపించేవారు. విశాలాంధ్ర గురుకులంలో గురువు, బాస్ వంటి పదాలు లేవు. మాబోటి వారందరికీ ఆయన మార్గదర్శి, ఆత్మీయుడు, పితృతుల్యుడు. ❑

**వ్యాసకర్త పూర్వాధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజె**

---

## నిరాడంబర మేధావి, నిబద్ధ సంపాదకుడు

**(41వ పేజీ తరువాయి)**

పదాల గురించి మాట్లాడుతూ భయంకర సేవ అన్నారు. కరసేవకులు అన్న పదం ఎలా వచ్చిందంటే కింకరులు అన్న పదం గుర్తు చేశారు. మా సంభాషణల్లో ఇలాటివి నిరంతరం వచ్చేవి. నాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి వంటి విషయాలపై శాస్త్రీయ చర్చ చేశారు. (బహుశా ఈ సంచికలో దాన్ని పునర్ముద్రణ చేస్తున్నారు గనక మళ్లీ ఇక్కడ ప్రస్తావించడం లేదు) గతం పేరుతో మతం పేరుతో అవాంఛనీయ ధోరణులు పెరుగుతున్న ఈ రోజువాటిపై కూలంకషమైన అవగాహన కలిగిన రాఘవాచారి వంటి వారు లేకపోవడం పెద్ద లోటే. మూడు దశాబ్దాల పాటు విశాలాంధ్రకు సంపాదక సారథిగా వున్న రాఘవాచారి సంపాదకీయం నిడివి కంపోజిటర్ నిర్ణయిస్తారని ఎప్పుడూ చమత్కరించేవారు. రోజూ దాన్ని రాసి పెట్టి బయటపడేవారు. ఇక సభా సంచారమే. వయోపరిమితిని రాజకీయ తేడాలను అధిగమించి భిన్న తరాల తరగతుల వారితో కలిసి పోయిన స్నేహశీలి. వారి సతీమణి జ్యోత్స్న గారికి సభల నుంచి వేడుకలలో మాటలు ఆపి ఆయనను తీసుకుపోవడం పెద్ద సమస్యగా వుండింది. కాని ఎక్కడా ఆయన సున్నితత్వపు హద్దు మీరరు. పెద్దరికపు స్థాయి తగ్గరు. గిలిగింతలు పెట్టే వ్యంగ్యం అబ్బురపరచే అవగాహన తన సొంతం. అవన్నీ రాయమంటే రాసేవారు కాదు. శైలి వేరైనా సభలలో రాఘవాచారి సమగ్ర భాషణం, తుర్లపాటి కుటుంబరావు సమయస్ఫూర్తి నాకెంతో ప్రేరణనిచ్చాయి. మోటూరి స్మారక అవార్డు న్యాయ నిర్ణేతగా రాఘవాచారి శ్రద్ధగా బాధ్యత నిర్వహించేవారు.

తన షష్టిపూర్తి సభలో కొంత మంది మిత్రులు మాట్లాడుతూ ఆయన విశాలాంధ్రకే పరిమితమై వుండకపోతే మరెంతో గొప్పవారయి వుండేవారని అన్నారు. రాఘవాచారి ఆ మాటలతో నిర్ద్వంద్వంగా విడగొట్టుకున్నారు. కమ్యూనిస్టును గనుకనే ఇవన్నీ చేశానని చెప్పేవారు. ఆ ఆశయబలం గొప్పదనుకున్నారు గనుకే అధికారిక వ్యవస్థలలోనూ సంస్థాగతంగానూ కూడా ఎలాటి పదవుల కోసం పాకులాడలేదు. మార్క్సిస్టు అధ్యయనం మానలేదు. సాహిత్య మథనమూ ఆపలేదు. ఒక కుమార్తె విషాద మరణం తట్టుకుని తన నిరంతర అనారోగ్యం కూడా అధిగమించి కృషి కొనసాగించారు. ఈ సమయంలో ఆయనకిదే నా నివాళి. ❑

**వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు సాహితీ ప్రస్థానం**

# ఆయన ఎడిటర్... సంపాదకుడు కాదు

పాత్రికేయ ప్రముఖుల మాటల్లో.. రాఘవాచారి

**కొత్తపల్లి రవిబాబు**

ఎడిటర్ అనే ఇంగ్లీషు పదానికి అనువాదం సంపాదకుడు అని ఎవరు చేశారో గాని, అది సరైన, సమగ్రమైన అనువాదం కాదనిపిస్తుంది. సంపాదకుడు అంటే మేము రాసే రచనలను సేకరించే (సంపాదించే) వాడేగదా అనే రచయితలున్నారు. తాను సంపాదకునిగా ఉన్న పత్రిక ఆశయమేమిటి? ఎటువంటి శీర్షికలు దీనిలో ఉండాలి? ఏ పాఠకులనుద్దేశించి అవి ఉండాలి! ఎటువంటి భాష పండిత, ప్రజల భాష – ఆ రచనల్లో ఉండాలి? ఇలా ఎన్నెన్నో విషయాలపై అవగాహన సంపాదకునికి ఉండాలి. అంతే కాదు వచ్చిన రచనలను మెరుగుపర్చడం, నాణ్యత పెంచడం కూడా ఆయన కర్తవ్యమే. ఇలా ఎన్నెన్నో కర్తవ్యాలను నిర్వహిస్తూ పత్రికను సకాలంలో, సక్రమంగా ప్రచురించడానికి యజమానికి సహకరించే వారిని కేవలం 'సంపాదకుడు' అనడం సరైనదేనా?

ఒక రాజకీయ పార్టీ అధికార పత్రికగా ప్రారంభమైన 'విశాలాంధ్ర'ను, ఒక స్థాయి గల్గిన పత్రికగా ఉన్నతీకరించిన ఘనత సి.రాఘవాచారి గారిదే. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఒకే పత్రికలో పని చేయడం సాధారణ జర్నలిస్టులు ఊహించలేరు. అయితే రాఘవాచారి గారు కమ్యూనిస్టు సిద్ధాంతం, కమ్యూనిస్టు పార్టీని త్రికరణ శుద్ధిగా నమ్మారు గనుకనే, ఆయన మరో పత్రిక వైపు చూపు సారించలేదు.

వామపక్ష, ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక రంగాల గురించి దృష్టి కేంద్రీకరించి, 'విశాలాంధ్ర' సాహిత్య పేజీని తీర్చిదిద్దినా, అంతర్జాతీయ వామపక్ష ఉద్యమాలను తెలుగు వారికి పరిచయం చేసినా అది రాఘవాచారి గారికే చెల్లింది.

ఆయన నిజమైన పండితుడు గనుక ఎటువంటి అహంభావం లేని మనీషి. మనం చాలా సభలకు శ్రోతలుగా వెళ్తుంటాం. ఆ సభల్లోని ఉపన్యాసాల్లో మనం కొత్తగా నేర్చుకోవాల్సిన విషయాలేవీ ఉండవు. రాఘవాచారి గారి ఉపన్యాసం శ్రోతలకు ఒక విజ్ఞాన విన్యాసం. ఆయన లలిత కళలన్నిటిపైనా, సంప్రదాయ ప్రగతిశీల సాహిత్యంపైనా, సాంస్కృతిక ఉద్యమాల పైన అనర్గళంగా శ్రోతలను ఆకట్టుకునేట్లు ఉపన్యసించేవారు.

ఆయన ఒక నిరంతర విద్యార్థి, ఎవరైనా సరే చనిపోయే క్షణం వరకూ నేర్చుకోవాల్సిన జ్ఞాన సముద్రం ఈ ప్రపంచంలో వుంది. చలిగాలి పడకపోయినా, స్వెట్టర్ వేసుకొని, మఫ్లర్ తలకు కట్టుకొని జనవరి నెలలో 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు, విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో రాఘవాచారి గారు వక్తగా, శ్రోతగా ప్రత్యక్షమయ్యేవారు. కొందరు లబ్ధప్రతిష్టులు తాము వక్తగా వుండే సభలకు మాత్రమే హాజరై వుంటారు. రాఘవాచారి గారు అలా కాదు. శ్రోతగా సభకు హాజజరు కావడానికి ఏ మాత్రం సంకోచించేవారు కాదు.

ఎనిమిదేళ్ళ క్రితం వారి ఇంటికి వెళ్ళినప్పుడు తాను విద్యార్థి సంఘంలో పని చేస్తున్నప్పుడు, తమ విద్యార్థి సంఘ వ్యవహారాలను పార్టీ తరపున తరిమెల నాగిరెడ్డి చూసే వారని జ్ఞాపకం తెచ్చుకున్నారు. తనకు సహాధ్యాయులైన వరవరరావు, అంపశయ్య నవీన్‌లతో, నాకున్న పరిచయం గురించి ముచ్చటించుకున్నాం.

తెలుగు సంపాదకులు పలువురు తమ సంపాదకీయాలను పుస్తక రూపంలో ప్రచురించుకున్నారు. రాఘవాచారి గారి సంపాదకీయాలు కూడా వర్గీకరించి, వివిధ సంపుటాలుగా ప్రచురిస్తే భవిష్యత్తులో సంపాదకులకు ఉపయుక్తంగా ఉంటాయి. ❑

**వ్యాసకర్త జనసాహితి సంపాదకుడు**

పాత్రికేయ
ప్రముఖుల మాటల్లో..
రాఘవాచారి

# సమాజాన్ని ప్రభావితం చేసిన రాఘవాచారి

అరసవిల్లి కృష్ణ

జర్నలిజంలో విలువలు కలిగిన పాత్రికేయుడు, మూడు దశాబ్దాల పాటు విశాలాంధ్ర దినపత్రికకు సంపాదక బాధ్యతలు నిర్వహించిన చక్రవర్తుల రాఘవాచారి మరణం జీర్ణించుకోలేని విషాదం. రాఘవాచారిని దగ్గరగా చూసిన వాళ్ళకీ, అతని ఉపన్యాసాలు విన్నవారికీ, ఆయనతో పరిచయం ఉన్నవారికీ ఆయనలో గొప్ప మానవతా హృదయం అర్థమవుతుంది. ఏ విషయంపైనైనా అనర్గళంగా, ఆశువుగా మాట్లాడే ప్రజ్ఞ ఆయన సొంతం.

వరంగల్ తన పుట్టిన ఊరిలో సాహిత్యమిత్ర మండలి ద్వారా సాహిత్య అభినివేశం పెంచుకొని కాళోజీ నుంచి స్ఫూర్తి పొంది, అలాంటి చైతన్యాన్ని జీవితమంతా కొనసాగించిన ఆలోచనాపరుడాయన. అందుకనే జాన్సన్ చోరగుడి అన్నట్లు... రాఘవాచారి అంతిమయాత్రలో రెండు తెలుగు రాష్ట్రాల శ్రేయోభిలాషులు, మిత్రులు, సహచరుల నివాళి ఒక అరుదైన ఘట్టం. ఇది రాఘవాచారి విలక్షణతను తెలియజేస్తోంది. వరంగల్ ఆయన ఊపిరి పోసుకున్న నేల అయినా ఆయన జీవితం విజయవాడ నగరంలో ముడిపడి ఉంది. దాదాపు అయిదు దశాబ్దాల సృజనాత్మక ప్రయాణంలో సాంస్కృతిక, రాజకీయ పరమైన గుర్తింపు కలిగిన నగరంలో రాఘవాచారి నిర్వహించిన సాహిత్య సాంస్కృతిక భూమిక, నగర చలనశీలతతో మమేకమయిన తీరు, నూత్న సాంస్కృతిక ఆలోచనలకు కేంద్రమయిన వ్యక్తిగా రాఘవాచారికి గుర్తింపు లభించింది.


భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిర్వహిస్తున్న పత్రికకు సంపాదకత్వం వహిస్తూ... అణగారిన ప్రజలు, వారి ఆకాంక్షలు, వారి ఆశలు, అవి నెరవేరే క్రమంలో పాలక పక్షాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ తనదైన విశ్లేషణ, వ్యాఖ్య చేయడంలో ఆయనకు ఆయనే సాటి. సంపాదకీయమైనా, ఉపన్యాసమైనా... ఆయా సందర్భాలకనుగుణంగా పాలకపక్షాల దుర్నీతిని ప్రశ్నించడంలో ముందుండేవారు. అన్నింటికీ మించి ఆయన క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, పార్టీ ఆదేశాలను తూచా తప్పక పాటించేవారు.


నిజానికి రాఘవాచారి వ్యక్తిత్వంలో అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. సంస్కృత, ఇంగ్లీషు భాషలపై లోతయిన అవగాహన ఉన్నది. అదే సమయంలో సంప్రదాయ, ఆధునికతల మేళవింపునకు తగిన ప్రాధాన్యత ఇచ్చేవారు. అభ్యుదయ ఆలోచనలను ప్రోది చేసుకుంటూ కొత్త తరాన్ని విలువల చట్రంలో ఏవైపు నిలబడాలో తనే ఒక నమూనాగా నిలిచారు. సాహిత్యం, చరిత్ర, రాజకీయం, సైన్స్, సంగీతం... ప్రతి రంగంలోనూ ఆయన మంచి అవగాహన ఉన్న పాత్రికేయులు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్థంభం లాంటి పత్రికారంగం ప్రజల పక్షాన నిలవాలని చెప్పడమే కాదు, వృత్తిపరంగా, వ్యక్తిపరంగా ఆచరించి చూపారు. ఆయన వద్ద నేర్చుకోవాల్సిన అంశం... బహుముఖ విషయ పరిజ్ఞానం, ఎక్కడా ఆవేశపడని స్వరం, అదే సమయాన ఏదైనా విమర్శించాల్సిన సందర్భం వచ్చినప్పుడు చాలా సూటిగా స్పష్టంగా చెప్పే నిక్కచ్చితత్వం. ఆయన సమకాలీన రాజకీయ అంశాలపై చాలా గొప్ప విశ్లేషకుడిగా ఉండేవారు. వామపక్ష భావజాలంతో వస్తున్న విశాలాంధ్ర దినపత్రికను ప్రజల గొంతుగా తీర్చిదిద్దడంలో అత్యంత నిజాయితీతో వ్యవహరించారు. అధికార మార్పిడి జరిగి ఏడు దశాబ్దాల కాలం గడిచింది. సామాన్యులకు స్వేచ్ఛ, సమానత్వం అనేవి ఎండమావిగానే మారాయి. భారత స్వతంత్ర పరిణామ క్రమాన్ని, దాని చుట్టూ ఏర్పరచుకున్న అమానవీయతను ప్రశ్నించడంలో, విశ్లేషించడంలో రాఘవాచారి ముందు వరుసలో నిలుస్తారు. బ్రాహ్మణీయ, భూస్వామ్య మూలాల నుంచి వచ్చి వాటిని తృణప్రాయంగా తృణీకరించారు. జీవితాంతం ప్రజాస్వామిక భావనతో ఉండటం, అన్ని రకాల ఆధిపత్యాలను నిరసించి సామాన్యుని వైపు దృష్టి సారించడం, సంపాదకునిగా వ్యాఖ్యాతగా రాఘవాచారి చూపిన చొరవ తర్వాత తరానికీ, విలువలు చట్రంలో రూపొందుతున్న తరానికీ, సృజన, మేధో రంగాలలో కృషి చేస్తున్న వారందరికీ దారి దివ్వె. ఇటీవల కాలంలో ఎప్పుడు కలిసినా భీమాకోరేగాం కుట్ర కేసులో అరెస్టులు అయిన వారి గురించి అడిగేవారు. సాయిబాబా ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసేవారు. భిన్న దృక్పథాలు కలిగినవారైనా వరవరరావు నిర్బంధం గురించి మాట్లాడుతూనే ఒకనాటి వరంగల్ సాహితీ మిత్రమండలి సమావేశాలు, అందులో వరవరరావు కన్వీనర్‌గా చూపిన చొరవను గుర్తు చేసుకునేవారు. అక్రమ నిర్బంధంలో ఉన్న వారంతా విడుదల కావాలని ఆయన బలంగా కోరుకునేవారు.


ఒక జీవితకాలం పాత్రికేయ వృత్తిలో ఉంటూ కొన్ని విలువలు ప్రకారం జీవించిన రాఘవాచారి నేటి పాత్రికేయులకు మార్గదర్శి. ఇవాళ పాత్రికేయ ప్రపంచం రాఘవాచారికి నివాళి అర్పించడమంటే తమ వృత్తిలో మరి కొంత విలువలు చట్రంలో వారిగా ఉండటమే. పాత్రికేయత్వం నానాటికీ మసక బారుతున్నప్పుడు, వార్త వాణిజ్యపు సరుకుగా పరిఢవిల్లుతున్నప్పుడు రాఘవాచారి వంటి వ్యక్తుల జీవితం నుంచి స్ఫూర్తి పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇవాల్టి సంకుచిత సమయంలో బ్రాహ్మణీయ ఆధిపత్యం సవాల్ విసురుతున్న కాలంలో రాఘవాచారి వంటి వ్యక్తిత్వం కలిగిన పాత్రికేయ, సంపాదకతరం, భౌతికంగా దూరం కావడం ఒక ఖాళీని సృష్టించవచ్చు. అయితే ఈ ఖాళీలను పూరించడం వర్తమాన ఆలోచనాపరుల ముఖ్య బాధ్యత. ❑


వ్యాసకర్త విప్లవ రచయితల సంఘం కార్యవర్గసభ్యుడు




కవిత
2016








తి - విజయవాడ
19



# రాఘవాచారి సంపాదకీయాలు

సమాజంలో సగభాగమైన స్త్రీలు ఈనాడు ఈ మేరకైనా విద్యా విజ్ఞానాల్లో పురుషులతో బాటు అన్ని రంగాలలోను ముందంజ వేస్తున్నారంటేనూ, అతి బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం మున్నగు సాంఘిక దురాచారాలు వెనుక పట్టు పట్టినవంటేనూ, హేయమైన దేవదాసీ వృత్తి, భోగం మేళాలు నిలిచిపోయినవంటేనూ, ప్రజల భాషలో పత్రికలు, గ్రంథాలు విరివిగా వ్యాపించినవంటేనూ అందుకు తెలుగు జాతి వీరేశలింగం గారికి ఎంతో రుణపడి వుంది. ప్రజానీకంలో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ దృక్పథాన్ని హేతువాద దృష్టిని పెంపొందించి తద్వారా సామాజిక చైతన్యాన్ని విజ్ఞానాన్ని పెంపొందించడానికి వీరేశలింగం పంతులు గారు చేసినంత కృషి తెలుగు దేశంలో మరెవరూ చేయలేదు. వీరేశలింగం గారు తమ తుది పలుకులలో చెప్పినట్లు ఆయన ప్రారంభించిన సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవోద్యమాలు అసంపూర్తిగా నేటికీ నిలిచిపోయి ఉన్నాయి.

అనేక రూపాలలో స్త్రీల అసమానత్వం, అనర్హతలు సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. వరకట్నాల వంటి దురాచారాలు స్త్రీల జీవితాన్ని అధోగతి పాల్జేస్తూనే ఉన్నాయి. కుల, మతతత్వాలు ప్రజలను తప్పుదోవల్లోకి ఈడ్చుతూనే ఉన్నాయి. శాస్త్రీయ విజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందినా, "ఆధునిక" మూఢనమ్మకాలు, హేతుబాద విరుద్ధ పోకడలు, మత మౌఢ్యం కొనసాగుతూనే ఉన్నాయి. బాబాలు, స్వాముల వార్లు, యోగులు గారడీ విద్యలతో ప్రజలను మోసగించుతూనే ఉన్నారు. ఆర్ష సంస్కృతీ పునరుద్ధరణ పేరిట కాలదోషం పట్టిన సనాతనాచారాలను, వర్ణ వ్యవస్థను పునరుద్ధరించే రివెజవలిస్టు ఉద్యమాలు తలెత్తుతున్నాయి. పీఠాధిపతులు, మతాధిపతులు ఆర్థిక సాంఘిక విప్లవాల్ని అడ్డం కొట్టడానికి కాషాయబట్టలు, కమండలములతో రంగప్రవేశం చేస్తున్నారు.

ఒక్క మాటలో నేడు రాజకీయ రంగంలో మితవాద శక్తుల మహత్తర కూటమి విప్లవ ప్రతిఘాట విజృంభణ వలెనే సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రతీప శక్తులన్నీ మాయలతో, మారుపేర్లతో, పలాయనవాద ధోరణులతో విజృంభించి ప్రజలను తిరోగమన మార్గం పట్టించి, పరోక్షంగా స్వార్థపర వర్గాల ప్రయోజనాలను నెరవేర్చుతున్నారు. సాంస్కృతిక పునరుజ్జీవనను, జాతీయ పురోగమనాన్ని అడ్డం కొడుతున్నారు. సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో ఈ తిరోగమన శక్తుల విజృంభణను ఎదుర్కోవడమే ఆయన చూపిన పట్టుదల, నిర్భీకత, దీక్షా దక్షతలను ప్రదర్శించడమే. సమరశీల విధానాలను అనుసరించడమే. నేడు ఏప్రిల్ 16న ఆయన 125వ జయంత్యుత్సవ సమయంలో వీరేశలింగం మహనీయునికి నిజమైన దివ్య సంస్మరణ కాగలదు.

**– ఏప్రిల్ 16, 1973 సంపాదకీయం నుంచి**

పోతన వ్యక్తిత్వం, సాహిత్య జీవితం నుంచి మనకు సంక్రమించినట్టి, కాలదోషం పట్టని నీతి సూత్రసారమిదే; నిరంకుశత్వమది ఏ రూపంలో వున్నా, లొంగుబాటు మాని తిరుగుబాటు జరపాలన్నదే ఈనాటి సత్కవులకు ఆయన ఉపదేశం. సత్తా వుండి, అవకాశాలొచ్చివారు చూపే తాగ్యవీరానికే విలువ; ఆ రెండూ వుండి తనకయిష్టమైన పనిని ప్రభువు కన్నెర్ర చేసినా, కత్తులు ఝుళిపించినా, ధనకనక నారీజన వస్తు విలాసాది ప్రలోభాలెన్ని, చూపినా త్రోసిరాజని చేయనివాడేసుకవి. అట్టి సుకవితా రాజ్యమే మేలని సాధారణ సామ్రాట్టులను ఛీయని కసిరికొట్టిన పోతన నుండి ఏ మాత్రం స్ఫూర్తి పొందగలిగినా ఈనాడు ఆయన మనవాడని చెప్పుకోవడంలో అర్థం వుంది. లేకపోతే అలాంటి 'కలదు కలందను వాడు కలడో లేడో' అన్న సందేహ వ్యాకులతే ఈ ఉత్సవాల శేషంగా దక్కేది!

పోతన ఎక్కడివాడన్న పండిత నైజమైన మీమాంసతో నిమిత్తం లేకుండా మొత్తంగా తెలుగుజాతి సార్వజనీన సమాదరణకు పాత్రమైనదాయన భాగవతం; సమస్తాంధ్రుల సౌభాగ్య పరిపాకంగా యింకా భాసిస్తుండటానికి వస్తుపరమైన భక్తి మాత్రమే గాక తెలుగు మాగాణపు పలుకుబడుల నిండుతనం తొణికిసలాడే మందార మకరంద నిష్యందతుల్యమైన ఆయన శైలి మాధుర్యం అంతే ప్రబల కారణం. డిండిమభట్టుల కంచుఢక్క మ్రోతల్లో పాండిత్యపరమైన ఆక్షేపణలూ, ఈసడింపులూ వున్నా అక్షరాలు రాని పామరజన కోటి తలలో నాల్కలైన ఆయన పద్యాలకు ప్రాచుర్య భంగం కలుగని రహస్యమూ అదే. రాచరికపు నిరంకుశత్వాన్ని ఎదిరించేందుకు "ఎవ్వనిచే జనించు..." వగైరా సవాలక్ష సందేహాలున్నా ఆ భగవద్భక్తిని పోతన సంకేతంగా సాధనంగా వినియోగించారు. మరి ఆ నిరంకుశత్వాన్ని పెంచే భక్తి ధోరణి ఈనాటి భారత రాజకీయ జీవనంలో అతిశయిస్తున్నది.

ఈ పరిస్థితుల్లో పోతన చూపిన తిరుగుబాటు మార్గాన్ని అన్వయించుకొని ఆచరించడంలోనే ఈ యుగ సామాజిక ధర్మ పరిరక్షణకు సరియగు చైతన్యాన్ని ఆయన వారసులు పొందగలుగుతారు. పోతనతో పునాతమైన ఆ మండలానికే చెందిన నరసింహారావు గారి లాంటి వారి వారసత్వ ప్రవచనాలకూ నిండుతనం సమకూడుతుంది. ఈ భావదీప్తికీ, చైతన్య ప్రదీప్తికీ పోతన పంచశతి ఉత్సవాలు దోహదకారి కాగలవని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తూ వాటి విజయాన్ని ఆకాంక్షిస్తున్నాం.

**– ఏప్రిల్ 16, 1982 సంపాదకీయం నుంచి**

శాస్త్రీయ విజ్ఞాన రంగంలో, మినుమిక్కిలి రోదసీ విజ్ఞానంలో భారతీయ శాస్త్రజ్ఞులు సాంకేతిక ప్రావీణులు సాధించిన ఈ విజయానికి మహత్తర ప్రాధాన్యత వుంది. ఇది స్వతంత్ర భారతదేశం తన ఆర్థిక, పారిశ్రామిక వైజ్ఞానిక రంగాలలో స్వావలంబన దిశగా సాధించగలుగుతున్న పురోగతిలో ఒక మైలురాయి. ఒక మహోజ్వల చిహ్నం భారతదేశం నేడు శాస్త్రజ్ఞుల, సాంకేతిక ప్రవీణుల, వైజ్ఞానిక పరిశోధకుల సంఖ్యలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. రష్యా, అమెరికాల తరువాత భారత దేశంలో ఉన్నత మంది శాస్త్రజ్ఞులు, సాంకేతిక ప్రవీణులు, విజ్ఞాన పరిశోధకులు మరే దేశంలోనూ లేరు. ఇది నిజంగానే స్వతంత్ర భారతావనికి గర్వకారణం.

శతాబ్దాల తరువాత తిరిగి భారతదేశం శాస్త్రీయ విజ్ఞాన రంగంలో సాధించుతున్న పురోగమనానికి ఇది తార్కాణం.

వర్షాల కోసం కప్పలను వూరేగించుతున్న ఉదంతాలను, అభిషేకాలు, పూజలు, పునస్కారాలు జరిపించుతున్న స్థితిని, "అష్ట గ్రహకూటములకు" హడలిపోయే స్థితిని, మంత్రాలు, మహిమలు, యజ్ఞాలు, యాగాల ద్వారానే సకల విధ సౌభాగ్యాలను, సంపదలను పొందాలనే గుడ్డి నమ్మకాలు విద్యాధికులలో సైతం వ్యాపించి ఉన్న స్థితిది. చివరకు అందుకు క్షుద్ర దేవతల పూజలు, తాంత్రిక విద్యలు, నరబలులు కూడా సాగించే పరమ దౌర్భాగ్య స్థితి – ఈ దేశంలో ఇంకా కొనసాగుతున్న విషయాన్ని విస్మరించ లేము. మత మౌఢ్యాన్ని, అంధ విశ్వాసాలను పునరుద్ధరించి దేశాన్ని మళ్లీ మధ్యయుగం నాటి అంధకారంలోకి తిరోగమింప జేసే ప్రతీప ధోరణులు ఇటీవల పెచ్చు పెరుగుతున్న దుస్థితినీ విస్మరించలేము.

మన పాదాలు – పురాణ యుగంలో, మన శిరస్సు – రోదసీ యుగంలో ఉన్న పరస్పర వైరుధ్య స్థితినీ రోహిణీ ఉపగ్రహ ప్రయోగం మనకు జ్ఞాపకం చేస్తున్నది. రోహిణి ఉపగ్రహం అజ్ఞానానికి – విజ్ఞానానికి మధ్య జరుగుతున్న నేటి సంఘర్షణకు చిహ్నం. భూమ్యాకర్షణ పరిధిని 'రోహిణి' జయప్రదంగా ఛేల్చుకొని అధిగమించినట్లే, నేటి మతమౌఢ్యాన్ని, అజ్ఞానాంధకారాన్ని ఛేల్చుకొని అధిగమించి శాస్త్రీయ విజ్ఞాన దృక్పథం పురోగమించ గలదని ఆశించుదాం.

**– జూన్ 3, 1981 సంపాదకీయం నుంచి**

## ఈ సన్మానం సంగీత సరస్వతిది

నాదం విశిష్టమైన జీవనవేదం, గళం విమల గాంధర్వం, కళారాధన విలక్షణమైన తపోమార్గంగా వరించి జీవించి తరించిన ధన్యచరిత సంగీత కళానిధి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి. సప్తతి వత్సరాల సుదీర్ఘ సుమధుర సురుచిర రసనిష్యందమైన ఆపాత మధుర నిరంతర గానఝరిలో దేశవాసుల్నే కాక ప్రపంచ శ్రోతృగణాన్ని మంత్రించినట్లు సమ్మోహితుల్ని చేసిన అద్వితీయ ప్రతిభ ఆమెదైన అపురూప విలక్షణం. "మాణిక్యవీణా ముపలాలయంతీం" అని కవికుల గురువు కాళిదాసు అభివర్ణించిన మంజుల వాగ్విలాసం ఆమె నిసర్గగాత్ర సౌకుమార్యానికి అచ్చుమైన మధురోపమానం. భావ రాగ తాళ సమన్వయంతో రసికజన సహృదయాల్లో స్వాతిక గుణాన్ని ఏతామెత్తినట్లు అద్భుతంగా ఆవిష్కరింపచేయడంలో అంతకు మించిన గానోపసకురాలిని ఇప్పట్ల ఎం.ఎస్. తర్వాత వీరని వేలుమడిచి మరొకరిని చూపడం కష్టం. జయసంగత రసికే అన్నది ఆమె విజయ రహస్యం. పద్మసంభవ వైకుంఠ భర్గ సభలు సాముగాండీలు మాకు గోత్రామరేంద్ర అన్న అల్లసాని వారి అల్లిక జిగిబిగి వర్ణనకే కులుకు తెచ్చిన పలుకుల వెలది తోడ్పాటు విదుషీమణి సంగీత విద్వన్మణి సుబ్బులక్ష్మి. స్ఫూర్తిమంతమైన సంగీత రసజగత్ చైతన్యానికి మూర్తిమంతమైనది ఆమె వినయశీల సుశోభిత వ్యక్తిత్వం. సంగీతానికి ప్రాదేశిక సరిహద్దులు పడికట్టు స్వపర భేదాలు లేవని తన వైదుష్య విలాసంతో విశ్వపరివ్యాప్త విన్యాసంలో నిరూపించి నిండు జీవితం సంగీత సరస్వతి సేవలో పండించుకొన్న అకళంక తపస్వి. అనన్య సాధ్యమైన గాత్ర సౌలభ్యం, అద్భుతమైన శాస్త్ర ప్రావీణ్యం సమపాళ్ళలో రంగరించి గానకళా మాధ్యమం ద్వారా అసంఖ్యాత శ్రోతృ జనగణమన అధినేత్రిగా విరాజిల్లుతున్న విద్వన్నిధి ఎం.ఎస్. ఇంద్రజాలమో మరే మంత్రతంత్రమో ప్రభావితుల్ని చేసిందా అన్నట్లు శృతి శుభగత్వం వున్న వారందరూ యితర చేష్టలు వీడి తన గానంలో తనువులు మరచిపోయేటట్లు పరవశింపచేసిన సంగీత రసహేల సుబ్బులక్ష్మి శాశ్వత చిరునామా ప్రకృతికి ప్రతిభకు, వృత్తికి, ప్రవృత్తికి, కళకు – జీవితానికి నాన్యతో సదృశమైన అద్వైతసిద్ధి ఆమె జీవిత సారాంశం.

స్వర సంస్కారం, సమ్మోహన గాంధర్వం, సాత్విక భావ సమ్మిశ్రమైన, సంస్కృతి సంపద ఆమె అవిశ్రాంత నాదోపాసనా ఫలసిద్ధి. శ్రవణానందకరమైన సంగీతం, నయనానందకరమైన రూపం, భారతీయ మర్యాదలకు మారు రూపమైన వ్యక్తిత్వం వెరశి ముప్పేటగా ముచ్చటైన కలనేతగా సృజన సంతరించుకున్న సాధ్వీరత్నం ప్రస్తుతం భారతరత్నగా సమాదరింపబడిన సంగీత సర్వమంగళ, దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని సగౌరవంగా ఆమెకు అందజేసి సంగీత రసికులను ఆనందపరచి తాము ధన్యత నొందిన భారత ప్రభుత్వం బహుధా ప్రశంసలకు పాత్రం. ఇదసలు ఏనాడో జరగవలసింది – యిప్పటికైనా జరిగినందుకు సంతసించని రసిక హృదయం వుండదు! అది శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమైనా, విష్ణుసహస్రనామ కీర్తనమైనా, అమృతోపమ గుళికల మీరా భజనలైనా, కబీర్ దోహాలైనా ఆమె స్వర సంస్కారంలో అపూర్వమైన శక్తి సంతరించుకుని బండరాళ్ళను సైతం కరిగించగల పరశువేది ఆమె గాత్ర సౌలభ్యం. మాట ఆగినచోట మాట మొదలవుతుంది.

**(సంపాదకీయం 17-1-98)**

# అక్షర తపస్వికి అరుణాంజలి



విశాలాంధ్ర సంపాదకీయం

మహనీయులంతా వెళ్లిపోతే మన గతేంకాను? అంటూ నాడు బహదూర్ షా జఫర్ గజల్ పదాల్లో విలవిలలాడేడు. నేడు మన బాధా అదే గదా! మహా ప్రకాశవంతమైన ఒక తార రాలిపడిందన్నా. ఒక మేరువు విరిగిందన్నా, భూగోళం ఒరిగిందన్నా, హంస ఎగిరిపోయిందన్నా – ఏమన్నా ఉపమాన సామర్థ్యం చాలదు. అందుకే చక్రవర్తుల రాఘవాచారి కీర్తిశేషులయ్యారని చెబుదాం. దిశానిర్దేశం చేసే బహు పెద్ద, లక్షల మెదళ్లను కదిలించిన సి.రా.(చుక్క), తెలుగు పాత్రికేయాన్ని మార్క్సిజపు వెలుగులో ఎరుపెక్కించిన నిర్మల స్ఫటికాకృతి గల అక్షరరుషి కనుమరుగయ్యారు. ఆ గొంతు మన చెవుల్లో మార్మోగుతూనే ఉన్నది. ఆ అక్షరం మన కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నది. ఆయన ఒక తేజస్వి, వర్చస్వి, మనస్వి, అన్నింటికీ మించి ఉత్తమ కమ్యూనిస్టు. కార్డినల్ న్యూమన్ ఇచ్చిన 'జెంటిల్‌మన్' నిర్వచనానికీ, మన ప్రాచీనులు చెప్పిన 'వినయ సంపత్తి'కి ఆయన నిలువెత్తు ప్రతిరూపం. ఆయన బహుముఖ ప్రజ్ఞను, బహువిషయ పరిజ్ఞానాన్ని గురించి ఎంత చెప్పినా, రాసినా తక్కువే. ఆయనను స్మరించితే ఒక సాంస్కృతిక పరంపర గుర్తుకు వస్తుంది. దాని శిరస్సున చంద్రరేఖ వలె ధరించిన మార్క్సిస్టు భావజాలం కనిపిస్తుంది. ఆయనొక స్థితప్రజ్ఞుడు. ఆయన జీవితం పరిపూర్ణ జ్ఞానరాశి. ఆయన జీవితం నేటి తరానికి ఒక సందేశం. ఆయన ధృఢదీక్ష, అంకిత భావం తరతరాలకు చెరగని స్ఫూర్తి. వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి, లోకోత్తరాణాం చేతాంసి – లోకోత్తురుల మనసులు వజ్రం కంటే కఠినం, పూల కంటే సుకుమారం అన్నారు పెద్దలు. అవును అలాంటి వజ్రసంకల్పం, సుస్థిర లక్ష్యం తామేర్పరచుకున్న చక్కటి దారి తప్పవు. అలాంటప్పుడు వాటికే ప్రాధాన్యం కాని వైయక్తికమైన అనురాగాలకూ, అభిమానాలకూ, వైరాలకూ, విద్వేషాలకూ తావులేదు.. అందుకే తాను నమ్మిన దారిలో, నమ్మిన రీతిలో సూటిగా వెళ్లిపోవడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ చిత్తశుద్ధి అద్వితీయం, త్రికరణశుద్ధి అన్నది ఆయన విషయంలోనే అన్వర్థం. ఏ అంశంపైనైనా లోతైన విశ్లేషణ, పదునైన వ్యాఖ్యానం, తిరుగులేని సాధికారిత, నిబద్ధత, చక్కని స్నేహభావం, అతి సాధారణ జీవితం ఆయన విశిష్ట లక్షణాలు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, తమిళంలో ఆయనకు ప్రవేశమే కాదు, పాండిత్యమూ ఉంది. భారత రామాయణాల నుంచి మన ప్రాచీన సాహిత్యాన్నీ, యూరోపియన్ సాహిత్యాన్నీ, మార్క్సిస్టు గ్రంథాల నుంచి వివిధ దేశాల రాజ్యాంగాలను ఆయన ఆపోశన పట్టారు. సామవేదాన్నీ, సామ్యవాదాన్నీ సాధికారికంగా తర్కించగల సవ్యసాచి. ఆయా సందర్భాలలో అలవోకగా ఆయా అంశాలను వివిధ గ్రంథాల నుంచి ఉటంకించడం ఆయన ధారణశక్తికి నిదర్శనం. అందుకే ఆయనను నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం అని అంటారు. ఆయన అక్షరంలో, మాటలో అభ్యుదయ భావ పరంపర, కమ్యూనిజం సిద్ధాంత సారం నిక్షిప్తమై ఉంటుంది. 'నేను మొదట కమ్యూనిస్టును, ఆ తర్వాతే జర్నలిస్టు అయ్యాను' అని చెప్పేవారు. కాబట్టే ఆయన ఆలోచనలో, రాతలో, మాటలో ఇతరుల కన్నా భిన్నత్వం, సామాజిక దృక్పథం ప్రతిబింబించేవి. సిద్ధాంతం, ఆచరణరీత్యా ఆయన కమ్యూనిస్టు అయినా ఇతర సిద్ధాంతాలు, విశ్వాసాలను నమ్మే వ్యక్తులతో ఎంతో స్నేహంగా ఉండడం ఆయనకే చెల్లు. నొప్పించక, తానొవ్వక అన్నట్లు వ్యవహరించినా... తన అభిప్రాయాలు, విశ్వాసాలలో ఆయన ఏనాడూ రాజీపడకుండా వ్యవహరించారు. పేట్రియాట్ ఆంగ్ల పత్రికలో పనిచేశారు. 1972లో విశాలాంధ్ర సంపాదక బాధ్యతలు చేపట్టి మూడు దశాబ్దాల పాటు నిర్విఘ్నంగా కొనసాగించారు. ఇంత సుదీర్ఘకాలం తెలుగు పత్రికలకు సంపాదకులుగా ఉన్నవారు లేరంటే అతిశయోక్తి కాదు. పాత్రికేయుల వృత్తి ప్రమాణాలకే కాదు, వారి హక్కుల కోసం ఉద్యమించారు. ఏపీయూడబ్ల్యూజే నిర్మాణంలోనూ ప్రధాన కార్యదర్శిగా దాన్ని తీర్చిదిద్దడంలోనూ, అది సాధించిన విజయాల్లోనూ ఆయన పాత్ర చిరస్మరణీయం. పాత్రికేయులూ ఈ సమాజంలో భాగమే తప్ప భిన్నం కాదు, ప్రత్యేకం కాదు అని జర్నలిస్టులను ఆయన హెచ్చరించేవారు. వినయం, విచక్షణ, వివేచనతో పాత్రికేయులు మెలిగినప్పుడే రాణించ గలుగుతారని హితవు పలికేవారు. నేడు కొందరు పాత్రికేయుల వింత ధోరణి చూసినప్పుడు ఆయన మాటలు ఎంతటి అక్షర సత్యాలనేది అర్థమవుతుంది. పాత్రికేయుడు సమాజాన్ని అధ్యయనం చేయాలి, దానిలోని లోటుపాటులు ఎత్తిచూపుతూ సరిదిద్దేందుకు ఒక సాధనంగా మారాలంటారు. అంతేకానీ సమాజంపై పడి బతికే పాత్రికేయం.. వృత్తి విలువలను దిగజార్చుతుందని ఆయన నిర్మొహమాటంగా చెప్పేవారు.

వరంగల్లు జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో వరదాచార్యులు, కనకవల్లి దంపతులకు 1939 సెప్టెంబరు 10న సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆయన బీఏస్సీ, తర్వాత ఎల్ఎల్ఎం చదివారు. ధర్మశాస్త్రాధ్యయనం 'జూరిస్ ప్రుడెన్స్' అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ఇది చాలా కష్టమైన పాఠ్యాంశమైనా పట్టుదలగా దాన్నే ఎంచుకొని ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థి దశలోనే ఆయన కమ్యూనిస్టు భావజాలాన్ని ఆకళించుకున్నారు. ఉస్మానియా లా కళాశాల

విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించారు. బాల్యం నుంచే సాహిత్య, సాంస్కృతిక అంశాలపై ఆసక్తి గల ఆయన తన తొలి రచన వరంగల్ నుంచి ఎంఎస్ ఆచార్య నిర్వహణలో వెలువడే 'జనధర్మ' లో వెలుగు చూసింది. కాలేజీ రోజుల్లోనే క్రీడాభిరామంలోని ఓరుగల్లు వర్ణన వ్యాసం రాసి పలువురు పండితుల ప్రశంసలు అందుకున్నారు. మహాకవి శ్రీశ్రీ అంటూ ఆయన తన కాలేజీ రోజుల్లోనే విశ్లేషణాత్మకంగా వ్యాసం వెలువరించారు. ఆయన సంపాదకీయాల లక్ష్యం సామాజిక ప్రయోజనమే. అతిశయోక్తులు, సంచలనాలు, రెచ్చగొట్టే ధోరణులు, భయానక వాతావరణాన్ని సృష్టించే మాటలు, వ్యాఖ్యలు ఆయన సంపాదకీయాల్లో భూతద్దం పెట్టి వెదికినా కనిపించేవి కాదు. మనిషిలో ఆలోచన, వివేచన కల్పించడమే ఆయన సంపాదకీయాల ధ్యేయంగా ఉండేది. 1972 నుంచి 2000 వరకూ తెలుగు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య పరిమాణాలను గురించి చర్చించాల్సి వచ్చినా, విశ్లేషించాల్సి వచ్చినా... రాఘవాచారి సంపాదకీయాలను ప్రస్తావించకుండా సాధ్యం కాదు. శ్రమజీవుల పక్షాన నిలబడి అక్షరాగ్నులు సంధించడంలోనూ, కమ్యూనిస్టు సిద్ధాంతచర్చలోనూ, బూర్జువా ప్రత్యర్థుల దాడిని తిప్పికొట్టడంలోనూ, సంగీత నిధి ఎంఎస్ సుబ్బులక్ష్మిని స్మరించడంలోనూ, భక్తపోతన సాహిత్యాన్ని విశ్లేషించడంలోనూ... దేనిలోనైనా ఆయన సంపాదకీయాలు కొలబద్దలుగా నిలుస్తాయి. పత్రిక స్వేచ్ఛ, విలువలు, ప్రవర్తనా నియమావళి, సంస్కరణలు, పాలకుల ఆర్డినెన్స్‌లు, అవాంఛనీయ ధోరణులు, గుత్తాధిపత్య పోకడలపై ఆయన రాసిన సంపాదకీయాలు వెలకట్టలేనివి. పత్రికా స్వాతంత్ర్యం పేరిట యజమానులు చేస్తున్న అక్రమాలను ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు. ఫోర్త్ ఎస్టేట్‌ను రియల్ ఎస్టేట్‌గా మార్చుతున్న తీరుపై ఆయన పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎవరి నుంచి అవరోధం కలుగుతున్నది. వాటిని నివారించడం ఎలా అన్నది నిస్సందేహంగా కీలకమైన ప్రశ్నే. కానీ అంతే కీలకమైన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఏ ప్రజా ప్రయోజనాల సాధనకు వినియోగపడాలన్న ప్రశ్న కూడా ఉంది. ఈ అవగాహన లేకుండా పత్రికా స్వాతంత్ర్యంపై జరిగే చర్చల వల్ల పత్రికలు సాంఘిక పురోగమనానికి దోహదం చేయడంలో వాటి కర్తవ్యాల పరిపూర్తికి తగిన సమాధానం లభించదు అని ఆయన ఏనాడో స్పష్టం చేశారు. ఆయన సంపాదకీయాల్లో డొంకతిరుగుళ్లు ఉండవు. సూటిగా భావవ్యక్తీకరణ ఉంటుంది. ఆయన సంపాదకీయాలను Journey into worldగా పేర్కొనవచ్చు. రాఘవాచారి సంపాదకుడే కాదు, అంతకుమించి వక్త. ఆయన సభ ఉందంటే ప్రత్యేకంగా హాజరయ్యే వారి సంఖ్య ఉండేది. ఏ విషయం మీదనైనా, ఏ సందర్భంలో మాట్లాడినా అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా, చమత్కార యుతంగా ప్రసంగించడం ఆయన ప్రత్యేకత. ఆధ్యాత్మిక సభలకు వెళ్లినా ఎక్కడా తన విశ్వాసాలు,

**సంస్మరణ సంపాదకీయాలు**

సిద్ధాంతాల నుండి పక్కకు తొలగే వారు కాదు, అదే సమయంలో ఆ భావాలు ఉన్న వారిని నొప్పించే వారు కాదు, అలా అని తాను చెప్పదలచిన విషయాన్ని చురుక్కుమనేలా అంటించేవారు. అరవిందుని సావిత్రి గురించి ఎంత ఆశువుగా మాట్లాడగలరో ఆంగ్లికన్ జ్యూరిస్ ప్రుడెన్స్ గురించి అంతే అనర్గళంగా విశదీకరించగలరు. రాజకీయాలు, రాజ్యాంగం, న్యాయశాస్త్రం, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలు, ఆయనకు కరతలామలకం. ఆయన కేవలం చదవడమే కాదు, దాన్ని మదిలో నిక్షిప్తం చేసుకుంటారు. అదే జ్ఞానం. ఆయన జ్ఞాపకశక్తి అమోఘం. ఐక్యూ టెస్టు చేసి ఉంటే ఐన్‌స్టీన్‌కు సరిసమానంగా ఉండి ఉంటారేమో అనడంలో అతిశయోక్తి కాదు. యేట్స్ 'విశ్వాసాలు, నిబద్ధతా ప్రకటనే సాహిత్యం' అన్నాడు. దీన్నే మన రాఘవాచారికి అన్వయించవచ్చు. 'విశ్వాసాలు, నిబద్ధతా ప్రస్థానమే పాత్రికేయ వృత్తి'గా రాఘవాచారి ఆచరించి చూపారు. ఆయనకు బుద్ధిబలం ఎంత ఉందో ఔదార్యం అంత ఉంది. తెలుగు పత్రికా రంగంలో సంపాదకులకు ఆయనొక సింబల్. తెలుగులో చాలా మంది సంపాదకులు ఉండవచ్చు గానీ ఒకే ఒక్క ఎడిటర్ రాఘవాచారి అని ఉషశ్రీ ఏనాడో ప్రకటించారు. చావు పుట్టుకల మధ్య సందేహం లాంటి జీవితంలో నలువైపులా ఒక చక్కని సందేశమిచ్చి మంచిగంధంలా పరిమళించే మానవత్వం అలంకారంగా మార్చుకున్న ధన్యజీవి ఆయన. ఒక్కొక్క తరంలో ఇటువంటి వ్యక్తులు బహు అరుదుగా ఉంటారు. అరుదుగా దొరుకుతాయి కనుకే వజ్రాలకంత విలువ. కొందరు వ్యక్తులూ అంతే. తెలుగు పత్రిక, సాంస్కృతిక రంగంలో రాఘవాచారి వంటి వ్యక్తి ఒకరున్నారని తెలుగు వారు సందర్భం వచ్చినప్పుడల్లా సగర్వంగా చెప్పుకోవచ్చు.

ఒక తరం అంతరిస్తుంది. మరొక తరం అవతరిస్తుంది. ముందు తరం ఆశయాలనూ, అనుభవాన్నీ, నైపుణ్యాన్నీ, కౌశలాన్నీ భావితరాలకు అందించడం వల్ల వచ్చే ప్రగతే చరిత్ర. ఆయనమార్గాన్ని అనుసరించడమే ఆయనకు మనం అర్పించే నిజమైని నివాళి.

**నువ్వులేవు నీరాత ఉంది... చంద్రం బిల్డింగ్‌లో**
**చిందరవందరగా పడి ఉన్న పాతపేపర్ల బౌండుల్లో**
**దశాబ్దాల రాజకీయ సామాజిక ఆర్థిక సాహిత్య సాంస్కృతిక సంఘటనలను**
**ఎర్రపూవ్వుల్లా అల్లుకుని... మా గుండెల్లో చుట్టుకుని..**
**నీ వాక్ప్రవాహం మా మదిలో హృదిలో విజ్ఞానపు వీచికలుగా..**
**మార్క్సిజపు ధారలుగా.. ప్రతిధ్వనిస్తూ.. ప్రబోధిస్తూ...**

ఎంత చెప్పినా, ఎవరెంత ఓదార్చినా.. ఈ అక్షర జీవనది, కాసేపు నా చెంపల మీదుగా వెళ్లిపోయింది. ఆయన చేతి స్పర్శ నా భుజాన్ని తాకుతున్నట్టే ఉంది.. ఉంటుంది ❑

సంస్మరణ
సంపాదకీయాలు

# ఆదర్శం, అక్షరం

ఆంధ్రజ్యోతి
మా అక్షరం- మీ ఆయుధం

సీనియర్ పాత్రికేయుడు, సంపాదకుడు సి. రాఘవాచారి నిష్క్రమణ, వెళ్లిపోతున్న తరం గురించిన బెంగను మరింతగా పెంచుతున్నది. పెద్దలు తాము సార్థకజీవులై, అనంతర తరానికి తమ జ్ఞానాన్ని విలువలను అందించి, కాలధర్మం చెందడం సహజం. కానీ, ఆ విలువలను అనంతర సమాజం అంది పుచ్చుకోలేనప్పుడు, వాటిని ఆదర్శాలుగా స్వీకరించనప్పుడు ఆ వియోగం రెండింతలవుతుంది. పాత్రికేయులు, సంపాదకులు పాటించవలసిన కొన్ని సార్వకాలీన ధర్మాలకు, ముట్నూరు కృష్ణారావు, ఖాసా సుబ్బారావు, మానికొండ చలపతిరావు, నార్ల వెంకటేశ్వరరావుల లాగానే రాఘవాచారి కూడా నిబద్ధుడు. కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా ఉండే దినపత్రిక సంపాదకుడే అయినా, ఆయన పార్టీ విధేయతతో పాటు, తన స్వభావంలో ఉండే అనేక సుగుణాలను కూడా పత్రికారచనలో ప్రదర్శించారు. వినమ్రత, నిరాడంబరత, అధ్యయనశీలత, అవగాహన- ఈ నాలుగింటికి రాఘవాచారి పెట్టింది పేరు.

తెలంగాణలో భూస్వామ్యం ఊడలుదిగిన నాటి గ్రామీణ వరంగల్ జిల్లాలో 80 ఏళ్ల కిందట పుట్టి, కష్టజీవుల జీవన్మరణ పోరాటాలను చిన్నతనంలోనే కళ్లారా చూసి, అక్షరాలలోను, ఆచరణలోను ఉద్యమాలను ఒంట పట్టించుకున్న వ్యక్తి రాఘవాచారి. విద్యార్థి ఫెడరేషన్‌లో రాటు దేలి, తరువాత పార్టీలో చేరి, సిపిఐ ఇంగ్లీషు పత్రిక 'పేట్రియాట్'కు హైదరాబాద్ కరస్పాండెంట్‌గా పనిచేసి, ఆ తరువాత 'విశాలాంధ్ర'లో అడుగు పెట్టారాయన. అతి తొందరలోనే ఆ పత్రికకు సంపాదకులయ్యారు. 28 ఏళ్ల పాటు సంపాదకత్వం నిర్వహించారు. ఏ విషయంమీద మృదువుగా స్పందించాలో, ఏ విషయంలో దృఢంగా ఉండాలో పార్టీయే నిర్దేశిస్తూ ఉండవచ్చును కాక, ఆయన స్పందనలో సాధారణ విలువ మాత్రం, విషయాధార విమర్శ. వ్యక్తులను కించపరిచే ధోరణికి ఆయన వ్యతిరేకం. విధానాల మీదనే వ్యతిరేకత, పోరాటం తప్ప, వ్యక్తి దూషణ ఆయన విలువ కాదు. అలవోక విమర్శతో వ్యాఖ్య రాయడం కాదు, తగిన నేపథ్య సమాచారం, అవగాహన జోడించి పాఠకుల చైతన్యస్థాయిపెంచే సంపాదకీయాలు రాయడం ఆయనకు ఇష్టం. అలాగని, అసందర్భ పాండిత్య ప్రదర్శన గిట్టదు. ఎంఎస్ సుబ్బులక్ష్మి మీద సంపాదకీయం రాసినప్పుడు కానీ, రాఘవాచారికి అంతటి సంగీత పరిజ్ఞానం ఉన్నదని ఎవరికీ తెలియలేదు. అట్లాగే, బమ్మెరపోతన మీద ఆయన రాసిన సంపాదకీయం కూడా సుప్రసిద్ధం. తెలుగు సాహిత్యంతో రాఘవాచారికి ఉన్న సాన్నిహిత్యం ఆ సంపాదకీయం చెబుతుంది.

రాఘవాచారిది అసాధారణ ధారణాశక్తి అని ఆయన మిత్రులు చెబుతారు. గ్రంథాలు అధ్యయనం చేయడంలో కానీ, సమకాలిక అంశాలను పరామర్శించడంలో కానీ, ఆయన వేగాన్ని అందుకోవడం కష్టమట. అటువంటి రచయిత పాత్రికేయ, ఇతర రచనలు ప్రత్యేకంగా పుస్తకాల రూపంలో రాకపోవడం విచారకరం. తన రచనలు, సంపాదకీయాలను పుస్తకరూపంలోకి తెచ్చే ప్రతిపాదనలు వచ్చినప్పుడల్లా, ఆ పని తన మరణానంతరం చేయాలని అనేవారట రాఘవాచారి. ఇప్పుడైనా ఆయన సంకలిత రచనల పుస్తకాలు వస్తే, సాధారణ పాఠకులకు, పాత్రికేయ విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

"పాత్రికేయులు కూడా సమాజంలో పౌరులే. వారికే కొమ్ములూ లేవు. అందరిలాగే వారు కూడా సమాజాన్ని పీడించే రుగ్మతలకు లోనవుతుంటారు... సమాజంలో పౌరులందరికీ సమాజాభివృద్ధి పట్ల కర్తవ్యాలు బాధ్యతలు ఎలా వున్నాయో పాత్రికేయులకు కూడా సమాజం పట్ల అట్లాగే కర్తవ్యాలూ, బాధ్యతలూ వున్నాయి. సూపర్ సిటిజన్స్‌గా ప్రవర్తించే వైఖరి విడనాడాలి.." తన సొంత వృత్తి రంగాన్ని కూడా రాఘవాచారి విమర్శా దృష్టి వదలలేదు. కొత్త తరం పాత్రికేయులలో, రచయితలలో అధ్యయనం కొరవడుతున్నదని, పెద్ద పరిజ్ఞానం లేకుండా పైపైన రాయవచ్చుననే ధోరణి పెరుగుతున్నదని ఆయన ఆవేదన చెందేవారు. మతతత్వం అంటే రాఘవాచారికి అసలు సహించదు. రానురాను దేశంలో పెరుగుతున్న ఛాందసవాదం ఆయనకు కలవరం కలిగించేది. అట్లాగే కులతత్వం కూడా. తాను పుట్టిన శ్రీవైష్ణవ కుటుంబాలలో అంటు-ముట్టు పాటించడం చూసి, అగ్రకులత్వం మీద ఏవగింపు పెంచుకున్న రాఘవాచారి, తాను స్వయంగా కులాంతర వివాహం చేసుకున్నారు, సంతానానికీ చేశారు.

రాఘవాచారికి ప్రథమ ప్రాధాన్యం కమ్యూనిస్టు పార్టీకి విధేయత. ఆ తరువాతే, సంపాదక వృత్తి బాధ్యత. అందువల్ల తన సొంతపార్టీ మీద విమర్శలను ఆయన సంపాదకీయాలలో, రచనలలో చదవలేము. ఆయన పార్టీ విధేయత కూడా ఎవరో నాయకులతో ముడిపడినది కాదు. రాఘవాచారిని సిపిఐలోకి ఆకర్షించిన మొహిత్ సేన్ వేరే పార్టీ పెట్టినా, ఆయన మాత్రం పార్టీని వీడలేదు. సిపిఎంతోను, విప్లవ వామపక్ష పార్టీలతోనూ ఆయనకు గట్టి రాజకీయ విభేదాలే ఉన్నాయి. అయితే, విభేదాలతో నిమిత్తం లేని మానవ సంబంధాలను నెరపగలిగిన ప్రజాస్వామిక స్నేహశీలి ఆయన. ❑

# నిబద్ధతకు నిలువెత్తు చిహ్నం

సంస్మరణ
సంపాదకీయాలు

బహుభాషా కోవిదుడు, మేధో సంపన్నుడు, ప్రసిద్ధ పాత్రికేయుడు, విశాలాంధ్ర దినపత్రిక పూర్వ సంపాదకుడు, అన్నిటికీ మించి ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ చక్రవర్తుల రాఘవాచారి కీర్తిశేషులైనారని తెలియజేయటానికి విచారిస్తున్నాం. మార్క్సిజం వెలుగులో ప్రత్యామ్నాయ జర్నలిజానికి మెరుగులు దిద్దిన అక్షర రుషి అతడు. అయినా డాబు దర్పం లేని నిరాడంబరుడు, నిగర్వి, స్నేహశీలి. ఆయన దృఢదీక్ష, నమ్మిన సిద్ధాంతం పట్ల అంకితభావం స్ఫూర్తిదాయకం. సనాతన ధర్మాచార కుటుంబంలో 1939లో జన్మించిన రాఘవాచారిని మార్క్సిజం ఆకర్షించటం ఒక విశేషమైతే, దాన్ని నిబద్ధతతో జీవితాంతం ఆచరించటం మరో విశేషం. నిజాం ముష్కర పాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుపార్టీ సాగించిన రైతాంగ సాయుధ పోరాట ప్రభావం ఆయన కుటుంబంపై పడింది. వారి అన్నగారొకరు విశాలాంధ్ర పత్రిక తెస్తుండటంతో 1953 నుంచి రాఘవాచారి దాన్ని చదవసాగారు. ఉత్తరోత్తరా ఆ పత్రికకు సంపాదకుడినవుతానని ఆనాడు కలలోనైనా ఆయన ఊహించి ఉండరు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం, రాజకీయ ప్రభావాలు ఆయన్ను కమ్యూనిస్టు సిద్ధాంతాలవైపు ఆకర్షించాయి. చదివింది లా అయినా రచనా వ్యాసంగం పట్ల ఉన్న అనురక్తి ఆయన్ను జర్నలిజం వైపు మరల్చింది. తొలుత హైదరాబాద్‌లో విశాలాంధ్రకు విలేకరి, తదుపరి అరుణా అసఫాలీ, ఎడతాత నారాయణన్‌ల సారథ్యంలో ఢిల్లీ నుండి వెలువడిన 'పేట్రియట్' ఆంగ్ల దినపత్రికకు హైదరాబాద్ విలేకరి. అటు తర్వాత 1972లో విశాలాంధ్ర దినపత్రిక సంపాదక బాధ్యత. చక్రం గిరగిరా తిరిగింది. అనితర సాధ్యంగా 28 సంవత్సరాలపాటు సంపాదక బాధ్యతల తదుపరి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఇంత సుదీర్ఘ కాలం తెలుగు పత్రికలకు సంపాదకులుగా ఉన్నవారు లేరంటే అతిశయోక్తి కాదు.

ఏ అంశంపైనైనా లోతైన విశ్లేషణ, పదునైన వ్యాఖ్యానం, తిరుగులేని సాధికారిత, నిబద్ధత, అతి సాధారణ జీవితం ఆయన విశిష్ట లక్షణాలు. భారత రామాయణాల నుంచి మన ప్రాచీన సాహిత్యాన్నీ, యూరోపియన్ సాహిత్యాన్నీ, మార్క్సిస్టు గ్రంథాల నుంచి వివిధ దేశాల రాజ్యాంగాల వరకు ఆయన ఆపోశన పట్టారు. సామవేదాన్నీ, సామ్యవాదాన్నీ సాధికారికంగా తర్కించగల సవ్యసాచి. ఆయా సందర్భాలలో అలవోకగా ఆయా అంశాలను వివిధ గ్రంథాల నుంచి ఉటంకించడం ఆయన ధారణశక్తికి నిదర్శనం. అందుకే ఆయనను నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం అని అంటారు. ఆయన అక్షరంలో, మాటలో అభ్యుదయ భావపరంపర, కమ్యూనిజం సిద్ధాంత సారం నిక్షిప్తమై ఉంటుంది. 'నేను మొదట కమ్యూనిస్టును, ఆ తర్వాతే జర్నలిస్టు అయ్యాను' అని చెప్పేవారు. సిద్ధాంతం, ఆచరణరీత్యా ఆయన కమ్యూనిస్టు అయినా ఇతర సిద్ధాంతాలు, విశ్వాసాలను నమ్మే వ్యక్తులతో ఎంతో స్నేహంగా ఉండడం ఆయనకే చెల్లు.

పాత్రికేయుల వృత్తి ప్రమాణాలకే కాదు, వారి హక్కుల కోసం ఉద్యమించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శిగా దాన్ని తీర్చిదిద్దడంలోనూ, అది సాధించిన విజయాల్లోనూ ఆయన పాత్ర చిరస్మరణీయం. పాత్రికేయులూ ఈ సమాజంలో భాగమే తప్ప భిన్నం కాదు, ప్రత్యేకం కాదు అని జర్నలిస్టులను ఆయన హెచ్చరించేవారు. వినయం, విచక్షణ, వివేచనతో పాత్రికేయులు మెలిగినప్పుడే రాణించగలుగుతారని హితవు పలికేవారు. పాత్రికేయుడు సమాజాన్ని అధ్యయనం చేయాలి, దానిలోని లోటుపాట్లు ఎత్తిచూపుతూ సరిదిద్దేందుకు ఒక సాధనంగా మారాలంటారు. అంతేకానీ సమాజంపై పడి బతికే పాత్రికేయం.. వృత్తి విలువలను దిగజార్చుతుందని ఆయన నిర్మొహమాటంగా చెప్పేవారు.

ధర్మశాస్త్రాధ్యయనం 'జూరిస్ ప్రుడెన్స్' అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ఇది చాలా కష్టమైన పాఠ్యాంశమైనా పట్టుదలగా దాన్నే ఎంచుకొని ఉత్తీర్ణులయ్యారు. ఉస్మానియా లా కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించారు. బాల్యం నుంచే సాహిత్య, సాంస్కృతిక అంశాలపై ఆసక్తి గల ఆయన తన తొలి రచన వరంగల్ నుంచి ఎంఎస్ ఆచార్య నిర్వహణలో వెలువడే 'జనధర్మ'లో వెలుగుచూసింది. కాలేజీ రోజుల్లోనే క్రీడాభిరామంలో 'ఓరుగల్లు వర్ణన' వ్యాసం రాసి పలువురు పండితుల ప్రశంసలు అందుకున్నారు. మహాకవి శ్రీశ్రీ అంటూ ఆయన తన కాలేజీ రోజుల్లోనే విశ్లేషణాత్మకంగా వ్యాసం వెలువరించారు. 1972 నుంచి 2000 వరకూ తెలుగువారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య పరిణామాలను గురించి చర్చించాల్సి వచ్చినా, విశ్లేషించాల్సి వచ్చినా.. రాఘవాచారి సంపాదకీయాలు వెలుగుచూపుతాయి. శ్రమజీవుల పక్షాన నిలబడి అక్షరాగ్నులు సంధించడంలోనూ, కమ్యూనిస్టు సిద్ధాంత చర్చలోనూ, బూర్జువా ప్రత్యర్థుల దాడిని తిప్పికొట్టడంలోనూ, సంగీత నిధి ఎంఎస్ సుబ్బులక్ష్మిని స్మరించడంలోనూ, భక్తపోతన సాహిత్యాన్ని విశ్లేషించడంలోనూ..

☞ మిగతా 59వ పేజీలో

సంస్మరణ సంపాదకీయాలు

# చిరస్మరణీయుడు, తెలుగు భాషాభిమాని మా రాఘవాచారి

ఆయన ఇంటిపేరు చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. విశాలాంధ్ర రాఘవాచారిగానే లోకానికి తెలుసు, ఆ పత్రికతో ఆయనకు అంత అనుబంధం ఉంది. మూడు దశాబ్దాల పాటు ఆ పత్రిక సంపాదకులుగా ఎన్నో సంపాదకీయాలు రాశారు. రాజకీయ వ్యాసాలే కాకుండా, తెలుగు భాషపై వ్యాసాలు రాశారు. తెలుగు అంటే ఆయనకు మమకారం ఎక్కువ. తెలుగు నుడికారం ఆయనకు తెలుసున్నంతగా సమకాలీన పాత్రికేయుల్లో ఎవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆయన పండిత వంశంలో పుట్టడం వల్ల సంస్కృతాంధ్ర భాషల్లో ఆరితేరిన వారయ్యారు. చదువురీత్యా, ఉద్యోగరీత్యా ఆంగ్లం, ఉర్దూ తదితర భాషల్లో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. ఆయన ఏ సభలో మాట్లాడినా ప్రసంగం పూర్తి అయ్యేవరకూ సభికులు చెవులు రిక్కించి వినేవారు. అంతేకాదు, ఆయన చెప్పే విషయాలపై దృష్టిని కేంద్రీకరించేవారు. నిజానికి ఆయన వృత్తి రీత్యా రాజకీయ భావజాలానికి దగ్గరైనా, ఆయన ప్రసంగాల్లో తెలుగు భాష నుడికారం, తెలుగు భాష తియ్యదనం కనిపించేది. ఆయన ఎంతో లబ్ధ ప్రతిష్టులైనప్పటికీ నిరాడంబరంగా ఉండేవారు. రేడియో ఉషశ్రీ గారితో ఆయనకు సాన్నిహిత్యం ఎక్కువ ఉండేది. వారి మధ్య రామాయణ, మహాభారత అంశాలపై చర్చ జరిగేది. కమ్యూనిస్టు నాయకులతో కలిసి ఉన్నప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం పుట్టు పూర్వోత్తరాలు, లెనిన్, స్టాలిన్ నాటి పరిస్థితులపై చర్చ జరిగేది. ఏ విషయంపై మాట్లాడినా ఆయన పరకాయ ప్రవేశం చేసినట్టుగా మాట్లాడేవారు. ఆయన మృదు భాషి. ఏ సభకు హాజరైనా హడావుడి, దర్పం లేకుండా చాలా నిరాడంబరంగా ధ్యానంలో ఉన్నట్టు కూర్చునేవారు. ఎవరైనా పలుకరిస్తే ఆప్యాయంగా మాట్లాడేవారు. ఎప్పుడో చాలా కాలం క్రితం కలిసిన వారిని సైతం మీరు ఫలానా పత్రికలో పని చేస్తున్నారు కదూ అని ప్రశ్నించేవారు. కమ్యూనిస్టు భావజాలానికి ఎంతగా ఆయన అంకితమయ్యారంటే ఆయన భావాల్లో, మాటల్లో, భావజాలంలో కమ్యూనిజం తప్ప మరొకటి కనిపించేది కాదు. చాలా మంది కమ్యూనిస్టు నాయకులు సభా వేదికల వరకే పార్టీకి పరిమితం అయినట్టు ఉండేవారు. కానీ, రాఘవాచారి అంతటి నిబద్ధత కలిగిన నాయకుడు, విశ్లేషకుడు, ఆదర్శవాది, అభ్యుదయ భావాలు కలిగిన వారు అరుదుగా ఉంటారు. లెనిన్ గురించి ఆయన రాసిన వ్యాసాలు ప్రస్తుత సమాజానికి చెందిన వారికి ఎంతో విజ్ఞానదాయకంగా ఉండేవి. కమ్యూనిజానికి అపజయం లేదన్న ధీమా, నమ్మకం ఆయన మాటల్లో నిత్యం కనిపించేది. కమ్యూనిజాన్ని గురించి ఉపన్యాసాలు ఇవ్వడమే కాకుండా పదహారణాల కమ్యూనిస్టుగా జీవించిన గొప్ప పాత్రికేయుడు రాఘవాచారిగారు. రాఘవాచారిగారు ఒక సభలో తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుతుంటే, ఈయన విశాలాంధ్ర రాఘవాచారియేనా అనిపించేది. భాష మీద ఆయనకు అంత పట్టు ఉండేది. సమాసాలు, అలంకారాలపై కూడా ఆయనకు ఎంతో పట్టు ఉండేది. రాఘవాచారి గారి సభను మిస్ కాకూడదన్న అభిప్రాయం శ్రోతల్లో కలిగించారంటే ఆయన ఎంత అధ్యయనం చేసి ప్రసంగాలు చేసే వారో తెలుసుకోవచ్చు. అదే సందర్భంలో కమ్యూనిస్టు నాయకులపైనా, కమ్యూనిస్టు సాహిత్యంపైనా ఆయన అంత సాధికారికంగానూ ప్రసంగించేవారు. తాను ఏ సిద్ధాంతానికి అంకితమైనా ఇతర భావజాలం కలిగిన వ్యక్తులనూ, పండితులనూ గౌరవించాలన్న సహృదయం కలిగిన జర్నలిస్టు. వివాదాల జోలికి పోకుండా అందరితోనూ స్నేహశీలిగా వ్యవహరించిన రాఘవాచారి గారు ఒక తరం జర్నలిస్టులకు మార్గదర్శిగా నిలిచారనడంలో అతి శయోక్తి లేదు. ఆయన కమ్యూనిస్టు విజ్ఞాన ఖని.గని. చదువుకునే రోజుల్లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకునిగా కమ్యూనిస్టు భావజాలానికి ప్రభావితమైన దగ్గర నుంచి ఆయన మరో పార్టీ వైపు చూడలేదు. కమ్యూనిస్టుపార్టీలో చీలిక వచ్చినప్పుడు సిపిఐలోనే కొనసాగారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర సంపాదకునిగా బాధ్యతలను స్వీకరించిన ఆయన 2000 వరకూ కొనసాగారు. ఆయన గొప్ప అభ్యుదయవాది, ప్రగతిశీల ఉద్యమకారుడు, మాటల్లో కాదు, ఆచరణలో వాటిని ఆచరించి చూపినవారు. ఆయన 1939లో వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో సెప్టెంబర్ 10వ తేదీన జన్మించారు. నిబద్ధత విలువలతో కూడిన జర్నలిజాన్ని వృత్తిగా స్వీకరించారు. ప్రవృత్తిగా కమ్యూనిస్టు, తెలుగు భాషాభిమాని, తెలుగు ఉపన్యాసకుడు. ఆయన మృతికి తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కమ్యూనిస్టు నాయకులు సంతాపం ప్రకటించారు. ఆయన మిత్రులు, అభిమానులు, అన్ని పార్టీల్లో, వర్గాల్లో ఉన్నారు. అందరికీ ఆత్మబంధువుగా, తలలో నాలుకగా, ఉన్నంత కాలం అందరి మంచినీ కోరిన సహృదయునిగా రాఘవాచారి గారు చిరస్మరణీయుడు. ఆయన మరణంతో తెలుగు భాష గొప్ప పండితుణ్ణి కోల్పోయింది. కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత గల నాయకుణ్ణి కోల్పోయింది. సుదీర్ఘ జీవనంలో ఆయన అందరి మంచిని ఆకాంక్షించి, అందరి చేత మంచి అనిపించుకుని ఆయన భౌతికంగా తనువు చాలించినా బంధు, మిత్రులందరి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. అందరూ ఆయనను మా రాఘవాచారిగారని అనుకునేట్టుగా ఆయన జీవన ప్రస్థానం కొనసాగింది. సోవియట్ యూనియన్ విడిపోయినప్పుడు ఆయన కలత చెందారు. ఆ సందర్భంలో ఆయన అన్న మాట ఆయన నిబద్ధతకు తార్కాణం. కమ్యూనిజానికి మరణం లేదని అన్నారు. అలాగే, ఆయనకూ మరణం లేదు. ఎర్ర సిరా, ఎర్రచొక్కా వదిలేసి ఉంటే ఆయనపై నిత్యం కరెన్సీ వర్షం కురిసి ఉండేది. ❑

ప్రజాతంత్ర
తెలంగాణ దినపత్రిక

# A legend in his Lifetime

With the demise of Chakravarthula Raghavachary, an eminent editor, a guide and philosopher of the working journalists professional and trade union movement in the country, a glarious chapter in Telugu jounalism came to an end. Born in an orthodox Sri Vaishnava family, he renounced his brahminical beliefs and embraced communism and continued to be an ideal communist and ethical journalist to the end of his life.He never wavered from his path even when offers of editor's position in one of the largest English newspaper groups came his way, saying that I am a communist first and journalist next. Erudite scholar in Telugu, Sanskrit, Urdu and English, he was considered to be a walking encyclopadie. Editors and senior journalists used to call him whenever they had a doubt on a fact or detail on any subject from politics to history and from literature to culture while writing editorials or articles and stoies. Everyone from veterans to cub journalists used to have an easy access to him and he was always ready to clear their doubts and given them a perspective. Ever smiling, he used to converse in simple language and explain complex things in simple terms.

SCRIBES NEWS
A JOURNAL OF PRACTITIONERS OF JOURNALISM

Raghavachary led the Andhra Pradesh Union of Working Journalists (APUWJ) as General Secretary in its formative years and laid basis for its growth as a pioneering force in defence of the freedom of the press, the freedom of expression and democratic rights. He laid stress on continuous training to journalists, particularly rural journalists to enhance the standards of journalism and its ethical stature. Under his guidance, the APUWJ started conucting refresher classes for journalists in rural areas since 1980s. He always abided by the adage that "Facts are sacred and opinion is free" during his more than five and half decades of journalistic life. He advocated the rise of 'alternative press' without strings of the business houses, to be the true voice of the voiceless millennium. Even though he worked all his life in publications promoted by the Communist Party of India, he was widely respected by sections of the non-left interllectuals and leaders across political spectrum. His writings and public speeches were well received by all sections of the people. He was a legend in his own lifetime. We dip our banner in his memory and pledge to uphold the principles of journalism he practised and preached. ❑

## నిబద్ధతకు నిలువెత్తు చిహ్నం

**(57వ పేజీ తరువాయి)**

దేనిలోనైనా ఆయన సంపాదకీయాలు కొలబద్ధలుగా నిలుస్తాయి. పత్రికా స్వాతంత్ర్యం పేరిట యజమానులు చేస్తున్న అక్రమాలను ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు. ఫోర్త్ ఎస్టేట్‌ను రియల్ ఎస్టేట్‌గా మార్చుతున్న తీరుపై ఆయన పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. 'పత్రికల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎవరి నుంచి అవరోధం కలుగుతున్నది, వాటిని నివారించడం ఎలా అన్నవి నిస్సందేహంగా కీలకమైన ప్రశ్నలే. కానీ అంతే కీలకమైన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఏ ప్రజాప్రయోజనాల సాధనకు వినియోగ పడాలన్న ప్రశ్న కూడా ఉంది. ఈ అవగాహన లేకుండా పత్రికా స్వాతంత్ర్యంపై జరిగే చర్చల వల్ల పత్రికలు సాంఘిక పురోగమనానికి దోహదం చేయడంలో వాటి కర్తవ్యాల పరిపూర్తికి తగిన సమాధానం లభించదు.' అని ఆయన ఏనాడో స్పష్టం చేశారు.

రాఘవాచారి సంపాదకుడే కాదు, అంతకు మించి వక్త. ఏ విషయం మీదనైనా, ఏ సందర్భంలో మాట్లాడినా అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా, చమత్కారయుతంగా ప్రసంగించడం ఆయన ప్రత్యేకత. అరవిందుని సావిత్రి గురించి ఎంత ఆశువుగా మాట్లాడగలరో ఆంగ్లికన్ జ్యూరిస్ ప్రుడెన్స్ గురించి అంతే అనర్గళంగా విశదీకరించగలరు. రాజకీయాలు, రాజ్యాంగం, న్యాయశాస్త్రం, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలు ఆయనకు కరతలామలకం. 'విశ్వాసాలు, నిబద్ధతా ప్రస్థానమే ప్రాతికేయ వృత్తి'గా రాఘవాచారి ఆచరించి చూపారు. ఆయనకు బుద్ధిబలం ఎంత ఉందో ఔదార్యం అంత ఉంది.

తెలుగు పత్రికా రంగంలో సంపాదకులకు ఆయనొక సింబల్. తెలుగులో చాలా మంది సంపాదకులు ఉండవచ్చుగానీ ఒకే ఒక్క ఎడిటర్ రాఘవాచారి అని ఉషశ్రీ ఏనాడో ప్రకటించారు. తెలుగు పత్రిక, సాంస్కృతికరంగంలో రాఘవాచారి వంటి వ్యక్తి ఒకరున్నారని తెలుగువారు సందర్భం వచ్చినప్పుడల్లా సగర్వంగా చెప్పుకోవచ్చు. ❑







విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక




సంపాదక చక్రవర్తి
ఉత్తమ కమ్యూనిస్టు
విశాలాంధ్ర రాఘవాచారి గారి
సంస్మరణ సభ
విశాలాంధ్ర విజ్ఞాన సమితి -
13-11-2019

# మార్క్స్ అంటే మార్పు

- సి. రాఘవాచారి

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సిద్ధాంతాల్లో మార్క్సిజం ఒకటి. కార్ల్‌మార్క్స్ జన్మించి నేటికి 200 సంవత్సరాలైంది. 1818 మే 5న జన్మించిన ఆయన 1883లో మరణించారు. ఆయన కార్యక్రమాలు ప్రపంచాన్ని గడిచిన 155 సంవత్సరాలుగా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. మనిషి మనిషిని దోపిడీ చేసేందుకు కారణాలేమిటి? సామాజిక వ్యవస్థలో అంతరాలకు కారణాలేమిటి? కొంత మంది పనిచేయడానికీ... కొంత మంది పని చేయకపోవడానికీ కారణాలేమిటి? ఫలితం కొందరికే దక్కడం వంటి సమస్యలు ఈనాటికీ అపరిష్కృతమే. వీటికి మార్క్స్ శాస్త్రీయమైన పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు ప్రయత్నించారు. మార్క్సిజమనీ ఆయన పేరుతో చెబుతున్నారే గానీ ఆయనకు సహాయ పడిన వారు అప్పట్లో చాలా మందే ఉన్నారు. ఫ్రెడరిక్ ఎంగిల్స్ ఆయనకు మంచి స్నేహితుడు. ఆర్థిక శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి, ఈనాటికీ ప్రపంచంలో మన్నన పొందుతున్న దాస్ క్యాపిటల్ అనే గ్రంథాన్ని రచించడానికి ఎంగిల్సే కారకుడు. మార్క్స్ స్వతహాగా తత్వవేత్త. న్యాయశాస్త్రంలో కోవిదుడు. తత్వవేత్త హేగెల్ శిష్యుడీయన. ఆయన నుంచి గతి తర్కాన్ని పుణికి పుచ్చుకున్నారు. దాన్ని సామాజిక మూలాలకు అన్వయించారు. ఉత్పత్తికి మూలమైన అనేక కారణాల్లో మానవ శ్రమకు ప్రాధాన్యత ఉంది. శ్రమజీవులు సంఘటితమైతే తప్ప సోషలిజం రాదని మార్క్స్ ఎలుగెత్తి చాటారు. ఈయన కంటే ముందే సోషలిస్టు భావాలున్నాయి. ఊహాజనితమైన భావాలున్న సోషలిస్టులున్నారు. సోషలిజాన్ని శాస్త్రీయ సిద్ధాంతంగా మార్చడానికి అప్పట్లో ఉన్న ఆర్థిక, సాంకేతిక, విజ్ఞాన, భౌతిక శాస్త్రాలను ఔపోసన పట్టారు. డార్విన్ సిద్ధాంతాన్ని ఇందుకు ప్రాతిపదికగా తీసుకున్నారు. అన్ని శాస్త్రాలతో సోషలిజం సిద్ధాంతాన్ని రూపొందించారు. అనంతరం రష్యాలో లెనిన్ నాయకత్వాన విప్లవం వచ్చింది. లెనిన్ మార్క్స్‌కు మంచి భాష్యకారుడు. మార్క్సిజానికి మూలాలు జర్మన్ తత్వశాస్త్రం, ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమాలు, బ్రిటీష్ ఆర్థిక శాస్త్రం, కాలం మారుతున్న కొద్దీ వాటికి సవరణలు జరిగాయి. దాన్ని పరిపుష్టం చేయడానికి మరికొంత మంది కృషి చేశారు. మార్క్స్ ఎంగెల్స్‌తో చెప్పింది ఈనాడు చాలా విస్తరించింది. లెనిన్, మావో, యూరప్‌లో కమ్యూనిస్టులు, క్యూబా, వియత్నాంలలోనూ విస్తరించారు. మార్క్సిజానికి మూలం యూరోప్ అయినప్పటికీ అది ఖండాంతరాలలో కోట్లాది శ్రమ జీవుల్ని ప్రభావితం చేస్తోంది. శాస్త్రీయ ప్రాతిపదిక ఉన్న ఆయుధంగా మారింది. మార్క్స్ మరణానంతరం చికాగోలో దీని శక్తి కనిపించింది. మే ఒకటో తేదీ నాడు ప్రపంచ కార్మికులంతా ఏకమయ్యారు. ప్రపంచంలో తరతమ బేధాలు లేకుండా పాటించేది మేడే ఒక్కటే. మేడేలో సార్వజనీనమైన ఆకర్షణ ఉంది. మనిషిని మనిషి దోపిడి చేసే వ్యవస్థ పోవాలనీ మహనీయులందరూ కాంక్షించారు. అందు కోసమే కృషి చేశారు. మనిషిని గౌరవించమన్నారు. శ్రమైక జీవన సౌందర్యానికి బహు ముఖీనమైన మానవీయ విలువల్ని రంగరించిన వాడు మార్క్స్. రాజకీయాల్లోనే కాకుండా సామాజిక, సాంస్కృతిక, కళా రంగాల్లో మనిషి వికసించడానికి దోపిడీ అవసరం లేని వ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. 1848లో మార్క్స్, ఎంగెల్స్ కలిసి కమ్యూనిస్టు మ్యానిఫెస్టో రూపొందించారు. అది చాలా చిన్నదైనప్పటికీ ప్రభావం చాలా గొప్పది. అన్ని భాషలలోకి తర్జుమా అయింది. భారత్‌లో 1900 శతాబ్దపు తొలినాళ్ళలోనే దాని అనువాదాలు ప్రచారంలోకి వచ్చాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో శ్రామిక వర్గానికి విప్లవ పంథా ఏమిటో చూపించారు మార్క్స్. అందులో విశ్లేషణ ఉంది. ఒక ఆశాభావముంది. భవిష్య ఆకాంక్షలను రూపుదిద్దే ప్రణాళికా ఉంది. దీనికన్నా పెద్దది దాస్ క్యాపిటల్. ఆర్థిక శాస్త్రంలో తలలు పండిన వారిలో దీనిని అభిమానించే వారు, విభేదించేవారు, సామాన్యులు అందరూ మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం మార్క్స్ యొక్క గొప్పదనం. శాస్త్ర, సాంకేతిక రంగాల వల్ల ఉత్పత్తి పెరగడం పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభానికి ముఖ్య కారణం. దీని వల్ల పారిశ్రామిక నాగరికత వస్తుంది. ప్రస్తుతం పెట్టుబడిదారుడి దోపిడీ ఎక్కువవడంతో సంపద పెరిగిపోతోంది. కొనుగోలు ధర తగ్గుతుంది. పెట్టుబడి దారుడు తగినంత తీసుకోవచ్చు. ఖర్చులన్నీ పోయిన తరవాత కూడా వారికి సూపర్ ప్రాఫిట్స్ మిగులుతున్నాయి. దాని వల్ల ఏమవుతుందంటే ఉత్పత్తి పెరుగుతుంది. కొనుగోలు శక్తి తగ్గుతుంది. సంక్షోభానికి కారణం అక్కడే ఉంది. ఆర్థికమాంద్యం ఏర్పడడానికి ఇవి కారణమయ్యాయి. ద్రవ్య పెట్టుబడిదారీ విధానం వల్ల సంక్షోభాలు ఏర్పడుతున్నాయి. 2008లో అమెరికాలో ఏర్పడిన సంక్షోభానికి ఇదే కారణం. ఇది ఒక సైకిల్ లాంటిది. కొత్త విధానాన్ని కనుగొనడం వల్ల వచ్చే ముప్పు ఇది. ఆచరణలో వీటిని విజయవంతంగా అమలు చేసినవారూ ఉన్నారు. ఉదాహరణకు సోవియట్ యూనియన్‌లో 75 ఏళ్ళు సోషలిజాన్ని అమలు చేశారు. అందులో పొరపాట్లు కూడా ఉండవచ్చు. ఎందుకంటే సిద్ధాంతమన్న తరువాత అన్వయం ఉండాలి. ఆచరించే వారుండాలి. అందుకు సౌలభ్యముండాలి. రష్యా, చైనా, భారత్, లాటిన్ అమెరికాలో పరిస్థితులు సక్రమంగా లేవు. కానీ అన్ని చోట్లా ఆచరించి, అన్వయించినవారు విజయం సాధించారు. లెనిన్, జార్జి చక్రవర్తి సక్సెస్ అయ్యారు. చైనా చాలా విస్తారమైంది. అక్కడ మావో సక్సెస్ అయ్యాడు. అమెరికా పక్కనే ఉన్న క్యూబాలో ఫిడెల్ క్యాస్ట్రో సోషలిజాన్ని ఒక రకంగా అమలుచేశాడు. వేలమైళ్ళ దూరంలో ఉన్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని ధిక్కరించి వియత్నాం విజయం సాధించింది. ఇందులో అందరి భాగస్వామ్యమూ ఉంది.

లెనిన్, లక్జెంబర్గ్, మావో, హోచిమిన్ లాంటి వాళ్ళు పరిస్థితులకు అన్వయించుకుని సఫలీకృతులయ్యారు.

1871లో ప్యారిస్ కమ్యూన్ అని కార్మికవర్గం రెండు రోజులు అధికారాన్ని చెలాయించింది. కానీ తిరుగుబాటు వచ్చి అది విఫలమైంది. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని మళ్ళీ విజయపథం పట్టాలి. ఆనాటికీ ఈనాటికీ చాలా తేడా ఉంది. ఒకప్పుడు సోవియట్, యూరోప్ కలుపుకుంటే ప్రపంచంలో మూడో వంతు జనాభా సోషలిజం పతాకం కింద ఉంది. ఇప్పటికీ చైనా, కొరియా, క్యూబా, వియత్నాం ఇవన్నీ కలిపితే ప్రపంచ జనాభాలో నాలుగు శాతం మాత్రమే దాని కింద ఉన్నారు. పాత సామ్రాజ్యవాద దేశాలు పెట్టుబడిదారీ పంథాలో ఉన్నాయి. 19వ శతాబ్దం మధ్య భాగంలోనే మొత్తం వలస వ్యవస్థలన్నీ పోయాయి. ఈరోజు ఎక్కడా వలస దేశం కనిపించదు. కానీ ఆ వ్యవస్థ కంటే దోపిడీ ఇప్పుడు ఎక్కువైపోయింది. రాజకీయంగా వలసలు లేవు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా అన్నీ వలస దేశాలే. యూరోపియన్, యూనియన్ దేశాల్లో కూడా వలస విధానమే. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్ అన్నిటికీ వలస దేశాలున్నాయి. మన దేశంలోనే అందరూ ఉండేవారు కదా. ఇప్పుడవన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇప్పుడు ప్రపంచ రాజకీయ పటం చూస్తే అన్ని దేశాలు సమానంగా కనిపిస్తాయి. ఐక్యరాజ్య సమితిలో సమాన సభ్యత్వం కలిగున్నాయి. కానీ కాదు. భారత రాజ్యాంగంలో అందరూ సమానమే అని ఉంటుంది. అలా ఉందా. లేదు కదా! వలస దేశాలు అభివృద్ధి చెంది, ఆర్థికంగా బలపడేందుకు సామ్రాజ్యవాద శక్తులు సహాయ నిరాకరణ చేసినప్పుడు సోషలిస్టు దేశాలు ఆదుకున్నాయి. సోషలిస్టు వ్యవస్థ లేనప్పటికీ ఇప్పటికీ రష్యాతో భారత్ సంబంధాలకు కారణమదే. వియత్నాంలో ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లింది. అమెరికా దాడి చేస్తే వారు దాన్ని తిప్పి కొట్టి, విజయం సాధించారు. సామ్రాజ్యవాదం పెట్టిన చిచ్చు కారణంగానే కొరియా విడిపోయింది. ఇప్పుడూ రెండూ ఒకటయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిణామ సామ్రాజ్యవాదానికీ, అమెరికాకీ చెంపపెట్టు.

మతోన్మాదం పేరిట ముస్లిం దేశాలైన సిరియా తదితర చోట్ల జరుగుతున్న నిరంకుశత్వానికి ప్రత్యామ్నాయంగా చర్యలు ఏర్పడుతున్నాయి. వాళ్ళు బాంబులేస్తుంటే వీళ్ళు రక్షణ కల్పిస్తున్నారు. బంగ్లా విమోచన సందర్భంగా ఆదుకున్నది సోవియట్ రష్యా అనే విషయం మనకి తెలుసు. ప్రపంచంలో ప్రగతిశీల పరిణామాలకు దోహదకరంగా మార్క్సిజం సిద్ధాంతపరంగానే పరిణామాలు సాగుతున్నాయి. తాజాగా నేపాల్ ఒక మంచి ఉదాహరణ. ఆ దేశంలో రాచరిక వ్యవస్థ ఉండేది. అక్కడ రెండు మార్క్సిస్టు పార్టీలు కలిసాయి. విజయం సాధించాయి. ఇది చాలా గొప్ప విషయం. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయింది. కానీ మార్క్స్ నుంచి మావో వరకూ ఆలోచనా విధానం ఒక్కటే. వీళ్ళంతా ఒక్కటయితే పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. యూరోప్‌లో కూడా అనేక రూపాల్లో ప్రగతిశీల పార్టీలున్నాయి. ఇటలీ, ఫ్రాన్స్ వంటి పెద్ద దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఉండేవి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిట్లర్‌కు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించాయి. ఇవాళ ఆ పరిస్థితి లేకపోవచ్చు. పోప్ కూడా ఈ విషయాలు చెబుతున్నారు. క్యూబా, చిలీ, వియత్నాం అంశాలను ప్రస్తావిస్తున్నారు.

భారతీయ సాహిత్యంలో కూడా భౌతిక, హేతువాదాలను వెలికి తెచ్చింది మార్క్సిస్టు భావజాలమే. రాహుల్ సాంకృత్యాన్ వంటివారు ప్రత్యామ్నాయ, ఉత్తమమైన జీవన విధానాన్ని మానవ విలువలతో కూడిన దోపిడీ చేయని సమాజాన్ని నిర్మించడానికి ఇప్పటికీ మార్క్సిజం స్ఫూర్తిగా కృషి చేస్తున్నారు. తత్వవేత్తలు పరిపరివిధాల ప్రపంచాన్ని వ్యాఖ్యానించారు కానీ కావల్సింది ప్రపంచాన్ని మార్చడం. ఇవాళ మార్క్స్ అంటే మార్పునకు పర్యాయపదం.

మార్పును తేవడానికి ప్రయత్నించేవారు మార్క్సిజాన్ని సక్రమంగా అధ్యయనం చేయాలి. మార్క్సిజం అంటే ఒక ఫిజిక్సు, ఒక కెమిస్ట్రీ లాంటిదే. దాన్ని అన్వయించేటప్పుడు భౌతిక పరిస్థితుల్ని చూడాలి. ఇక్కడున్న సామాజిక వాస్తవికతను గమనించాలి. సాంస్కృతిక వాస్తవికతను పరిశీలించాలి. ఇవన్నీ గమనించినప్పుడు ఆయా దేశాల్లో సోషలిజం సంబంధిత అంశాలతో ఉంటుంది. చైనాలో పెట్టుబడిదారీ విధానమని చాలా మంది అంటున్నారు. సోషలిజం విధానం అలాగే ఉంది. అందులోనే సోషలిజాన్ని చూస్తున్నారు. మనలాగ కంపెనీలొచ్చి ఆధిపత్యం వహించడం కాదు. మిగిలినవి అలా కాదు. ఆయా దేశాల నిబంధనలకు లోబడి ఉంటారు. మేం విద్యార్థులుగా ఉన్నప్పుడు 1950 ప్రాంతంలో ప్రతి అమెరికా అధ్యక్షుడూ క్యూబాను నాశనం చేస్తామన్నారు. ఏం చేయగలిగారు? ఆ దేశ గొప్పదనాన్ని గుర్తించి, ఒబామా లాంటి వాళ్ళు వెళ్ళాల్సి వచ్చింది. వియత్నాం... అక్టోబర్ విప్లవం గొప్పదై ఉండవచ్చు. చైనాలో సంక్షోభాలు రావచ్చు. రాజ్యాంగాలు ఎన్నున్నాయన్నది కాదు. తమ లక్ష్యం గాంధీయన్ సోషలిజం అని మన దేశం పేర్కొంది. ఆ ఆకర్షణ ప్రజల జీవనం నుంచి వచ్చింది. జీవితానుభవం నుంచి వచ్చిన దానికి శాస్త్రబద్ధమైన హేతువాద ప్రాతిపదిక కల్పించింది మార్క్సిజం. ఏమాత్రం కాలదోషం పట్టనిది మార్క్సిజం. తత్వవేత్తగా ఉన్నాడాయన. జర్మనీలో పుట్టాడు. నాలుగు దేశాల్లో బహిష్కరణకు గురయ్యాడు. చివరికి బ్రిటన్‌లో స్థిరపడి, పదహారేళ్ళు బ్రిటీష్ లైబ్రరీలో ఆర్థిక సిద్ధాంతాలు చదివి ఎన్నో కష్టాలు పడ్డాడు.

ఆయనకు తోడు ఎంగెల్స్, ప్రపంచంలో గొప్ప స్నేహితులు ఎవరయ్యా అంటే వారిద్దరే. మార్క్స్ భార్య జెన్నీ సంపన్న కుటుంబీకురాలు. అయినా ఆమె భరించింది. ఇవన్నీ త్యాగాలే. ఇప్పటికీ మార్క్స్ కోట్లాది మంది హృదయాల్లో ఆశలు రేపుతున్నారు. ఆయనంటే ఆరాధనా భావముంది. ఆశయాల కోసం పోరాడే వారందరూ కూడా మార్క్స్‌ని ఆరాధిస్తున్నారు. ❑

**– ఆంధ్రప్రభ వ్యాసం**

# ఆయన అరుదైన మేధావి

- ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

ప్రముఖ రచయితల అక్షరాంజలి

సీనియర్ పాత్రికేయులు, విశాలాంధ్ర మాజీ ఎడిటర్ చక్రవర్తుల రాఘవాచారి మరణం మిత్రులందరినీ విషాదంలో ముంచింది. ఆయన అరుదైన మేధావి. సంస్కృతం, ఆంగ్ల భాషల్లో అపూర్వ పాండిత్యాన్ని సొంతం చేసుకున్నారు. బహుశా రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జన్మించిన వారిలో సంపాదకుడిగా, పత్రికా రచయితగా, మంచి మిత్రుడిగా, సంభాషణా చతురుడిగా, గొప్ప ఉపన్యాసకుడిగా, పేరు పొందిన అతి కొద్ది మందిలో వామపక్ష భావజాలాలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తిగా చిరస్మరణీయుడు. ఆషామాషీ సంభాషణల్లోనూ సంప్రదాయ విజ్ఞానం, ఆధునిక చింతన, వామపక్ష మెరుపులు కనిపించేవి.

రాఘవాచారి విశాలాంధ్ర సంపాదక బాధ్యతల నుంచి విరమించిన తరువాత నేను ఎప్పుడు కలిసినా ఒక కోరికను ఆయన ముందుంచే వాడిని. మీ సంభాషణలు, ఉపన్యాసాలు కొద్ది మందికే జ్ఞాపకం ఉంటాయి. మీ సంపాదకీయాల్లో, ఇతరేతర రచనల్లో ఈ తరం గుర్తు పెట్టుకోవాల్సిన సాంస్కృతిక విషయాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా సంస్కృతి, భాష, సమాజం, చరిత్ర వాటికి సంబంధించిన సంపాదకీయాలను ముఖ్యంగా ఒక చోట సంకలనం చేసి పుస్తకంగా తీసుకురావాలని అనేకసార్లు అభ్యర్థించినా.. సరే చూద్దాం అనేవారు. ❑

- వ్యాసకర్త కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత, కడప

# సంపాదక ఉద్యమభేరి

- నల్లి ధర్మారావు

సంపాదక ఉద్యమభేరి కామ్రేడ్ రాఘవచారి
ఎరుపెక్కిన అక్షరాలకు ఎల్లకాలం మీరే దారి
జోహారు మీకయ్యా! మా వెలుగు రేకయ్యా
జోహారు జోహారు జోహారు జోహారు

పాఠాలు నేర్చుకునే విద్యార్థి దశలోనే
పోరాటాల ఆరాటాల వేడి నెత్తురు తోనే !
మార్క్సిజం అధ్యయనం నిబద్ధతే నీ నయనం
కలానికే జెండా కట్టి కడదాకా, మీ పయనం !

విప్లవాన్ని తలుచుకొని విరామాన్ని విడుచుకొని
రచనలెన్నొ చేసినారు ! శక్తి కూడగట్టుకొని
మనసును కదిలించే మాట ఏ వేదిక మీదైనా !
మమతను కురిపించే మాట సందర్భం ఏదైనా !

అశ్రువయ్యింది విశాలాంధ్రము
అలుపెరగని యోధుని కొరకు
అవనతమయింది అరుణపతాకం
మీ హృదయం తాకేవరకూ !

- కవి, పాత్రికేయులు

# అక్షరాంజలి...!

- గోలి సీతారామయ్య



తెలుగు అక్షర మాలను
మార్క్సిజం వెలుగుతో
ఎరుపెక్కించినవాడు...

కుల, మత సంప్రదాయాల
మూఢత్వం వదిలించటానికి
యువ జంటలకు మార్గం చూపి
ఆచార్యుడై దీవించినవాడు

విశాలాంధ్ర ఛత్ర ఛాయలో
అక్షరాలకు నిబద్ధత బోధించి
సమస్త దోపిడీ, పీడనలపై
సైన్యంగా నడిపించినవాడు

కష్టజీవుల శ్రమతత్వాన్ని,
వారి విషాదాన్ని అక్షరాలకు
అనునయంగా వివరించి
అభ్యుదయం చేసినవాడు

ఎందరో నవ జర్నలిస్టులకు
కలం కదలికల్లో మెళకువలు
నేర్పించినవాడు..

ఆయన అక్షరాలకు చక్రవర్తి
విశాలాంధ్ర విహారి...
పేరు రాఘవాచారి...
పత్రికా లోకం చిన్నబోయి
అర్పిస్తోంది అక్షరాంజలి.

# మంచి కమ్యూనిస్టు రాఘవాచారి

**అదృశ్య దీపక్**

"నేను మొదట కమ్యూనిస్టుని, ఆ తర్వాత జర్నలిస్టుని అయ్యాను" అని ఆత్మవిశ్వాసంతో చెప్పుకున్న చక్రవర్తుల రాఘవాచారి తాను నమ్మిన సిద్ధాంతానికీ, ఉన్నతమైన విలువలకూ కట్టుబడి, తుదిశ్వాసవరకూ 'మంచి కమ్యూనిస్టు'గా జీవించారు.

ఆయన నిబద్ధత, నిజాయితీలు ఇంధనంగా పత్రికారంగంలో దారిదీపమై వెలిగిన మార్గదర్శి!

తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషలలో మంచి పట్టుగల విద్వాంసుడు!

ఇటు వేదాలనూ, అటు మార్క్సిజాన్నీ ఆపోశన పట్టిన కమ్యూనిస్టు మహర్షి!

రాజకీయవిషయాలతో పాటు సాహిత్య, కళారంగాల గురించి కూడా ఎక్కడా తడుముకోకుండా సాధికారికంగా మాట్లాడగలిగిన మహావక్త! ఏ అంశం గురించి అయినా లోతైన విశ్లేషణతోనూ, వివేచనతోనూ, సభారంజకంగా సాగే ఆయన ప్రసంగం ఎంతసేపయినా ఇంకా ఇంకా వినాలనిపించేలా ఉండేది!

ఆయన చిన్నకూతురు (దీప) హఠాన్మరణం లాంటి అశనిపాతాలను తట్టుకుని నిలచిన స్థితప్రజ్ఞుడు!

ఎన్నో పెద్ద పత్రికలకు ఎడిటర్‌గా వచ్చిన అవకాశాలను విడిచిపెట్టి, తాను నమ్మిన భావజాలానికి వేదిక అయిన 'విశాలాంధ్ర' సంపాదకునిగా అతి సాధారణ జీవితం కొనసాగించిన నిరాడంబరుడు! నిగర్వి!

కమ్యూనిస్టు వ్యతిరేకుల నుంచి కూడా ఎనలేని గౌరవ, మర్యాదలను పొందిన అజాత శత్రువు!

ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చే విద్యార్థి సమాఖ్య, యువజన సమాఖ్య, అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి కార్యకర్తలకు అయన యిల్లు ఒక విడిది గృహంలా ఉండేది. 1973లో గుంటూరులో జరిగిన రాష్ట్ర అరసం మహాసభలకు వెళుతూ మొదటిసారి విజయవాడలో ఈ 'సత్రం'లో దిగాను. అందుకు కారణమైన స్వర్ణక్క (రాఘవాచారి గారి శ్రీమతి జ్యోత్స్నకు చెల్లెలు–కాకినాడ కాలేజీలో లెక్చరర్) ద్వారా ఆ కుటుంబంతో నాకు ప్రగాఢమైన అనుబంధం ఏర్పడింది.

రాఘవాచారి పైకి ఎంత గంభీరంగా కనిపించినా, ఆయనలో చక్కని హాస్యప్రియత్వం కూడా ఉండేది. "డాగ్ హేమర్‌షెల్డ్, పాట్రిస్ లుమంబా, ఫైడెల్ కాస్ట్రోల హత్యల వెనుక సి.ఐ.ఏ. హస్తం ఉందన్న నిజాన్ని అమెరికా అధ్యక్షుడు బుష్ అంగీకరించాడు" అని ఒకరోజు 'విశాలాంధ్ర'లో వార్త వచ్చింది. (బుష్ అంటే సీనియర్ బుష్). "ఫైడెల్ కాస్ట్రో హత్య" అని చదవగానే, కంగారుపడి నేను రాఘవాచారి గారికి ఉత్తరం రాశాను. (అప్పట్లో నాకు ఫోన్ సౌకర్యం లేదు) ఆ తర్వాత ఓ వారం రోజులకు విజయవాడ వెళ్లినప్పుడు విశాలాంధ్ర ఆఫీసులో రాఘవాచారి గారిని కలిశాను. తేనీటి సేవనం పూర్తయ్యాక, ఆయన సబ్‌ఎడిటర్ (తరువాత కాలంలో పేరుపొందిన చిత్రకారుడు) మోహన్‌ను పిలిచి,"కాస్ట్రోను హత్యచేసింది ఇతనే" అన్నారు చమత్కారంగా! "అమెరికా గూఢచారి సంస్థ సి.ఐ.ఏ. ఫైడెల్ కాస్ట్రోమీద 58సార్లు హత్యాప్రయత్నం చేసింది" అనే వార్త మోహన్ చేతులలో అలా రూపాంతరం చెందింది!

మహాకవి శ్రీశ్రీ "శైశవగీతి"లో "పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం/కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ఏమీ ఎరుగని పూవుల్లారా!/ అయిదారేడుల పాపల్లారా!" అంటాడు. ఆఫీసులో 'ఎడిటర్' వేషం వదిలేసి ఇంటికొచ్చిన రాఘవాచారి – ఇంట్లో పిల్లలతో కలిసి, "ఏమీ ఎరుగని పువ్వు"లాగా, "అయిదారేళ్ల పాప" లాగా మారిపోయి, ఆటపాటలతో గడిపే సన్నివేశాలు సన్నిహితులకూ, మిత్రులకూ ఎంతో ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగించేవి.

ఒకసారి విజయవాడ సిద్దార్థ కాలేజీలో జరిగిన అంతర్ కళాశాలల యువజనోత్సవాలలో నాటికల పోటీకి నేను న్యాయ నిర్ణేతగా వ్యవహరించాను. ఇంగ్లీష్ ఎలెక్యూషన్ పోటీకి రాఘవాచారి జడ్జిగా బాధ్యతలు నిర్వహించారు. మాకు సంబంధించిన విభాగాలలో పోటీలు ముగిసిన తరువాత డాన్స్ పోటీలు జరుగుతుంటే నేనూ, రాఘవాచారిగారూ చూడటానికి వెళ్లాం. ఆ సందర్భంలో ఆయన వివిధ రాష్ట్రాల నాట్యరీతుల గురించీ, వాటి విశిష్టత గురించీ వివరించి చెబుతుంటే ఆశ్చర్యపోయాను. ఈయనకు తెలియని విషయమేదైనా ఉందా?" అని! ఒక్కమాటలో చెప్పాలంటే విజ్ఞానఖని రాఘవాచారితో మాట్లాడటమే మనకు గొప్ప ఎడ్యుకేషన్! ఇది వక్రోక్తి కాదు–అతిశయోక్తి కాదు–కేవలం స్వభావోక్తి మాత్రమే!

ప్రతియేటా జనవరి నెల ప్రారంభంలో విజయవాడలో జరిగే పుస్తక ప్రదర్శనలో భాగంగా 2018లో మిత్రుడు జి.వి. పూర్ణచంద్ సారథ్యంలో ఒక వినూత్న కార్యక్రమం జరిగింది. పదహారు మంది రచయితల స్వపరిచయాలు – వారికి సత్కారాలూ! నన్నూ పిలిచారు. నేను వేదికదిగి వస్తుంటే ప్రేక్షకులలో రాఘవాచారి కనిపించారు. "నువ్వు వచ్చావని తెలిసింది. కలుసుకుందామని వచ్చాను" అన్నారు అభిమానంగా. అంత చలిలో అక్కడ ఆయనను చూసి అవాక్కయ్యాను!

నేను విజయవాడ ఎప్పుడు వెళ్లినా ఆయనను కలవకుండా వచ్చేవాడిని కాదు. ఆయన ఆరోగ్యం పాడయిన తరువాత రోజులలో ఒకసారి రెండు గంటలకుపైగా కబుర్లతో గడిపాం. నేను కొంచెం 'గిల్టీ'గా ఫీలవుతూ, "మీతో ఎంతసేపు వున్నా నాకు యిష్టమే కానీ ఈ పరిస్థితులలో మిమ్మల్ని ఇలా

☞ మిగతా 68వ పేజీలో

ప్రముఖ రచయితల అక్షరాంజలి

# 'మార్క్సిస్టులలో అగ్రగణ్యుడు'

తుర్లపాటి కుటుంబరావు

నా ప్రియమైన పాత్రికేయ మిత్రులు చక్రవర్తుల రాఘవాచారి గారి ఆకస్మిక మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించింది. కొంత కాలంగా ఆయన తీవ్రమైన రుగ్మతతో బాధపడుతున్నారని అందరికీ తెలిసిందే. అయినా ఆయన ఇంతలో మనల్ని విడనాడి వెళ్లిపోయారన్న వార్త నన్ను కలచి వేసింది. ఆయన మేటి పత్రికా సంపాదకులు. మహాపండితుడు. గొప్ప మేధావి. అన్నింటిని మించి మంచితనం మూర్తీభవించిన మానవతా మూర్తి.

1965 జూలైలో ఆయన "విశాలాంధ్ర" దినపత్రిక విలేకరిగా తన పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. కొంతకాలం "పేట్రియాట్", "లింక్" ఆంగ్ల పత్రికలకు స్టాఫ్ రిపోర్టర్‌గా హైదరాబాద్, ఢిల్లీలో పనిచేసిన తరువాత 1971 జూన్‌లో "విశాలాంధ్ర"కు తిరిగి వచ్చి, 33 సంవత్సరాల వయస్సులోనే ఆ పత్రికకు ఎడిటరై, మూడు దశాబ్దాల పాటు ఆ పత్రికలో పని చేశాడు. ఆయన గొప్ప వ్యక్తి కూడా.

ఇక మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆయన ఆపోశన పట్టారని చెప్పవచ్చు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిర్భీతి, నిజాయితీలతో నిలకడగా నిలబడిన కొద్ది మంది పత్రికా సంపాదకులలో రాఘవాచారి గారు ఒకరు.

ఆయన మృతి అటు పాత్రికేయ వృత్తికి, ఇటు కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు. ఆయనకు నా జోహార్లు. ఆయన కుటుంబానికి నా హృదయ పూర్వకమైన సానుభూతి తెలియజేస్తున్నాను. ❑

– వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

# అలవోకగా, అర్థవంతంగా ప్రసంగించే మేధావి

డా. నాగసూరి వేణుగోపాల్

ఏ సమయంలోనైనా ఏ అంశం గురించి అయినా ప్రసంగించగల దిట్ట రాఘవాచారి గారు. 1996–2002 మధ్య కాలంలో వారిని ఆకాశవాణి స్టూడియోలో, సభలలో నేను ఎరుగుదును. ఒక్క ఆకాశవాణి గురించి వారి అనుబంధం గురించి చెప్పుకోవాలి. ప్రతిరోజు రాత్రి 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే ఆంగ్ల వార్తలను వారు తప్పక వినేవారు. ఐదు నిమిషాల వార్తలు విని, స్థూలంగా సంభవించిన పరిణామాలు గమనించి అప్పటికప్పుడే తర్వాత రోజు రాయబోయే సంపాదకీయం అంశం నిర్ణయించుకునేవారట. ఇది వారు నాకు ముఖాముఖి చెప్పిన విషయం. అలాగే పత్రికా రంగంలో ప్రవేశించే వారికి ఆకాశవాణి వినమని చెప్పేవారట. సరళమైన వాక్యం ఎలా ఉంటుందో రేడియో ద్వారా తెలుసుకోమని వివరించేవారు.

ఆకాశవాణిలో వారిని ఎక్కువ కార్యక్రమాలు చేయించింది వారి మిత్రులు ఉషశ్రీ. ఆయన తర్వాత ఎక్కువ కార్యక్రమాలు చేయించింది నాగసూరి అని వారే చెబుతూ, చాలా వైవిధ్యమైన అంశాలతో రూపొందించారని అభినందించారు కూడా. పత్రికలలో సైన్స్, శతాబ్దంలో ప్రజాస్వామ్య పరిణామాలు (ఆరు భాగాలు); జి.వి.కృష్ణారావు సిద్ధాంత గ్రంథం కళా పూర్ణోదయం; దాశరధి కృష్ణమాచార్య 'అగ్నిధార'; వట్టికోట అళ్వారు స్వామి ప్రజల మనిషి వంటి పుస్తకాలపై విశ్లేషణా ప్రసంగాలు; నండూరి రామమోహనరావుతో కలిపి రాఘవాచారితో నిర్వహించిన చర్చా కార్యక్రమం; ఆకాశవాణి, ప్రెస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన సంపాదకుల, కవుల భువన విజయంలో కాశీనాధుని నాగేశ్వరరావు పాత్ర – ఇలా చాలా విశేష రీతిలో ఆకాశవాణికి వారు సేవలందించారు.

జూలై 20వ తేదీన గోరా శాస్త్రి శత జయంతి సదస్సులో కలవడమే చివరి సందర్భం. రెండేళ్ల క్రితం విజయవాడలో వారింట్లో కలిసినపుడు నాకు కొన్ని పుస్తకాలు బహుకరించారు. రాఘవాచారి ఒక అపురూపమైన స్నేహశీలి అయిన సంపాదకుడు.

– వ్యాసకర్త ఆకాశవాణి సంచాలకులు,
హైదరాబాద్ కేంద్రం

ప్రముఖ
రచయితల
అక్షరాంజలి

# లక్షల మెదళ్లను కదిలించిన 'సిరా' చుక్క

పెనుగొండ లక్ష్మీనారాయణ

'అక్షరరూపం దాల్చిన ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక' ఈ కవితా పంక్తులు అందరికీ మననమే. లక్షల మెదళ్లను ప్రగతిశీలత వైపు కదిలించిన సంపాదక చక్రవర్తి 'సిరా' (చక్రవర్తుల రాఘవాచారి).

సి. రాఘవాచారి గారు పాత్రికేయ రంగంలో నాకే కాదు ఎందరికో ప్రత్యక్ష అప్రత్యక్ష గురువు. నాకూ గురువుగానే కాక హృదయానికి చేరువైన సన్నిహితులు.

విశాలాంధ్ర దినపత్రికలో ఎనభైవ దశాబ్దిలో గుంటూరు జిల్లా విలేకరిగా పని చేసినప్పుడు సంపాదకులుగా వారందించిన ప్రోత్సాహం, చూపించిన అభిమానం మరువలేనిది.

నా ప్రధాన కార్యక్షేత్రం అభ్యుదయ రచయితల సంఘం, అభ్యుదయ సాహిత్యోద్యమానికి సాంస్కృతికోద్యమాన్ని అందలమెక్కించడంలో వక్తగా, సంపాదకునిగా రాఘవాచారి గారిది అపూర్వ కృషి.

1992 నవంబర్ 14, 15 తేదీలలో గుంటూరులో జరిగిన అరసం 11వ రాష్ట్ర మహాసభలలో ప్రారంభోపన్యాసం చేసింది సిరాయే. అరసం తెనాలిశాఖ కమ్యూనిస్టు రచయిత బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారాన్ని 2009లో రాఘవాచారి గారికి అందించి గౌరవించింది. ఆ సభలో ప్రజానాట్యమండలి నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి, నేనూ వక్తలం. రాఘవాచారి గారితో నేను పలు సభలలో పాల్గొన్నాను. విజయవాడలో జరిగిన తుమ్మల వెంకట్రామయ్య గారి శతజయంతి సభలో కలిసి పాల్గొని తుమ్మల గారికి నివాళులర్పించాం. మరికొన్నిసభలలో కూడాను గురువు గారి పక్కన వేదిక పంచుకునే అవకాశం లభించినందులకు గర్విస్తున్నాను.

గుంటూరు బార్ అధ్యక్షునిగా 2004లో ఎన్నికైన నేను నా అధ్యక్షతన జరిగిన న్యాయవాద సంఘం వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా రాఘవాచారి గారిని ఆహ్వానించాను. సాధారణంగా న్యాయమూర్తులను, రాజకీయ నాయకులను ఆహ్వానించే సంప్రదాయానికి భిన్నంగా రాఘవాచారి గారిని ఆహ్వానించి సత్కరించాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో ఎం.ఎల్.పట్టా పొందిన రాఘవాచారి గారు 'లా ఆఫ్ జ్యూరిస్‌ప్రెడన్సీ'లో గోల్డ్ మెడలిస్ట్. ఆనాటి వారి మేధో సంపన్నమయిన ప్రసంగం హాజరైన న్యాయవాదులకు ఒక విలువైన పాఠం.

1999లో విజయవాడలో రాఘవాచారి గారి షష్ఠిపూర్తిని వారి అభిమానులు, మిత్రులు ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి సిరా గారి సూచనపై ఆహ్వాన సంఘం వారి పిలుపు మేరకు నేనే వ్యాఖ్యాతను. నాకెంతో సంతృప్తినిచ్చిన కార్యక్రమం అది.

ఆ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలో వారివి కొన్ని సంపాదకీయాలు చేర్చారు. రాఘవాచారి గారి సంపాదకీయాలపై విశ్వవిద్యాలయంలో పరిశోధనలు కూడా జరిగాయి. అయితే వారి సంపాదకీయాలు ఒక్క సంపుటైనా వెలువడకపోవడం విచారకరం.

విశాలాంధ్ర సంపాదకులుగా ఒక వార్త ప్రచురణ విషయంలో మాచర్ల న్యాయస్థానంలో కేసును ఆ విలేకరితో పాటు సంపాదకులుగా రాఘవాచారి గారు, ప్రచురణకర్త ఎదుర్కొన్నారు. ఆ కేసు అప్పీలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాది టి.రామ్మోహన్‌రావు సహకారంతో పెద్ద ఇబ్బంది లేకుండా బయట పడేయటం న్యాయవాదిగా నాకు సంతోషం.

రాఘవాచారిగారు తన శ్రీమతి జ్యోత్స్నతో కలిసి మా యింట జరిగిన శుభకార్యక్రమాలకు హాజరై మా చిరంజీవులకు ఆశీస్సులందించారు. ఆశీర్వదించారు. జ్యోత్స్నకు రాఘవాచారి గారంటే వల్లమాలిన ప్రేమ, గౌరవం. జ్యోత్స్నను నేనెప్పుడూ పిలిచేది జ్యోత్స్నక్కే అని. జ్యోత్స్న తల్లిదండ్రులు కనపర్తి నాగయ్య, సరస్వతి. అలాగే ఆమె సోదరి స్వర్ణలత ఈమె సహచరుడు రామ్మోహనరావులతో నాకెంతో అనుబంధముంది. అరసానికి ఎంతో సహకరించినవారు. యిప్పుడు వీళ్ళంతా మనల్ని వీడిపోయారు. ఈ సమయంలో జ్యోత్స్నక్క రాఘవాచారి గారు లేని లోటును మానసికంగా ఎదుర్కోగలదని ఆశిస్తాను. అవును. రాఘవాచారి గారిని గురించి నేను సైతం మరిచిపోవడం ఎలా సాధ్యం – వారికి నా మదిలో, హృదిలో చిరస్థానం. ❑

– వ్యాసకర్త ప్రధాన కార్యదర్శి,
ఆం.ప్ర. అభ్యుదయ రచయితల సంఘం

# విలువలకు నిలువుటద్దం

ప్రముఖ రచయితల అక్షరాంజలి

**వేల్పుల నారాయణ**

1982 మార్చిలో (తేది గుర్తులేదు) విశాలాంధ్ర దినపత్రికలో జర్నలిజం శిక్షణ కోసం నేను మొట్టమొదటిసారి ఎడిటర్ రాఘవాచారి గారి రూంలోకి రిపోర్టు చేయడానికి వెళ్లాను. అప్పుడు విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉండేది. విశాలాంధ్ర ఎడిటోరియల్ డెస్కును ఆనుకొని ఉన్న చిన్న క్యాబిన్ లాంటి గదిలో ఇంగ్లీష్, తెలుగు పత్రికలలో ఆరోజు వచ్చిన సంపాదకీయాలను చదువుతున్న ఆయన తలెత్తి నావంక చూశారు. ఎర్రని ముఖం, తెల్లని క్రాపు, తెల్లని డ్రస్సులో ఎంతో శాంతమూర్తిలా కనిపించారు. వచ్చిన విషయం చెప్పి ఉత్తరం ఇచ్చాను. ఉత్తరం తీసుకొని టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చోమన్నారు. నేను కూర్చొన్నాను. ఉత్తరం చదివి కందిమళ్ల ప్రతాపరెడ్డి పంపించారా అని అడిగారు. నేను హైదరాబాద్‌లో అప్పటికే అరసం కార్యకలాపాల్లో ఉండడంతో సాహితీపరంగా అప్పటికే కవితలు, పాటలు, కథలు రాయడంతో ప్రవేశంతో పాటు నా వ్యక్తిగత విషయాలు అన్నీ అడిగి తెల్సుకున్నారు.

జర్నలిజంలో దృక్పథం, లక్ష్యం ముఖ్యం. ప్రజల గొంతుకను వినిపించడంలో ఏనాడు వెనకాడకూడదు. ఇక్కడ శిక్షణలో మెలకువలు దిద్దుకొని, శిక్షణ ముగించుకొని క్షేత్ర స్థాయిలో మంచి విలేకరిగా రాణించాలని హితబోధ చేశారు. నీకు ఎలాంటి సందేహాలు వచ్చినా సబ్ ఎడిటర్లతో పాటు నన్ను అడిగి తెల్సుకొమ్మని సూచనలిచ్చారు. శిక్షణ కాలంలో విశాలాంధ్ర బిల్డింగులోనే నాకు వసతి ఏర్పాటు చేశారు. అప్పుడు డెస్కులో యోగయ్య, పార్ధసారథి, ఎం.సుబ్బారావు, ఎన్‌కే బాబు, జనార్ధనరెడ్డి తదితరులుండేవారు. సోదుం రాంమోహన్ సాహిత్య పేజీ చూసేవారు. మైత్రేయ ప్రూఫ్ చూసేవారు. వార్తలు తయారు చేయడం, శీర్షికలు పెట్టడంలో ప్రాధాన్యం, ఇంగ్లీషు నుండి తెలుగు ట్రాన్సలేట్ చేయడం, సాహితీ పేజీ మెళకువలు అన్నీ తెలుసు కున్నాను. ప్రతిరోజు రాఘవాచారి గారు నా పనితీరును తెల్సుకొని అనేక సూచనలిచ్చేవారు. ఒక విధంగా చెప్పాలంటే జర్నలిజం ఓనమాలు దిద్దుకున్నది రాఘవాచారి గారి దగ్గరే. నువ్వు చాలా త్వరగా అన్ని విషయాలు నేర్చుకున్నావు. వెళ్లిన చోట మన పత్రిక ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా పని చేయమని శిక్షణ తర్వాత హితబోధ చేశారు. నేను కరీంనగర్ జిల్లాకు విలేకరిగా వచ్చి గోదావరిఖని కేంద్రంగా ఉన్నాను. విశాలాంధ్ర పత్రిక ద్వారా నేను రచయితగా ఎదగడానికి ప్రోత్సహించారు. సంపాదకులకే మార్గదర్శకుడిగా, నిరాడంబరుడుగా, కమ్యూనిస్టుగా, మేధావిగా, ఉత్తమ జర్నలిజం సాంప్రదాయాలు నెలకొల్పిన రాఘవాచారి గారు సోమవారం ఉదయం మరణించారని విని తీవ్ర దిగ్భ్రాంతి చెందాను. ఆయన మరణం అందరికి తీరిన లోటు. ఆయనకు నా అశ్రునివాళులు. ❑

**– వ్యాసకర్త అరసం తెలంగాణ అధ్యక్షవర్గ సభ్యులు**

# పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన కలంకృషీవలుడు

**డా॥ జీకే రావ్**

పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన కలంకృషీవలుడు. నిష్పాక్షిక వీక్షణంతో ముందుకు నడిచిన పాత్రికేయ దిగ్గజం సి.రాఘవాచారి. ఏ అంశం గురించైనా సుస్పష్టంగా, వివరణాత్మకంగా విశ్లేషించగల వ్యక్తి ఇక మన మధ్యలేరంటే చాలా బాధగా ఉంది. పత్రికారంగం అలనాటి – ఆ తరానికి, ప్రస్తుత ఈ–పత్రికల తరానికి వారధిగా నిలిచిన రాఘవాచారితో నా పరిచయం మూడు దశాబ్దాల నాటిది.

విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయంలో పని చేస్తున్నప్పుడు తరచూ కలిసేవాడిని. ఏదైనా వాక్య నిర్మాణంలో అనుమానం వచ్చినప్పుడు వెంటనే నాకు గుర్తుకొచ్చేది – ఇంకెవరు – "సీఆర్" గారే!! ఏదైనా విషయం గురించి వివరించేందుకు ఆయన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కవులు, రచయితలను, వారి మాటలను అలవోకగా ఉటంకించడం – ఇప్పటికీ నాకు గుర్తే.

ఇక ఆకాశవాణి (విజయవాడ) ప్రాంతీయ వార్తా విభాగానికి సంబంధించి ఆయన పలు చర్చా కార్యక్రమాలు, వార్తా వ్యాఖ్య, విశ్లేషణా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. ఎక్కడ కనిపించినా భుజం మీద చేయి వేసి మరీ దగ్గరగా, చనువుగా మాట్లాడేవారు – రాఘవాచారి గారు. పాత్రికేయ సువిశాల ఆకాశంలో "ఆయన ధ్రువతార". మీ అభిమానం, మీ మంచితనం ఎప్పటికీ నిలిచే వుంటాయి. ❑

ప్రముఖ రచయితల అక్షరాంజలి

# జ్ఞాన తపస్వి, జన పాత్రికేయుడు

ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

తెలుగు పత్రికారంగం గురించి తెలిసిన వారికి పరిచయం చేయనక్కరలేని పేరు సి. రాఘవాచారి. మొన్నటి విశిష్ట పత్రికా సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, మద్దుకూరి చంద్రం, నార్ల వెంకటేశ్వరరావుల తరానికీ, నేటి తరానికీ నడుమ సముచితమైన వారధి ఆయన. తెలంగాణలోని కాకతీయుల కదనసీమ ఓరుగల్లులో ఒక సంప్రదాయ శ్రీవైష్ణవ కుటుంబంలో పుట్టి, హైదరాబాద్లో ఉన్నత విద్యలు చదివి, విజయవాడను కార్యక్షేత్రంగా ఎన్నుకున్న ఉత్తమ జర్నలిస్టు. బాల్యంలోనే సంస్కృత భాషపై పట్టును సాధించి పురాణ ప్రబంధాలను ఔపోసన పట్టాడు. యవ్వనంలో ఆంగ్లం, ఉర్దూ భాషలపై సాధికారికత సాధించాడు. మాతృభాష 'తెలుగు'లోని మెళకువలన్నీ అధ్యయనం చేశాడు.

వేదాలు, ఉపనిషత్తులు మొదలుకొని అత్యాధునిక సాహిత్య ప్రక్రియల వరకు, మహాకవి కాళిదాసు నుంచి షేక్స్పియర్ రచనల వరకు విస్తారంగా చదివిన నిరంతర విజ్ఞానాన్వేషి, నిర్విరామ జ్ఞాన తపస్వి చక్రవర్తుల రాఘవాచారి. జర్నలిజం కేవలం ఒక వృత్తి కాదని, సామాజిక బాధ్యత అని నిరూపించిన నిబద్ధ పాత్రికేయుడు. పత్రికా సంపాదకుడు ఒక ఉద్యోగి కాదు, ఉద్యమకారుడు, ఉత్తమ అధ్యాపకుడు, సమాజ పథ నిర్దేశకుడని సూచించడమే కాక స్వయంగా ఆచరించి చూపాడు. నేడు పత్రికా రంగంలో అగ్రశ్రేణి పాత్రికేయులనేకమందికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయుడు. దిన పత్రిక సంపాదకీయం ఒక కాలక్షేప రచన కాదనీ, ప్రజల చైతన్యాన్ని పదును పెట్టే సాధనమనీ నిరూపించిన ఉత్తమ సంపాదకుడు.

తెలుగులో చక్కటి, చిక్కటి వచనాన్ని రాసిన ప్రతిభావంతుడైన రచయిత. సభలు, సమావేశాలను, గోష్ఠులను ఉత్తేజపరిచిన స్ఫూర్తిమంతమైన వక్త. సూక్తులు, సామెతలు, నుడులు, నానుడులతోనూ, చమత్కార సంభాషణలతోనూ సాగే రాఘవాచారి ప్రసంగశైలి పండిత గోష్ఠులను ఎలా రాగరంజితం చేయగలదో, సామాన్య ప్రజావేదికలను కూడా అలాగే అలరింప జేసేది. ఇదొక అసాధారణ ప్రతిభ. అలవోకగా మహనీయుల మహితోక్తులను, సంస్కృత శ్లోకాలను, ఆంగ్ల ఉటంకింపులను తమ ప్రసంగంలో ఉటంకించడం ద్వారా శ్రోతలను ఆకట్టుకున్న ప్రజ్ఞతో వ్యక్తిత్వానికి వన్నె తెచ్చాడు. సమయోచిత ఉక్తి వైచిత్రి, సందర్భోచిత హాస్య చతురత రాఘవాచారి ప్రసంగ విలక్షణతగా ఉండేది.

బట్టతల, విశాలమైన నుదురు, ఆలోచనలతో రాటుదేలిన లోతైన కళ్లు, మల్లెపూల వంటి తెల్లటి వస్త్రధారణతో కనిపించే ఆయన నిరాడంబర జీవన విధానం, అలుపెరుగని అధ్యయన శీలత్వం, ఎన్నుకున్న పాత్రికేయ వృత్తిపట్ల నిబద్ధత, నిర్వహించే బాధ్యతల పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వంలో కనబడే సుగుణాలు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టినప్పటికీ పెరుగుతున్న క్రమంలో చుట్టూరా ఉన్న సామాజిక పరిస్థితుల అవగాహన, చదివిన గ్రంథాల స్ఫూర్తితో మొదట హేతువాదిగా రూపాంతరం చెంది క్రమంగా మార్క్సిస్టుగా పరిణామం చెందిన సామ్యవాద స్వాప్నికుడు చక్రవర్తుల రాఘవాచారి కృషికి గుర్తింపుగా తెలుగు నాట అనేక సామాజిక, సాంస్కృతిక సంస్థలు ఆయనను సముచితంగా సత్కరించాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సన్మానించింది. విజయలక్ష్మి స్మారక ట్రస్టు వారి పురస్కారం, సురవరం ప్రతాపరెడ్డి సాహితీ వైజయంతిక వారి పురస్కారం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ వారిచే జీవిత సాఫల్య పురస్కారం పొందాడు. ఉత్తమ అభిరుచి, ఉన్నతాశయాలతో కొనసాగిన రాఘవాచారి జీవితం, వ్యక్తిత్వం నేటి తరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం. ❑

– వ్యాసకర్త కవి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి

## మంచి కమ్యూనిస్టు రాఘవాచారి

**(64వ పేజీ తరువాయి)**

మాట్లాడించడం నాకు ఇబ్బందిగా ఉంది" అన్నాను. "భలే వాడివి దీపక్! ఇప్పుడు నీతో మాట్లాడిన సమయమంతా నాకు ఒక 'elixir'లా పనిచేస్తుంది!" అన్నారు.

నాలుగురోజుల క్రిందట షాంఘైలో ఉంటున్న మున్నీ (స్వర్ణక్క గారి అమ్మాయి) మెసేజ్ పంపింది."పెదనాన్న గారికి బాగోలేదు. నేను బయలుదేరి వస్తున్నాను" అని! ఈ ఆదివారం పిడుగులాంటి వార్త "రాఘవాచారిగారు ఇకలేరని!". వెంటనే మిత్రులు స్టాలిన్గారూ, నేను చివరిచూపులకోసం విజయవాడ వెళ్లాం. నివాళి అర్పించడానికి వివిధ వర్గాలనుంచి వచ్చిన అభిమానులూ, ప్రముఖులతో విశాలాంధ్ర ఆవరణ కిటకిటలాడి పోయింది. సభానంతరం ఆయన శరీరాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించారు. కుటుంబసభ్యులూ, పార్టీ నాయకులతోపాటు స్టాలిన్గారూ, నేనూ వారికూడా వెళ్లాం. మార్చురీగదిలో భద్రపరిచే వరకూ ఉండి వెనక్కి తిరిగాం.

ఇంకేముంది చెప్పడానికి? మనసునిండా చెప్పలేనంత బెంగ ఆవరించింది! ఎటుచూసినా శూన్యం! కటిక చీకటి!! ❑

Jaateeya Spurthi, Fortnightly Printed and Published by N. Venkateswara Rao
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. & 9848 234228 Chief Editor : DVVS Varma

One of the Biggest Cooperative Urban Bank in India with **104** Years of Service

# THE VISAKHAPATNAM COOPERATIVE BANK LIMITED

(MSCS/CR/1101/2014) (MULTI STATE COOPERATIVE URBAN BANK)

Dwarakanagar, Visakhapatnam-530016, Ph: 0891-2788461, 62, 63, 66, 71

## BOARD OF DIRECTORS



**Sri M.Anjaneyulu**
Chairman Emeritus



**Sri Ch.Raghavendra Rao**
Chairman



**Sri G.Bhaskara Rao**
Sr.Vice Chairman



**Sri M.Raghava Rao**
Vice Chairman



Sri Naga Bhusana Chowdary



Sri A J Stalin



Sri N.Kamaraju



Smt K Bhavani



Sri Rao Venkata Jaggarao



Sri V.Chandra Sekhar



Sri G.Janardhana Rao



Smt T Padmavathi



Sri Ch Ramarao



Sri Ch.Adinarayana Sastry



Smt U.Parvathi Devi



Sri K.Prasada Rao



Sri S.J. Ramachandra Raju



Sri P.V.Ramana Rao



Sri D.Babu Rao



Sri R.Vaidyanadhan



Sri P.V.Narasimha Murthy
CEO

### Salient Features

- Higher Rate of Interest on Deposits.
- Additional rate of Interest on deposits of Senior Citizens.
- All Deposits are insured as per DICGC Act.
- DDs/Bankers Cheques on all important places in India at low rates of Exchange.
- All Branches works on Sunday Extended Working hours for Customer's convenience.
- Safe Deposit Locker facility
- Corporate Agency with United India Insurance Company Ltd and Life Insurance corporation of India Safe Deposit Locker facility.

### Members Welfare Schemes

- All members covered under Personal Accident Policy upto Rs.50,000/- Members with share capital of Rs.5000/- and above covered under **"Arogya Visakha Bima"** for medical expenses upto Rs.50,000/- per year with additional coverage of Spouse.
- In case of unfortunate death of member, legal heirs are entitled to received Death Benefit Fund equal to Share Capital with a minimum of Rs.5000/- and a maximum of Rs.1.00.000/-
- Yearly Cash Incentives for Meritorious children of our members and many

**THE BIGGEST COOPERATIVE BANK IN SOUTH INDIA**